6-7Pg1exHMNWJQE.qxd:26-7Pg1exHMNWJQE.qxd 1/1/02 6:58 AM Page 1

: fb.com/vaartha Digital

epaper.vaartha.com

WWW.VAARTHA.COM

విశాఖపట్నం

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

26-7-2026

ఆదివారం సంపుటి: 32


సంచిక: 176 పేజీలు: 16 వెల: 8.00



కేంద్రమంత్రి రాజీనామాతో శనివారం న్యూఢిల్లీలో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న సిజెపి చీఫ్ అభిజిత్, విద్యార్థులు

## కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్

# రాజీనామా



### పదిరోజుల పరిణామాలు ఎంతో బాధించాయి..

### వ్యక్తిగత ప్రతిష్ఠకంటే యువత భవిష్యత్తే ముఖ్యం: ధర్మేంద్ర

**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను ఎక్స్‌లో పోస్టు చేశారు. లేఖలో తన రాజీనామాకు గల కారణాలను సోదాహరణంగా వివరించారు. గత 10 రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలు తనను ఎంతో బాధకు గురి చేసినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. ఇది నా వ్యక్తిగత ప్రతిష్ఠకు చెందిన విషయం కాదు అని అన్నారు. భారత యువశక్తియే ఈ దేశానికి అసలైన శక్తి అనిఅన్నారు. దేశ యువ శక్తిని భ్రమలో పడకుండా చూస్తానన్నారు. ఇదే తన సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. జంతర్ మంతర్ కానీ, ఇతర ప్రదేశాల్లో జరిగిన సంఘటనలతో దేశ >>2

రాజధాని ఢిల్లీలో విద్యార్థుల నిరసనలు సద్దుమణిగాయి. ప్రధాన డిమాండ్ అయిన విద్యామంత్రి ధర్మేంద్ర రాజీనామాతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సిజెపి ప్రకటించింది. మరికొన్ని డిమాండ్లకు కూడా కేంద్రం సమ్మతించింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులందరు స్వస్థలాలకు పయనం కావడంతో పది రోజుల తర్వాత ప్రశాంతత ఏర్పడింది.

### తాత్కాలిక విద్యామంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు 2లో

## జంతర్‌మంతర్‌కు

# గుడ్‌బై

### మంత్రి రాజీనామాతో సిజెపిలో సంబరాలు

### ఆందోళన విరమించి స్వస్థలాలకు వెళ్తున్న విద్యార్థులు

**న్యూఢిల్లీ,జులై 25:** కాక్రోచ్ జనతాపార్టీ నిర్వహించిననిరవధిక ఆందోళనలతో కేంద్రం దిగివచ్చింది. కేంద్రమంత్రి దర్మేంద్రప్రధాన్ రాజీనామాతో నిరసనలు సద్దుమణుగుతున్నాయి. ఇప్పటివరకూ నిరసనలతో హోరెత్తిన ఢిల్లీ ఇప్పుడు విద్యార్థుల సంబరాలతో నిండిపోయింది. నీట్ పరీక్షా పేపర్ల లీక్ తదనంతర పరిణామాలతో విద్యార్థులు రోడ్డెక్కారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం తొలి నుంచి డిమాండ్ చేస్తున్నారు. గత వారం రోజులుగా ఢిల్లీ కేంద్రంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారు. ఛలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారింది. ప్రధాని మోడీ స్వయంగా విద్యార్థులకు హామీ ఇచ్చారు. పరీక్షా పత్రాల లీక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని కొత్త చట్టం తీసుకొచ్చారు. విద్యార్థుల భవిష్యత్ తమకు ముఖ్యమని ప్రధాని >>2



శనివారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులు నడ్డా, జితేంద్రతో చర్చలు జరుపుతున్న సిజెపి ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్

# చర్చలు సానుకూలం

### కేసులు ఎత్తివేత, ఆత్మహత్య చేసుకొన్న విద్యార్థులకు పరిహారం

### ఎఫ్ఐఆర్ కాపీలు కూడా సిజెపికి

### భవిష్యత్తులో వేధింపులు ఉండవని హామీ

### సిజెపి ప్రతినిధులతో చర్చలు జరిపిన కేంద్రమంత్రులు నడ్డా, జితేంద్ర

**న్యూఢిల్లీ,జులై 25:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శనివారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సిజెపి డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది.విద్యార్థులపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి జెపి నడ్డా ప్రకటించారు. న్యూఢిల్లీతోపాటు ఇతర రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగాఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ విషయంలో సిజెపితో చర్చిస్తామని వెల్లడించారు.ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో కేంద్రం, సిజెపి మధ్య జరిగిన మూడో విడతచర్చల్లో కేంద్రమంత్రులు జెపి నడ్డా, జితేంద్రసింగ్, సిజెపి ప్రతినిధులు సౌరవ్‌దాస్, అశుతోష్ రంకాపాల్గొన్నారు. సుదీర్ఘ చర్చలఅనంతరం సమావేశ వివరాలను సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు. ప్రధానంగా నాలుగు అంశాలు మాత్రమే >>2



శనివారం ఆసుపత్రినుంచి విక్టరీ సింబల్ చూపుతున్న వాంగ్ చుక్

### ప్రజాస్వామ్య విజయం: వాంగ్‌చుక్

**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ తొలిసారిగా స్పందించారు. ఇది ప్రజాస్వామ్య విజయం అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. జూన్ 28న కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనకు మద్దతుగా సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ, నిరసన >>2

## విద్యావ్యవస్థ పునర్నిర్మాణానికి ఇది ముందడుగు

### ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి: రాహుల్



**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. 'ఇది కేవలం ప్రతీకాత్మకమైన రాజీనామా అయినప్పటికీ దేశ విద్యా వ్యవస్థ పునర్నిర్మాణానికి కీలక అడుగుగా అభివర్ణించారు. విద్యార్థులపై బలప్రయోగానికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకో వాలని, ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన వీడియో సందేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా దేశ విద్యా వ్యవస్థ పునర్నిర్మా ణంలో ఒక పెద్ద అడుగు. ఆయన ఒక ప్రతీక మాత్రమే. అందుకే ఇది ప్రతీకా త్మక నిర్ణయమే అయినప్పటికీ చాలా ముఖ్యమైనది' అని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విద్యార్థుల నిరంతర ఆందోళనలే కారణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, దేశ భవిష్యత్తు, రాజ్యాం గ పరిరక్షణ >>2

# డ్రోన్లతో సీడ్‌బాల్స్



### లోయ ప్రాంతాల్లో వేయి ఎకరాల్లో వెదజల్లుతున్నాం: డి.సిఎం పవన్

### 30వేల హెక్టార్లలో నిర్ణీతకాలంలో పూర్తి

**విజయవాడ,జులై24,ప్రభాతవార్తప్రతినిధి:** వర్షాపాతం, నేలలో తేమ వంటి వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అటవీ పర్యావరణ శాఖల మంత్రిత్వశాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర డీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అడవులు క్షీణించిన ప్రాంతాల్లో సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు మరిన్ని డ్రోన్ల సహాయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అటవీ పునరుద్ధరణ, 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో సీడ్‌బాల్స్ పంపిణీ కార్యక్రమం అత్యంత కీలక ప్రక్రియ అని తెలిపారు. జిల్లాల వారీగా సీడ్ బాల్స్ పంపిణీ, వెదజల్లే కార్యక్రమం, డ్రోన్ సాంకేతికత వినియోగంపై అటవీశాఖ ఉన్నతాధికారులతో శనివారం మధ్యాహ్నం సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియ పూర్తయ్యింది? డ్రోన్ల సాయంతో ఎంత విస్తీర్ణంలో సీడ్ బాల్స్ జారవిడిచారు?తదుపరి లక్ష్యాలు తదితర అంశాలను ఈసందర్భంగా అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. ఉపముఖ్యమంత్రి >>2

# 'వేదవతి'ని పూర్తి చేస్తా

### ఆలూరు ప్రజల రుణం తీర్చుకుంటా

### కర్నూలు నుంచి బళ్లారి దాకా హైవే

### సీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతా: సంజీవని ప్రాజెక్టు కార్యక్రమంలో సిఎం చంద్రబాబు



శనివారం ఆలూరులో జరిగిన సంజీవని కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

**ఆస్పరి, జులై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాయలసీమ ప్రాంతాన్ని రతనాలసీమగా మారుస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి అధ్యక్షతన మండల కేంద్రమైన ఆస్పరిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సంజీవిని పైలెట్ 6వ విడత ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు వేదవతి ప్రాజెక్టును నేనే ప్రారంభించాను నేనే పూర్తి చేసి ఆలూరు నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. వేదవతి ప్రాజెక్టు హంద్రీనీవా నగరడోన,రిజర్వాయర్లను 36 కోట్ల తోపూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టులను 35 వేల కోట్లతో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలో రహదారులను బాగు చేస్తామన్నారు. కర్నూల్ నుంచి బళ్లారి వరకు హైవే మంజూరు చేస్తామన్నారు. పోలవరం ప్రాజె క్టును 2027మార్చి నాటికి జాతికి అంకితం చేస్తా మన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చి దిద్దుతామన్నారు. జోహారపురం గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం 7కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అందిస్తున్నామన్నారు. సంక్షేమం నుంచి సౌర విద్యుత్ వరకు ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తునదన్నారు. ప్రజారోగ్యంతో పాటు సంక్షేమానికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందిస్తూ పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు.తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి మద్దతు, స్త్రీశక్తిద్వారా మహిళల >>2



## టమాటా ధరలపై తప్పుడు ప్రచారం

# నమ్మొద్దు

### మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,జులై 25,ప్రభాతవార్తప్రతినిధి:** టమాటా ధరలపై వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా రైతులకు కిలోకు కేవలం రూ.2 మాత్రమే లభిస్తోందంటూ వైసిపి పార్టీ తప్పుడు ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి రైతులను అయోమయానికి గురిచేసేలా ప్రచారం చేయడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టమాటా సగటు ధర కిలోకు రూ. 10.55గా ఉందని, అన్నమయ్య జిల్లాలో రూ.10.58, మదనపల్లె మార్కెట్ లో రూ.11గా ధర నమోదవుతోందని మంత్రి తెలిపారు.నిన్నటి >>2



## మంచి నీటి అవసరాలకే పులిచింతల, పట్టిసీమ

### మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జులై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిపూర్ణ సమ న్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆదేశించారు. గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ సీఈలు, ఎస్ఈలతో శనివారం నిర్వహించిన ఉన్నత స్థాయి టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం, క్లిష్టమైన నీటి కొరత దృష్ట్యా ఇరిగేషన్ శాఖలోని పైస్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరి సెలవులను రద్దు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.పుష్కర కాలువ, ఏలేరు వ్యవస్థ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ జిల్లాల్లో దాదాపు 55 లక్షల మందికి మంచితాగునీరు అందించాల్సి ఉందన్నారు. అందుకే ఈ నీటిని మంచినీటికి, ఆరుతడి పంటలకే వినియోగించాలని సూచించారు. సీలేరు జలాలను గోదావరి డెల్టా ఖరీఫ్ అవసరాల కోసం వాడుతున్నామన్నారు. మెరక ప్రాంత రైతులు కూడా ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే గోదావరి ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు >>2

# 'కల్తీనెయ్యి'పై మరింత లోతుగా దర్యాప్తు



### ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగం అధికారులతో విచారణ


### మూడు నెలల్లో నివేదిక రెడీ

### పలువురు అధికారులపై ఇప్పటికే చర్యలు

**తిరుమల,జులై 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూప్రసాదం తయారీకి కల్తీనెయ్యి సరఫరా చేసిన ఉదంతంలో బాధ్యులైన అధికారులపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. గత రెండునెలలుగా స్తబ్ధుగా ఉన్న ఈ కేసులో తాజాగా ప్రభుత్వం అక్రమార్కులపై దర్యాప్తుకు ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగం అధికారులపై విచారణకు ఆదేశించడంతో మళ్ళీ అక్రమార్కుల్లో గుబులురేకెత్తిస్తోంది. ఈ వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు వారివారి వాంగ్మూలాలతో సమర్పించిన రాతపూర్వక సమాధానాలపై విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు రాష్ట్ర బాయిలర్స్ డైరెక్టర్ బి.ఉమామహేశ్వరరావును,ప్రజంటింగ్ అదికారిగా ఫ్యాక్టరీస్ డైరెక్టర్ కార్యాలయం చీఫ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావులను నియమించింది. రానున్న మూడునెలల కాలంలో ఈ అధికారులు విచారణ పూర్తిచేసి తదుపరి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. ఇప్పటికే పలు డెయిరీలకు సంబంధించిన ఈ విభాగం అధికారులపై చర్యలు తీసుకున్న విషయం విదితమే. గతంలోనే తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో రెండేళ్ళపాటు లోతుగా కొనసాగిన దర్యాప్తు,విచారణ నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. దాదాపు 70లక్షలకిలోల నెయ్యి కల్తీ టిటిడికి తిరుమలకు చేరిందని, దాదాపు 300కోట్ల రూపాయలు పైమాటే ఆర్థిక లావాదేవీలు జరిగాయనేది ప్రధాన ఆరోపణలు . ఆ దిశగా దర్యాప్తుకు సిబిఐ అధికారులతో, ఆహారభద్రత విభాగం అధికారులతో ,రాష్ట్రపోలీస్ అధికారులతో సిట్ బృందాన్ని నియమించి ఏకంగా ఏడాదిన్నరకాలంపైగా లోతుగా అన్ని కోణాల్లో విచారణ చేసి నివేదికలు రూపొందించారు. పలువురు కాంట్రాక్టర్లను, నెయ్యిసరఫరా చేసిన సంస్థల యాజమాన్యాన్ని, ప్రతినిధులను విచారణ చేసింది. అందులో తప్పిదాలు జరిగాయని తేల్చి గతంలో పనిచేసిన టిటిడి ఉన్నతాధికారులు, మార్కెటింగ్ కొనుగోళ్ళ విభాగాల జిఎంలు, మేనేజర్లను దోషులుగా తేల్చింది. నివేదికల ఆధారంగా అసలు దోషులను తేల్చి వారిపై చట్టప్రకారం చర్యలకు ఉపక్రమించేందుకు రాష్ట్రప్రభుత్వం విశ్రాంత >>2

## రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 4,16,27,694

### సిఇఓ వివేక్ యాదవ్ వెల్లడి



**విజయవాడ,జులై25,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదైందని రాష్ట్రఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్) ప్రక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు.అత్యధికంగా 44,89,488 మంది ఓటర్లకు సరైన అడ్రస్ లేదని సీఈఓ తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 15,22,174మంది ఓటర్లు మరణించినట్లు వెల్లడించారు. అలాగే, 14,43,886 మంది ఓటర్లు మరో చోటుకు బదిలీ అయ్యారని, ఇతర ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 7,37,216గా ఉందన్నారు. ఆచూకీ లభించని ఓటర్ల సంఖ్య 7,77,885 గా తేలిందని సీఈఓ తెలిపారు. అలాగే ఇతర కేటగిరీల కింద మరో 8,327 మంది ఓటర్లు ఉన్నారని వివేక్ యాదవ్ వివరించారు. అర్హులైన వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 30 వరకు సరైన డాక్యుమెంట్లను చూపించి, మరలా ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు సిఇఓ ప్రకటించారు.

26-7pg2exHMNWJQE.qxd:26-7pg2exHMNWJQE.qxd 1/1/02 7:01 AM Page 1




డ్రోన్లతో విత్తనబంతులు వెదజల్లుతున్న దృశ్యం

# డ్రోన్లతో సీడ్‌బాల్స్

>> ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్లకు పైగా సీడ్ బాల్స్ సిద్ధం చేయగా, ఇప్పటి వరకు 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్ దాదాపు 6,500 హెక్టార్ల విస్తీర్ణంలో వెదజల్లే ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో మానవ వనరుల సాయంతో సుమారు 6 వేల హెక్టార్ల పరిధిలో 59 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లినట్లు, మొట్టమొదటి సారి డ్రోన్ల సాయంతో అడవుల్లో లోయ ప్రాంతాలకి వెళ్లి సీడ్ బాల్స్ జారవిడిచినట్లు వివరించారు. సుమారు 500 ఎకరాల్లో డ్రోన్స్ ద్వారా సీడ్ బాల్స్ జార విడిచినట్లు తెలిపారు. అత్యధికంగా రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలో దాదాపు 28 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లగా, అందులో డ్రోన్ సాయంతో 2.26 లక్షలు జారవిడిచినట్లు అధికారులు చెప్పారు. విశాఖ అటవీ డివిజన్‌లో 7.50 లక్షలు, కర్నూలు అటవీ ప్రాంతంలో 8.67 లక్షల సీడ్ బాల్స్ పంపిణీ ప్రక్రియ పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా చింతూరు, పీటీ ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం, వైఎస్ఆర్ కడప డివిజన్లలో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు, మానవ వనరులు చేరుకోవడం కష్టంగా ఉండే అటవీ ప్రాంతాలను డ్రోన్ ద్వారా చేరుకోవడం సులభం అవుతుందని చెప్పారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియకు కొంత మేర ఇబ్బందులు కలిగించవచ్చు, వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మాత్రం జాప్యానికి తావు లేకుండా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. అవసరం అయితే డ్రోన్ల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ ప్రాంతాల్లో వర్షపాతం తగ్గిన చోట [illegible] అడవి పునరుద్ధరణ మొదలవ్వాలి. మానవ వనరులతో సీడ్ బాల్స్ వెదజల్లిన ప్రాంతాల్లో మొలకలు వస్తే, వాటిని సంరక్షించడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యాల్లో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం అత్యంత ప్రధానమైనదని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఎవరూ అలక్ష్యంగా ఉండవద్దు. సీడ్ బాల్స్ చల్లి సరిపుచ్చ కుండా, వేడి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో మొక్కల పరిరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలన్నారు.

# 80 ప్రభుత్వాసుపత్రుల్లో కలుషిత నీటి శుద్ధి ప్లాంట్లు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జూలై 25,ప్రభాతవార్తప్రతినిధి:** కలుషిత నీటి శుద్ధీకరణ పూర్తిగా చట్టాలు, నియమాలకు అనుగుణంగా జరగాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రమైన వాతావరణానికి కీలకమైన ఈ అంశంపై ఉన్నతాధికారులు, నిపుణులతో శుక్రవారం సాయంత్రం మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రతి ఒక్క బెడ్ (పడకకు) దాదాపు రోజుకు 400 గ్రాముల బయో మెడికల్ వేస్ట్ వస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో 13 లక్షల కిలోల వ్యర్థాలు వెలువడుతున్నట్లు అంచనా. వీటిని నియమాల మేరకు సమీకరించి, వేరుచేసి, నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది. వ్యర్థాల నిర్వహణలో కొన్ని లోపాలు జరుగుతున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ గమనించారు. ఈ వ్యర్థాలను నిర్ణీత సమయంలో ఎప్పటికప్పుడు సేకరించి, వేరుచేసి, నిర్దేశాల ప్రకారం వివిధ రకాల సంచుల్లో రవాణా చేసి తరలించాలని, ఇందుకోసం అవసరమైతే వారీగా పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా సీసీ టీవీల్లో నమోదయ్యేలా చూడాలని, బార్ కోడింగ్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. కలుషిత జలాల శుద్ధికి 80 ప్లాంట్లు బోధనాసుపత్రులు, సెకండరీ ఆసుపత్రుల్లో నిర్దేశించిన ప్రమాణాల మేరకు కలుషిత జలాల శుద్ధి జరగకపోవడంపై మంత్రి అసంతృప్తిని వ్యక్తం చేశారు. సెకండరీ ఆసుపత్రుల్లో కేవలం నూజివీడు మరియు బనగానపల్లి ఏరియా ఆసుపత్రుల్లో మాత్రమే కలుషిత నీటి జలాల శుద్ధి ప్లాంట్లు (సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఉన్నట్లు మంత్రి దృష్టికొచ్చింది. 40 బోధన మరియు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో 17 చోట్ల ఎస్‌టీపీలు లేవు. ఈ పరిస్థితి ఆమోదయోగ్యం కాదని, వెంటనే సవరణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్(డీఎంఇ) పరిధిలోని 17 బోధన మరియు స్పెషాలిటీ ఆసుపత్రులు, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్(డిఎస్‌హెచ్) పరిధిలోని మొత్తం 54 ఏరియా మరియు 9 జిల్లా ఆసుపత్రుల్లో వెంటనే ఎస్‌టీపీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ 80 ఆసుపత్రుల్లో ఎస్‌టీపీల ఏర్పాటుకు రూ. 83 కోట్లు ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. 10 నెలల్లో నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# రాష్ట్రంలో పలు జిల్లా జడ్జీల బదలీ

**విజయవాడ,జూలై 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ జిల్లాల పరిధిలో పెద్ద సంఖ్యలో జిల్లా జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం,. పదోన్నతులు పొందిన వారితో కలిపి భారీగానే జిల్లా జడ్జీలకు స్థానచలనం కల్పించినట్లు తెలుస్తోంది. సివిల్ జడ్జీలు (సీనియర్ డివిజన్) నుంచి అదనపు జిల్లా జడ్జీలుగా పదోన్నతి పొందిన వారు కూడా ఈ జాబితాలో ఉన్నారని సమాచారం.పూర్తి పేర్లు మరియు కొత్త స్థానాల వివరాలతో కూడిన అధికారిక బదిలీల జాబితాను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ ద్వారా చూసి తెలుసుకునే అవకాశం కల్పించారు.


శనివారం ఆలూరులో జరిగిన సిఎం చంద్రబాబు సభకు హాజరైన ప్రజానీకం

# 'వేదవతి'ని పూర్తి చేస్తా

>> సాధికారత, దీపం2.0 ద్వారా గ్యాస్ సబ్సిడీ, ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో గందరగోళం సృష్టించి వివాదాలకు కారణమయ్యారని సీఎం విమర్శించారు. రీసర్వే ద్వారా అన్ని భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరుస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తూ ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని.. వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. హీరో మోటార్స్, ఎల్‌జీ, దాల్మియా వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని, రూ.1 లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను ఉద్యాన, పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కర్నూలు-బళ్లారి రైల్వే లైన్‌కు కేంద్రం ముందుకు రావడం సంతోషకరమన్నారు.

# మంచి నీటి అవసరాలకే పులిచింతల, పట్టిసీమ

>> లేకుండా చూస్తూ, పోలవరం కుడి కాలువ నీరు వృథా కాకుండా కృష్ణా డెల్టాకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా డెల్టా పరిధిలో నాగార్జున సాగర్ నిండకుండానే వరి సాగు చేస్తే ఆ ప్రాంత రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. ఈ సీజన్‌లో సాగర్‌కు నీళ్లు రాకపోతే 2027 జూన్ వరకు పులిచింతల, పట్టిసీమ నీళ్లను మంచి నీటి అవసరాలకే భద్రపరచుకోవాలని స్పష్టం చేశారు. పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు 10 జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# టమాటా ధరలపై తప్పుడు ప్రచారం నమ్మొద్దు

>> మార్కెట్ ధరలను పరిశీలిస్తే వివిధ మార్కెట్లలో కనిష్టంగా రూ.6 నుంచి గరిష్టంగా రూ.16 వరకు ధరలు ఉన్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా టమాటా రైతులకు కిలోకు కేవలం రూ.2 మాత్రమే లభిస్తోందని చెప్పడం వాస్తవ విరుద్ధమని అన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు మార్కెట్‌లో సరఫరా, డిమాండ్‌ను సమతుల్యం చేసేందుకు వ్యవసాయ మార్కెటింగ్, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది అధిక దిగుబడుల కారణంగా మార్కెట్లకు టమాటా రాక పెరిగినప్పటికీ, ముందస్తు ప్రణాళికలో భాగంగా సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించడం, దశలవారీగా నాట్లు వేయించడం వంటి చర్యల ద్వారా ఒకేసారి అధిక సరఫరా ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. జూలై నెలలో మార్కెట్లకు రోజువారీగా సగటున 5,000 నుంచి 5,500 మెట్రిక్ టన్నుల టమాటా రాకలు నమోదవుతున్నాయని, నిన్న వివిధ మార్కెట్లకు సుమారు 6,000 నుంచి 7,000 మెట్రిక్ టన్నుల వరకు రాకలు వచ్చాయని మంత్రి తెలిపారు. 12,225 మెట్రిక్ టన్నుల టమాటా రాకలు నమోదయ్యాయని, రాప్తాడు మార్కెట్‌లో భారీ స్థాయిలో లావాదేవీలు జరిగాయని ప్రచారం చేయడం కూడా వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. రాప్తాడు మార్కెట్‌లో టమాటా రాకలే నమోదు కాలేదని తెలిపారు.

గత రెండేళ్లలో మొత్తం సీజన్‌లో టమాటా ధరలు కిలోకు రూ.3 నుంచి రూ.6 మధ్యే ఉన్నాయంటూ చేస్తున్న ప్రచారం కూడా వాస్తవాలను వక్రీకరించేదేనని మంత్రి అన్నారు. 2024, 2025 సంవత్సరాల్లో పలు నెలల్లో టమాటా ధరలు ఈ స్థాయికి మించి గణనీయంగా నమోదయ్యాయని వివరించారు. రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రచారం చేయకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపడుతున్న మార్కెట్ జోక్య చర్యల్లో భాగంగా ఈ ఏడాది జూలై 5 నుంచి ఇప్పటివరకు సుమారు 261 టన్నుల టమాటాను సేకరించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సేకరించిన టమాటాలను రాష్ట్రంలోని రైతు బజార్లలో నో లాస్-నో ప్రాఫిట్ విధానంలో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

# రైతు ఆత్మహత్య

**అచ్చంపేట, జులై 25 ప్రభాత వార్త:** పల్నాడు జిల్లా పెద్దకూరపాడు నియోజకవర్గం పరిధిలోని అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామానికి చెందిన రైతు కడిమెళ్ల నాగరాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో తీవ్ర సంచలనానికి దారితీసింది. ఆత్మహత్యకు ముందు నాగరాజు విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో "ఈ వీడియోనే నా వాంగ్మూలం" అంటూ తన మరణానికి అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ సురేష్, గ్రామానికి చెందిన బాగేశ్వరరావుతో పాటు మరికొందరు కారణమని ఆరోపించినట్లు వీడియోలో కనిపిస్తోంది. ఈ వీడియో ప్రస్తుతం పల్నాడు జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, ప్రేమ వ్యవహారానికి సంబంధించిన వివాదంలో నాగరాజు తీవ్ర మనోవేదనకు గురయ్యాడని, న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఫిర్యాదుపై సరైన చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. అనంతరం మనస్తాపంతో పురుగుల మందు తాగిన నాగరాజు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. నాగరాజు మృతి అనంతరం సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. సెల్ఫీ వీడియోలో చేసిన ఆరోపణలపై వెంటనే నిష్పాక్షిక విచారణ చేపట్టి, విచారణలో ఆరోపణలు నిజమని తేలితే అచ్చంపేట సీఐ శ్రీనివాసరావుతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# పొగాకు రైతులను ఆదుకోవాలి

## సిఎం చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు సెక్రటరీ, డైరెక్టర్ల భేటీ

**విజయవాడ,జులై 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పొగాకు రైతులను ఆదుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు చేపడుతున్న నిరంతర సంప్రదింపులతో రాష్ట్రంలోని పొగాకు రైతుల సమస్యలపై కేంద్రం దృష్టి సారించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి ఆ శాఖ అదనపు సెక్రటరీ నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మోనికా గౌర్‌ను రాష్ట్రానికి పంపింది. కర్నూలు జిల్లా పర్యటనకు బయలు దేరే ముందు సీఎం చంద్రబాబుతో వీరు భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, టుబాకో బోర్డు ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేలా సిద్ధం చేసిన 3 ప్రతిపాదనలపై సీఎంతో కేంద్ర ప్రతినిధులు చర్చించారు. వడ్డీ లేకుండా వర్కింగ్ క్యాపిటల్ రుణాల జారీ, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి ప్రతిపాదనలను రూపొందించారు. ఈ ప్రతిపాదనలపై పూర్తి స్థాయిలో చర్చించాలని ఏ నిర్ణయం తీసుకున్నా పొగాకు రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

# కుప్పాన్ని ద్రావిడ సిటీగా కేంద్రం ప్రకటించాలి

**కుప్పం, జూలై 25 ప్రభాతవార్త:** దక్షిణాది రాష్ట్రాల కూడలి అయిన కుప్పాన్ని కేంద్ర ప్రభుత్వం ద్రావిడ సిటీగా ప్రకటించాలని ద్రావిడ సిటీ మూమెంట్ అధ్యక్షుడు అభిగౌడ పేర్కొన్నారు. శనివారం ద్రవిడ స్నేహ దినోత్సవంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రవిడ వర్సిటీ క్యాంపస్‌లో పార్లమెంట్ సెషన్ సమావేశాలు నిర్వహించాలన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

>> విరోధ శక్తులు బలపడకుండా చూడాలన్నారు. దేశం ఐక్యతతో నిలవాలన్నారు. భారత విద్యార్థుల భవిష్యత్తు దేశ చట్టాలకు బందీ కావొద్దన్నారు. మన పిల్లలు తమ మనసును చదువులపై పెట్టాలని, కెరీర్‌పై ఫోకస్ పెట్టాలని, ఈ విషయంపై ఆలోచనలు చేసి, తన రాజీనామాను ప్రధాని మోడీకి సమర్పించినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. ప్రభు జగన్నాథుడి ఆశీస్సులతో భవిష్యత్తులో దేశమాత కోసం సేవ చేస్తానన్నారు. ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మీదకు నాకు నమ్మకం ఉందని, యువత ఆకాంక్షలు, ఆశయాలను గౌరవిస్తున్నానన్నారు. యువత కేవలం భారత దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, వాళ్లు వికసిత భారత్‌కు కొత్త వాహకాలు అన్నారు. భవిష్యత్ నిర్మాతలు, శిల్పకారులు అని కూడా యువతే అని పేర్కొన్నారు. మే 3వ తేదీన జరిగిన పరీక్షలో అక్రమాలు జరిగినట్లు తెలియగానే. ఆ కేసును సిబిఐకి అప్పగించామన్నారు. ఆ ఎగ్జామ్‌ను మళ్లీ షెడ్యూల్ చేశామన్నారు. 2027 నుంచి నీట్ యూజీ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధాన్ తెలిపారు. సుమారు 20 లక్షల మంది రాసిన నీట్ పరీక్షను స్మూత్‌గా నిర్వహించడమే ప్రాధాన్యతగా ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం దీనికి సహకరించిందన్నారు. విద్యార్థులు, గార్డియన్లు, పేరెంట్స్ సహకారంతో పరీక్షను జూన్ 21వ తేదీన విజయవంతంగా నిర్వహించినట్లు ప్రధాన్ తెలిపారు. ముందు నుంచి ఈ సంక్షోభానికి బాధ్యతను ఆమోదిస్తున్నట్లు ఆయన చెప్పారు. బాధ్యతల నుంచి తానేమీ పారిపోయేందుకు ప్రయత్నించలేదన్నారు. ఎగ్జామ్ మాఫియా వల్ల మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడడమే తన కర్తవ్యంగా పెట్టుకున్నానన్నారు. ఏ విద్యార్థికి కూడా అన్యాయం జరగకుండ చూశానన్నారు. జూలై 16వ తేదీన రిలీజ్ చేసిన నీట్ యూజీ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎంతో మంది మెరిట్ పేద విద్యార్థులు విజయం సాధించినట్లు చెప్పారు. తన లేఖలో కేంద్ర మంత్రులకు, అధికారులకు, విద్యాశాఖ సిబ్బందికి, తనతో పనిచేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి సేవ చేయడమే తన జీవితంలో అత్యధిక ప్రాధాన్యమైందని, దేశ సేవకే అంకితమైనట్లు ఆయన తన లేఖలో చెప్పారు. ప్రధాని మోడీకి రాసిన రాజీనామా లేఖను ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది.

# కొత్త విద్యా మంత్రిగా ప్రహ్లాద్‌జోషి



**న్యూఢిల్లీ, జులై 25:** కేంద్ర కొత్త విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్‌జోషి నియమితులయ్యారు. ఈమేరకు ప్రధాని కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజాపంపిణీ వ్యవస్థ తోపాటు కొత్త, పునరుత్పత్తి ఇంధన మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్న జోషికి అదనంగా విద్యాశాఖ బాధ్యతలను కూడా మోడీ సర్కారు అప్పగించింది.

**ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం**

ఇదిలా ఉండగా మంత్రిపదవికి చేసిన రాజీనామా లేఖను ప్రధాని మోడీకి అందచేయగా ఆ పత్రాన్ని రాష్ట్రపతికి పంపించడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెనువెంటనే రాజీనామాను ఆమోదించారు. రాజీనామాకు దారితీసిన పరిస్థితులు, తన వ్యక్తిగత ప్రతిష్టకంటే దేశ భవిష్యత్తు,యువత భవిష్యత్తే ముఖ్యమని అయితే దారితీసిన పరిస్థితులు తనను ఎంతో బాధించాయని మంత్రి ప్రధాన్ తన లేఖలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

# జంతర్‌మంతర్‌కు గుడ్‌బై

>> మోడీ హామీ ఇచ్చారు. ఆ తరువాత ఎన్టీఏలో ప్రక్షాళన చేసారు. కొత్త పరీక్షా విధానం ప్రకటించారు. కాక్రోచ్ పార్టీ ప్రతినిధులతో చర్చలు చేసారు. అందులో వారి డిమాండ్లకు అంగీకరించారు. అయినా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే నిరసన ఆగుతుందని సిజెపి తేల్చి చెప్పింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో కాక్రోచ్‌పార్టీ ఆందోళన ఫలించింది. ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా లేఖలో దేశ యువత భవిష్యత్తు, దేశ ఐక్యతను దృష్టిలో పెట్టుకుని రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశసేవకు ఎప్పటికీ అంకితభావంతో కొనసాగుతానని లేఖలో స్పష్టం చేసారు. 10 రోజులుగా జరుగుతున్న పరిణామాలు బాధించాయని ఆవేదన వ్యక్తం చేసారు. తాను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదని స్పష్టం చేసారు. యువత భవిష్యత్ కోసమే రాజీనామా చేసినట్లు వెల్లడించారు. దేశ విద్రోహ శక్తులకు అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. యువశక్తే ఈ దేశ అసలైన శక్తిగా ధర్మేంద్ర ప్రధాన్ అభివర్ణించారు. యువత చదువు కోసమే సమయం కేటాయించాలని సూచించారు. జంతర్‌మంతర్ ఇతర నగర వీధుల్లో సిజెపి ప్రతినిధులు సంబరాల్లో మునిగిపోయారు. వీధుల్లోకి వచ్చి డాన్సులు చేయడం కనిపించింది.మరోపక్క రాష్ట్రాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల్లో వెలుగురేఖలు కనిపించాయి. డిమాండ్లు మొత్తం మూడింటికి అంగీకరించిన కేంద్రం పరిహారం వస్తుందని మరోపక్క, ఇంతకాలానికి నీట్ విద్యార్థులకు న్యాయంజరిగిందని మరోవైపు విద్యార్థుల తల్లితండ్రులు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా కూడా రాష్ట్ర రాజధానుల్లో సిజెపి ప్రతినిధులేకాకుండా వివిధ పార్టీల యువనేతలు కూడా హర్షాతిరేకాలుప్రకటించారు.

**జంతర్‌మంతర్‌ను వీడండి: ఆందోళన విరమణకు పిలుపు**

కాగా డిమాండ్లు పరిష్కారం కావడంతో జంతర్‌మంతర్‌లో మకాం చేసిన విద్యార్థులందరూ ఇక ఇళ్లకు తరలివెళ్లాలని సిజెపినేతలు ప్రకటించారు. కేంద్ర మంత్రి రాజీనామా, ఆత్మహత్యలుచేసుకున్న విద్యార్థి కుటుంబాలకు పరిహారం చెల్లింపుతోపాటు విద్యార్థినేతలపై కేసులు ఎత్తివేసేందుకు మంత్రులు జితేంద్రసింగ్, జెపి నడ్డాలు ప్రభుత్వంతో సంప్రదించి ఆమోదం తెలిపారని అందువల్ల ఇక మన ఉద్యమాన్ని విరమించాలని సిజెపి నేతలు విజ్ఞప్తిచేసారు. జంతర్‌మంతర్ వేదికవద్ద అంబేద్కర్ చిత్రపటాన్ని చేతపట్టుకుని విద్యార్థినేతలు భారీ స్థాయిలో హర్షాతిరేకాలు వ్యక్తంచేసారు.

# చర్చలు సానుకూలం

>> డిమాండ్లుగా ఉన్నాయి. నిరసన కారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని, ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు, ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉంటే వాటిని ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌కు మంత్రులు అంగీకరించినట్లు తెలిపారు. ఈ కేసులు ఢిల్లీ పోలీసులు నమోదుచేసినా లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ నమోదైనా సరే ఆ ఎఫ్ఐఆర్ కాపీలను మేం వారికి అందిస్తాం. నిరసనల సమయంలో ఆందోళనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడానికి, వారిపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటానికి ప్రభుత్వం అంగీకరించింది. భవిష్యత్తులో కూడా ఆందోళనల నిర్వాహకులు, నిరసనకారులపై ఈ కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి కేసులు నమోదు చేయకూడదని మేము అంగీకరించాం. వారు ప్రస్తావించిన రెండో అంశం పరిహారానికి సంబంధించినది. ఈ పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం తన వైఖరిని చాలా స్పష్టంగా తెలియజేసింది. నిబంధనలు లోబడి సాధ్యమైనంత పరిహారాన్ని అందిస్తామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపినడ్డా స్పష్టంచేసారు.

**'ఆందోళనకారులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోండి':** చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. కేంద్రం తమ డిమాండ్లు నెరవేరుస్తామని మంగళవారం నాటికి స్పష్టత ఇస్తామని ప్రకటించడంతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు సౌరవ్‌దాస్, అశుతోశ్ రంకాలు ప్రకటించారు. మరోవైపు, తమ ఐదుసూత్రాల డిమాండ్ల పత్రాన్ని ప్రభుత్వానికి సీజేపీ ప్రతినిధులు సమర్పించారు. నాలుగు వారాల తర్వాత తదుపరి విడత చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సిజెపి ప్రతినిధి అశుతోశ్ రాంకా మాట్లాడారు. "మేము నీట్ బాధితుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం డిమాండ్ చేశాం. అందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇది కాకుండా విద్యా, పరీక్షా సంస్కరణల గురించి ప్రస్తావిస్తూ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని కూడా ప్రభుత్వం ముందు ఉంచాం. ఆ డిమాండ్ల పత్రం గురించి సుమారు నాలుగు వారాల్లో మేం ప్రభుత్వాన్ని మళ్లీ కలుస్తాం. డిమాండ్లకు అంగీకారం లభించింది కాబట్టి నిరసనకారులు వెంటనే తమ ఇళ్లకు తిరిగివెళ్లాలని కోరుతున్నామని అశుతోశ్ పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్య విజయం: వాంగ్‌చుక్

>> తెలిపిన విద్యార్థులపై ఎలాంటి కేసులు ఉండబోవనే హామీ, నీట్ వివాదం నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అంశాలపై కేంద్రం హామీ ఇవ్వడంతో ఆయన 26 రోజుల నిరాహారదీక్షను గురువారం విరమించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆయన విక్టరీ సింబల్ చూపుతూ ఉన్న ఫోటోను పోస్ట్ చేశారు. వీధుల నుంచే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, ఇది శాంతి, సహనం, పట్టుదల సాధించిన విజయం అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ, దేశ యువతకు ఆయన అభినందనలు తెలిపారు. భయాన్ని వీడి ఉద్యమంలో పాల్గొన్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఇకపై ఉద్యమం జవాబుదారీతనం, విద్యాసంస్కరణల దిశగా ముందుకు సాగుతుందని అన్నారు.

# పునర్నిర్మాణానికి ఇది ముందడుగు

>> కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యం కోసం, దేశ భవిష్యత్తు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి నా అభినందనలు. మీపై నాకు గర్వంగా ఉందని అన్నారు. ఈ రాజీనామా రైతులు, కార్మికులు, పేదలు సహా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి వర్గానికి ఒక సందేశమని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం అణచివేతకు గురిచేస్తున్న ప్రతి వర్గం ధైర్యంగా పోరాడితే మార్పు సాధ్యమవుతుందని ఈ పరిణామం నిరూపించింది. దేశ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తూ, సంస్థలను తన ఆధీనంలోకి తీసుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఎదుర్కోవాలి. అని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా రెండు కీలక డిమాండ్లను నెరవేర్చాల్సి ఉందన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్, కాల్పులు, బలప్రయోగానికి పాల్పడిన అధికారులు, వాటిని ఆదేశించిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై చేయి చేసుకున్నవారు, వారిని కొట్టినవారు, కాల్పులకు పాల్పడినవారు, ఈ చర్యలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసిన ప్రతి ఒక్కరినీ బాధ్యులుగా నిలబెట్టి శిక్షించాలని కోరారు. దేశ విద్యార్థుల పట్ల గౌరవం చూపిస్తూ ప్రధాని మోడీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తైన విద్యార్థులపై జరిగిన అమానుష దాడులకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి. విద్యార్థులపై జరిగిన దాడులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

# 'కల్తీనెయ్యి'పై మరింత లోతుగా దర్యాప్తు

>> సిఎస్ దినేశ్‌కుమార్‌ను ఏకసభ్య కమిటీని నియమించింది, ఆయన దాదాపు ఆరునెలలపైగా సిబిఐ సిట్ నివేదికల ఆధారంగా గతంలో పనిచేసిన టిటిడి ఇఒ,జెఇఒలను,మార్కెటింగ్ ,డెయిరీ సంస్థల ప్రతినిధులను విచారణ చేపట్టారు. ఈ రెండు శాఖల నివేదికలు ప్రభుత్వానికి అందాయి.లడ్డూల కల్తీ నెయ్యి కేసులో దేశంలోని 15ప్రాంతాల్లో గతనెలలో గుంటూరు, ఢిల్లీ, ముంబై, రాజ్‌కోట్, డెహ్రాడూన్, రూర్కీ, బికనీర్, అహల్యానగర్, దిండిగల్‌లో ఇడి అధికారుల సోదాలు కూడా చేయడం సంచలనం రేపింది. ఈ కేసులో నిందితులు పోమిల్ జైన్, విపిన్ జైన్, రాజు రాజశేఖరన్, రాజేష్ చావ్డా, అపూర్వ చావ్డా,సుచీంద్ర శాంతారామ్ లాంకే, అజయ్‌కుమార్ సుగంధ్, మహేష్‌కుమార్ రోహిరా, ఆశిష్ అగర్వాల్ తదితరుల నివాసాలు, కార్యాలయాల్లో ఇడి సోదాలు చేసి 60 లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. **ఫ్యాక్టరీస్ విభాగం కీలకం:** తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన కేసులో పునబాకలోని వైష్ణవీడెయిరీ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ నుండి లంచాలు తీసుకున్నారనే ఆరోపణలపై విశ్రాంత డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కర్రి పరమేశ్వరరావుతో బాటు ఏదుమంది అధికారులపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం మేనెలలోనే ఉత్తర్వులిచ్చింది. అప్పట్లో నెల్లూరుజిల్లా ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివశం కర్‌రెడ్డి, విశ్రాంత ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రమేశ్‌బాబు,బాయిలర్స్ డిప్యూటీ చీఫ్ మేడిచర్ల సత్యనారాయణ.నరసింహరాజు.సుష్మ, రాంబాబుపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. రానున్న రోజుల్లో ఏ అదికారికి నెలవారీ మామూళ్ళు అందాయనేది ఇప్పుడు విచారణకు రానుంది. తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి వెనుక కీలకంగా వ్యవహరించిన పెద్దలను మాత్రం వదలిపెట్టరాదనే నిశ్చయంతో సిబిఐ సిట్ నివేదికలు, ఏకసభ్యకమిటీ నివేదికలను ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ,పోలీస్ బాస్ డిజిపి , న్యాయశాఖ కార్యదర్శి సభ్యులుగా త్రిసభ్యకమిటీ కూడా రావాల్సి ఉంది.అయితే కల్తీనెయ్యి వివాదంలో సిబిఐ సిట్, ఏకసభ్యకమిటీ తేల్చిన అంశాలపై మరింత లోతుగా విచారణ చేపట్టి అసలు దోషులు గుర్తించాలని భావించినా ఇప్పటికీ ఏం తేల్చలేకపోయిందనేది టిటిడి వర్గాల్లో గుప్పుమంటోంది.

## వారం - వర్జ్యం

26-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
ద్వాదశి మ.1.57
జ్యేష్ఠ ఉ.7.34
వర్జ్యం : లేదు
దు.సా.4.54-సా.5.46
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. శాస్త్ర, సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**వృషభం:** పురోభివృద్ధిలో కొంత ప్రతికూల పరిస్థితులు చోటుచేసుకుంటాయి. వృత్తిలో స్థిరత్వ నెలకొంటుంది. వాహనసౌఖ్యం.

**మిథునం:** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. అంతర్గత రాజకీయాలు కొంత బాధిస్తాయి.

**సింహం:** మనోధైర్యం, ఓర్పు వీడకండి. అన్నీ ప్రతికూలంగా ఉన్నా సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. స్పెక్యులేషన్‌కు ఎంత దూరంగాఉంటే అంత మంచిది.

**కన్య :** ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. పెట్టుబడులు సమకూర్చుకుంటారు.

**తుల:** కుటుంబ సమస్యల నుండి బయట పడతారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందు తారు.ఇంటా బయటా మీదే పైచేయిగా వుంటుంది.

**వృశ్చికం:** వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు. వివాదాలకు దూరంగా వుండండి.

**ధనుస్సు:** కారణంలేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి. ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో సాధిస్తారు.

**మకరం:** చేపట్టిన కార్యక్రమాలలో స్వల్ప ఆటంకాలు కలిగినా ఎట్టకేలకు పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**కుంభం:** కార్యాలయంలో పనిభారం పెరిగినప్పటికి సమర్థతతో నిర్వహిస్తారు. ఒకానొక బాధ్యతను పూర్తిచేసి బరువు దించుకుంటారు.

**మీనం:** శాంతము వహించడం వలన అనేక లాభాలు కలుగుతాయి. ఆర్థిక అంశాలు అనుకూలంగా వుంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రవాణా రంగంలో ఇ-బస్సుతో నూతన శకం

## 'సింహపురి ఇ-బస్సు డిపో'లో పవర్ రూమ్ ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి




**విశాఖపట్నం, జులై 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యావరణహిత, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం విశాఖపట్నంలోని సింహపురి ఈబస్సు డిపోలో పవర్ రూమ్‌ను ప్రారంభించి, డిపోలో ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్, ఛార్జింగ్ స్టేషన్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తొలి ఏకాదశి రోజున రాష్ట్రంలో మొదటి బస్ పవర్ రూమ్ ప్రారంభం నూతన శకానికి నాంది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ప్రజా రవాణాను వేగంగా విస్తరిస్తున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి ఈబస్సు అద్దె పథకం కింద రాష్ట్రానికి తొలి దశలో 750 ఎలక్ట్రిక్ బస్సులు రానుండగా, అందులో విశాఖపట్నానికి 100 బస్సులు కేటాయించినట్లు చెప్పారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు నగరాల్లో దశలవారీగా ఈబస్సులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, కూటమి ప్రభుత్వం ఉన్నంతకాలం సంస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం మంత్రిగారిని డిపో కమిటీలు, కార్మికుల సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు, ఇంజినీర్లు, డిపో మేనేజర్లు, ఉద్యోగులు, వివిధ ఆర్టీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాప్ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62యేళ్లకు పెంపు

## రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60యేళ్ల నుంచి 62యేళ్లకు పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచే వర్తింపజేస్తుండటంతో ఇటీవల 60 యేళ్లకు పదవీ విరమణ చేసిన ఎనిమిది మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోనున్నట్లు శాప్ ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమ పదవీ విరమణ వయసును కూడా 62 యేళ్లకు పెంచాలని ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యు), కార్పొరేషన్లు, సొసైటీలలో పనిచేసే ఉద్యోగులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం 2022లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 62 యేళ్లకు పెంచినప్పటికీ, ఈ సంస్థలకు మాత్రం వర్తింపజేయలేదు. దీంతో కొందరు ఉద్యోగులు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో స్పందించిన ప్రస్తుత ప్రభుత్వం, ఇటీవల పీఎస్‌యులు, కార్పొరేషన్లలోని ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 యేళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని షెడ్యూల్ 9, షెడ్యూల్ 10 పరిధిలోకి వచ్చే సంస్థలకు ఈ పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల ఖజానాపై పడే ఆర్థిక భారంతో పాటు ఇతర అంశాలపై ప్రభుత్వం క్షుణ్ణంగా చర్చించి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇప్పటికే 60యేళ్లకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నారు.వారు ఉద్యోగంలో లేని కాలానికి ఎలాంటి జీతభత్యాలు చెల్లించరు. 62యేళ్లు నిండే వరకు వారిని రెగ్యులర్ ఉద్యోగులుగానే పరిగణిస్తారు. ఇటీవల ఏపీ ఆగ్రోస్ విశ్రాంత డైరెక్టర్ వి.రంగరాజన్ ఇదే విధానంలో తిరిగి విధుల్లోకి తీసుకున్న ప్రభుత్వం, ఇప్పుడు శాప్ ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాన్ని వర్తింపజేసింది.

# ముత్తుకూరు గేట్ సుందరీకరణ

● ఆరణి కందప్ప మేస్త్రి సత్రంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవ సభలో మంత్రి నారాయణ



**నెల్లూరు(వైద్యం), జులై 25, ప్రభాతవార్త:** నెల్లూరు నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దే దిశగా ముత్తుకూరు గేట్ సెంటర్‌లోని సర్వేపల్లి కాలువ వద్దున ఉన్న స్థలాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శనివారం పరిశీలించారు. ఆ ప్రాంతాన్ని బ్యూటిఫికేషన్ ద్వారా సుందరీకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వీఆర్‌సీ మైదానంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తర్వాత సంతపేటలోని ఆరణి కందప్ప మేస్త్రి సత్రంలో రూ.3.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్రం ఈవో ఉషారాణి, పాలకమండలి చైర్మన్ మహేష్, కమిటీ సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, సభ్యులకు ఐడీ కార్డులు అందజేసిన మంత్రి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరణి కందప్ప మేస్త్రి సత్రాన్ని పరిరక్షిస్తూ వారసులతో నడుస్తున్న సత్రంలో ప్రజలకు ఉపయోగపడే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజ సేవ లక్ష్యంగా ఆరణి కందప్ప మేస్త్రి సత్రాన్ని ఏర్పాటు చేయడం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.14 వేల కోట్లతో మంచినీటి ప్రాజెక్టులు, రూ.28 వేల కోట్లతో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందించడంతో లక్ష్యమని, 2029 నాటికి జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేస్తామని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడించారు. ప్రభుత్వం, ధార్మిక సంస్థలు, సేవా సంస్థలు కలిసి పనిచేస్తే సమాజంలో మరింత మంచి మార్పు తీసుకురావచ్చని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనూరాధ, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, జనసేన నేత దుగ్గిశెట్టి సుజయ్ బాబు, టీడీపీ నేతలు పుట్టా అజయ్, ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు అత్యంత ప్రాచీనమైన భాష

● మానవ జీవన వికాసం తొలి నాళ్ళ నుంచే తెలుగు అస్తిత్వం ఆరంభమైంది ● తెలుగు మహోత్సవంలో పలువురు వక్తలు



తెలుగు ఉత్సవాల తపాల సంచి ఆవిష్కరణ

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు అత్యంత ప్రాచీనమైన భాషగా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలుగు అత్యంత సరళమైనది. సులభ గ్రాహ్యమైందని వారన్నారు. మానవ జీవన వికాసం తొలి నాళ్ళనుంచే తెలుగు అస్దిత్వం ఆరంభ మైందన్నారు. అచ్చతెనుగును వాడుకలోకి తీసుకుని రావడం ద్వారా భాష విశిష్టతను మరింత బలీయంగా ప్రజలకు అవగాహన కలిగించ వచ్చునన్నారు. తెలుగు వారి వారసత్వ సంపదగా నిలిచిన ప్రతి కళను ప్రోత్సహించాలన్నారు. తెలుగు భాషా విశిష్టతను, సాంస్కృతిక వైభవాన్ని భవిష్యత్తు తరాలకు అందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో తెలుగు మహోత్సవం రెండు రోజుల వేడుకలు విజయవాడ నగరశివారు చారిత్రక ఉండవల్లి గుహల వద్ద శనివాఆరం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉండవల్లి గుహలల్లో ఉదయం 6.30 ని.లకు ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల గాత్ర విద్యార్థులచే తెలుగు భక్తి, సాహిత్య గీతాలతో ప్రభాతాన్ని ఆహ్వానిస్తూ, గుహల పైభాగంలో సాగే అద్భుతమైన శాస్త్రీయ సంగీత గీతికలతో "సూర్యోదయ సుప్రభాతం" కార్యక్రమం ప్రారంభమైంది. తదుపరి తెలుగు మహోత్సవం ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, ఏపీఎంఎస్ఐడీసీదీది చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, ఏపీ సారసత్వ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా డీసీపీ కె.జి.బి సరిత, తెలుగు సాహిత్య, సంస్కృతి అకాడమీ చైర్మన్ ఎండి విల్సన్ (శరత్ చంద్ర) జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభ ఉపన్యాసం చేస్తూ మన మాతృభాష తెలుగు ప్రాచీనతను, శతాబ్దాల సాహిత్య సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. మారుతున్న కాలంలో యువతలో మాతృభాషాభి మానాన్ని నింపేందుకే చారిత్రక నేపథ్యం ఉన్న ఉండవల్లి గుహల సాక్షిగా ఈ తెలుగు మహోత్సవంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలుగు కళలు, జానపద మూలాలు, లలిత కళలతో భాషా వైభవాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం శుభపరిణామం అని గద్దె అనురాధ పేరోన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భవాని దేవి, మందలపు హైమావతి, తేళ్ల అరుణ, వసుధా రాణి, సుశీలమ్మ, సింహాద్రి జ్యోతిర్మయి మొల్ల సాహిత్యం నుంచి ఓల్గా సాహిత్యం వరకు ప్రతి కోణంలో మహిళలు ఎలా వారి బాటలో పయనించి లక్ష్యాల వైపు పరుగులు తీస్తూ నూతనాన్ని సాహిత్య విలువలను స్త్రీ తన వంతు పాత్రను ఏ విధంగా నిర్వహిస్తుందో ఈ చర్చా వేదిక సాక్షిగా చర్చించడం జరిగింది. ఆకాశవాణి విశ్రాంత సంచాలకురాలు ముంజలూరి కృష్ణకుమారి అమ్మమ్మ కథల ద్వారా పిల్లలకు ఆసక్తిని, ఉత్సాహాన్ని కలిగించే పంచతంత్ర, నీతి కథలను చెప్పడమే కాక పిల్లల చేత సృజనాత్మకంగా కథలను చెప్పించారు.

**గుహల్లో ప్రతిధ్వనించిన కవితాగానం:** తెలుగు మహోత్సవంలో భాగంగా "చెట్టునీడలో చిరుగాలి కవిత్వం" పేరుతో ప్రత్యేకంగా, వినూత్నంగా చెట్టు చుట్టూ ఏర్పాటు చేసిన వేదికపై కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ, సాహితీవేత్తలు డా.గుమ్మా సాంబశివరావు, డా. జి.వి.పూర్ణచందు, డా. యం.ప్రభాకర్, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన కవులు తెలుగుభాష, ప్రకృత, చారిత్రక ప్రదేశాలు వంటి పలు అంశాలపై కలమెత్తారు. కవిగా గానం చేశారు. కవుల గళాల నుండి వెలువడ్డ తెలుగు కవితాగానం ఉండవల్లి గుహల్లో ప్రతిధ్వనించింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులకు గడిచిన ఆర్థిక సంవత్సరంలో బకాయిపడ్డ ఫీజులను ప్రభుత్వం రీయింబర్స్‌మెంటు చేసింది. చదువు పూర్తి చేసినప్పటికి ఫీజు బకాయిలతో సర్టిఫికెట్లు పొందలేకపోతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించింది. 2025 -26 విద్యా సంవత్సరంలో ఫైనలియర్ చదివి కోర్సులు పూర్తిచేసిన విద్యార్థుల ఫీజుల విడుదలకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. సుమారు రూ.600 కోట్ల మేర ఫీజులు కాలేజీల ఖాతాలకు జమ అవుతున్నాయి. దీంతో విద్యార్థులకు వెంటనే సర్టిఫికెట్లు అందనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరంలో నాలుగు క్వార్టర్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఇంజనీరింగ్, డిగ్రీ, ఇతర కోర్సుల్లో ఫైనలియర్ చదివిన విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు నిలిపివేశాయి. ఇప్పుడు ఫైనల్ ఇయర్ ఫీజులను విడుదల చేసిన ప్రభుత్వం.. మిగిలిన విద్యార్థులకు దశలవారీగా బకాయిలు విడుదల చేయనుంది.

# ఆ నియోజకవర్గాలకు టిడిపి ఇన్‌చార్జ్‌లు

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అవనిగడ్డ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాలకు టిడిపి ఇన్‌చార్జ్‌లను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. అవనిగడ్డ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్‌గా విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్‌గా బుద్ధా వెంకన్నను నియమించింది. ఈ రెండు నియోజకవర్గంలో కూటమి పక్షానికి చెందిన జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయవాడ పశ్చిమానికి బిజెపి ఎమ్మెల్యే యలమంచలి సత్యనారాయణ (సుజనా చౌదరి) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టిడిపి క్యాడర్‌ను పటిష్టం చేసుకోవడం, ఇతరంశాలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ తెలుగుదేశం ఇన్‌చార్జీలను నియమించారు.




# అంతర్ రాష్ట్ర ఎర్రచందనం దొంగలు అరెస్ట్

● రూ.1.5 కోట్ల విలువ చేసే 78 దుంగలు స్వాధీనం

● నిందితులకు సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

**తిరుపతి(క్రైమ్), జులై 25 ప్రభాతవార్త:** శేషాచలం అడవుల్లోని విలువైన ఎర్రచందనంను దొంగలించే ఇద్దరు అంతర్ రాష్ట్ర ఎర్రచందనం దొంగలను తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ఆర్ఎస్ఏఎస్‌టిఎఫ్ ఎస్పి శ్రీనివాసులు అడిషనల్ ఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అరెస్టు చేశారు. కర్ణాటక, హర్యానా, వెస్ట్ బెంగాల్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్న ప్రధాన స్మగ్లింగ్ నెట్‌వర్క్ ను చెందించి నిందితులను అరెస్టు చేశారు. అనంతరం వారి నుండి 1.5 కోట్ల రూ విలువచేసే 78 దొంగలను స్వాధీనం చేసుకున్నారు. వీరికి సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసరును కూడ అరెస్టుచేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్, స్టేట్ ఇంటలిజెన్స్ బృందం అటవీ సిబ్బందికి రాబడిన ఖచ్చితమైన సమాచారంతో కడప జిల్లా, కాశినాయన మండలంలోని జ్యోతిగుడి వరికుంట్ల గ్రామం సమీపంన వాహనములు తనిఖీ చేస్తూ ఉండగా బొలెరో మ్యాక్సీ ట్రక్ వాహనంలో ఇంటి సామాన్లు తరలించే ముసుగులో ఎర్ర చందనం అక్రమ రవాణా చేస్తున్న హర్యానా రాష్ట్రానికి చెందిన సన్నీ, రమేశ్ అను ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో పని చేస్తున్న ఎఫ్‌బిఓ మల్లికార్జున్ ఈ ఎర్ర చందనం అక్రమ రవాణా లో ప్రధాన ఎర్ర చందనం స్మగ్లర్లకు సహకరిస్తునట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

# వ్యాసాశ్రమంలో పరిపాలనా లొల్లి

## ముఖం తప్పించిన అధికారులు... సాధువుల అసంతృప్తి

**ఏర్పేడు, జులై 25 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఏర్పేడు మండల కేంద్రంలో సుమారు వంద సంవత్సరాల సుధీర్ఘ చరిత్రకల్గిన మళయాళ యతీంద్రులచే స్థాపించబడిన శ్రీ వ్యాసాశ్రమం నేడు వివాదాలకు నిలయంగా మారింది. ఈ ఆశ్రమాన్ని 1926లో మళయాళ యతీద్రులు స్థాపించారు. ఆయన ఎన్నో సంవత్సరాలు తిరుమలలోని గోగర్భం లో సాధన చేస్తూ ఇక్కడ ఆశ్రమాన్ని స్థాపించారు. ఈ ఆశ్రమం 2005 వరకు ఎంతో చక్కగా సాగింది. తరువాత ప్రస్తుతపీఠాధిపతి పరిపూర్ణాందిగిరి స్వామి పీఠాధిపతిగా బాద్యతలు స్వీకరించిన తరువాత ఇక్కడ కుటుంబ పాలన చోటు చేసుకుందనే విమర్శలు ఆరోపణలు చోటు చేసుకున్నాయి. పీఠాధిపతి సోదరుడు,బంధువుల ఆశ్రమాన్ని ఆక్రమించుకొని కుటుంబపాలనగా మార్చారనే విమర్శలు చోటుచేసుకున్నాయి.ఈ నేపథ్యంలో ఆశ్రమం వీధికెక్కింది. దాంతో రాష్ట్రంలోని సుమారు వెయ్యి మంది సాధువులు శనివారం ఏర్పేడు మండలంలోని వ్యాసాశ్రమం వద్దకు చేరుకున్నారు.

**మొహం తప్పించిన అధికారులు:** శనివారం ఆశ్రమం వద్ద పరిస్థితిని చూసిన సాధువులు కూడా పోలీసుల దయాదాక్షిణ్యాలతో ప్రవేశించాల్సి వచ్చిందని చంద్రగిరి ఆశ్రమ పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాము ఇక్కడ చోటు చేసుకున్న సమస్యను సామరస్యంగా పరిష్కరించుకొనుటకు మొదట జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఆర్‌డిఓలకు విన్నవించగా వారు శనివారం ఇక్కడ చర్చించుటకు ఆహ్వానించారన్నారు. అయితే ఇక్కడకు వచ్చిన తరువాత తమకు కూర్చోటానికి కుర్చీలేదు, కనీసం గాలి ఆడటానికి ఫాన్లు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఇక ఇక్కడకు వస్తామన్న అధికారులు హాజరు కాకపోగా డియస్‌పి మాత్రం వచ్చారని, ఆయన కూడా తమ కోసం రాలేదని పీఠాధిపతికి సంరక్షణగా వచ్చినట్లు చెప్పటం గమనిస్తే అధికారుల తీరు స్పష్టం అయ్యిందన్నారు. ఆశ్రమం కుటుంబ పాలనగా మారి ధార్మిక విధానాలకు స్వస్తి చెప్పారన్నారు. ఇక్కడ మళయాళ యతీంద్రులు స్థాపించిన ఆశ్రమంలో కన్యాగురుకులం మూసి వేసారు. ప్రజలకోసం ఏర్పాటు చేసిన వైద్యాలయం మూసి వేసారు. ట్రస్టు లేదు. ఇక్కడ భోజన సదుపాయం లేదన్నారు. ఇక వందల గదులున్న ఆశ్రమంలో బీడు పడిందన్నారు. ఇక్కడ సమస్యలపై రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకుంటామని ప్రకటించారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించం

● ఆపరేషన్ అరణ్యపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తా ● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరిక

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని అటవీ పర్యావరణ శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు మరింత కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆపరేషన్ అరణ్యం ద్వారా ఎర్ర చందనం స్మగ్లింగ్ ను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. శనివారం, కడప జిల్లా అవధూత కాశినాయన మండల పరిధిలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతి గుడి వద్ద రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసిన విషయాన్ని ఉప ముఖ్యమంత్రిలకు అధికారులు తెలియచేశారు. ఈ ఘటన పూర్వాపరాలను వివరించారు.

శనివారం తెల్లవారు జామున ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, స్టేట్ ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారం ఆధారంగా వరికుంట్ల గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బొలెరో మ్యాక్స్ ట్రక్కులో ఇంటి సామగ్రి ముసుగులో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న హర్యానాకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, సన్నీ, రమేష్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు వివరించారు.

విచారణలో జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునుడు అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్నట్లు గుర్తించామని, వెంటనే అతడిని కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్టు వెల్లడించారు. బెంగళూరు, హర్యానా, కోల్‌కతా ప్రాంతాల్లో వీరికి సహకరిస్తున్న మరికొందరు ప్రధాన సూత్రధారులను గుర్తించినట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆ ప్రధాన సూత్రధారులను పట్టుకోవాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆదేశించారు. బీట్ ఆఫీసర్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు.




# ఆషాఢం సారె తెచ్చిన భక్తులతో రద్దీ

**ఇంద్రకీలాద్రి, జులై 25 ప్రభాతవార్త:** దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి 11వ రోజు శనివారం సాయంత్రం 5 గంటల వరకు 48 సారె బృందాలకు చెందిన 18,890 మంది భక్తులు సారె సమర్పణ చేశారు. దుర్గమ్మ దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు.

ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆధ్వర్యంలో దుర్గమ్మకి శనివారం ఆషాఢ సారె సమర్పించారు. రాజగోపురం వద్ద మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచారణలతో ఇఓ వికె శీనా నాయక్ స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. శ్రీఅమ్మవారి దర్శనానంతరం మహామండపం 6వ అంతస్తులో ప్రసాద వితరణ చేశారు.

# బిటెక్ వార్షిక ఫీజు రూ.47 వేలు

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలకు సంబంధించి ఫీజులను ఖరారు చేస్తూ సీఎం చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, బీటెక్ కోర్సుకు కనీస వార్షిక ఫీజును రూ.47 వేలుగా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

బీటెక్‌తో పాటు బీఆర్క్ మెరైన్ ఇంజినీరింగ్ వంటి ఇతర వృత్తి విద్యా కోర్సులకు కూడా ఫీజుల ను ఖరారు చేసింది. అయితే, అన్ని కాలేజీల్లోనూ ఇదే ఫీజు ఉండదు. ఆయా కాలేజీల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, కోర్సును బట్టి ఫీజుల నిర్మాణంలో మార్పులు ఉంటాయని తెలుస్తోంది. ఈ కొత్త ఫీజుల విధానం తక్షణమే అమల్లోకి రానుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఈ కనీస ఫీజు ఆధారంగా, ఒక్కో కాలేజీకి వేర్వేరుగా ఫీజులు వర్తిస్తాయి. త్వరలో ప్రారంభం కానున్న ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నాటికి ఫీజుల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు స్పష్టత ఇవ్వడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# 'ధర్మేంద్ర రాజీనామా జవాబుదారీతనానికి నిదర్శనం'

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని, ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీ తనానికి నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ పేర్కొన్నారు. ఇదే నైతికతను ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ, డీఎస్సీ పరీక్ష నిర్వహణలో జరిగిన అంతులేని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్రంలో అదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న లోకేశ్ తన పదవికి రాజీనామా చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా జగన్ ప్రశ్నించారు. "ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రమాణాలు, విలువలు, జవాబుదారీ తనానికి పూర్తిగా పాతర వేస్తూ, సీఎం చంద్రబాబు తన కొడుకు పదవిని కాపాడుకుంటారా?" అని వైసీపీ అధినేత జగన్ నిలదీశారు.

# మరో 10 కరోనా కేసులు నమోదు

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ మరో 10 కరోనా కేసులు నమోదు అయ్యాయి. గుంటూరు జిల్లాలో ముగ్గురు, ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. అలాగే అల్లూరి, ఏలూరు, కృష్ణా, తిరుపతి, విశాఖ జిల్లాల్లో ఒక్కొక్క కేసు నమోదైంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 49 కరోనా కేసులు నమోదయ్యాయి. 24 మంది బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు 302 మందికి పరీక్షలు నిర్వహించామని వైద్యశాఖ తెలిపింది.

# జెఎన్‌టియుఏకి పూర్వపు విద్యార్థుల చేయూత

## పోస్టల్ స్టాండ్ ఆవిష్కరణలో డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ జి.సతీష్‌రెడ్డి



**అనంతపురం(సిటీ), జులై 25 ప్రభాతవార్త:** రాబోయే రోజుల్లో ప్రపంచానికే తలమానికంగా జెఎన్‌టియుఏ నిలుస్తుందని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్, డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ డా.జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. జెఎన్‌టియుఏ 80యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని పూర్వపు విద్యార్థుల సహకారంతో రూపొందించిన పోస్టల్ స్టాంప్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్టర్ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ సతీష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెఎన్‌టియుఏ విసి సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, డిఆర్ఓ మలోలా, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డిలతో కలిసి సతీష్ రెడ్డి పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెఎన్‌టియుఏలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాలలో అత్యున్నత స్థాయిలో ఉన్నారన్నారు. జెఎన్‌టియుఏ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచేలా ఇక్కడి అధ్యాపకులు శ్రమిస్తున్నారని, పూర్వపు విద్యార్థులు సైతం తమవంతు తోడ్పాటును అందిస్తామని పేర్కొన్నారు. రీసెర్చ్ ప్రాజెక్టులు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

## సోములగూడెం ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్

# 31 మంది విద్యార్థినులకు అస్వస్థత

**చింతూరు, జులై 25 ప్రభాతవార్త:** పోలవరం జిల్లా వర రామచంద్ర పురం మండలం సోములగూడెం ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయి జన్ అయి 31 మంది విద్యార్థి నులు అస్వస్థకు గురయ్యారు. ఆశ్రమ పాఠశాలలోనే ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత శనివారం సాయంత్రం 11మంది విద్యార్థులను చింతూరు ఏరియా ఆసుపత్రికి, మరో పది మందిని కూనవరం సిహెచ్‌సికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పాఠశాలలోనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మిగిలిన 10 మందికి హాస్టల్లోనే అందించిన ప్రాథమిక వైద్యంతో వారి ఆరోగ్యం కుదుటపడింది.

VMRDA VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

"e"- Procurement Tender Notice

VMRDA invites the following tender on "e" Procurement Platform

| Sl.No. | Tender Notice No. | ECV in Rs. | Last Date & Time |
|---|---|---|---|
| 1 | 11/2026-27/EE-IX/VMRDA, Dt.22-07-2026 | 6,63,780/- | 28-07-2026 - 3:30 P.M |

For details logon to www.apeprocurement.gov.in

Sd/- Metropolitan Commissioner, VMRDA

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

RFP Tender Notice No.30/2026-27/CE (GVMC) / SE (East) / EE (East) / GVMC/ Dt: 18-07-2026 (2nd call)

01. No.of Works : 1 (One) (RFP Tender)
02. Downloading Starting Date : 20-07-2026 @ 10.00 PM
03. Downloading End Date : 04-08-2026 @ 04.00 PM
04. Last date for Submission of bid : 04-08-2026 @ 05.00 PM

Further details at http://www.apeprocurement.gov.in

O/o The Executive Engineer (East) Division

Sd/- Commissioner, GVMC

26-7pg4.qxd:26-7pg4.qxd 1/1/02 7:23 AM Page 1



ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్ ప్రశ్నాపత్రం లీకు కావడంతో.. పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహించారు. ఈసారి జరిగిన పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు జరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళన చేశారు. రెండోసారి నాలుగు రోజుల క్రితం సైతం జంతర్‌మంతర్ దగ్గర జరిగిన నిరసనలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం చేయడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు వ్యవహరించిన తీరుతో విద్యార్థులుసైతం పోలీసులపై దాడి చేసిన సంఘటనలు జరిగాయి. నీట్ పేపర్ లీకేజీలో ప్రధానంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం చివరికి కేంద్ర విద్యాశాఖ మంత్రితో రాజీనామాచేయించాల్సి వచ్చింది. కేంద్రమంత్రి సైతం తాను రాజీనామా చేస్తున్నానని.. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహిస్తామని తెలిపారు. ఇటువంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. గతంలో జాతీయ స్థాయిలో జరిగిన కొన్ని సంఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కొందరు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన మంత్రి ఒకరు పేపర్ లీకేజీ నేపథ్యంలో రాజీనామా చేశారు. అనంతరం మరోసందర్భంలో మరొక మంత్రి సైతం రాజీనామా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంజనీరింగ్, మెడిసిన్‌లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఎంసెట్ పేపర్ లీకైన సందర్భాలు ఉన్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరవాత కూడా ఎంసెట్ పేపర్ లీకైంది. లీకైన తరువాత మరోసారి పరీక్షను నిర్వహించారు.

# పేపర్ లీకేజీలలో ప్రభుత్వాల అలసత్వాలు..

**నాగమణీంద్ర పల్లాపు**

పేపర్ లీకేజీలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. లీకేజీల మూలంగా విద్యార్థులు మానసిక ఆందోళన చెందడమే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలతో వారి తల్లిదండ్రులు సైతం తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పేపర్ లీకేజీలు అనేది దేశ వ్యాప్తంగా నిర్వహించే పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలతోపాటు, రాష్ట్రాల్లో నిర్వహించే పోటీ పరీక్షలు, చివరికి విద్యార్థులకు నిర్వహించే విద్యా సంవత్సరపు వార్షిక పరీక్షలు సైతం లీకవుతున్నాయి. ఏ రకమైన పేపర్ లీకైన విద్యార్థులే ప్రధాన బాధితులుగా ఉంటున్నారు. పేపర్ లీకేజీలతో విద్యార్థులు మానసిక ఆందోళనే కాకుండా ఆర్థికంగా అదనపు భారం పడుతోంది. పేపర్ లీకేజీలు ఇపుడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఎప్పటి నుంచో జరుగుతున్న వ్యవహారం. ఎపుడు జరిగినా అప్పటికపుడు లీకేజీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం.. కొన్ని సందర్భాల్లో జాతీయస్థాయి పోటీ పరీక్షల ప్రశ్నలు లీకైనపుడు కొందరు మంత్రులు రాజీనామా చేయడం, కొన్ని రాష్ట్రాల్లోనూ మంత్రులు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడం జరిగాయి. పేపర్ లీక్ జరిగే అవకాశం లేకుండా సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికి కూడా ఏదో రూపేణా పేపర్ లీకేజీల లాలూచీలు సంభవిస్తూనే ఉంటున్నాయి. గతంలో సైతం పలు సందర్భాలలో విద్యార్థుల బంగారు భవిష్యత్తో ఈ పేపర్ లీక్ వ్యవహారం ఆటలాడుకున్న సందర్భాలు ఉన్నాయి. పేపర్ లీకేజీల మూలంగా బాగా కష్టపడి చదివే విద్యార్థుల నోట్లో మట్టి కొట్టేలా అనారోగ్య వాతావరణం పొడచూపుతుండటం నిజంగా అత్యంత దురదృష్టకరమైన విషయం. సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా బాగా పలుకుబడి వున్నవ్యక్తుల అండదండలతో దేశ విద్యావ్యవస్థకే, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే వారి ఉనికినే భ్రష్టు పట్టించేలా వ్యవహరించే వారి తీరుతెన్నులు ప్రజాస్వామ్య దేశంలో సిగ్గుచేటైన, హేయమైన విషయం. మే 3న జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2026 ప్రశ్నాపత్రం లీకైంది. నీట్ పేపర్ లీకేజీ సందర్భంగా జరిగిన ఆందోళనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం విద్యార్థుల ఆందోళనకు మద్దతు ఇవ్వడంతోపాటు ప్రధాని ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. గత పదేళ్లలో 152పరీక్షా పేపర్లు లీకయ్యాయని తెలిపారు. ఇంత వరకూ నిందితులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతపదేళ్లల్లో జరిగిన 152 పేపర్ లీక్స్ కారణంగా 7.5 కోట్లమంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని రాహుల్ గాంధీ ఆవేదన



వ్యక్తం చేశారు. మే 3న జరిగిన నీట్ పేపర్ లీకైన తరువాత ఈ ఏడాదిలోనే జూన్ రెండో వారంలో మహారాష్ట్రలో జరిగిన టెట్ పరీక్ష పేపర్ లీకైంది. టెట్‌కి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఇలాంటి పేపర్ లీక్ కేసులలో ప్రమేయంఉన్నట్లు అనుమానిస్తున్న నిందితులతో ముడిపడి ఉన్న అంతర్రాష్ట్ర పేపర్ లీక్ రాకెట్‌పై మహారాష్ట్ర పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసి విచారణ జరుపుతోంది. నీట్‌పై కూడా సీబీఐ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే నీట్ పేపర్ లీకేజీతో సంబంధం ఉన్న సుమారు 18 మందిని అరెస్టు కూడా చేశారు. ఈ ఏడాది జరిగిన నీట్ పేపర్ లీకేజి కంటే ముందు 2024లో జరిగిన నీట్ పేపర్ లీకైందని కొందరు కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టులో విచారణ సందర్భంగా పేపర్ లీకేజీ మాస్‌గా జరగలేదని.. కొందరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారని వారిని అనర్హులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో తిరిగి నీట్ పరీక్షను నిర్వహించలేదు.2024లో సుమారు 23 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది మేలో జరిగిన పరీక్షకు సైతం సుమారు 22 లక్షల మంది హాజరు కాగా.. జూన్‌లో జరిగిన రీ ఎగ్జామ్‌కి సుమారు 20.50 లక్షల మంది హాజరయ్యారు. 2023 మార్చిలో అసోంలో టెన్త్ ప్రశ్నాపత్రం లీకైంది. ప్రశ్నాపత్రం లీకేజీపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. ప్రశ్నాపత్రం లీక్ కావడం తమ వైఫల్యేమనని.. తప్పు అంగీకరిస్తున్నాని ప్రకటించారు. ఈ పేపర్ లీకేజీ వెనుక ఉన్న అస్సలు సూత్రధారిని గుర్తించినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకైతే ఆయా పరీక్షలకు ప్రిపేర్ అయిన విద్యార్థులు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారు. అప్పటికే బాగా చదివి పరీక్ష రాసిన విద్యార్థులు పేపర్ లీకై మరోసారి పరీక్షను నిర్వహించే సమయంలో తిరిగి అదే స్థాయిలో చదవలేక వారి తల్లిదండ్రులు ఏమంటారోననే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గతంలో జరిగిన పేపర్ లీకేజీల సమయంలో ఇటువంటి ఆత్మహత్యలు జరిగాయి. మొన్న మేలో జరిగిన నీట్ ప్రశ్నా పత్రం లీకైన సందర్భంలోనూ జరిగాయి. కానీ ఈ ఏడాది జరిగిన పేపర్ లీకేజీ కారణంగా సుమారు 20నుంచి 24 మంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాగా చదివి పరీక్షను బాగారాసిన వారు సైతం మానసిక ఆందోళనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పేపర్ లీకేజీలే కాకుండా రాష్ట్రాల్లో నిర్వహించే పోటీ పరీక్షలు, రెగ్యులర్‌గా జరిగే అకడమిక్ వార్షిక పరీక్షల పేపర్లు లీకేజీ విషయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఏదైనా జాతీయ పోటీ పరీక్షలు కావచ్చు, రాష్ట్రస్థాయిలో పరీక్షలకు కావొచ్చు, వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రాలు కావొచ్చు ఏ పేపర్ లీకైన తిరిగి పరీక్షలను నిర్వహించడం చాలా కష్టంగా మారుతోంది. మొదటిసారి నిర్వహించిన దానికంటే పకడ్బందీగా పరీక్షలను నిర్వహించడం అధికారులు, ప్రభుత్వాలకు కత్తిమీద సాములాంటింది.

మేలో జరిగిన నీట్‌పేపర్ లీకైన తరువాత జూన్ 21న నిర్వహించిన పరీక్షకు సుమారు2లక్షల మందితో అదనంగా భద్రతను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇదే కాకుండా విద్యార్థులు కూడా మరోసారి పరీక్షకు సిద్ధం కావల్సి వస్తుంది.వారితోపాటు వారి తల్లిదండ్రులు కూడా వీరికి తోడుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పరీక్ష మొదటిసారి నిర్వహించిన దానికంటే తరువాత నిర్వహించడానికి ఎక్కువ ఖర్చుచేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పేపర్ లీకేజీలు జరిగిన తరువాత ప్రభుత్వాలు పేపర్ లీకేజీపై కేసులు నమోదు చేసికొన్ని సందర్భాల్లో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)లను ఏర్పాటు, మరి కొన్ని సందర్భాల్లో సీబీఐతో విచారణ జరిపించడం చేస్తున్నాయి. ప్రశ్నాపత్రాలు లీకేజీతో ప్రభుత్వాలకు చెడ్డపేరు రావడమే కాకుండా అదనంగా ఖర్చులు భరించాల్సి వస్తుంది. పేపర్ లీకేజీలపై ప్రభుత్వాలు ఇప్పటి వరకు కేసులు నమోదు చేసి వారినిజైలుకు పంపిస్తున్నప్పటికీ పేపర్ లీకేజీలు ఆగడం లేదు. దీంతో కేంద్ర మంత్రి వర్గం ఇకపై లీకేజీలపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నూతనచట్టం చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంప్రకారం, వ్యక్తిగతంగా ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై 3నుంచి5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలున్నాయి. పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టిపెట్టింది.ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఢిల్లీలో ఒక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయగా త్వరలో మరో నాలుగు కోర్టులను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. పేపర్ లీక్‌లకు సంబంధించిన కేసులను కోర్టుల్లో ఏడాది లోపే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్న ట్లు తెలుస్తోంది. వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అటు జైలు శిక్షతోపాటు భారీగా జరిమానా విధించడం, జైలు శిక్ష కాలాన్ని సైతం పెంచి పేపర్ల లీకేజీలకు పాల్పడే వారు భయపడేలాగా చేయాలని కేంద్రం భావిస్తోంది.



# 'కదన' తరంగం!

ఢిల్లీ

**ఎ.వి.వి ప్రసాద్**

యువత కదిలితే అదొక కడలి తరంగం. యువత నినదిస్తే అది మహా సముద్ర ఘోష. ఆ రెండూ ఇప్పుడు ఒకేసారి కనిపిస్తున్నది ఢిల్లీ జంతర్ మంతర్ లోనే. తరంగం, ఘోష రెండూ కలగలిస్తే అదొక ఉప్పెనే. గత వారం రోజులుగా ఆ 'ఉప్పెన'లో అన్నీ కొట్టుకుపోతున్నాయి. ఆ దృశ్యాన్ని చూసి, వెను కదుగు వేయని ప్రధాని మోడీ సైతం నిలబడి ఆలోచిస్తున్నారు.'విద్యార్థులు దేశ భావి నిర్ణేతలురా' అని ఓ పాటలో అన్నట్లు ఇండియా ముఖ చిత్రాన్ని మార్చే సంకల్పంతో వివిధ ప్రాంతాల విద్యార్థులంతా జంతర్ మంతర్ వద్ద హోరెత్తిపోతున్నారు. దానితో వారం రోజులుగా పార్లమెంటు కూడా స్తంభించింది. రోజూ సమావేశం కావడం రభస, రగడతో కొద్దిసేపటికే వాయిదా పడడం నిత్యకృత్యమైపోయింది. నీట్ పరీక్ష పత్రాల లీకేజి నేపథ్యంలో మొదలైన ఆందోళనలు 'కాక్రోచ్'లుగా కదులుతూ వచ్చి మొత్తం వ్యవస్థకే సవాలుగా మారాయంటే అది చిన్న విషయమేమీ కాదు. ఒక విచిత్రమైన పరిస్థితిలో రూపుదిద్దుకున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) ఇంకా పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా పరిణామం చెందకుండానే ఇంతటి ప్రభావం సృష్టించడం దేశంలో అందరినీ, ముఖ్యంగా రాజకీయ పార్టీల నేతలందరిని ఎంతో ఆశ్చర్య పరుస్తోంది. ఒక వ్యంగ్య ఉద్యమంగా రెండు నెలల క్రితమే ఆవిర్భవించిన ఈ పార్టీఇంతలోనే అంతగా ఎదగడం కూడా అందరినీ ఆలోచింపజేస్తోంది. పెద్దప్రచారం లేకుండానే ప్రతి విద్యార్థి మైండ్ లోకి 'కాక్రోచ్' ప్రవేశిస్తోంది. జన్‌జడ్ తరం దాని వెనుకేనడుస్తోంది. దేశ రాజధానిలో ఆందోళనలకు కేంద్ర బిందువైన జంతర్ మంతర్ వద్ద గత ఆరురోజులుగా యువ ఆందోళనకారులు వెల్లువెత్తడం చూస్తే అది కేవలం ఓ పార్టీ ఇచ్చిన పిలుపుగా అనిపించదు. సామాజిక ఉద్యమకారుడు వాంగ్ చుక్ విద్యార్థుల ఉద్యమానికి మద్దతు ప్రకటించడమే గాక 26 రోజులపాటు జరిపిన నిరాహార దీక్ష ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయాలను ఎంతో ప్రభావితం చేస్తున్నట్లే కనిపిస్తోంది. అన్నిరాష్ట్రాల నుంచి యువత స్వచ్ఛందంగా కదిలిరావడం గమనించవలసిన పరిణామం. విద్యార్థిలోకం స్వచ్ఛందంగా సాగిస్తున్న ఉద్యమంగానే దీనిని భావించవచ్చు. సామాజిక వ్యవస్థలు ఎలా కృంగి కృశించిపోతున్నాయో, ఎలా కమిలిపోతున్నాయో చెప్తూ యువతే దిశానిర్దేశం చేస్తోంది. తమకు న్యాయం కావాలని డిమాండ్ చేస్తోంది. దశా బ్దాలుగా వేళ్లానుకొన్న పెద్ద పెద్ద రాజకీయ పార్టీలను సైతం కలవరపరుస్తోంది. తాము చేయ లేకపోతున్నది విద్యార్థి లోకం చేస్తున్నదని గ్రహించి ఒక్కొక్కటిగా ఆయా పార్టీలు కూడా కదన రంగంలోకి దిగే ప్రయత్నం చేస్తున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆందోళనలను కఠినంగా అణచివేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు విద్యార్థులకు మద్దతుగా రంగంలోకి దిగడం విమర్శలపాలవుతోంది. రాహుల్ గాంధీ, ఖర్గే ప్రభృతులు ప్రధాని మోడీ నివాసం వద్ద మెరుపు ధర్నా చేయడంలో నిజాయితీ లేదనీ, ఉంటే వారంతా జంతర్ మంతర్ వద్దకు వచ్చి విద్యార్థులకు ఎందుకు మద్దతు ప్రకటించ లేదనీ వాంగ్ చుక్ సతీమణి గీతాంజలి వేసిన ప్రశ్నకు ఆనేతలే సమాధానం చెప్పవలసి ఉంది. రాజకీయ నాయకులు సొంత ప్రయోజనాల కోసం వాంగ్ చుక్ ప్రతిష్టను వాడుకొంటున్నారని కూడా ఆమె సంచలనాత్మక వ్యాఖ్యలు చేయడం గమనించవలసిన విషయం. 20న విద్యార్థులు నిర్వహించిన 'చలో పార్లమెంటు' మార్చ్ పై పోలీసు చర్యను ఖండించడంలో సైతం రాహుల్ నుంచి సరైన స్పందన రాలేదంటూ విద్యార్థులు వ్యాఖ్యానించడం వినిపిస్తోంది. పోలీసు చర్యలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను పరామర్శించేందుకు రాహుల్ వెళ్ల కపోవడాన్ని కూడా అంతా విమర్శిస్తున్నారు. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడైన అభిజిత్ దీప్కే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియాలో కీలక పాత్ర వహించడంతో 'ఆప్' ఛాయలు అతడిపై ఉంటాయని భావించిన కాంగ్రెస్‌మొదట దానికి దూరంగానే ఉంటూవచ్చింది. కానీ ఆందోళనలు వాటికవే ఉధృతరూపం దాల్చడం చూసి తమ పాత్ర కూడా దానిలో ఉండడానికి ప్రయత్నాలు ఆరంభించింది. 2011 లో అన్నాహజారే అవినీతి వ్యతిరేకోద్యమం పెద్ద ఎత్తున నడిపిన ప్పుడు బిజెపి సహా ఎన్నో పార్టీలు మద్దతు ఇచ్చాయి. కానీ ఇప్పుడు అటువంటి రాజకీయ పార్టీల మద్దతు తగినంత లేకుండానే విద్యార్థులు ఇంత మహోద్యమం నడపడం చూస్తే 'మారుతున్న స్వరం' ఏమిటో అందరికీఅర్థమవుతోంది. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లో సాగిన జన్‌జడ్ ఉద్యమాలు ఆ దేశాల్లో ఎలాంటి కుదుపునిచ్చాయో ఇటీవల చూశాం. అయితే ఈ విద్యార్థుల ఉద్యమానికి రెండు మూడు అంశాలే కారణాలుగా కనిపిస్తున్నాయి గాని వ్యవస్థలోని మొత్తం అవినీతిపై తిరుగుబాటుగా కనిపించడం లేదనే అభిప్రాయం ఉంది. ఎన్‌టిఎలో సంస్కరణలు, అధికారులపై చర్యలు కూడా ఏదోవిధంగా పరిష్కారం కావొచ్చు. కానీ వ్యవస్థలో పేరుకుపోతున్న అవినీతిని తుడిచిపెట్టే ఉద్యమంలా సాగితే అది కొత్త చరిత్ర సృష్టిస్తుంది, సమాజానికి ఉత్తమ ఫలితాలనిస్తుంది. అన్నాహజారే ఉద్యమం అప్పట్లో చాలా ప్రభావాన్నే చూపినా అంతలోనే చల్లారిపోయింది. కానీ ఈ ఉద్యమంలో విద్యార్థి లోకం స్వచ్ఛందంగా పాల్గొనడంతో అంతకు మించిన ప్రభావాన్నే చూపగలుగుతుంది కానీ సరైన ఫలితాలు సాధించేందుకు శాంతియుత మార్గంలో వెళ్లవలసి ఉంది. కొందరంటున్నట్లు ఇలాంటి ఉద్యమాల్లోకి సాంఘిక వ్యతిరేక శక్తులు కూడా తలదూరుస్తాయి. అందువల్ల మరింత అప్రమత్తత అవసరం. కాక్రోచ్ పార్టీ కోరుకున్నట్లుగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం రాజీనామా చేశారు గనుక ఆ పార్టీనేతలు ఆందోళన విరమిస్తారో, లేక మరికొన్ని డిమాండ్లతో ఉద్యమం కొనసాగిస్తారో చూడాలి.




యువత ఆందోళనలు

# యుద్ధభూమిలో పాలనా సంస్కరణలు

ఉక్రెయిన్

**గన్ని మోహాన్**

రష్యాతో ఐదేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం కీలక దశకు చేరుకున్న వేళ ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ ప్రభుత్వంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టి ప్రపంచ దేశాలను ఆకర్షించారు. ఐదేళ్ల నుంచి రష్యాతో ఎడతెరిపిలేని యుద్ధం కొనసాగిస్తున్న జెలెన్స్కీ తన దేశ సార్వభౌమత్వం కోసం నిరంతరం తపిస్తూనే ఉన్న సంగతి తెలిసిందే. అగ్ర రాజ్యం సోవియట్ యూనియన్ ఈ చిన్నదేశాన్ని నాటోలో చేరకుండా నిరంతరం అడ్డుకుంటూనే ఇప్పుడు సైనిక చర్యకాస్తా యుద్ధంగా మారిపోయింది. నిరంతరం కొనసాగుతున్న ఈ దమన కాండలో అటు అమెరికా నుంచి ఇటు యూరోపియన్ దేశాలు కూడా ఉక్రెయిన్‌కు ఆయుధ పరంగా కొండంత అండగా నిలిచాయి. అయితేట్రంప్ పాలన ప్రారంభం నుంచి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఒత్తిడులను ఎదుర్కొంటున్నారు. ఒక దశలో రష్యా చెప్పినట్లు ట్రంప్ ఆడుతున్నారన్న భావన కూడా ఉక్రెయిన్ ప్రజల్లో సర్వత్రా వినిపించింది. అప్పుడప్పుడు శాంతిచర్చల పేరిట అమెరికాకు పిలిపించి మరీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ దేశాధినేతను ఘోరంగా అవమానపరిచారన్నఆక్రోశం కూడా ఆ ప్రజల్లో గూడుకట్టుకునిపోయింది. కమ్ముకొస్తున్న రష్యా యుద్ధమేఘాల మాటున ఇప్పుడు జెలెన్స్కీ కొత్తగా ప్రభుత్వం మొత్తం ప్రక్షాళనకు పూనుకోవడం ఆయన సాహసోపేతమైన కార్యాచరణగానే చెప్పుకోవచ్చు. ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ నాఫ్టోగాజ్ సీఈఓ సెర్గీ కొరెట్స్కీని ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. దేశాన్ని రాబోయే శీతాకాలానికి సిద్ధం చేయడమే ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేసిన అధ్యక్షుడు ప్రధాని గా యూలియా స్విరిడెంకోను కేవలం ఏడాది పదవీకాలంతోనే తప్పించారు. ఆమె రాజీనామాను పార్లమెంట్ ఆమోదించగా, కొత్త ప్రధానిగా సెర్గీ కొరెట్స్కీ నియామకానికి పార్లమెంట్ ఓటింగ్ నిర్వహించింది. అధికార పార్టీ సర్వెంట్ ఆఫ్ ది పీపుల్‌కు పార్లమెంట్‌లో మెజారిటీఉండటంతో కొరెట్స్కీ నియామకం ఖాయమనే చెప్పాలి.జెలెన్స్కీ మాట్లాడుతూ ప్రస్తుతందేశంముందు ఉన్న ప్రధాన లక్ష్యం శీతాకాలానికి సన్నద్ధంకావడం. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత సెర్గీ కొరెట్స్కీనే ప్రధానమంత్రి పదవికి అత్యంత అర్హుడిగా తేల్చారు. అంతేకాకుండా ప్రభుత్వ పునర్వ్యవస్థీకరణలో అత్యంత ఆసక్తికర అంశంగా రక్షణ మంత్రిత్వశాఖ మార్పులు నిలిచాయి.ప్రస్తుతం రక్షణ మంత్రిగా ఉన్న మైఖైలో ఫెడొరోవ్ స్థానంలో 2023 నుంచి అంతర్గత వ్యవహారాల మంత్రిగా ఉన్న ఇహోర్ క్లైమెంకోను నియమించే అవకాశం ఉందని అధికార పార్టీ ఎంపీలు వెల్లడించారు.అధ్యక్షుడితో సమావేశం అనంతరం పలువురు ఎంపీలు సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. అధికార పార్టీ ఎంపీ ఒల్హా వాసిలెవ్స్కాస్మాల్హి యుక్ కూడా క్లైమెంకో పేరును రక్షణ మంత్రి పదవికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. ఫెడొరోవ్ తొలగింపుపై విమర్శలు సైతం జెలెన్స్కీ ఎదుర్కొన్నారు. కేవలం ఆరు నెలల కాలంలోనే ఫెడొరోవ్ ఉక్రెయిన్ సైన్యాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కీలక సంస్కరణలు చేపట్టారు. ముఖ్యంగా డ్రోన్ కొనుగోళ్ల పెంచడం, సాంకేతికత ఆధారిత యుద్ధ వ్యూహాలను అమలు చేయడం, రక్షణ కొనుగోలు వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడానికి ప్రయత్నించడం వంటి చర్యలకు ఆయన ప్రశంసలు అందుకున్నారు. రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి డ్రోన్ దాడులు ముమ్మరం చేస్తున్న సమయంలో ఫెడొరోవ్‌ను మార్చడం సరైన నిర్ణయం కాదని పలువురు ఎంపీలు బాహాటంగానే జెలెన్స్కీకి నివేదించినా మార్పు అనివార్యం అన్న సంకేతాలే ఇచ్చారు. పార్లమెంట్ విదేశాంగ కమిటీ ఛైర్మన్ ఒలెక్సాండర్ మెరెజ్కో మాట్లాడుతూ ఫెడొరోవ్‌కు అంతర్జాతీయ సంస్థల్లో మంచి గౌరవం ఉందని, రక్షణ శాఖలో నిజమైన సంస్కరణలపై ఆశలు ఆయనతోనే ముడిపడి ఉన్నాయని అందువల్లనే మార్పుఅనివార్యం అవుతోందని జెలెన్స్కీని సమర్థిస్తూ వచ్చారు. ప్రఖ్యాత డ్రోన్ యుద్ధ నిపుణురాలు, వాలంటీర్ మరియా బెర్లిన్స్కా ఫెడొరోవ్‌ను మార్చడం అధ్యక్షుడు జెలెన్స్కీ చేసిన అతిపెద్ద తప్పిదాల్లో ఒకటని, ఈనిర్ణయం ఉక్రెయిన్‌కు భారీ మూల్యం చెల్లించే పరిస్థితి తీసుకు రావచ్చని, లక్షలాది మంది సైనికుల ప్రాణాలు, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించినా జెలెన్స్కీ వెనక్కి తగ్గలేదు. ఉక్రెయిన్ ప్రస్తుతం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాయు రక్షణ వ్యవస్థల కొరత, సైనికుల కొరత, నియామక ప్రక్రియలో లోపాలు ఇప్పటికీ ఆదేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. మరోవైపు, రాబోయే శీతాకాలంలో విద్యుత్ మౌలిక వసతులపై రష్యాదాడులు మళ్లీ పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ మంత్రిగా ఉన్న సమయంలో ఫెడొరోవ్ చేపట్టిన సైనిక సంస్కరణలు ఇంకా పూర్తికాలేదు. అదే సమయంలో అమెరికా తయారీ బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే ఆధునిక ఇంటర్‌సెప్టర్ వ్యవస్థల కొరత కూడా ఉక్రెయిన్‌కు ప్రధాన సమస్యగా మారింది. తూర్పు ఉక్రెయిన్‌లోని డోనెట్స్క్ ప్రాంతంలోని కీలక నగరాలవైపు రష్యా సైన్యం నెమ్మదిగా ముందుకు కదులుతోంది. మొత్తం డోనెట్స్క్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడమే లక్ష్యంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యూహం అమలు చేస్తున్నట్లు కదనరంగం నుంచి సంకేతాలు అందుతున్నాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, వంటి దేశాలు ఆయుధబలగాలను సమకూరుస్తున్నా ఈ సాయంఎంత కాలం కొనసాగుతుందనేది కూడా స్పష్టంగాచెప్పలేని పరిస్థితి. ఎందుకంటే ట్రంప్ ఈ దేశాలపై ఒత్తిడి తెచ్చినా తీసుకురావచ్చనేది అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో జెలెన్స్కీ చేపట్టిన ప్రభుత్వ మార్పులు ఉక్రెయిన్ యుద్ధ వ్యూహం, ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితులపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశం కావడంతోపాటు ఉత్కంఠగా కూడా మారింది.



జెలెన్స్కీ

# మేల్కొన్న యువత దేశాన్ని మారుస్తున్న వేళ..



డా.జె. పూర్ణచంద్ర రావు

రాత్రి పదకొండు గంటల యాభై నిమిషాలు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఎక్స్ ఖాతాలో ఒక వీడియో పెట్టారు. దేశమంతా విద్యార్థుల పోరాటాల గురించి మాట్లాడుతున్న వేళ ఆ వీడియో రావడం చాలామందిని ఆలోచింపజేసింది. ఆ చర్చ ఇంకా కొనసాగుతుండగానే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. పరీక్షలలో జరిగిన అవకతవకలపై దేశవ్యాప్తంగా సాగిన విద్యార్థుల పోరాటాల నడుమ జరిగిన ఈ రెండు పరిణామాలు ఒక విషయాన్ని స్పష్టంగా చూపించాయి. ప్రజల గొంతు బలంగా వినిపించినప్పుడు, పాలకులు మాట్లాడక తప్పదు. అవసరమైతే నిర్ణయాలు కూడా మార్చక తప్పదు. దేశమంతా విద్యార్థుల పోరాటాల గురించి మాట్లాడుతున్న వేళ ఆవీడియో రావడం చాలామందిని ఆలోచింపజేసింది. ఇంత బలమైన మోడీ కూడా ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది?" అని చాలామంది అడిగారు. కానీ అసలు ప్రశ్న అది కాదు. మోదీ ఎందుకు మాట్లాడాడు? అన్నది కాదు. మోదీ మాట్లాడాల్సిన పరిస్థితి ఎవరు తెచ్చారు? అన్నదే అసలు ప్రశ్న. పాలకులుఎప్పుడూ తమంతట తామే దిగి రారు. ప్రజలు నిలబడితేనే ఒక్క అడుగు వెనక్కి వేస్తారు. అదే చరిత్ర. అదే ప్రజల బలం. మన దేశంలో ఒక విచిత్రమైన అలవాటు పెరిగిపోయింది. ఎవరో కొత్తగా పోరాటం మొదలుపెడితే ముందుగా నవ్వుతాం. వీళ్ల వల్ల ఏమవుతుంది?", నలుగురు పిల్లలు రోడ్డు మీద కూర్చుంటే దేశం మారిపోతుందా?", "ఇది రెండు రోజుల్లో చల్లారిపోతుంది" అంటాం. కానీ రోజులు గడుస్తాయి. అదే పోరాటం పెద్దదవుతుంది. ఊళ్లకు, పట్టణాలకు పాకుతుంది. దేశమంతా దాని గురించే మాట్లాడుతుంది. చివరకు పెద్దపెద్ద నాయకులు కూడా నోరు విప్పాల్సి వస్తుంది. అప్పుడు మాత్రం వీళ్లవల్లే జరిగింది'అంటాం. మొదట తక్కువ చేసి మాట్లాడిన వాళ్లే చివరికి చప్పట్లు కొడతారు. ఇది ఈ రోజు కొత్తగా జరిగిన విషయం కాదు. చరిత్ర అంతా ఇలాగే ఉంది. స్వాతంత్ర్యం కోసం పోరాటం మొదలైనప్పుడు కూడా బ్రిటిష్ వాళ్లు కొద్దిమందిని చూసి నవ్వుకున్నారు. దక్షిణ ఆఫ్రికాలో నల్లజాతి వాళ్లు హక్కుల కోసం నిలబడినప్పుడు వాళ్లను అణచేయగలమని పాలకులు అనుకున్నారు. అమెరికాలో నల్లజాతి వాళ్లు వీధుల్లోకి వచ్చి నప్పుడు కూడా మొదట ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఒకరి వెనుక పది మంది, పది మంది వెనుక వంద మంది, వంద మంది వెనుక లక్ష మంది నిలబడినప్పుడు పాలకులు తలవంచక తప్పలేదు. మన దగ్గర మాత్రం ఇంకో జబ్బుఉంది.'వాళ్లు ఏం చేస్తున్నారు?' అని అడగడం చాలా సులభం. 'రాహుల్ గాంధీ ఏం చేస్తున్నాడు?,ప్రతి పక్షం ఏంచేస్తోంది?,ఆ నాయకుడు ఎందుకు మాట్లాడడం లేదు?' ఆ చదువుకున్న వాళ్లు ఎక్కడున్నారు?' అని అడు గుతాం. కానీ 'నేను ఏం చేస్తున్నాను?" అని మాత్రం మనల్ని మనం అడగం. మనం పోరాటానికి వెళ్లం. మనం ప్రజలను చైతన్యపరుస్తూ ఒక పాట రాయం. ఒక వ్యాసం రాయం. ఒక చిన్న వీడియో కూడా తీయం.పెట్టం. మనం ఒక రూపాయి కూడా ఇవ్వం. మనం ఒక రోజు కూడా సమాజం బాగు కోసం కేటాయించం. కానీ పోరాడుతున్న వాళ్లకు మాత్రం రోజూ సలహాలు ఇస్తుంటాం. పార్లమెంట్ లో దక్షిణాది వాటా తగ్గిపోతుందని చాలామంది చెబుతున్న కొత్త నియోజకవర్గాల ఏర్పాటు గురించి మన రాష్ట్రాల్లో ఎంత పెద్ద చర్చ జరుగుతోంది? ఆంధ్రప్రదేశ్లోనూ, తెలంగాణలోనూ ఎంతమంది నాయకులు ఊరూరా తిరిగి ప్రజలకు చెబుతున్నారు? జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, కేసీఆర్, రేవంత్ రెడ్డి,కిషన్ రెడ్డి,బండి సంజయ్, ఒవైసీ.. ఎవరినైనా మనం ఒక ప్రశ్న అడుగుతున్నామా?"ఈవిషయం మీద మీరే మంటారు ?' అని నిలదీస్తున్నా మా? లేదు. ఎన్నికలు వస్తే మళ్లీ పాత గొడవలే. జగన్ మీద కోపమొస్తే చంద్రబాబుకు ఓటు వేస్తాం. చంద్రబాబు మీద కోపమొస్తే జగన్‌కి వేస్తాం. కేసీఆర్ మీద కోపమొస్తే రేవంత్కు వేస్తాం. ఒక కులం మీద కోపమొస్తే మరో కుల నాయకుడికి వేస్తాం.ఒక మతం మీద కోపమొస్తే మరో మతం పేరిట రాజకీయం చేసేవాళ్లకు వేస్తాం. మన ఓటు మన బాగుకోసం వేయడం లేదు. అభిమాన దురభిమానా లతో ఓటు వేస్తాం. కానీ మన బతుకు మాత్రం మారడం లేదు.చుండూరు జరిగింది. కారంచేడు జరిగింది. వేంపెంట జరిగింది. లక్షింపేట జరిగింది. ఇంకా ఎన్నో చోట్ల పేదల రక్తం కారింది. ఆ రోజున మనమంతా బాధపడ్డాం. సభలు పెట్టాం. కొవ్వొత్తులు వెలిగించాం. మాటలు చెప్పాం. కానీ కొంతకాలం తర్వాత మళ్లీ అదే పాతపార్టీల చుట్టూతిరిగాం. మనకు జరిగిన అన్యాయాన్ని మర్చిపోలేదు. కానీ ఆ అన్యాయానికి కారణమైన రాజకీయ నాయకుల కోసం పనిచేయడం మానలేదు కాన్షీరాం ఇంకా చేయాల్సింది",'మాయావతి పని చేయటల్లేదు','ఆర్. కృష్ణయ్య ఏం చేశాడు?','మంద కృష్ణ మాదిగ ఏం సాధించాడు?' అని అడుగుతాం.అడగాలి కూడా. కానీ అదే సమయంలో మనల్ని మనం కూడా అడగాలి. మనలో ఎవరైనా మన వాళ్ల కోసం పోరాటానికి ఒక రోజు సమయం ఇచ్చామా? మన దగ్గర ఉన్నదాంట్లో కొంచెమైనా మన వాళ్ల కోసం ఖర్చుపెట్టామా? మనకు సమయం లేదని చెప్పడం నిజం కాదు. తీర్థయాత్రలకు సమయం ఉంది. విహారాలకు సమయం ఉంది.సినిమాలకు సమయం ఉంది. ఫోన్లో గంటల కొద్దీ గడపడానికి సమయం ఉంది. కానీ మన ఊరి పిల్లలకు చదువు చెప్పడానికి సమయం లేదు. మనవాడి కూలీ బిడ్డకు పుస్తకం కొనివ్వడానికి సమయం లేదు. అన్యాయం జరిగిన చోటికి వెళ్లి నిలబడడానికి సమయం లేదు. ఇది మన బలహీనత. డాక్టర్ అంబేద్కర్ "చదవండి, పోరాడండి, ఒక్కటిగా నిలబడండి" అనిఎందుకు చెప్పాడు? ఒక్క మనిషి ఏమీ చేయలేడని ఆయనకు తెలుసు. ప్రజలు ఒక్కటైతే ఏ శక్తినైనా మార్చగలరని ఆయనకు తెలుసు. నెల్సన్ మండేలా కూడా అదే చూపించాడు. మార్టిన్ లూథర్ కింగ్ కూడా అదే చేశాడు. చే గువేరా కూడా అదే నమ్మాడు. అలిశెట్టి ప్రభాకర్ తన అక్షరాలతో అట్టడుగు మనిషి బతుకును దేశం ముందు పెట్టాడు. గొప్పవాళ్లందరూ వేర్వేరు భాషల్లో చెప్పింది ఒకటే.ప్రజలు కదిలితేనే చరిత్ర కదులుతుంది. మనకు ఇంకో పెద్ద అలవాటు ఉంది. పోరాటం చేస్తున్న వాళ్లగురించి వెంటనే అనుమానం మొదలవుతుంది. 'డబ్బు ఎవరు ఇస్తున్నారు?','వాళ్ల వెనుక ఎవరు ఉన్నారు?' అని అడుగుతాం. కానీ వేలాది మంది తమ చేతులతోవండి విద్యార్థులకు భోజనం పెట్టడం కనిపించదు. యువవైద్యులు ఉచితంగా వైద్యశిబిరాలు పెట్టడం కనిపించదు. న్యాయవాదులు ఉచితంగా కేసులు చూడడం కనిపించదు. ఉపాధ్యాయులు పిల్లలకు తోడుగా నిలవడం కనిపించదు. పేద ప్రజలు తమ కష్టార్జితంలో కొంత తీసి ఉద్యమానికి ఇవ్వడం కనిపించదు. పోరాటాన్ని నిలబెట్టేది కొద్దిమంది ధనవంతులు కాదు. వేలాది సాధారణ మనుషుల చిన్నచిన్న సాయం. దేశంలో ఏ పెద్ద మార్పు వచ్చినా మొదట యువతే ముందుకు వచ్చింది. స్వాతంత్ర్య పోరాటంలోనూ అదే జరిగింది. జయప్రకాశ్ నారాయణ్ పిలుపు ఇచ్చినప్పుడు కూడా యువతే వీధుల్లోకి వచ్చింది. తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో కూడా ముందుండింది యువతే. ప్రపంచంలో ఎక్కడ చూసినా ఇదే కనిపిస్తుంది. పెద్దవాళ్లు దారి చూపారు. కానీ దారిలో నడిచింది యువతే. అందుకే ఇప్పుడు పెద్దవాళ్ల మీద కూడా ఒక బాధ్యత ఉంది. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ఒక పిల్లవాడికి చదువు చెప్పవచ్చు.పదవీ విరమణ చేసిన వైద్యుడు ఒకరోజు ఉచితంగా వైద్యంచేయవచ్చు. న్యాయవాది పేదవాడికి తోడుగా నిలవవచ్చు.రైతు తన అనుభవం చెప్పవచ్చు. రచయిత ఒక వ్యాసం రాయవచ్చు. కవి ఒక పాట రాయవచ్చు. సినిమా తీయలేని వాడు ఒకచిన్న వీడియో తీయవచ్చు. డబ్బు ఇవ్వలేని వాడు తన సమయం ఇవ్వవచ్చు. సమయం కూడా ఇవ్వలేని వాడు కనీసం పోరాడుతున్న వాళ్లను తక్కువ చేసి మాట్లాడకుండా ఉండవచ్చు. దేశాన్నిమార్చేది ఒక్క నాయకుడు కాదు. ఒక్కపార్టీ కాదు. ఒక్క ఎన్నిక కాదు. మేల్కొన్న ప్రజలే దేశాన్ని మారుస్తారు.'వాళ్ల చేయాలి' అనే మాట ఈ దేశాన్ని ఎక్కడికీ తీసుకెళ్లదు. 'మనం చేద్దాం' అనే మాట మాత్రం చరిత్రను మార్చగలదు.చివరగా మనం ఆలోచించాల్సింది ఏమంటే ఎందుకు దిగివచ్చాడు మోడీ? ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది ధర్మేంద్ర ప్రధాన్? సమాధానం ఒక వ్యక్తిలో లేదు. ఒకపార్టీలో లేదు. కొందరు యువకులు భయపడలేదు. లక్షలాది మంది ప్రజలు వాళ్ల వెనుక నిలబడ్డారు.తమ సమయాన్ని ఇచ్చారు. తమ శ్రమనుఇచ్చారు. తమడబ్బును ఇచ్చారు. ఆ చిన్నచిన్న చినుకులేఒకరోజు పెద్ద వరదఅయ్యాయి. ప్రజల గొంతు బలంగా వినిపించినప్పుడు ఏ పాలకుడైనా వినకతప్పదు. అదే ప్రజలపాలన. అదే చరిత్రచెప్పే నిజం.అందుకే ప్రశ్న మోడీ గురించికాదు. ప్రశ్న మనగురించే.మనం ఇంకా ప్రేక్షకులుగానే ఉండాలా? లేక చరిత్రను మార్చేవాళ్లలో మనమూ

26-7Pg5.qxd:26-7Pg5.qxd 1/1/02 6:19 AM Page 1



# పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం




## 3 నెలల్లోనే విచారణ ప్రక్రియ ముగింపు

## రూ.10కోట్లు జరిమానా, 5 నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష

## పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు డ్రాఫ్ట్ విడుదల చేసిన కేంద్రం

## రేపు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం

**న్యూఢిల్లీ, జులై 25:** పేపర్ లీకులను నివారించడానికి, పరీక్షలకు సంబంధించిన మోసాలకు వ్యతిరేకంగా చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం మరింత కఠినమైన నిబంధనలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించి తాజాగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో మంత్రివర్గం ఆమోదించిన పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు 2026 డ్రాఫ్ట్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. దేశంలో పోటీ పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే పేపర్ లీక్ మాఫియాపై కేంద్ర ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలకు శ్రీకారం చుట్టింది.

ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ 2024'ను మరింత పటిష్టం చేసింది. పేపర్ లీక్ మాఫియాపై రూ.10 కోట్ల వరకు జరిమానాలు, 7ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) ఏర్పాటు ద్వారా 2 నెల్లలో విచారణ, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 3 నెల్లలో తీర్పులు వెలువరించేలా కొత్త మార్గదర్శకాలను తీసుకొస్తుంది. అధికార వర్గాల ప్రకారం, వ్యవస్థీకృత పరీక్ష అవకతవకలను అరికట్టడానికి, ప్రతిపాదిత సవరణల లక్ష్యం శిక్షలను గణనీయంగా పెంచడం, దర్యాప్తును వేగవంతం చేయడం, విచారణలను త్వరితగతిన ముగించడం. కేంద్ర మంత్రి వర్గం తాజాగా ఆమోదించిన పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024కు కొనసాగింపుగా ఈ ప్రతి పాదిత మార్పులు ఉన్నాయని వర్గాలు తెలిపాయి. 2024 చట్టం పేపర్ లీక్ మాఫియాకు వ్యతిరేకంగా ఒక ప్రధాన నిరోధకంగా పనిచేసినప్పటికీ, ప్రభుత్వం ఇప్పుడు దాని నిబంధనలను మరింత కఠినతరం చేయాలని భావిస్తోంది. ప్రతిపాదిత సవరణల ప్రకారం, పేపర్ లీక్‌లో పాల్గొన్న వ్యక్తికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా విధించవచ్చు. పరీక్షలు నిర్వహించే సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.5కోట్ల జరిమానాతో పాటు ఎనిమిదేళ్లపాటు బ్లాక్‌లిస్ట్ చేయవచ్చు. అలాంటి సర్వీస్ ప్రొవైడర్ యాజమాన్యానికి రూ.5 కోట్ల జరిమానాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష విధించవచ్చు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నేర బృందాలకు పదేళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించవచ్చు. ఈ పెంచిన శిక్షలు పరీక్షల మోసానికి వ్యతిరేకంగా మరింత బలమైన నిరోధకాన్ని సృష్టిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపాదిత సవరణలు పేపర్ లీకేజీ, పరీక్షల మోసాలకు దర్యాప్తు చేయడానికి చట్టబద్ధమైన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ల ఏర్పాటుకు కూడా వీలు కల్పిస్తున్నాయి. ఏదైనా పేపర్ లీక్ కేసును ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించినట్లయితే, అది తన దర్యాప్తును రెండు నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనివల్ల దర్యాప్తులు వేగవంతం అవుతాయని, ప్రాసిక్యూషన్ మరింత కేంద్రీకృతమై ఉంటుందని భావిస్తున్నారు. అదనంగా, ఈ సవరణలు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల కోసం చట్టబద్ధమైన నిబంధనలను ప్రతిపాదిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులతో సంప్రదించి ఈ కోర్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ కోర్టులు రోజువారీ ప్రాతిపదికన కేసులను విచారిస్తాయి. మూడు నెలల్లోగా విచారణలను పూర్తి చేస్తాయి. ఈ ప్రతిపాదనల ప్రకారం, పెండింగ్‌లో ఉన్న అన్ని దర్యాప్తులను ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లకు బదిలీ చేస్తారు, అలాగే పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు తరలిస్తారు. పరీక్షలకు సంబంధించిన కేసుల కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించేందుకు కూడా ఇవి వీలు కల్పిస్తున్నాయి. అధికారవర్గాల సమాచారం ప్రకారం, ఈ సవరణలు నేర నివారణను బలోపేతం చేస్తాయి, దర్యాప్తులను వేగవంతం చేస్తాయి. నేరస్తులకు త్వరితగతిన శిక్ష పడేలా చూస్తాయి.



# రాజీనామాలు చేసిన కేంద్ర మంత్రులు ఎందరో!

**న్యూఢిల్లీ, జులై 25:** నీట్ ప్రశ్నాపత్రం లీక్, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలతో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకున్నారు. అయితే, స్వతంత్ర భారతదేశ చరిత్రలో రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి ఆరోపణలు లేదా ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రులు రాజీనామా చేయడం సాధారణంగా జరుగుతున్నదే. భారతదేశంలో పలు వివాదాలు, ఆరోపణలు లేదా విపక్షాలు, ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత కారణంగా గతంలో చాలా మంది కేంద్ర మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. స్వతంత్ర భారత చరిత్రలోనే రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్న తొలి కేంద్ర మంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రినిలిచారు. 1956లో తమిళనాడులోని అరియలూర్‌వద్ద సంభవించిన భారీ రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి రైల్వే మంత్రిగా ఉన్న శాస్త్రి రాజీనామాచేసారు. దేశంలోనే తొలి అవినీతి కేసుగా గుర్తింపు పొందిన 1958 నాటి ఎల్ఐసీ కుంభకోణంలో అప్పటి ఆర్థిక మంత్రి కృష్ణమాచారి పదవి నుంచి తప్పుకున్నారు. వ్యక్తిగతంగా ప్రత్యక్ష ప్రమేయం ఏదీ రుజువు కానప్పటికీ ఎంసీ చాగ్లా కమిషన్ నివేదికలోని అంశాల ఆధారంగా ఆయన రాజీనామా చేశారు. తర్వాత 1962 భారతచైనా యుద్ధంలో వైఫల్యాలకు బాధ్యత వహించాలని విపక్షాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అప్పటి రక్షణ మంత్రిగా ఉన్న వీకే కృష్ణ మీనన్ తన పదవి నుంచి తప్పుకున్నారు. 1993లో విమాన ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ విమానయాన మంత్రిగా, 1996లో హవాలా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో మాధవరావ్ సింధియా రాజీనామా చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి క్యాబినెట్లో రైల్వే మంత్రిగా నితీష్ కుమార్1999లో పశ్చిమ బెంగాల్లోని గైసాల్ లో రైళ్లు ఢీకొట్టిన ఘటనలో 280 మంది ప్రాణాలు కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేశారు. ఆ తర్వాత 2008 నవంబరు 26 ముంబయి ఉగ్రదాడుల సమయంలో జరిగిన జాతీయ భద్రతా వైఫల్యాలపై ప్రజాగ్రహం, నైతిక విమర్శలను ఎదుర్కొన్న అప్పటి కేంద్ర హోం మంత్రి శివరాజ్ పాటిల్ తన రాజీనామాను సమర్పించారు. యూపీఏ 2 హయాంలో 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం ఆరోపణలు, విపక్షాల తీవ్ర ఒత్తిళ్లతో అప్పటి కేంద్ర టెలికం మంత్రి ఎ.రాజా 2010లో తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. రైల్వే బోర్డు నియామకాల లంచం కేసులో తన మేనల్లుడు చిక్కుకోవడంతో, విపక్షాల ఒత్తిడి మేరకు 2013లో పవన్ కుమార్ బన్సల్ రైల్వే మంత్రిపదవికి రాజీనామా చేశారు. ఇక, ప్రధాని నరేంద్ర మోదీ క్యాబినెట్లో విదేశాంగశాఖ సహాయ మంత్రిగా ఉన్న ఎంజే అక్బర్ 2018లో "Me Too" ఉద్యమం సమయంలో వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు,రాజీనామా డిమాండ్ల కారణంగా పదవికి రాజీనామా చేశారు. బీజేపీ సీనియర్ నేత ఎల్కే అద్వానీ 1996లో హవాలా కుంభకోణంలో తన పేరు ప్రస్తావన రావడంతో నైతిక బాధ్యతగా పదవికి రాజీనామా చేశారు. హవాలా డైరీలలో ఆయన పేరు వెలుగులోకి వచ్చిన తర్వాత అద్వానీ ప్రతిపక్ష నేత పదవితో పాటు ఎంపీగానూ రాజీనామాచేసి కోర్టులు నిర్దోషిగా ప్రకటించే వరకు పార్లమెంటులో తిరిగి ప్రవేశించబోనని ప్రతిజ్ఞ చేశారు.



## మహారాష్ట్ర టెట్ పేపర్ లీక్

## ప్రధాన సూత్రధారి బిజేంద్ర గుప్తా అరెస్ట్

**ముంబై, జులై 25:** సుమారు ఆరు లక్షల మంది అభ్యర్థుల పరీక్షా ప్రక్రియకు అంతరాయం కలిగించిన మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టిఇటి) ప్రశ్నపత్రం లీక్ ఘటన జరిగి దాదాపు ఒక నెల తర్వాత, ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తిని థాణె సిటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు బిజేంద్ర గుప్తాను శనివారం బీహార్‌లో అరెస్టు చేశారు. కొన్ని వారాల పాటు పరారీలో ఉన్న అతను, అక్కడ నకిలీ గుర్తింపుతో జీవిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో కోచింగ్ క్లాస్ టీచర్‌గా పనిచేసిన గుప్తా, పలు పరీక్షాపత్రాల లీక్ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొం టున్నారు. రద్దయిన టెట్ పరీక్షకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇంకా కొత్తతేదీని ప్రకటించని తరుణంలోనే అతని అరెస్టు జరిగింది. ఈ ఘటనపై పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు తమ నిరసనలను ఉధృతం చేశాయి. లీక్ అయిన ప్రశ్నపత్రాన్ని కొనుగోలు చేయడానికి అంగీకరించిన మరికొందరు అనుమానితులు ఇంకా పరారీలోనే ఉన్నారని పోలీసులు తెలిపారు. 'అరెస్టు అయిన వారు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు, త్వరలోనే ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేస్తాము' అని ఒక పోలీసు కమిషనర్ తెలిపారు.

# ఢిల్లీ అల్లర్లలో నిరసనకారులపై హత్యాయత్నం కేసులు

## మొత్తం 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు

## 18మంది డిసిపిలతో భద్రత కట్టుదిట్టం



**న్యూఢిల్లీ,జులై 25:** ఢిల్లీలోని పార్లమెంట్, రైల్ భవన్ సమీపంలో జులై 20న జరిగిన నిరసన ప్రదర్శనలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 109(1) కింద హత్యాయత్నం అభియోగాన్ని చేర్చారు. ఈ కేసులో మొత్తం 13 తీవ్రమైన సెక్షన్లను నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. కర్తవ్య పథ్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. హైసెక్యూరిటీ జోన్‌లో భద్రతా విధుల్లో ఉండగా, రైల్ భవన్ రౌండ్‌అబౌట్ వద్దకు వేలాది మంది నిరసనకారులు చేరుకున్నారని వైర్‌లెస్ ద్వారా సమాచారం అందినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, నిరసనకు ఎలాంటి అనుమతి లేదని లౌడ్ స్పీకర్ల ద్వారా పదేపదే హెచ్చరించినా ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదని తెలిపారు. కొంతమంది వ్యక్తులు రెచ్చగొట్టడంతో నిరసనకారులు బారికేడ్లను దాటుకుని పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో ఆరోపించారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ కార్యాలయాల భద్రత దృష్ట్యా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేసి, బాష్పవాయువు ప్రయోగించాల్సి వచ్చిందని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘర్షణల్లో మొత్తం 129 మంది పోలీసు సిబ్బంది, 60 మందికి పైగా నిరసనకారులు గాయపడినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు సుమారు 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఢిల్లీలోని పలు మార్గాల్లో 18 మంది డీసీపీల పర్యవేక్షణలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) లేదా మరే ఇతర సంస్థ ఈ ఘటనపై ఏవైనా ఆరోపణలు చేస్తే, వాటిని కూడా విచారించి, నిజానిజాలను బయటపెడతామని ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.



## ఫడ్నవిస్,షిండేలకు కేంద్రం పిలుపు


## అమిత్‌షా, ప్రధాని మోడీలతో భేటీ

**న్యూఢిల్లీ,జులై 25:** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఢిల్లీలో వేగంగా రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. మరోవైపు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు బీజేపీ హైకమాండ్ నుంచి పిలు పువచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. ఫడ్నవీస్‌తో పాటు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే కూడా ఢిల్లీకి బయలుదేరారు. ప్రధాన్ రాజీనామా చేయగానే ఫడ్నవీస్, షిండేకు బీజేపీ హైకమాండ్ నుంచి ఫోన్ వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఫడ్నవీస్‌ను కేంద్ర మంత్రి మండలిలోకి తీసుకుంటారే ప్రచారం ఊపందుకుంది. ఇటీవల మహారాష్ట్రలో కూడా ఇదే విష యం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం ఎంపీ సంజయ్ రౌత్ మాట్లా డుతూ సీఎం పదవికి దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేసి, ఢిల్లీకి వెళ్తారని అన్నారు. ఈ వ్యాఖ్యలు మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారాయి. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా రౌత్ వ్యాఖ్యలకు బలాన్ని ఇస్తున్నాయి. మహారాష్ట్రకు చెందిన ఓ సీనియర్ బీజేపీ నేతను సీఎంగా ఎన్నుకోవచ్చని ఆ సమయంలో ఆయన అన్నారు. అయితే ఇందుకు సంబంధించి భిన్న కథనాలుకూడా వచ్చాయి. మహారాష్ట్రలో టెట్‌పేపర్ లీక్‌కకు సంబంధించి వివాదం నడుస్తోంది. ఈకేసులో కీలక వ్యక్తిని బీహార్‌లో పోలీసులు అరెస్టులు చేసారు. దీనితో ఇపుడు నీట్‌తరహాలో ఉద్యమం మళ్లీ ప్రారంభం కాకుండా మహారాష్ట్ర ప్రభుత్వంచేపట్టిన కార్యాచరణను తెలుసుకునేందుకే ఇద్దరినీ పిలిపించారని తెలుస్తోంది. ఫడ్నవిస్, షిండేలు ఇద్దరూ శనివారం ప్రధాని మోడీని కలిసే ముందుగా హోంమంత్రి అమిత్‌షాతో సుదీర్ఘ భేటీ జరిపినట్లు సమాచారం.

# ఇది సత్యానికి దక్కిన విజయం: మల్లిఖార్జున ఖర్గే



**న్యూఢిల్లీ,జులై 25:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్‌యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థుల నుంచి వెల్లువెత్తిన తీవ్ర నిరసనలు, విపక్షాల ఒత్తిడి నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సహా పలువురు ప్రముఖులు స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయం. ప్రధాని మోడీ మొండివైఖరికి దక్కిన ఓటమి. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్ట పోయిన కుటుంబాలందరిదీ ఈ విజయమని ఖర్గే అభివర్ణించారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రస్తావిస్తూ, "తమ డిమాండ్ల కోసం దృఢంగా నిలబడి నిరసన తెలిపిన యువతకు, ప్రజాస్వామ్యానికి ఇది దక్కిన భారీ విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ కాగా, దీనిపై ప్రియాంక చోప్రా స్పందిస్తూ నమస్కారం, లవ్ ఎమోజీలను జత చేసి తన మద్దతును చాటారు.




## హెచ్-1బి వీసాకు లక్ష డాలర్ల ఫీజుపై

## ట్రంప్‌కు మళ్లీ ఎదురుదెబ్బ

**వాషింగ్టన్, జులై 25:** విదేశీ వృత్తి నిపుణుల హెచ్-1బి వీసాలకు లక్ష డాలర్ల ఫీజు విధింపు విషయంలో ట్రంప్‌నకు మళ్లీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఫీజులు చట్టబద్ధం కాదంటూ ఇటీవల దిగువ న్యాయస్థానం తీర్పుపై స్టే ఇచ్చేందుకు అప్పీల్స్ కోర్టు నిరాకరించింది. దీనిపై స్టే ఇవ్వకపోవడంవల్ల దేశానికి వచ్చే నష్టం ఏమిటో తెలియజేయడంలో ట్రంప్ యంత్రాంగం విఫలమైందని పేర్కొంది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకోలేరని పేర్కొంది. విదేశాల్లో ఉండి అమెరికా తాత్కాలిక వలస వీసా అయిన హెచ్-1బికి ఎంపికైన వారు లక్షడాలర్ల ఫీజును చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని సవాల్ చేస్తూ 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని విచారించిన యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ లక్ష డాలర్ల ఫీజు చట్ట విరుద్ధమని ప్రక టించారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకపో వడంతో దానిని చట్ట విరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని తీర్పుచెప్పారు. దీంతో ట్రంప్ యంత్రాంగం అప్పీల్స్ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా, గతేడాది సెప్టెం బరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్షడాలర్లకు పెంచేసింది. విదేశీ ఉద్యోగులపై ఆధారపడ కుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెనుప్రభావమే పడింది.

# రాజీనామాల కంటే సమగ్ర సంస్కరణలు ముఖ్యం: మాయావతి



**న్యూఢిల్లీ,జులై 25:** నీట్‌యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ కంటే, విద్యా మరియు పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టడమే అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థుల నిరసనలు, రాజకీయ ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆమె శనివారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వివాదంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న శాంతి యుత నిరసనలకు ప్రజల నుంచి సానుభూతి లభిస్తోందని మాయావతి తెలిపారు. రాజకీయ పార్టీలు కేవలం మంత్రి రాజీనామా చుట్టూ రాజకీయం చేస్తున్నాయని, ఈ క్రమం లో అసలు సమస్య అయిన విద్యా వ్యవస్థ ప్రక్షాళన పక్కదారి పట్టే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ప్రతి పక్షాలు ఈ సమస్యను వీధుల నుంచి పార్లమెంటు వరకు రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నా యని మాయావతి ఆరోపించారు. ఈ వివాదం వల్లే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఒక్కరోజు కూడా సజావుగా సాగలేదని, దీనివల్ల ఇతర ప్రజా సమస్యలపై జవాబుదారీతనం లేకుండా పో యిందని విమర్శించారు.పార్టీ కార్యకర్తలు దూకుడుగా ప్రవర్తించ కుండా, లక్ష్యం కోసం క్రమశిక్షణతో పనిచేయాలని ఆమె సూచించారు.

# ఈ ఘనత కాక్రోచ్ జనతాపార్టీదే: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి,వాయనాడ్ లోక్‌సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. ఈ ఘనత కాక్రోచ్ జనతా పార్టీకే దక్కుతుందని వ్యాఖ్యానించారు. యువత, విద్యార్థిలోకం ఐక్యంగా ఉద్యమించడం వల్లే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చిందని పేర్కొన్నారు. ఈ పని ఎప్పుడో చేసి ఉండాల్సిందని అన్నారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న నిరుద్యోగ సమస్య పరిష్కారంలోనూ, యువత, విద్యార్థుల ఆవేదనలను ఆలకించడంలోనూ కేంద్రం విఫలమైందని ఆరోపించారు. దేశాన్ని సరైన మార్గంలో నడిపించే నాయకుడికి ధైర్యం, తెగువ, బాధ్యతాయుత ప్రవర్తన అత్యంత అవసరమని, ప్రధాని మోడీ ఎప్పుడోగానీ వీటిని ప్రదర్శించలేదని గుర్తు చేశారు. ఆ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంలో నెలకొన్న జాప్యం, ఇన్ని రోజులూ కేంద్రం అనుసరించిన మొండి వైఖరి వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని, చివరికి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఢిల్లీలో ఈ స్థాయిలో ఆందోళన చేయా ల్సి వచ్చిందని అన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో జరుగుతోన్న పేపర్ లీకేజీలు, ఇతర అవకతవకలపై విద్యార్థులు సుదీర్ఘ కాలంగా ఆందోళనలు చేస్తు న్నప్పటికీ ఇన్నాళ్లూ పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిం చారని మండిపడ్డారు. నిజమైన నాయకత్వం అంటేఎన్నికల వేదికలపై సుదీర్ఘ ఉపన్యాసాలు ఇవ్వడంకాదని, ప్రజా కష్టాలను ప్రత్యక్షంగా ఆలకించి వాటికి తగిన పరిష్కారాలు చూపడమేనని ఆమె వ్యాఖ్యానించారు.




## ఢిల్లీ అల్లర్లలో పాక్ దేశీయ సోషల్‌మీడియా కుట్రలు

## 480 ఖాతాలు స్తంభింప చేసినట్లు పోలీసుల వెల్లడి

**న్యూఢిల్లీ,జులై 25:** జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న 480 సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు శనివారం వెల్లడించారు. ఈ ఖాతాలన్నింటికీ పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ ఆందోళనలపై కృత్రిమ మేధ (ఏఐ)తో రూపొందించిన వీడియోలు, డీప్‌ఫేక్‌లు, ఎడిట్ చేసిన క్లిప్పింగ్‌లు మరియు నకిలీ పోస్టుల ద్వారా ఒక ప్రణాళికాబద్ధమైన దుష్ప్రచారం జరుగుతోందని సీనియర్ అధికారులు మీడియాకు వివరించారు. ఇటువంటి తప్పుడు సమాచారంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం జరుగుతోందని వారు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఏఐ, డీప్‌ఫేక్ మరియు ఇతర తప్పుడు పోస్టుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమాచారంలోని నిజానిజాలను గుర్తించాలని పోలీసులు కోరారు.

# బ్రిటన్ మంత్రివర్గంలో ముగ్గురు భారత సంతతి మంత్రులు



**లండన్,జులై 25:** బ్రిటన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆండీ బర్న్‌హమ్ తన కొత్త కేబినెట్‌ను ప్రకటించారు. లేబర్‌పార్టీకి చెందిన ముగ్గురు భారత సంతతి ఎంపీలకు ఆయన ప్రభుత్వంలో కీలక పదవులు దక్కాయి. ఆ జాబితాలో కనిష్క నారాయన్, సత్‌వీర్ కౌర్, హర్‌ప్రీత్ ఉప్పల్ ఉన్నారు. కనిష్క నారాయన్‌కు కేబినెట్‌లో చోటు దక్కింది. బ్రిటన్ సర్కారులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాఖకు తొలి మంత్రిగా నియమితులయ్యారు. ఇక సత్‌వీర్ కౌర్, హర్‌ప్రీత్ ఉత్పల్ అత్యున్నత ప్రభుత్వ హోదాలో నియమితులయ్యారు. వీరితో పాటు శ్రీలంక తమిళ సంతతికి చెందిన హిందూ ఎంపీ ఉమా కుమరన్ ఆ దేశ విదేశీ ఆఫీసులో జూనియర్ మంత్రి పదవి దక్కించుకున్నారు. కీర్ స్టార్మర్ ప్రధానిగా ఉన్న సమయంలో సీమా మల్హోత్రా, ప్రీత్ కౌర్ గిల్ మంత్రులుగా చేశారు. ఇప్పుడు వాళ్లు వెనక బెంచీలకు వెళ్లిపోయారు. కనిష్క నారాయన్ బీహార్‌లోని ముజాఫర్‌పూర్‌లో జన్మించారు. ఆయన ఫ్యామిలీ వేల్స్‌కు వలసవెళ్లింది. 12 ఏళ్ల వయసులో ఆయన లండన్ వెళ్లారు. ఈటన్ కాలేజీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీల్లో చదువుకున్నారు. గ్లామోర్గన్ సీటు నుంచి ఆయన ఎంపీగా ఎన్నియ్యారు. గతంలో సైన్స్, ఇన్నోవేషన్, టెక్నాలజీ శాఖ కార్యదర్శిగా చేశారు. సత్‌వీర్ కౌర్ సౌతాంప్టన్ నుంచి ఎంపీ అయ్యారు. 2024 జూలైలో పార్లమెంట్‌కు తొలిసారి ఎన్నికయ్యారు. ఆమె పేరెంట్స్ పంజాబ్‌కు చెందినవారు. సౌతాంప్టన్‌లో చీరల షాపు ఉండేది. మినిస్ట్రీ ఫర్ ఈక్వాలిటీస్‌లో సహాయ మంత్రిగా చేశారు. హోంశాఖలో కూడా సెక్రటరీగా చేశారు. పార్లమెంటరీ సెక్రటరీగా కూడా ఆమె కొంత కాలం చేశారు. 2025 సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి 2026 వరకు ఆమె మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారు. హర్‌ప్రీత్ ఉత్పల్ హడ్డర్స్‌ఫీల్డ్ నుంచి ఎన్నియ్యారు. అసిస్టెంట్ విప్‌గా నియమితులయ్యారు. పార్లమెంటరీ బిజినెస్‌కు చెందిన ఆదేశాలు ఇస్తుంటారు. ఓటింగ్ సమయంలో ఎంపీలకు కీలక ఆదేశాలు ఇస్తారు. గతంలో ఆమె గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ క్యాంపేన్‌లో బర్న్‌హమ్‌తో కలిసి పనిచేశారు.


# సంక్షిప్త వార్తలు

## 50 ఒటిటిలపై నిషేధం విధించిన కేంద్రం




**న్యూఢిల్లీ, జులై 25:** దేశంలో ఒటిటి యాప్స్ విషయంలో కేం ద్రం కఠినంగా వ్యవహరిస్తోంది. దీనిలో భాగంగా అభ్యంతరకర కంటెంట్ ప్రసారం చేస్తున్న ఒటిటిలపై కేంద్రం ఉక్కు పాదం మోపుతోంది. తాజాగా ఇలాంటి 500 ఒటిటి యాప్స్ ను నిషేధించినట్లు కేంద్ర సమాచార, ప్రసా రశాఖ మంత్రి ఎల్. మురుగన్ వెల్లడించారు. దేశ చట్టాలను ఉల్లంఘించి, అసభ్యకర కంటెంట్‌ను ప్రసారం చేసినందుకే వాటిని నిషేధించామని మంత్రి లోక్‌సభలో తెలిపారు. అయితే, ఇలా ఒటిటిలను నిషేధించడం ఇదే మొదటిసారి కాదు. నిబంధనలు ఉల్లంఘించి, అభ్యంతరకర కంటెం ట్ ప్రసారం చేస్తున్న ఒటిటిలపై కేంద్రం నిషేధం విధిస్తూనే ఉంది.

## ప్రశ్నించే తరం ఇది: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్



**న్యూఢిల్లీ,జులై 25:** దేశవ్యాప్తంగా పేపర్ లీకులు, పరీక్షల అక్రమాలపై విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న వేళ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ యువత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. నేటి తరం ప్రశ్నించే తరం అని, వారికి ఆదేశాలు ఇవ్వడం కంటే చర్చించి అర్థం చెప్పడం అవసరమని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన సమకాలీన మాతృత్వం అంశంపై జాతీయ అవగాహన సమావేశంలో భాగవత్ మాట్లాడారు. తమ చిన్నతనంలో పెద్దలు చెప్పిన మాట వినేవాళ్లమని చెప్పారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. నేటి యువత ప్రతి విషయాన్నీ ప్రశ్నిస్తోందని, అందుకే వారికి కారణాలు వివరించి నమ్మకం కల్పించాలని చెప్పారు.

## అంతర్జాతీయ కోర్టు నుంచి చీఫ్ ప్రాసిక్యూటర్ తొలగింపు



**హేగ్,జులై 25:** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)లో తీవ్ర కలకలం నెలకొంది. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఆ సంస్థ చీఫ్ ప్రాసిక్యూటర్ కరీం ఖాన్‌ను పదవి నుంచి తొలగించారు. అత్యంత కీలకమైన హోదాలో ఉన్న వ్యక్తిపై ఇటువంటి చర్యలు తీసుకోవడం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. బ్రిటిష్ న్యాయవాది అయిన కరీం ఖాన్, ఐసీసీలో చీఫ్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తనతో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి పట్ల ఆయన లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

## ఆయుధాలు విక్రయిస్తే ఆ రెండుదేశాలకే నష్టం: ట్రంప్



**వాషింగ్టన్,జులై 25:** ఇరాన్‌కు చైనా, రష్యా ఎలాంటి ఆయుధాలు విక్రయించకూడదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అలా చేస్తే అది ఆ రెండు దేశాల ప్రయోజనాలకు మంచిది కాదని స్పష్టంచేశారు. అయితే ప్రస్తుతం ఇరాన్‌కు ఆయాదేశాలు ఆయుధాలుఅందించడంలేదని తాను నమ్ముతున్నట్లు తెలిపారు.ఇరాన్‌కు చైనా, రష్యాలక్ష్యాన్ని నిర్ధారించుకునే సమాచారాన్ని అందిస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## భారతీయులున్న నౌకపై దాడి.. 28 మంది సురక్షితం



**టెహ్రాన్,జులై 25:** భారతీయులు 28 మంది పనిచేస్తున్న నౌకపై ఇరాన్ జలాల్లో దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదని, భారతీయులు సహా నౌకలోని సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మొజాంబిక్ దేశానికి చెందిన ఐఎంవో నెం. 8818219 అనే దిశ పేరుగల నౌకపై దాడి జరిగిందని రాయబార కార్యాలయం తెలిపింది. ఈ ఘటనపై సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నామని తెలిపింది.

## కెనడాలో భారతీయ మహిళ దారుణ హత్య



**ఎడ్మంటన్,జులై 25:** భారతీయ మహిళ కెనడాలో దారుణ హత్యకు గురైంది. 23 ఏళ్ల దమన్‌ప్రీత్ కౌర్‌ను ఆమె భాగస్వామి హత్యచేశాడు. ఎడ్మంటన్‌లోని ఓ ఇంట్లో ఆమెను గొంతునులిమి చంపేశాడు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు పోలీసులు చెప్పారు.ఈనెల 9వ తేదీన ఈ ఘటన జరిగింది. ఈ కేసులో 22 ఏళ్ల రితేశ్ కుమార్‌ను ఎడ్మంటన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పార్ట్నర్‌పై సెకండ్ డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేశారు. బాధితురాలు దమన్‌ప్రీత్ కౌర్‌ది పంజాబ్‌లోని లుథియానా జిల్లా.

26-7Pg6exHMNWJQE.qxd:26-7Pg6exHMNWJQE.qxd 1/1/02 6:21 AM Page 1



# 50,114 సౌర విద్యుత్ కనెక్షన్లు పూర్తి



సౌరవిద్యుత్తు అనుసంధాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎపిసిపిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి

- 180 మెగావాట్ల సామర్థ్యం గ్రిడ్‌కు అనుసంధానం
- ఎపిసిపిడిసిఎల్‌లో పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన మరో మైలురాయి

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిసిపిడిసిఎల్) పరిధిలో ప్రధానమంత్రి పిఎం సూర్యాఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలులో మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఈ పథకం కింద మొత్తం 50,114 సౌర విద్యుత్ (రూఫ్‌టాప్ సోలార్) కనెక్షన్లు పూర్తి చేసి, 180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎపిసిపిడిసిఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి తెలిపారు. అనుసంధాన కార్యక్రమం అనంతరం సిఎండి మీడియాతో మాట్లాడుతూ, ఏప్రిల్-2025 నాటికి కేవలం 6,489 కనెక్షన్లు మాత్రమే పూర్తి కాగా, గత ఒక్క సంవత్సరం కాలంలోనే మరో 43,625 కనెక్షన్లను పూర్తి చేయడం ద్వారా మొత్తం 50,114 సౌర విద్యుత్ కనెక్షన్ల మైలురాయిని చేరుకోవడం ఎపిసిపిడిసిఎల్‌కు గర్వకారణమని తెలిపారు. అధికారులు, ఇంజనీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషితో ఈ ప్రగతి సాధ్యమైందన్నారు. వినియోగదారులకు ఇంటింటికీ వెళ్లి పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పించడం, దరఖాస్తు నుండి గ్రిడ్ అనుసంధానం వరకు నిరంతరం మార్గనిర్దేశం చేయడం, ప్రతి రోజు వెండార్లతో అధికారులు సమీక్షలు నిర్వహిస్తూ ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించడం, అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ అద్భుత విజయాన్ని సాధించగలిగామని సిఎండి పేర్కొన్నారు.

పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించడంలో, పర్యావరణ పరిరక్షణలో పిఎం సూర్యాఘర్ పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరింత వేగంగా సౌర విద్యుత్ కనెక్షన్లు అందించి రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ లక్ష్యాల సాధనకు ఎపిసిపిడిసిఎల్ కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఈ విజయానికి కృషి చేసిన డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) టివిఎస్ఎన్ మూర్తి, కార్పొరేట్ కార్యాలయ అధికారులు, ప్రాజెక్ట్స్ విభాగం బృందం, అన్ని సర్కిళ్ల చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజన్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, వెండార్లను సిఎండి పి.పుల్లారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నంకు చెందిన ఒడుగు నరేంద్ర, వనమాడి కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. శనివారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంధ్య ఆక్వాలో రోజు వారీ పని కోసం వెళ్తుండగా లారీ ఢీ కొనడంతో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. బాధిత కుటుంబాల ఆవేదన తీర్చలేనిది. ప్రయాణ సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. అధికారులు కూడా రోడ్డు ప్రమాదాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, వార్నింగ్ లైట్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## గోదావరిలో ఇన్‌ఫ్లో బాగా తగ్గిపోయింది

- జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరిలో ఇన్‌ఫ్లో బాగా తగ్గిపోయిందని జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో గోదావరి జిల్లాలో 71 శాతం వర్షపాతం తక్కువగా ఉంది. గోదావరి డెల్టా ఆయకట్టు ఖరీఫ్ పంటకు సాగునీటి కొరత ఉండదు. గత 70యేళ్లలో గోదావరి పరివాహక ప్రాంతంలో లేని నీటి కొరత ఇప్పుడు ఏర్పడింది. ప్రస్తుతం 50 టిఎంసిల నీరు గోదావరి డెల్టాకు అందించాం. గోదావరి డెల్టాకు 14,700 క్యూసెక్కులు ఇస్తున్నాం. మరో 80 టిఎంసిలు గోదావరి డెల్టాలో ఖరీఫ్ పంటకు అవసరం. గోదావరిలో లభ్యమయ్యే నీటి నిల్వలతో ఈ పరిస్థితిని అధిగమిస్తాం. డెల్టా గోదావరి నీరు ఇస్తాం. కాకినాడ జిల్లా మెట్ట కోసం వారికి సాగునీరు అందించలేని నీటి అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. కృష్ణా డెల్టాకు నీటి కొరతపై ప్రత్యేక చర్యలు చూస్తున్నాం. విశాఖ, కాకినాడ జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి తెలిపారు.

## హోం మంత్రి అనిత 'ఎక్స్' అకౌంట్ హ్యాక్

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సామాజిక మాధ్యమం 'ఎక్స్' అకౌంట్ హ్యాక్ అయ్యింది. దీంతో హోం మంత్రి కార్యాలయ అధికారులు అలర్ట్ జారీ చేశారు. మంత్రి అనిత వ్యక్తిగత ఎక్స్ అకౌంట్‌ను కొందరు హ్యాక్ అయ్యిందని, ఈ సమయంలో ఆ అకౌంట్ నుంచి అనధికారిక పోస్టులు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. అకౌంట్ సైబర్ దాడికి గురైన నేపథ్యంలో పోస్ట్ చేసిన అంశాలను అధికారికంగా పరిగణించవద్దని హోంమంత్రి కార్యాలయం ప్రకటించింది. అకౌంట్ హ్యాక్ అవ్వడంపై ఇప్పటికే పోలీసులకు మంత్రి ఫిర్యాదు చేశారు. హ్యాక్ చేసిన వారిని గుర్తించేందుకు, అకౌంట్ రికవరీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## అగ్నిప్రమాదాల నివారణపైనే ప్రత్యేక దృష్టి

- అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యమే లక్ష్యం
- అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పి.వి. రమణ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 25 ప్రభాతవార్త:** అగ్నిప్రమాదాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, అవి జరగకుండా ముందుగానే నివారించడమే అగ్నిమాపక శాఖ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పి.వి.రమణ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజా నగరంలలో నిర్వహిం చిన ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం, మాక్ డ్రిల్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జెనరల్ పి.వి. రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 60 శాతం ఆసు పత్రుల్లో ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు పూర్తి చేశామని, త్వరలోనే పాఠశాలల్లో కూడా ఇదే తరహా కార్యక్రమాలు చేపడతామని పి.వి.రమణ చెప్పారు.

ప్రతి అగ్నిమాపక కేంద్రం పరిధిలో నెలకు నాలుగు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులు, ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా యానిమేషన్ వీడియోలు, జింగిల్స్, కర పత్రాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంప్రదాయ ఉప న్యాసాల కంటే దృశ్య రూపంలో ఇచ్చే అవగాహన కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. అనంత రం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారులతో అగ్నిమాపక శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఆసు పత్రులు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు వంటి ప్రజలు అధిక సంఖ్యలో ఉండే భవనాల్లో అగ్ని భద్రతా ప్రమాణాలను రాజీ పడకుండా అమలు చేయాలని ఆయన కోరారు. నిర్మాణ దశలోనే అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా పెద్ద ఎత్తున ప్రాణనష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి సి.హెచ్. మార్టిన్ లూథర్ కింగ్, అగ్ని మాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సమస్య పరిష్కారం తొలి ప్రాధాన్యత

### - ప్రజాదర్బార్‌లో టిడిపి ఇన్‌ఛార్జి శ్రీనివాస్

**తిరుపతి, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ కసరత్తు చేపట్టారు. ఇందుకోసం శనివారం తొలిసారిగా తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో ప్రజాదర్బార్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) నిర్వహించారు. తిరుపతి నగరవాసుల నుండి డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధి లైట్లు, సిసి రోడ్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అర్జీదారులతో నేరుగా మాట్లాడి వినతులు స్వీకరించారు. 57మంది ఫిర్యాదులు అందించడం విశేషం. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆదేశాలతో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కుమారమ్మ, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జులు దంపూరి భాస్కర్ యాదవ్, శ్రీధర్ వర్మ, మునిశేఖర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నాం: ఆర్‌వైఎస్ఎఫ్

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం పట్ల రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా సాగించిన ఉద్యమాలు, నిరసనలు, ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాల ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని ఆయన పేర్కొన్నారు. ఇది విద్యార్థి ఉద్యమాల విజయమే కాకుండా ప్రజాస్వామ్య విలువల విజయంగా భావిస్తున్నామని అన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో ఏర్పడిన వివాదాలు, అవకతవకలు, విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేసి, ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువజనులపై నమోదు చేసిన అన్ని కేసులను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే పరీక్షల నిర్వహణలో జరిగిన పరిణామాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం చెల్లించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.



## గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతల శాంతియుత సత్యాగ్రహం

**తిరుపతి, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం నిరక్ష ్యంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గమని ,దీన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళన చేస్తే వారిపై దారుణంగా పోలీసులతో లాఠీచార్జి చేయించడం అమానవీ యమని కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండి పడ్డారు. నీట్, సిబిఎస్ఈ పరీక్షల్లో అవక తవకలు ప్రశ్నాపత్రాల లీకులు, విద్యార్థులపై పోలీసుల దాడులను నిరసిస్తూ శనివారం తిరుపతిలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో కొవ్వొత్తులు చేతపట్టుకుని శాంతియుత సత్యాగ్రహం నిర్వహించారు. మాంగాటి గోపాల్ రెడ్డి, కంభంపాటి మురళీకృష్ణ, శివశంకర్, జ్యోతీశ్వర్ నాయక్, సుప్రజ, ముసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



### భక్తులతో తిరుమలకొండ కిటకిట

- వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిట లాడుతోంది. వారాంతం శనివారం ఉదయానికి వైకుంఠమ్2లో అన్ని కంపార్టుమెంట్లు నిండాయి. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడు తోంది. క్యూలైన్లు శిలాతోరణం వరకు విస్తరించాయి. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంత రాయంగా సేవలందిస్తున్నారు. వారాంతం సెలవులు ఆపై తమతమ మొక్కు బడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిట లాడుతోంది. వైకుంఠం కంపార్టు మెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తు న్నారు. శనివారం సాయంత్రం వరకు 47వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రి వరకు 78,721 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం 4.98 కోట్లుగా నమోదైంది.

### టిటిడి ఉద్యోగి సస్పెన్షన్

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ధార్మిక సంస్థలో అవినీతికి పాల్పడిన ఓ ఉద్యోగిపై వేటు పడింది. హర్యానాలోని కురుక్షేత్ర వేంకటేశ్వర స్వామి ఆలయంలో అసిస్టెంట్ షరాఫ్‌గా పనిచేస్తున్న పి.గిరిని శనివారం టిటిడి సస్పెండ్ చేసింది. టిటిడి పేరుతో అన్నదానం, కల్యాణోత్స వం, వాహనసేవల పేరుతో భక్తుల నుంచి డబ్బులు వసూలుచేసినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

**మరో అవినీతి ఉద్యోగి...**

దేవుని చెంత నిజాయతీగా విధులు నిర్వహించాల్సిన టిటిడి ఉద్యోగులు కొందరు అవినీతికి పాల్పడుతుండటంతో టిటిడి అధికారులు కొరఢా ఝుళి పించారు. తిరుమలలోని జిఎన్‌సి ప్రాంతంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.శరత్ బాబును శనివారం టిటిడి సస్పెండ్ చేసింది. భక్తుల నుండి డబ్బులు డిమాండ్ చేసినట్లు సామాజిక మాధ్యమంలో వీడియో వైరల్ కావడంతో ఆధారంగా విచారణ చేపట్టారు. ప్రాథమికంగా ఉద్యోగి ప్రవర్తన నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించిన టిటిడి క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయనను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆగస్టు 6న మిక్స్‌డ్ రైస్ ఇ వేలం

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన బియ్యాన్ని ఆగస్టు 6న ఇ-వేలం ద్వారా విక్రయించనున్నట్లు టిటిడి తెలిపింది. ఈ వేలంలో మొత్తం 20 లాట్లలో సుమారు 7,938 కిలోల మిక్స్‌డ్ రైస్ అందుబాటులో ఉంచనున్నారు. ఆసక్తి గల వారు ఆగస్టు 5వ తేదీ సాయంత్రం లోపు కొనుగోలు పోర్టల్ ద్వారా రూ.50వేలు ఇఎండి ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయం 08772 26442నంబర్‌కు సంప్రదించవచ్చు.



### గోవిందరాజస్వామికి కవచ ప్రతిష్ఠ

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక జ్యేష్ఠాభిషేక మహోత్సవాల్లో శనివారం కవచ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. వేదఘోషలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉదయం శతకలశ స్నపనం, మహాశాంతి హోమం వైదిక పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో అభిషేకాలు జరిపి విశేషారాధనలు సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం కవచ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు. స్వామివారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులు 'గోవింద' నామస్మరణతో ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ ఏ.బి. నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### బృహన్నల వేషంలో అర్జునుని దివ్యదర్శనం

**శ్రీకాళహస్తి, జులై 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్తర గోగ్రహణం కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం రాత్రి ఆలయంలో అర్జున తపస్సు తరువాత అర్ధరాత్రి దాటిన తరువాత అలుగు కుంభాగ్రాన నిలుపు పవిత్ర కార్యక్రమాల్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. కుండపై కత్తిని నిలబెట్టడం అనేది అరుదైన కార్యక్రమాలు. రాత్రి పట్టణంలో ఊరేగింపు జరిపిన తరువాత స్థానిక పూజారులు పురుషోత్తం వారి సహచరులు మహిమాన్వితమైన ఈ కార్యక్రమాల్ని చేపట్టారు. అలుగు కుంభాగ్రాన నిలబెట్టు ఉత్సవాన్ని జరిపారు. శనివారం ఉదయం ఉత్తర గోగ్రహణం




సందర్భంగా అర్జునుడు బృహన్నల వేషంలో పట్టణంలో ఊరేగించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ ఎఇఒ హేమామాలిని, చిన్న ఆలయాల ఇన్‌ఛార్జి లక్ష్మయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్, దఫేదార్ పర్యవేక్షణలో ఉత్సవం జయరామారావు వీధి, బజారు వీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా సాగింది.

### దాససాహిత్య గాయకులకు ఆగస్టు 1 నుండి దరఖాస్తులు

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే శ్రీవారి సహస్ర దీపాలంకార సేవ, అలాగే తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో నిర్వహించే దాససాహిత్య సంకీర్తనలను ఆలపించేందుకు ప్రతిభావంతులైన, అర్హులైన సంగీత కళాకారుల నుంచి టిటిడి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఆడిషన్లు 2026 నవంబరు 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ఆరు రోజులపాటు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించబడనున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 1 నుండి 20వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో 'హెచ్‌టిటిపిఎస్://ఎపిపిఎస్. తిరురమల. ఒఆర్‌జి/డిఎస్‌పి' తమ దరఖాస్తులను సమర్పించాలి. అభ్యర్థుల అర్హతలు, ఆడిషన్ విధానం, సమర్పించాల్సిన ధ్రువపత్రాలు, మార్గదర్శకాలు, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలు టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.


## 28న సింహాచలం గిరి ప్రదక్షిణ




**విశాఖపట్నం, జులై 25 ప్రభాతవార్త:** ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణ మార్గంలో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రతి చోటా సీసీకెమెరాలు ఏర్పాటు చేసి, అవి పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని, నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం కొండపై దర్శనాలకు వచ్చే భక్తుల సంఖ్యను అంచనా వేసి తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. భక్తులకు అనువైన ప్రాంతాల్లో నమూనా ఆలయాలను ఏర్పాటు చేసి అక్కడ భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తొలి పావంచాతో పాటు నమూనా ఆలయాల వద్ద కూడా కొబ్బరికాయలు కొట్టి భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించుకునేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ తదితర అంశాల్లో తగిన చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు.

## మదనపల్లిలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- మారణాయుధాలతో బెదిరించి ఎటిఎం మిషన్ ఎత్తుకెళ్లారు
- ఎటిఎంలో రూ. 13.5 లక్షలు ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణ
- డ్రోన్లతో పోలీసుల ముమ్మర గాలింపు
- నిమ్మనపల్లి వద్ద ధ్వంసమైన మిషన్ గుర్తింపు









**మదనపల్లె (క్రైమ్), జులై 25 ప్రభాతవార్త:** మదనపల్లె పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్బీఐ ఏటీఎంను దొంగలు బొలెరో వాహనంలో ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఎస్బీఐ ఏటీఎంలో సుమారు రూ. 13.5 లక్షల నగదు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు ప్రాథమికంగా ధ్రువీకరించారు. ఎస్పీ ధీరజ్ ఆదేశాలతో పోలీసులు చేపట్టిన ముమ్మర గాలింపు చర్యల్లో ధ్వంసమైన ఏటీఎం మిషన్ లభ్యమైంది. స్థానిక శివాజీ నగర్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎస్బీఐ ఏటీఎం కేంద్రంలోకి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు బొలెరో వాహనంతో దూసుకెళ్లారు. ఏటీఎం మిషన్‌ను వాహనంలోకి ఎక్కిస్తుండగా అలికిడి గమనించిన స్థానికఇరుగు పొరుగువారు కొందరు పెద్ద పెద్ద శబ్దాలను గుర్తించి బయటికి రావడానికి ప్రయత్నించగా అప్రమత్తమైన దుండగులు కత్తులు, తుపాకి చూపించి స్థానికులను బెదిరించి, ఏటీఎం మిషన్‌ను వాహనంలో ఎక్కించుకుని వేగంగా పరారయ్యారు. దీంతో వారు 112 కు కాల్ చేయగా సమాచారం అందుకున్న గస్తీ పోలీసులు వెంటనే ఎస్పీ ధీరజ్ కు సమాచారం అందించారు. స్పందించిన ఎస్పీ జిల్లా అంతటా పోలీసులను అప్రమత్తం చేసి, పకడ్బందీగా నాకాబంధీ నిర్వహించారు. ఏటీఎంను తరలిస్తున్న బొలెరో వాహనం వాల్మీకిపురం మండలం కురపతి గ్రామం మీదుగా వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఈ కోణంలో దర్యాప్తును వేగవంతం చేసి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

**క్లూస్ టీం విస్తృత తనిఖీలు:** సీటీఎం రోడ్డు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని శివాజీ నగర్ వద్ద దుండగులు ఎస్బీఐ ఏటీఎంను అపహరించిన ప్రదేశాన్ని శనివారం జిల్లా క్లూస్ టీం నిపుణులు సందర్శించి కీలక ఆధారాలు సేకరించారు. క్లూస్ టీమ్ సిబ్బంది.. ఘటన స్థలంలో నిందితుల వేలిముద్రలు, పాదముద్రలతో పాటు టెక్నికల్ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఏటీఎం పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను సేకరించి విశ్లేషిస్తున్నారు.

**8 ప్రత్యేక బృందాలతో గాలింపు:** పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఎస్బీఐ ఏటీఎం చోరీ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. పరారీలో ఉన్న దొంగల ముఠాను పట్టుకోవడానికి 8 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

సీసీటీవీ ఫుటేజ్, సెల్‌ఫోన్ వీడియోల ఆధారంగా నిందితుల కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తున్నామని, నిమ్మనపల్లె పరిసర ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో ముమ్మర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని ఆయన చెప్పారు. త్వరలోనే దుండగులను అదుపులోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
ఆదివారం 26, జూలై 2026


## రాజ్యసభ నూతన సభ్యుల అవగాహన సదస్సులో పాల్గొన్న
# ఎంపీ చింతకాయల విజయ్



(న్యూఢిల్లీ, ప్రభాతవార్త)

నూతనంగా ఎన్నికైన మరియు నామినేట్ అయిన రాజ్యసభ సభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, పారిశ్రామిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎంపీ చింతకాయల విజయ్ పాల్గొన్నారు. ఈ ప్రముఖ సమావేశంలో ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ మరియు ఇతర సభ్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాజ్యసభను సంపూర్ణ డిజిటల్ సంసద్‌గా మార్చడంలో భాగంగా భాషా పరిమితులను అధిగమించే 'వాణి సేతు' నుండి సభ్యుల చేతిలోనే సభా వ్యవహారాలు అందుబాటులో ఉండే 'సదస్య సేతు' వరకు సరికొత్త సాంకేతిక మార్పులను ప్రదర్శించారు (తరువాయి 8వ పేజీలో)

## రూ.500 కోట్ల తాగునీటి నిధుల సాధనపై
# అయ్యన్నపాత్రుడికి ధన్యవాదాలు
### ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



మాకవరపాలెం, జూలై 25, ప్రభాతవార్త :

నర్సీపట్నం నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల అయిన శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ఏకంగా రూ.500 కోట్ల భారీ నిధులను సాధించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడికి తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఘనంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాకవరపాలెంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నర్సీపట్నం నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చాలనే దృఢ సంకల్పంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అయ్యన్నపాత్రుడు చేసిన కృషి అభినందనీయమని నాయకులు కొనియాడారు. నియోజకవర్గ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒకే ఒక్క మంచినీటి ప్రాజెక్టుకు రూ.500 కోట్లు తీసుకురావడం ఆయన దూరదృష్టి, నాయకత్వ పటిమకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లతో సంప్రదింపులు జరిపి, ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కలను నిజం చేసిన ఘనత స్పీకర్ అయ్యన్నపాత్రుడికే దక్కుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల తాగునీటి సమస్యను తుదిముట్టించే ఈ మహత్తర ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించినందుకు మాకవారపాలెం మండలాల ప్రజలు, నాయకుల తరఫున స్పీకర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్.వై. పాత్రుడు, అల్లు నాయుడు, చిరంజీవి రాజు, కిషోర్, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందుల్లేకుండా
# గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు



విశాఖపట్నం, జూలై 25, ప్రభాతవార్త :

ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం వీసీ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలు వెల్లడించారు. సమావేశంలో (తరువాయి 8వ పేజీలో)

- 5 నుంచి 6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం
- పటిష్ట భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు, తాగునీటి వసతి
- భక్తుల సేవలో 5 వేల మంది ఉద్యోగులు: హోం మంత్రి వంగలపూడి అనిత
- నాలుగు మండలాల పరిధిలో 221 పాఠశాలలకు 28న స్థానిక సెలవు

## విశాఖ సర్వతోముఖాభివృద్ధికి గేమ్ చేంజర్‌గా
# భోగాపురం ఎయిర్ పోర్ట్

- ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన రహదారుల అభివృద్ధి
- భోగాపురం విమానాశ్రయం రావటంతో ఉత్తరాంధ్ర ఆర్థిక ముఖచిత్రం మారనుంది
- వీఎంఆర్డీఏ కమీషనర్ తేజ్ భరత్ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ,

విశాఖపట్నం, జూలై 25 ప్రభాత వార్త :

విశాఖ నగర సర్వతోముఖాభివృద్ధికి భోగాపురం ఎయిర్ పోర్ట్ గేమ్ చేంజర్ కానుందని, అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటి శాఖమంత్రి నారా లోకేష్ కృషిచేస్తున్నారని విఎంఆర్డీఏ కమీషనర్ ఎన్.తేజ్ భరత్, చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ అన్నారు. శనివారం ఉదయం వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజభరత్, చైర్మన్ ప్రణవ్ గోపాల్ సి.ఈ.వినయ్‌కుమార్‌లతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన (తరువాయి 8వ పేజీలో)




## ఎయిర్ పోర్ట్ ప్రారంభ ఘట్టంలో
# ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

- ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి
- అధికారులు, ప్రజా ప్రతినిధులతో హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం, జూలై 25, ప్రభత్వ వార్త :

ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షకు ప్రతిరూపంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఈ ప్రాంత అభివృద్ధి చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆగస్టు 1న జరగనున్న ఈ మహా క్రతువులో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె పలు అంశాలపై ఎమ్మెల్యేలకు, అధికారులకు సూచనలు చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ప్రజలందరూ తమ వేడుకగా భావించి భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, స్వచ్ఛందంగా వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన ప్రయాణం, తాగునీరు, ఆహారం, భద్రత తదితర ఏర్పాట్లు ఉండేలా అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరయ్యే ప్రజలకు రవాణా సౌకర్యం సజావుగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని హోం మంత్రి సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని బస్సుల రూట్ మ్యాప్, సమయ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. అన్ని బస్సులు ఉదయం 9 గంటలకల్లా భోగాపురం చేరుకునేలా, ఆయా ప్రాంతాల దూరం, రహదారి పరిస్థితులను బట్టి ఉదయం (తరువాయి 8వ పేజీలో)



## విశాఖ గీతంలో
# 'మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్'పై వర్క్‌షాప్



విశాఖపట్నం, జూలై 25, ప్రభాతవార్త :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజినీరింగ్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ (ఇ.ఇ.సి.ఇ.) విభాగం ఆధ్వర్యంలో జూలై 22 నుండి 25 వరకు 'మ్యాట్‌ల్యాబ్ తో మెషీన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్" అనే అంశంపై వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆర్కాన్స్ ఇన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో, మ్యాథ్‌వర్క్స్ సీనియర్ ట్రైనింగ్ ఇంజనీర్ డాక్టర్ శుభ్రోబ్రత భట్టాచార్య ప్రధాన రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ప్రత్యేక సెషన్స్ నిర్వహించారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన 30 మందికి పైగా అధ్యాపకులు (ఫ్యాకల్టీ సభ్యులు) ఈ వర్క్‌షాప్‌లో చురుగ్గా పాల్గొన్నారు. వీరు మ్యాట్‌ల్యాబ్ ఉపయోగించి మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ విభాగాలలో ప్రాక్టికల్ (హ్యాండ్స్-ఆన్) అనుభవాన్ని పొందారు.

గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజినీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ భరణి చంద్ర కుమార్ పక్కి, విభాగాధిపతి డాక్టర్ ఎ. సిహెచ్. సుధీర్, మరియు డాక్టర్ ఎస్. నీరజ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ ఎల్. ఎల్. రాజేశ్వరరావు, డాక్టర్ బి. ఉదయ్ కుమార్ మరియు డాక్టర్ ఎస్. హర్షవర్ధన్ ఈ వర్క్‌షాప్‌ను సమన్వయం చేశారు. ప్రాక్టికల్ సెషన్ల పట్ల, అలాగే అభివృద్ధి చెందుతున్న నూతన విభాగాలలో తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి లభించిన ఈ అవకాశం పట్ల పాల్గొన్నవారు హర్షం వ్యక్తం చేశారు.

## కోటవురట్ల కేజీబీవీ పాఠశాలలో
# 30 మంది విద్యార్థినులకు అస్వస్థత

- కోటవురట్ల కేజీబీవీ సిబ్బంది నిర్వాకం..?
- మెరుగైన వైద్యానికి హోం మంత్రి అనిత ఆదేశాలు..
- నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలు తప్పవు: మంత్రి అనిత





నక్కపల్లి-కోటవురట్ల, జూలై 25, ప్రభాతవార్త:

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల కస్తూరిబా బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినుల 30 మంది అస్వస్థకు గురయ్యారు. అస్వస్థతకు గురైన విద్యార్థినిల్లో ఐదుగురు విద్యార్థినుల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వారికి స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి కి తరలించారు. ఒక్కసారిగా విద్యార్థులు అస్వస్థత గురైన పరిస్థితులు ఎందుకొచ్చాయని పరిశీలించగా నిల్వ ఉన్న ఆహారం తీసుకోవడం వలన , సిబ్బంది నిర్లక్ష్యంతో జరిగినట్లు భావిస్తున్నారు. శుక్రవారం జరిగిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు వచ్చిన తల్లిదండ్రులు, పిల్లలకు మధ్యాహ్నం (తరువాయి 8వ పేజీలో)

## మీడియా కథనాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన
# ఎమ్మెల్యే వంశీకృష్ణ



విశాఖపట్నం, జూలై 25, ప్రభాతవార్త :

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుండటం సంతోషకరమైన విషయమని, ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ నేతలకు విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అయితే మంత్రి నారాయణకు తాను సమర్పించిన వినతిపత్రంపై (తరువాయి 8వ పేజీలో)

## ఘనంగా గిరి ప్రదక్షిణకు
# తరలివచ్చిన భక్తులు



నక్కపల్లి, జూలై 25, ప్రభాతవార్త :

మండలం లోని ఉపమాక వెంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం సాయంత్రం గిరిప్రదక్షిణోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా ఆలయం వద్ద అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం గరడాద్రి పర్వతం చుట్టూ గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. శ్రీనివాస భజన భక్త సమాజం ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులు గోవింద నామాలతో గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్ లో చేరుకొని దర్శించుకున్నారు. ఎన్నడూ ఊహించని విధంగా రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చారు. ప్రదర్శించిన కోలాటాలు విశేషంగా భక్తులను ఆకట్టుకుంది.

## అన్ని వర్గాల అభివృద్ధి
# విశాఖ లక్ష్యం కావాలి

- చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నం, జూలై 25, ప్రభాతవార్త :

అన్ని రంగాల అభివృద్ధే విశాఖ లక్ష్యం కావాలనికలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పిలుపునిచ్చారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సమావేశాన్ని శనివారం సాయంత్రం పాత జైలు రోడ్డులోని ఓ హోటల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్పో బ్రోచర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ (తరువాయి 8వ పేజీలో)



## అభిమానులకు 'చిరు' బీమా
# ప్రశంసనీయం




విశాఖపట్నం, జులై 25, ప్రభాతవార్త :

అభిమానులకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం అందించాలన్న మెగాస్టార్ చిరంజీవి నిర్ణయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశంసించారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ ఆఫీస్ లో చిరంజీవి అభిమాన సంఘం ప్రతినిధులు శనివారం ఆయన్ను కలిశారు. ఆగస్టు 22 వ తేదీన మెగాస్టార్ పుట్టినరోజు సందర్భంగా చేపట్టబోయే సామాజిక సేవా, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను (తరువాయి 8వ పేజీలో)

## రాజ్యసభ నూతన సభ్యుల అవగాహన సదస్సులో పాల్గొన్న ఎంపీ చింతకాయల విజయ్

(7వ పేజీ తరువాయి)

కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, నూతన సభ్యులు పార్టీలకతీతంగా దేశ సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, పరిశోధనాత్మక విధానాలు మరియు డిజిటల్ పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ సభా సమయాన్ని ఫలవంతం చేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల నియమాలు, సాంప్రదాయాలు, సభా వ్యవహారాలను నూతన సభ్యులకు సులభంగా అర్థమయ్యేలా చేయడానికి ఈ ఓరియంటేషన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని సెక్రటరీ జనరల్ తెలిపారు. సభ్యులందరికీ సచివాలయం తరఫున సమర్థవంతమైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## అభిమానులకు 'చిరు' బీమా ప్రశంసనీయం

(7వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేకు తెలియజేశారు. చిరంజీవితో తనకెంతో సాన్నిహిత్యం ఉందని.. అభిమానులకు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. ఇప్పటికే బ్లడ్ బ్యాంక్ ద్వారా సేవ చేస్తున్న చిరంజీవి మరో అడుగు ముందుకేసి బీమా కోసం అభిమానుల జాబితా రూపొందించడం ఆదర్శనీయమైన నిర్ణయంగా పేర్కొన్నారు. అభిమానులను కుటుంబ సభ్యులుగా భావించే చిరంజీవి పుట్టిన రోజు నాడు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈనెల 30 వ తేదీ సాయంత్రం పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియం లో క్యాలు ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జరగనున్న సినీ నేపథ్య గాయని ఎస్.జానకి సంగీత విభావరి పోస్టర్ ను గంటా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గల్లా కొండలరావు, కోయిలాడ శ్రీనివాస్, వాసుపల్లి ఎల్లాజీ, మధు, లంక శ్రీను, పి.వెంకటరమణ, జనార్ధన్, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ పోర్ట్ ప్రారంభ ఘట్టంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

(7వ పేజీ తరువాయి)

6 గంటల నుంచే వేర్వేరు సమయాల్లో బయలుదేరేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఒక్కో గ్రామం, మండలం, రూట్ వారీగా సమన్వయ బాధ్యతలు స్పష్టంగా ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పరం సమన్వయం చేసుకోవాలన్నారు. బస్సుల రూట్ మ్యాప్, సమయాలు, ప్రయాణ వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల సాధారణ రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని హోం మంత్రి ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్రలో ఏర్పడే కొత్త అవకాశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని హోం మంత్రి సూచించారు. ఉపాధి, పెట్టుబడులు, పర్యాటకం, వ్యాపారం, విమానయానం తదితర రంగాల్లో రానున్న అవకాశాలపై యువత, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

### 31న విశాఖలో భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కార్యక్రమం.

ఈ నేపథ్యంలో ఆగస్టు 31న విశాఖపట్నంలో భవిష్యత్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా మారథాన్ రన్, బీచ్ వాక్, ఫ్లాష్ మాబ్, 5కే రన్ లేదా సైక్లింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహించేలా సంబంధిత శాఖలు కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. తగిన ప్రణాళికలు రూపొందించామని, కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర భవిష్యత్తుకు కొత్త ద్వారాలు తెరచే ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు.

## అన్ని వర్గాల అభివృద్ధి విశాఖ లక్ష్యం కావాలి

(7వ పేజీ తరువాయి)

కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ విశాఖ జోన్ ఆధ్వర్యంలో విశాఖ లో మొదటిసారిగా బిజినెస్ ఎక్స్పో చిన్న తరహా మధ్యతరహా పరిశ్రమలు అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖ అంటేనే అనేక అవకాశాలకు ఉపాధికి కేంద్రంగా నిలుస్తుంది అన్నారు. విశాఖపట్నం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సెప్టెంబర్ 11,12,13 తేదీలలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తిలకించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశానికి వస్తున్న పెట్టుబడులలో 25 శాతం పెట్టుబడులు ఏపీ కి వస్తున్నాయని తెలిపారు. వీటిలో అధిక పెట్టుబడులు ఉమ్మడి విశాఖకు వస్తున్నాయని పేర్కొన్నారు. విశాఖకు దిగ్గజ సంస్థ గూగుల్ వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం విశాఖ లో ప్రతి సంవత్సరం భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తుందని చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారుని తెలియజేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ లో 50 వరకు ప్రాజెక్టులు వస్తున్నాయని తెలియజేశారు. విశాఖ లో బే సిటీ కాన్సెప్ట్ తీసుకువస్తున్నారు. ఏపీ చాంబర్స్ కామర్స్ ఆఫ్ ఇండస్ట్రీ విశాఖపట్నం జోన్ చైర్మన్ పి శోభన ప్రకాష్ మాట్లాడుతూ ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11,12,13 తేదీలలో బిజినెస్ ఎక్స్పో నిర్వహిస్తున్నారు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు గుప్తా మాట్లాడుతూ గతంలో విజయవాడలో బిజినెస్ ఎక్స్పో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ చాంబర్స్ కామర్స్ ఇండస్ట్రీస్ వైస్ చైర్మన్ లు పవన్ కార్తీక్, శివకుమార్, ఉమెన్స్ వింగ్ చైర్మన్ డాక్టర్ శ్రీవల్లి, సభ్యులు గీతా శ్రీకాంత్, వాణి బాల తదితరులు పాల్గొన్నారు.

## 30 మంది విద్యార్థినులకు అస్వస్థత!

(7వ పేజీ తరువాయి)

భోజనం ఏర్పాటు చేయగా ఆ భోజనం సాయంత్రానికి మిగలడంతో అదే ఆహార పదార్థాలు సిబ్బంది రాత్రి విద్యార్థులకు వడ్డించినట్లు తెలిసింది.! నిల్వ కూరలతో భోజనాలు చేసిన విద్యార్థులు అర్ధరాత్రి సమయం నుంచి కడుపునొప్పి, వాంతులు, విరేచనాల బారిన పడడంతో గమనించిన ఉపాధ్యాయులు పుటాహుటిన ఆసుపత్రికి శనివారం ఉదయం వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించారు. పాఠశాలకు చేరుకున్న వైద్య సిబ్బంది విద్యార్థులను పరిశీలించి అవసరాన్ని మందులు ఇచ్చారు. అప్పటికి తీవ్ర అస్వస్థతకు గురైన ఐదుగురు విద్యార్థులను మిగతా స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉంది. మిగిలిన 25 మంది విద్యార్థులకు కేజీబీవీ లోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. పరిస్థితి తెలుసుకున్న ఆర్డిఓ వి.వి రమణ , అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీరాములు కేజీబీవీ పాఠశాలకు చేరుకున్నారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘటనపై విచారణ చేపడతామని నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మధ్యాహ్నం మిగిలిన పదార్థాలు రాత్రి వడ్డించారా? అని ప్రశ్నించగా పూర్తి సమాచారం అందాల్సి ఉందని సమాధానం ఇచ్చారు. విచారిస్తున్నామని తెలిపారు. ఘటనకు కేజీబీవీ నిర్వాహకురాలు సరిత నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆమె సాయంత్రం ఐదున్నర సమయంలో ఇంటికి వెళ్లిపోతారని రాత్రి ఏం జరుగుతుందో ఇక్కడ ఉన్న సిబ్బంది చెబితే తప్ప ఆమెకు తెలియదన్నారు. మధ్యాహ్నం మిగిలిన ఆహార పదార్థాలను రాత్రి పెట్టి పిల్లలను ఆసుపత్రి పాలు చేశారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులతో మాట్లాడి జరిగిన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఎటువంటి సంఘటన జరగకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణలో విద్యార్థుల నుంచి వైద్యం అందించాలని వారికి వేడివేడిగా ఆహారాన్ని ఇవ్వాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పకుండా తీసుకుంటామని చెప్పారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థుల పరిస్థితులు తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు చేరుకొని మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులతో ఆరోగ్య పరిస్థితి పై మాట్లాడారు ఎవరో ఆందోళన చెందాల్సిన పనిలేదని ధైర్యంగా ఉండాలని కోరారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు కేజీబీవీని సందర్శించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీరాములకు కోరారు. అస్వస్థత గురైన విద్యార్థినులకు హోం మంత్రి ఆదేశాల మేరకు పీహెచ్సీ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ కుమార్, డాక్టర్ ప్రత్యూష, సీహెచ్సీ వైద్యులు డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో చికిత్స అందిస్తున్నారు. అందరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

# విశాఖ సర్వతోముఖాభివృద్ధికి గేమ్ చేంజర్‌గా భోగాపురం ఎయిర్ పోర్ట్

(7వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం కానుంద న్నారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావటంతో ఉత్తరాంధ్ర వాసుల కల నెరవేరబోతుందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక ముఖచిత్రం మార్చేస్తుందని, ఈ విమానాశ్రయం పెట్టుబడులను ఆకర్షించేందన్నారు. ఒక విధంగా చెప్పాలంటే భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజన్‌గా, పర్యాటకంతో పాటు పలు రంగాల ప్రగతి సాధనకు గేమ్ చేంజర్ మారనుందన్నారు. భోగాపురం విమానాశ్రయం రావటంతో ఎన్నో కొత్త పరిశ్రమంలు, ఐటీ కంపెనీలు ఉత్తరాంధ్రకు తరలిరానున్నాయని, స్థానిక యువతకు విమానాయానం, కార్గో, పర్యాటకం, ఆతిధ్యరంగం వంటి రంగాల్లో పెద్ద ఎత్తున ప్రత్యక్షం గాను, పరోక్షంగాను ఉపాధి లభించనుందన్నారు. ఉత్తరాంధ్రకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి గారికి ఉత్తరాంధ్ర యువత తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

### రహదారుల అభివృద్ధిలో వీఎంఆర్డీఏ కీలక పాత్ర

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంకు నగరవాసులు రాకపోకలు సాగించేందుకు వీలుగా పలుప్రధాన రహదారులను విస్తరణ చేపట్టటంలో వీఎంఆర్డీఏ కీలకపాత్ర పోషించిందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకునేందుకు వీలుగా జాతీయ రహదారికి అనుసంధానించేలా 15 ప్రధాన రహదారుల విస్తరణ చేపట్టాల్సి ఉందని, అయితే ముందుగా అత్యంత ప్రాదాన్యత కలిగిన 7 రహదారులను వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బి శాఖల ద్వారా అభివృద్ధిచేయటం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రూ.170 కోట్లతో వీఎంఆర్డీఏ ద్వారా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని, వీఎంఆర్డీఏ ద్వారా 26 కి.మి. మేర రహదారులను విస్తరించటం జరిగిందన్నారు. తిమ్మాపురం-మారికవలస రోడ్డును 6.3కి.మి. మేర 30 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరణ పనులు శతశాతం పూర్తి చేసామన్నారు. అడవివరం-శొంఠ్యాం రహదారి 8 కి.మి.మేర 30 మీటర్ల వెడల్పుతో ఆరు లైన్ల రహదారి విస్తరణపనులు దాదాపుగా 80శాతం పూర్తయ్యాయని, ఇక్కడ అటవీశాఖకు చెందిన భూములు ఉండగా, ఇంకా 4 కి.మి. మేర అభివృద్ధిచేయాల్సి ఉందన్నారు. వీటికి సంబంధించి వన్యప్రాణి సంరక్షణ విభాగం అనుమతులు వచ్చాయని, ఇక అటవీశాఖ అనుమతులు రావల్సి ఉందన్నారు. ఈ రహదారిలో 86 మందికి టీడీఆర్లు ఇవాల్సి ఉండగా , ఇప్పటి వరకు 28 మందికి ఇచ్చామని, మిగిలిన వారికి త్వరలోనే అందజేస్తామన్నారు. నేరెళ్లవలస - కొత్తవలస 3.90 కి.మీ. మేర రహదారిని 24 మీటర్ల వెడల్పుతో విస్తరణ పనులు శతశాతం పూర్తయ్యాయన్నారు. ఈ రహదారిలో 41 మందికి టీడీఆర్లు ఇవ్వాల్సి ఉండగా , ఇప్పటి వరకు 14 మందికి ఇచ్చామన్నారు. భవన యజమానులకు 30 మందికి నష్టపరిహారం ఇవాల్సిఉండగా , ఇప్పటి వరకు 21 మందికి నిధులు కేటాయించామన్నారు . భోయపాలెం - కాపులుప్పాడ రహదారిని 3.10 కి.మీ.మేర 24 మీటర్ల వెడల్పుతో 4 లైన్లతో శత శాతం అభివృద్ధి చేసామన్నారు. భీమిలి -దొరతోట రహదారి 6.02 కి.మీ. మేర విస్తరణను ఆర్అండ్ బి శాఖ పర్యవేక్షిస్తుందన్నారు. వేపగుంట- పినగాడి ప్రధాన రహదారిని వీఎంఆర్డీఏ ద్వారా 3.20 కి.మి. మేర మాత్రమే విస్తరణ చేశామని, ఈ పనులు దాదాపుగా 90 శాతం పూర్తయ్యాయన్నారు . అలానే ఇక్కడ భూములు ఇచ్చిన 148 మందికి టీడీఆర్లు ఇవ్వాల్సి ఉందన్నారు . భవనాలు దెబ్బతిన్న భవన యజమానులు 111 మందికి రూ.58.62 లక్షలు చెల్లించటం జరిగిందన్నారు. వేపగుంట-జుత్తాడ రహదారి అభివృద్ధి పనులు జీవీఎంసీ చేపడుతుందన్నారు.

### మార్గ సూచికలు ఏర్పాటుకు సన్నాహాలు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనుసంధానించే ప్రధాన రహదారులను కేవలం 9 నెలల సమయంలోనే పూర్తి చేయటం జరిగిం దని, ఇందుకు ఇంజనీరింగ్ అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నా మన్నారు . యుద్ధ సమయంలో తారు కొరత వచ్చినా, చెన్నై నుంచి దిగుమతి చేసుకుని మరీ రోడ్డు పనులు చేపట్టి అనుకున్న సమయానికి పూర్తి చేశామని పేర్కొన్నారు . విమాన ప్రయాణికులు విమానాశ్రయానికి సులభతరంగా చేసుకునేలా ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు కలిసే కూడళ్ల వద్ద మార్గ సూచికలను సైతం ఏర్పాటుచేయనున్నామన్నారు. కూడళ్ల వద్ద ప్రమాదాలను నివారించేందుకు ఆయా ప్రాంతాలను విస్తరణచేస్తున్నామన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ గారు మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావటం ద్వారా ఉత్తరాంధ్రకు మహార్దశ పడుతుందన్నారు. అదేవిధంగా బీచ్ రోడ్ ద్వారా భోగాపురం విమానాశ్రయానికి చేరుకునేలా కోస్టల్ కారిడార్‌ను కూడా అభివృద్ధి చేయనున్నామని, తెన్నేటిపార్కు నుంచి భీమిలి వరకు, భీమిలి నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు బీచ్ రోడ్డు వెంబడి రహదారిని జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ అభివృద్ధి చేయనుందన్నారు. అదేవిధంగా వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో 40 కి.మి. విస్తీర్ణంలో 32 ప్రాంతాల్లో సైనో బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భోగాపురం విమానాశ్రయం చేరుకునేందుకు వీలుగా ఈవీ బస్సులను ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుపుతున్నారని, విమాన ప్రయాణికులు వేచిఉండేందుకు వీలుగా లాంజ్ లను సైతం ఏర్పాటు చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమైందన్నారు.

### ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు...

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టటం గర్వకారణమని , విమానాశ్రయాన్ని ఉత్తరాంధ్ర సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దారన్నారు. అదేవిదంగా 13 వేల మందితో దింశా నృత్యప్రదర్శన ఉంటుందని, ఈ ప్రదర్శనను దేశ ప్రధాని నరేంద్ర మోదీ కూడా తిలకించనున్నారన్నారు. ఈ విమానాశ్రయం రావటంతో పెట్టుబడులను మరింత ఆకర్షించటం జరుగుతుందని , తద్వారా ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు అనే నినాదం ప్రాచుర్యం పొందుతుందన్నారు .కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీడియా కథనాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

(7వ పేజీ తరువాయి)

వాస్తవాలను తెలుసుకోకుండా కొన్ని మీడియా సంస్థలు తప్పుడు కథనాలు ప్రసారం చేయడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఏ అంశంపై వినతిపత్రం సమర్పించారో పూర్తిగా తెలుసుకోకుండా వార్తలు ప్రచురించడం జర్నలిజం విలువలకు విరుద్ధమని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు సాయిబాబా దేవాలయానికి అవకాశం కల్పించే అంశంతో పాటు, ప్రతి నెల నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే తాను స్పందించినట్లు స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తుల మధ్య ఉన్న వివాదాన్ని తనకు ఆపాదించడం పూర్తిగా అన్యాయమని ఆయన అన్నారు. జీవీఎంసీ కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి నారాయణకు లేఖ అందజేశానని, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన వారికి న్యాయం చేయాలని మాత్రమే తాను వినతిపత్రంలో కోరినట్లు వెల్లడించారు.

ప్రస్తుత వివాదానికి గతంలో వైసీపీ నాయకులు ఇచ్చిన అనుమతులే కారణమని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆరోపించారు. పేదలకు అన్యాయం జరుగుతున్నప్పుడు ప్రజాప్రతినిధిగా స్పందించడం తన బాధ్యత అని, తప్పు జరిగితే ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని అన్నారు.

ఆధారాలు లేకుండా వార్తలు ప్రచురించడం వల్ల తన కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్తలు రాసే ముందు వాస్తవాలను పూర్తిగా నిర్ధారించుకోవాలని మీడియా సంస్థలకు సూచించారు. కూటమి ప్రభుత్వం, జనసేన పార్టీని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. పార్కు అంశంపై తనపై వచ్చిన ఆరోపణలు నిజమని ఎవరైనా నిరూపిస్తే అరగంటలోనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని వంశీకృష్ణ సవాల్ విసిరారు. తన పద్దెనిమిదేళ్ల రాజకీయ జీవితంలో ఎవరి వద్దా చేయి చాచలేదని, భూముల కొనుగోలు, అమ్మకాల విషయంలో ఎటువంటి ఆధారాలు లేకుండా తనపై దుష్ప్రచారం చేయడం తగదని అన్నారు.

వ్యక్తిగతంగా తన ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు కథనాలు ప్రచురిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వంశీకృష్ణ హెచ్చరించారు. మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రచురించాలని ఆయన కోరారు.

ఈ పత్రిక సమావేశంలో విశాఖ సౌత్ ఇంచార్జి శివప్రసాద్ రెడ్డి, జనసేన పార్టీ ఆఫీస్ ఇంచార్జి మద్రివేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఫెర్టిలిటీపై విశాఖలో ఫెర్టీ-9 అవగాహన సదస్సు



విశాఖపట్నం, జూలై 25, ప్రభాత వార్త : ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫెర్టీ-9 విశాఖ ఫెర్టిలిటీ సెంటర్ శనివారం నగరంలో సంతానోత్పత్తి పై అవగాహన సదస్సు ను నిర్వహించింది . ఏపీలో ప్రముఖ ఫెర్టిలిటీ కేర్ నెట్‌వర్క్‌గా పేరుగాంచిన 'ఫెర్టీ-9' కు ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు లభించిందని నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన సదస్సుల్లో ఫెర్టీ-9 వైద్య నిపుణులు తమ పరిశోధనల్ని ప్రదర్శించారు. దేశంలో సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గుముఖం పడుతోందని, తెలంగాణలో 1.8, ఏపీ 1.7కు చేరిందని డాక్టర్ కావ్యా రెడ్డి కుమ్మల, డాక్టర్ పాల కీర్తి తెలిపారు. సంతాన సమస్యలపై సమాజంలో అవగాహన పెరగడం అత్యంత అవసరమని, సరైన సమయంలో ఫెర్టిలిటీ నిపుణుల్ని సంప్రదించి, ఆధునిక వైద్య సాంకేతికతతో చికిత్స ప్రారంభిస్తే తల్లిదండ్రులయ్యే అవకాశాలు మరింత మెరుగుపడతాయని స్పష్టం చేశారు. 'నీడిల్-ఫ్రీ ఐవీఎఫ్‌చ సేవల్ని అందుబాట్లోకి తెచ్చామ న్నారు. భవిష్యత్తులో గర్భస్రావా లు, ఇంప్లాంటేషన్ వైఫల్యాల నివారణకు ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసి, తెలుగు రాష్ట్రాల్లోని దంపతులకు మరింత ఆధునిక సేవలు అందించనున్నామన్నారు.

# ఉత్తరాంధ్ర మణిహారం... అల్లూరి విమానాశ్రయం

**ఆగస్టు 1న ప్రారంభోత్సవ వేడుకలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలి**

**విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

విశాఖపట్నం, జూలై 25, ప్రభాత వార్త : అల్లూరి సీతారామరాజు పేరుతో నిర్మితమైన అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయనుందని, ఆగస్టు 1న జరగనున్న ప్రారంభోత్సవ వేడుకను చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్ మీటింగు హాలులో హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమీక్షలో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్న ఆయన అనంతరం కలెక్టరేట్ వీసీ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో భోగాపురం ఎయిర్ పోర్టు కు సంబంధించిన వివరాలను హోం మంత్రి అనితతో కలిసి వెల్లడించారు.

### ఉత్తరాంధ్ర నుంచి భారీగా ప్రజల భాగస్వామ్యం

అల్లూరి విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి సుమారు లక్ష మంది, ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు మూడు లక్షల మంది ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయం నిర్దేశించిన ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, ప్రజల భద్రత, సౌకర్యం, రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. విశాఖపట్నం నగరానికి దూరంగా విమానాశ్రయం నిర్మించారనే అభిప్రాయాలు కొందరు వ్యక్తం చేస్తున్నప్పటికీ, భవిష్యత్ జనాభా పెరుగుదల, ప్రాంతీయ విస్తరణ, అంతర్జాతీయ విమానయాన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక దృష్టితో ఈ ప్రాజెక్టును నిర్మించినట్లు స్పష్టం



చేశారు. ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భోగాపురం విమానాశ్రయం నిర్మితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత అవసరాలను తీర్చడమే కాకుండా భవిష్యత్ తరాల అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందించారని, సందర్శించే ప్రతి ఒక్కరికీ దాని విస్తృతి, నాణ్యత, భవిష్యత్ దృష్టి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఉత్తరాంధ్రను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లే కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుగా ఈ విమానాశ్రయం నిలుస్తుందని అన్నారు.

### ఉత్తరాంధ్ర సంస్కృతికి అద్దం పట్టే సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రారంభోత్సవ వేడుకల్లో ఉత్తరాంధ్ర గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రసిద్ధ థింసా నృత్యంతో పాటు ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రస్థానంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలో ఆర్థిక అభివృద్ధి, పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కేవలం ఒక మౌలిక వసతుల ప్రాజెక్టు ప్రారంభం మాత్రమే కాదు.. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయానికి నాంది అని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

### అసిప్ సెమీ కండెక్టర్ టెక్నాలజీ సంస్థకు శంకుస్థాపన

విశాఖపట్టణం వేదికగా ఏర్పాటు కానున్న ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన అసిప్(ఆసిప్ ) టెక్నాలజీస్ సెమీ కండక్టర్ సంస్థకు ఆగస్టు 01న ప్రధాని, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుందని పల్లా శ్రీనివాసరావు వివరించారు. ఆ రోజు ఎయిర్ పోర్టుతో పాటు, ఏవియేషన్ హబ్ - యూనివర్శిటీ, ఎడ్యుసిటీలు, జీఎంఆర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కూడా ప్రారంభమవుతాయని, వాటితో పాటు అసిప్ టెక్నాలజీ సంస్థకు శంకుస్థాపం కూడా జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సీపీ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు

(7వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు. 32 కిలోమీటర్ల మేర జరిగే సింహగిరి గిరి ప్రదక్షిణలో ఈ ఏడాది 5 నుంచి 6 లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. భక్తుల సేవలో వివిధ శాఖలకు చెందిన సుమారు 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. ఈ నెల 28న ఉదయం నుంచి తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ స్వామివారి రథం బయలుదేరుతుందని తెలిపారు. రద్దీ నియంత్రణ కోసం తొలిపావంచా వద్ద 50 క్యూ లైన్లు, 120 ఇనుప బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

### 28 సహాయ కేంద్రాలు.. ఏడు కంట్రోల్ రూములు

భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ మార్గంలో 28 సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి కేంద్రంలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, లైటింగ్, సూచిక బోర్డులు, వైద్య సదుపాయాలు, కార్పెట్ వంటి ఏర్పాట్లు ఉంటాయని చెప్పారు. తొలిపావంచా, అడవివరం జంక్షన్, హనుమంతవాక, అప్పుఘర్, మాధవధార, ఎన్ఎస్‌టీఎల్ గేట్, పాత గోశాల వద్ద మొత్తం ఏడు ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్, దేవస్థానం, వైద్య ఆరోగ్యశాఖ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

### 31 వైద్య శిబిరాలు.. నిరంతర తాగునీటి సరఫరా

గిరి ప్రదక్షిణ మార్గంలో 31 వైద్య శిబిరాలు, 22 అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 28, 29 తేదీల్లో మొబైల్ వైద్య బృందాలు, మెట్ల మార్గంలో ప్రత్యేక వైద్య బృందాలు సేవలందిస్తాయని చెప్పారు. కొండపై కూడా అదనపు వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తులకు తాగునీటి కొరత లేకుండా మార్గమంతా, కొండపై నిరంతర నీటి సరఫరా ఏర్పాటు చేశామని తెలిపారు. 115 వాటర్ పాయింట్లు, వాటర్ బబుల్స్, తాగునీటి ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. మజ్జిగ, పులిహోర తదితర ప్రసాదాల ప్యాకెట్లను వెంటనే తొలగించేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. మార్గంలో 595 తాత్కాలిక మరుగుదొడ్లతో పాటు దేవస్థానం, జీవీఎంసీ శాశ్వత మరుగుదొడ్లను కూడా వినియోగానికి సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

### పటిష్ట భద్రత.. సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

భక్తుల భద్రత కోసం దిగువ ప్రాంతాల్లో 70 తాత్కాలిక సీసీ కెమెరాలు, కొండపై ఇప్పటికే ఉన్న కెమెరాలకు అదనంగా 45 తాత్కాలిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. పోలీస్ శాఖకు చెందిన 2,700 మంది సిబ్బందితో పాటు మొత్తం 5 వేల మంది అధికారులు, ఉద్యోగులు విధుల్లో ఉంటారని తెలిపారు.

మార్గమంతా 40 పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్, తగినంత లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అగ్ని ప్రమాదాల నివారణకు పైకొండ, దిగువకొండ ప్రాంతాల్లో 192 అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. చిన్నారులు, వృద్ధులు తప్పిపోకుండా ఆర్ఎఫ్ఐడీ ట్యాగింగ్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

### ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. హనుమంతవాక, వెంకోజిపాలెం ప్రాంతాల్లో జాతీయ రహదారి దాటే భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల 28 ఉదయం 7 గంటల నుంచి 29 మధ్యాహ్నం వరకు హనుమంతవాక, శొంఠ్యాం, వేపగుంట, గోపాలపట్నం వైపు నుంచి సింహాచలం వచ్చే భారీ వాహనాల రాకపోకలను నియంత్రిస్తామని తెలిపారు. శొంఠ్యాం నుంచి వచ్చే బస్సులను అడవివరం జంక్షన్ వద్ద, ప్రహ్లాదపురం వైపు నుంచి వచ్చే బస్సులను వేపగుంట వైపు మళ్లిస్తామని చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం--సబ్బవరం మార్గంలో మళ్లిస్తామని తెలిపారు. నగరంలోకి వచ్చే వాహనాలు అనకాపల్లి హైవే--లంకెలపాలెం మీదుగా, ద్విచక్ర వాహనాలు, కార్లు అసకపల్లి--నరవ మార్గం మీదుగా ప్రయాణించాలని సూచించారు. నగరం నుంచి బయలుదేరే వాహనాలు షీలానగర్, గాజువాక, లంకెలపాలెం, అనకాపల్లి హైవే మార్గాలను వినియోగించాలని కోరారు.

### సముద్ర స్నానాల వద్ద 90 మంది నిపుణులైన ఈతగాళ్లు

అప్పుఘర్, జోడుగుళ్లపాలెం వద్ద సముద్ర స్నానాలు చేసే భక్తుల భద్రత కోసం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మూడు షిఫ్టుల్లో 90 మంది నిపుణులైన ఈతగాళ్లను నియమిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా భక్తులకు నిరంతరం భద్రతా సూచనలు అందిస్తామని చెప్పారు. భక్తుల రవాణా కోసం ఈ నెల 28న ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు తెలిపారు. 29వ తేదీ తెల్లవారుజామున 3 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొండపైకి, కొండపై నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు. అదే రోజు కొండపై నుంచి దిగువకు భక్తులను తరలించేందుకు దేవస్థానం బస్సులతో పాటు 50 ఆర్టీసీ బస్సులను ఉచితంగా నడపనున్నట్లు వెల్లడించారు. మార్గమంతా నిరంతర వీధి దీపాల నిర్వహణతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### విజయవంతానికి భక్తుల సహకారం అవసరం

గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులు అధికారుల సూచనలు పాటించి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని హోం మంత్రి వంగలపూడి అనిత కోరారు. సముద్ర స్నానాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులు, వృద్ధుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, దేవస్థానం, పోలీస్, జీవీఎంసీతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన గిరి ప్రదక్షిణ కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

### 221 పాఠశాలలకు స్థానిక సెలవు

గిరి ప్రదక్షిణ సందర్భంగా ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని గోపాలపట్నం, చినగదిలి, సీతమ్మధార, పెందుర్తి మండలాల పరిధిలో గిరి ప్రదక్షిణ మార్గానికి సమీపంలోని 221 పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 28న స్థానిక సెలవు ప్రకటించినట్లు హోం మంత్రి వెల్లడించారు.

vsp9:vsp9.qxd 25-07-2026 21:32 Page 1






## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం : కలెక్టర్



**పాడేరు, జులై 25, ప్రభాతవార్త:**

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకా శాలు కల్పించడమే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం "లక్ష్యం - జిల్లా ఉపాధి సెల్" ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు.శనివారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని కలెక్టర్ పోస్టర్ను విడుదల చేసి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ కోసం "లక్ష్యం " అవకాశాలకు దిశ -నిర్దేశం ఉపాధికి భరోసా" అనే నినాదంతో కలెక్టర్ ఆఫీస్ కేంద్రంగా ఈ ఉపాధి సెల్ పనిచేస్తుందని, నిరుద్యోగ యువతీ యువకులు స్కిల్ డెవలప్మెంట్ అధికారుల ద్వారా నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని యువత నైపుణ్యాలను మెరుగుపరచి, వారికి సరైన శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కలెక్టర్ పేర్కొన్నారు. సంప్రదించా ల్సిన ఫోన్ నంబరు 9885507887, 9493417604 జిల్లాలోని అర్హులైన యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ భవిష్యత్తును బంగారు బాటగా మలచుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంతి పిలుపునిచ్చింది. కార్యక్రమం లో ఐటిడిఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి(పివిటిజి ) ఏం. వెంకటేశ్వరరావు, ఏపిఓ (జనరల్ )టి. మరతమ, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రశాంత్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2026-27కు దరఖాస్తులు



**పాడేరు,జులై25, ప్రభాతవార్త:**

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం) ఆధ్వర్యంలో ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2026-27 పోటీలకు అర్హులైన యువతీ యువకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి పేర్కొన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో జరిగిన వర్క్ షాప్ లో ఆమె ఐటీడీఏ ఏపీవో,స్కిల్ డెవలప్మెంట్ అధికారి , ఇతర అధికారులతో కలిసి ఈ పోస్టర్‌ను విడుదల చేసారు . అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులై నైపుణ్యం గల యువత ఈ కంపిటేషన్ పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.యువతలోని ప్రతిభను వెలికితీసి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వారి నైపుణ్యాలను నిరూపించుకునేందుకు ఈ పోటీలు ఒక అద్భుతమైన వేదిక అని కలెక్టర్ తెలిపారు. 63 విభాగాలలో ఈ పోటీలు నిర్వహించబడతా యన్నారు.రాష్ట్రంలోని నైపుణ్యం కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ కీర్తి ప్రతిష్టలను చాటాలని కలెక్టర్ ఈ పోస్టర్ రిలేజ్ చేస్తూ జిల్లా లో నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు.

## మద్యం మత్తులో విధులకు హాజరైన టీచర్ సస్పెన్షన్

**పాడేరు,జులై25,ప్రభాతవార్త:**

చింతపల్లి మండలం పినపాడు గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ ( పిటిఎం) కార్యక్రమానికి మద్యం మత్తులో హాజరైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు కె.వి.రమణను విధుల నుండి సస్పెండ్ చేసినట్లు అల్లూరి సీతారామరాజు కలెక్టర్ టి. నిషాంతి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నివాస పరిసరాల ప్రాంతాల్లో పిచికారీ చేయించుకోండి

**దుంబ్రిగుడ , జులై 25, ప్రభాతవార్త:**



నివాస గృహాల పరిసరాల ప్రాంతంలోని పిచికారీ పనులు చేయిస్తే వ్యాధుల నివారణకు తోడ్పాటునిచ్చే వాలవుతామని జిల్లా మలేరియా అధికారిణి తులసి అన్నారు. గుంటసీమ సచివాలయ పరిధి సోబురు, రంగిలిసింగి గ్రామాల్లో రెండో విడత పిచికారీ పను లను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా ప్రభావిత గ్రామాల్లో ముం దస్తుగానే పిచికారీ పనులను చేయించడం జరిగిందన్నారు.. దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నిరు పయోగంగా ఉండే పనికి రాని వస్తువులు, నీటి తొట్టెలు, పూల కుండీలు, డ్రమ్ముల్లో నీటి నిల్వ ఉంచకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. మలేరియా నిర్మూలనలో జిల్లా వ్యాప్తంగా ముందస్తు పిచికారీ నివారణతో వ్యాధుల ప్రభావాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంవో ధనుంజయ్, జిల్లా ఎంపీహెచ్ఇవో సుబ్రహ్మణ్యం, అరకు సబ్ యూనిట్ సిబ్బందితోపాటు ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 30న చింతపల్లి జిల్లా కౌన్సిల్, సమితి సమావేశం

**పాడేరు,జులై25,ప్రభాతవార్త:**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అల్లూరి సీతారామరాజు జిల్లా కౌన్సిల్, సమితి సమావేశం ఈనెల 30వ తేదీన చింతపల్లిలో నిర్వహిస్తున్నామని సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసులకు నిర్వాసితులు చేసే హైడ్రో పవర్ ప్రాజెక్ట్, బాక్సైట్, 1/70 చట్టం, జీవో నెంబర్ 3 సమస్యలపై భవిష్యత్ పోరాటాలు, పార్టీ అంతర్గత నిర్మాణం సుదీర్ఘంగా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఎస్ఐఆర్‌లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి

**పాడేరు,జులై25,ప్రభాతవార్త:**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల 100 శాతం పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియను 2026 జులై 24 నాటికి విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు.నిర్దేశిత గడువులోపు ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన ఎన్నికల నమోదు అధికారులు సహాయ ఎన్నికల నమోదు అధికారులు బూత్ స్థాయి అధికారులు సూపర్‌వైజర్లు ,ఎన్నికల విధుల్లో పాల్గొన్న అన్ని శాఖల అధికారులను జిల్లా ఎన్నికల అధికారి నిశాంతి అభినందించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయడంలో ప్రజల సహకారం ఎంతో కీలకమైందని పేర్కొంటూ, సహకరించిన ప్రతి ఓటరికి జిల్లా ఎన్నికల అధికారి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్‌కు అనుగుణంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో మిగిలిన ప్రక్రియలను కూడా అదే నిబద్ధతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## దుంబ్రిగుడలో తాగునీటి సౌకర్యానికి రూ.16 లక్షలు : ఎంపీటీసీ

**దుంబ్రిగుడ, జులై 25, ప్రభాతవార్త:**

దుంబ్రిగుడ గ్రామంలోని కింది వీధికి తాగునీటి సౌకర్యానికి రూ.16లక్షలు మంజూరయ్యాయని ఎంపీటీసీ సభ్యురాలు గీత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు పోతంగి పంచాయతీ హెడ్ క్వార్టర్ దుంబ్రిగూడ గ్రామంలో రక్షిత తాగునీటి పథకం ఉన్నపటికి, జాతీయ రహదారి విస్తరణతో మూడేళ్ల కిందట ప్రధాన లైనూ గొట్టాలు పూర్తిగా తొలగించారన్నారు. మూడేళ్లుగా కింది వీధి గిరిజన ప్రజానికం పడుతున్న ఇబ్బందులపై అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి రూ. 16లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే పనుల ప్రక్రియలో భాగంగా నిర్మాణ సామాగ్రిలను అందుబాటులో తీసుకొచ్చామని, పూర్తిస్థాయి పనుల ప్రక్రియను చేపట్టి ట్యాంకు నిర్మాణంతోపాటి ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

## ప్రమాద రహిత వారోత్సవాలు ప్రారంభం

**పాడేరు,జులై25,ప్రభాతవార్త:**



ఆర్టీసీ డ్రైవర్లు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రమాద రహిత ఆర్టీసీగా తీర్చి దుద్దాలని పాడేరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎస్.రామారావు పిలుపు నిచ్చారు.పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ పీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా ఈనెల 25వ తేదీ(శనివారం) 31వ తేదీ వరకు జరిగే ఈ ప్రమాద రహిత వారోత్సవాల సమావేశాన్ని ఏర్పాటు చేసారు.ఈ సమావేశానికి పాడేరు సిఐ రామారావు హాజరై ఆర్టీసీ కార్మికులను,డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు.సేఫ్టీ మీద దృష్టి పెట్టి డ్రైవర్లు బస్సులు నడపాలని అదేవిధంగా తన జీవితాంతం కూడా వాహనాలు నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించి అప్రమత్తంగా ఉండాలన్నారు.ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణికుల భద్రత ముఖ్యంగా ఉండాలన్నారు.ఆర్టీసీ సిబ్బందిప్రభుత్వానికి ,సంస్థకు మంచి పేరు తేవాలని సి ఐ రామారావు కోరారు.కార్యక్రమంలో పాడేరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కె.పాపి నాయుడు,ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాసరావు,డ్రైవర్లు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 'గిరిజన రైతుల ఆర్థిక అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

**అరకులోయ,జులై 25, ప్రభాతవార్త :**



గిరిజన రైతుల ఆర్థిక అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అరకులోయ నియోజకవర్గం ఏఎంసీ చైర్మన్ బొరి బొరి లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం లో గిరిజన రైతులకు 12 టన్నుల యూరియా బస్తాలను పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బొరి బొరి లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని, అగ్రికల్చర్ అధికారి ఫణి వర్మతో కలిసి 267 యూరియా బస్తాలను గిరిజన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గిరిజన రైతుల ఆర్థిక అభివృద్ధి కొరకు 12 టన్నుల యూరియా బస్తాలను మండలంలోని 9 పంచాయితీల గిరిజన రైతులకు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి అందజేసినట్లు తెలిపారు. 45 కేజీల యూరియా బస్తాను రైతులకు 270 రూపాయల చొప్పున పంపిణీ చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అగ్రికల్చర్ ఏఓ ఫణి వర్మ మాట్లాడుతూ అరకులోయ మండలంలోని 14 పంచాయతీలకు గాను 9 పంచాయతీల రైతులకు 12 టన్నుల యూరియా బస్తాలను పంపిణీ చేశామని , మిగిలిన పంచాయితీలకు గన్నెల లో పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి త్వరలోనే అందజేస్తామని చెప్పారు. యూరియాను మూడు విడతలగా రైతులు ఉపయోగించాలని, పంట సమయంలో రైతులు పాటించవలసిన సూచనలను తెలియజేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో గిరిజన రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల భద్రత, హక్కుల పై అవగాహన సదస్సు



**అరకులోయ, జులై 25, ప్రభాతవార్త :**

అరకులోయ ఏపీ టీ డబ్ల్యూ ఆర్ బాలికల పాఠశాలలో శనివారం బాలల భద్రత, హక్కులపై అల్లూరి జిల్లా స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కమిడి కృష్ణకుమారి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని , క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ గురించి వివరించారు . విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటూ మంచి క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించి తోటి వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. బాల్య వివాహాలు, డ్రగ్స్ , టీనేజ్ ప్రెగ్నెన్సీ, చైల్డ్ హెల్ప్ లైన్ తదితర వాటి గురించి క్లుప్తంగా విద్యార్థులకు తెలియపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి వెంకట నాయుడు , ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## రీ-సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపు

**గూడెంకొత్తవీధి, జులై 25, ప్రభాతవార్త :**



మండలంలోని పెదవలస పంచాయతీ రంపులు గ్రామంలో భూముల రీ-సర్వేపై వి.ఆర్.ఓ వి. సత్యమణి, డిప్యూటీ తహశీల్దార్ దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ దుమంతి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎలాంటి భూ వివాదాలకు తావు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఈ రీ-సర్వే ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ అధికారులకు సహకరించి, ఈ రీ-సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, మాజీ వైస్ సర్పంచ్ కంకిపాటి బాలయ్య పడాల్, వార్డు మెంబర్ పూజారి మంగ, త్రిమూర్తులు, దొరబాబు, బాలయ్య, గిరిజన వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పూజారి బాలరాజు, కంకిపాటి వీరన్నపడాల్, వి.ఆర్.ఓ వి. సత్యమణి, అగ్రికల్చర్ అసిస్టెంట్ మరియు రంపులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 30 వేల ఎకరాల్లో తోటలు, పండ్ల మొక్కలు నాటుతాం

**హుకుంపేట,జులై25,ప్రభాతవార్త:**



జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, హరిత విప్లవంలో భాగంగా హుకుంపేట మండలం సుకురు గ్రామంలో నిర్వహించిన భారీ వృక్షారోపణ (మొక్కలు నాటే) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిషాంతి. టి పాల్గొని స్వయంగా మొక్కలు నాటారు.వికసిత్ భారత్ -- గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం కింద పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నీడ నిచ్చే తోటలు పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని అల్లూరి జిల్లాలో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, జీవనోపాధుల భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో అల్లూరి జిల్లాలో సుమారు 30,వేల ఎకరాల్లో రూ.462 కోట్ల అంచనా వ్యయంతో (ఎకరానికి రూ 1,54,655) ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల భూముల్లో నీడ నిచ్చే తోటలు, పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్ రావు, మండల స్థాయి అధికారులు, తహశీల్దార్ తహ ముజీబ్, ఎంపీడీఓ రమాదేవి, ఏపీ ఏం లు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సంఘాల నాయకులతో
## 28న పాడేరులో హోంమంత్రి,ఇంచార్జి మంత్రి సమావేశం

**పాడేరు,జులై25, ప్రభాతవార్త:**

మంగళవారం ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నామని ఈ సమావేశానికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి,అల్లూరి జిల్లా ఇంచార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరుకానున్నారని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆదివాసీ సంఘాల నాయకులతో మంత్రులు సమావేశం నిర్వహించి ఆదివాసీ ప్రజల సంక్షేమం, వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలపై ప్రత్యక్షంగా చర్చించనున్నారన్నారు.ఆదివాసీ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టుకలెక్టర్ నిశాంతి స్పష్టం చేసారు.ఆదివాసీ సంఘాలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్నా పాడేరు శంకరన్ హాలులో ఈ సమావేశం మంగళవారం ఉదయం ఉదయం 10.00 గంటలకు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.సమావేశంలో మంత్రులు ఆదివాసీ సంఘాల నాయకుల అభిప్రాయాలు, సమస్యలు, సూచనలను తెలుసుకోనున్నారనీ ఆమె తెలిపారు సమావేశంలో జిల్లా కలెక్టర్ టి. నిషాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొంటారనీ కలెక్టర్ .నిశాంతి తెలియజేసారు.

## రిజిస్ట్రేషన్ చేసుకున్న కాఫీ రైతులకే ప్రభుత్వ రాయితీలు, సబ్సిడీలు



**గూడెంకొత్తవీధి , జులై 25, ప్రభాతవార్త :**

మండలంలోని అర్హులైన కాఫీ రైతులందరికీ ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, సబ్సిడీలు అందేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ కాఫీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) అయింతి కుమారి అధికారులను ఆదేశించారు.ఆమె జీకే వీధి మండలంలోని రింతాడ పంచాయతీ పరిధిలో గల కడుగుల, ముల్లుమెట్ట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కాఫీ రైతులతో ప్రత్యేకంగా సమావేశమై, 'ఈ-పంట' నమోదు మరియు 'ఇండియా కాఫీ రిజిస్ట్రేషన్' ప్రక్రియలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. జీకే వీధి మండలంలో కాఫీ సాగు చేస్తున్న రైతుల వివరాలను తప్పనిసరిగా ఈ-పంట పోర్టల్‌లో నమోదు చేయించాలన్నారు. అలాగే అటవీ హక్కుల పత్రాలు), రెవెన్యూ పట్టాలు కలిగిన ప్రతి ఒక్క రైతు తమ వివరాలను 'ఇండియా కాఫీ రిజిస్ట్రేషన్' యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్న వారికి మాత్రమే కాఫీ బోర్డు, ఐటీడీఏ ద్వారా అందే సబ్సిడీలు, రాయితీలు లభిస్తాయని ఆమె స్పష్టం చేశారు.

## గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : సియ్యారి

**అరకులోయ, జులై 25, ప్రభాతవార్త :**



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా వేదిక (గ్రీవెన్స్) నిర్వహించడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. శనివారం అరకులోయలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను తెలియజేశారు. ముఖ్యంగా కర్సలగుడ పంచాయతీ పరిధిలో టి వి టి సి గ్రామాలకు సిసి రోడ్లు నిర్మించాలని, కొన్ని గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రీవెన్స్‌లో విన్నవించారు. ప్రధానంగా నూతన పెన్షన్లు మంజూరు చేయాలని గ్రీవెన్స్ లో వినతులు అందజేశారు. తాగునీటి సమస్య ఎక్కడ తలెత్తినా వాటిని వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా చైర్మన్ దొన్ను దొర సంబంధిత అధికారులకు ఫోన్ లో ఆదేశించారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదని, ఎట్టి పరిస్థితుల్లో గ్రీవెన్స్ లో దానిపై వినతులు ప్రజల నుంచి రావడానికి వీలు లేదన్నారు. ప్రతి గ్రామంలో స్వయంగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పర్యటించి తాగునీటి సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. దీంతో పాటు పి వి టి జి గ్రామాలలో గృహ నిర్మాణాల ప్రక్రియ వేగవంతం అధికారులు కృషి చేయాలన్నారు. ఇల్ల నిర్మాణానికి ఎదురవుతున్న ఇబ్బందులను ముందుగానే గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బొరి బొరి లక్ష్మి , టిడిపి మండల మహిళా నాయకులు ద్రౌపతి, ఆనంద్, చందు పాడి పాల్గొన్నారు.

## ఇంటింటికి వెళ్దాం - అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిద్దాం
### క్యాడర్ సమావేశంలో దొన్నుదొర



**అరకు రూరల్, జులై 25, ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సూపర్ 6తో పాటు అనేక హామీలను నెరవేర్చిందని, వీటిని ప్రజలకు వివరించేందుకు ఈనెల 27వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్దామని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, ఏ పి ఎస్ ఆర్ టి సి విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. అరకులోయ లోని తన క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఈనెల 27వ తేదీ నుంచి ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించిందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ రెండేళ్ల కాలంలో ఏ ఇంట్లో ఎంతవరకు మేలు జరిగిందనే విషయాన్ని తెలుసుకొని వారికి వివరించాలన్నారు. వాస్తవానికి చెప్పిన హామీలు మాత్రమే కాకుండా చెప్పని వాటిని కూడా కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల కాలంలో నెరవేర్చిందన్నారు. గిరిజనులకు ఎన్నడూ లేని విధంగా మౌలిక సదుపాయాల కల్పనలో అత్యధిక నిధులను వెచ్చిస్తుందన్నారు. ఇది చారిత్రక రికార్డ్ అని పేర్కొన్నారు. ఒకపక్క సంక్షేమాన్ని అమలు చేస్తూనే మరోపక్క ప్రతి గ్రామానికి రహదారులు నిర్మిస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. సికిల్ సెల్ అనేమియాతో బాధపడే వారందరికీ పెన్షన్ ఇస్తూ వారికోసం ప్రత్యేకంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అరకు లో బ్లడ్ బ్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వీటితోపాటు ఉచిత బస్సు సౌకర్యం, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఫీజు రియంబర్స్మెంట్ వంటి అనేక హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని ఇది ప్రజలకు వివరించాల్సిన బాధ్యతుందన్నారు. కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలని కోరారు.

## అటవీ భూమి కేటాయింపు పూర్తిగా చట్ట విరుద్ధం
### ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పల నరస

**పాడేరు, జులై 25, ప్రభాతవార్త;**



ఆలూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి డివిజన్‌లోని గిరిజన ప్రాంతాల్లో ఏపీ జెన్ కో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ కోసం సీలేరు లో 128.61 హెక్టార్ల అటవీ భూమిని లాక్కుంటూ జారీ చేసినజి.ఓ.ఎం. ఎస్.నం. 29 (24-07-2026) ను మేం తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నరస అన్నారు.శనివారం పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో పి. అప్పల నరస మాట్లాడుతూ...ఇది కేవలం భూమి మళ్లింపు కాదు. ఇది 5వ షెడ్యూల్డ్ ఏరియాలో నివసించే ఆదివాసీల జీవితాలు, జీవనోపాధి, సంస్కృతి, అటవీ హక్కులపై నేరుగా జరిగిన దాడి. గిరిజనుల గొంతును అణచివేసి, చట్టాలను తొక్కివేసి తీసుకువస్తున్న ఈ నిర్ణయాన్ని మేం ఎన్నటికీ అంగీకరిం చం అని అప్పలనరస స్పష్టం చేసారు. మరో పక్క సిఏం 1/70 చట్టం పై అనుమానం వద్దని ప్రకటించిన రెండొవ రోజే హామీ నీ విస్మరించి ఆదివాసీ ప్రజలను మోసం చేస్తున్నారు. దొడ్డి దారిలో అనుమతి ఇస్తున్న గిరిజన సలహా సలహా మండలి (టి ఎ సి ) ప్రేక్షక పాత్ర పోషించడం దారుణమన్నారు. కార్యక్రమం లో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధ కృష్ణ, గిరిజన సంఘం జిల్లా గిరిజన సంఘం జిల్లా నాయకులు వంతల దాసు, జీవో నెంబర్ 3 రిజర్వేషన్, 1/70 చట్టం పరిరక్షణ సాధన కమిటీ జిల్లా నాయకులు గంప రాయి భాను సిహెచ్ రావు, బత్తిరి నరేష్, పాంగి చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**పాడేరు,జులై25,ప్రభాతవార్త:**

పాడేరు పూర్ణపుష్కల అయ్యప్ప స్వామి దేవాలయంలో కొలువై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం నుండి విష్ణు సహస్రనామం గోవింద నామ పారాయణం 5:30 నుండి 6 గంటల 30 నిమిషాల వరకు సరస్వతి సంగీత విద్యా నిలయం వారిచే అన్నమయ్య కీర్తన లు పారాయణ ఆరు గంటల నుండి 7:30 వరకు స్వామివారికి అష్టోత్తర పూజ మంగళహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అధిక సంతలో వచ్చిన భక్తులకు ప్రసాద పంపిణీ చేసారు.ఈ ప్రత్యేక పూజా పారాయణ కార్యక్రమాలు ఆలయ ధర్మ కర్త కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

## ఎల్.ఈ.డి స్క్రీన్‌ను ప్రారంభించిన కలెక్టర్ నిశాంతి





**పాడేరు,జులై 25, ప్రభాతవార్త:**

విజయనగరం జిల్లా భోగాపురంలో నూతనంగా నిర్మించిన ప్రతిష్టాత్మక అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్" ను ఆగస్టు 1వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు, రానున్న సందర్భంగా ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న ముమ్మర ఏర్పాట్లను, ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు తిలకించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్ ను జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ష శనివారం పాడేరు పాత బస్సు స్టాండ్ కూడలిలో అన్నా క్యాంటీన్ ఎదురుగా ఏర్పాటుచేసిన ఏర్పాటు చేసిన ఎల్ ఈడి స్క్రీన్ ను ప్రారంభించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఈడి స్క్రీన్ ప్రదర్శన వీక్షించేందుకు విచ్చేసే ప్రజలు, సందర్శకులు ప్రారంభోత్సవ దృశ్యాలను స్పష్టంగా వీక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార ఎల్.ఈ.డి స్క్రీన్ ద్వారా శనివారం నుండి ఆగస్టు 1 వ తేది వరకు నిరంతరం ప్రత్యక్ష ప్రచారం జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో విమానాశ్రయ ప్రాంగణంలో జరుగుతున్న కార్యక్రమలు ఎప్పటికప్పుడు ప్రజలు విక్షించేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరూ స్పష్టంగా చూసేలా ఎయిర్‌పోర్ట్ పరిసరాలతో పాటు ప్రధాన కూడలి లో భారీ ఎల్.ఈ.డి స్క్రీన్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రచారాన్ని అంతరాయం జరగకుండా విద్యుత్ శాఖ, బిఎస్ఎన్ఎల్ వారిని తాగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఎల్ ఈ డి ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి అన్నమా, పాడేరు మండల తహసిల్దార్ శ్రీనివాసరావు, డివిజనల్ పవర్ సంబంధిత అధికారి వెంకట్రావు, బిజెపి జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి పెనియా ర్, ఎన్ఆర్ఐ కన్వీనర్ సల్ల రమణ, గిరిజన మోస అధ్యక్షుడు లకె అబ్బాయి దొర, ఉత్తరాంధ్ర ఎస్టీ సెల్ జోనల్ ఇంచార్జ్ లకే భాస్కరరావు, లీగల్ సెల్ బిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు బి ఎస్ ఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీతో సమీక్షా సమావేశం

అనకాపల్లి, జూలై 25,ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీతో సమీక్ష సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, మందుల లభ్యత, సిబ్బంది కొరత, ఆసుపత్రి ఆధునీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, డి.సి.హెచ్.ఎస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అనకాపల్లి ఎల్లయ్య గ్రోయిన్ ప్రారంభం

### 1,500 ఎకరాలకు సాగునీటి భద్రత

అనకాపల్లి, జూలై 25, ప్రభాతవార్త



అనకాపల్లి నియోజకవర్గ రైతులకు ఇచ్చిన హామీ మేరకు శారదా నదిపై తుమ్మపాల గ్రామ సమీపంలోని ఎల్లయ్య గ్రోయిన్ మరమ్మత్తు పనులు డీఎంఎఫ్టీ నిధులతో రూ.1.19 కోట్ల వ్యయంతో పూర్తి చేసి శనివారం ప్రారంభించారు. ఈ పనుల ద్వారా సుమారు 1,500 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం కలగనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ , జిల్లా కలెక్టర్ విజయ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. డీఎంఎఫ్టీ, ఇరిగేషన్ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో డీసిల్టింగ్, కాలువల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరి ఉత్తరాంధ్రలో లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. అలాగే, ఉత్తరాంధ్రలో పరిశ్రమలు, డేటా సెంటర్లు, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, మూతపడిన షుగర్ ఫ్యాక్టరీల స్థానంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, రైతులు, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## అనకాపల్లిలో వైభవంగా శ్రీ జగన్నాథ స్వామివారి తిరుగు రథయాత్ర ప్రారంభం

అనకాపల్లి, జూలై 25,ప్రభాతవార్త



అనకాపల్లి గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్రా-బలభద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవంలో భాగంగా, గుడ్స్ రోడ్ ఇంద్రజ ముని హాల్ లో నవరాత్రి ఉత్సవాలు పూర్తి చేసుకున్న అనంతరం శనివారం తిరుగు రథయాత్ర వైభవంగా ప్రారంభమైంది. ఉదయం స్వామివారు భక్తులకు కల్కి అవతారంలో దివ్య దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వామివారిని సుందరంగా అలంకరించిన రథంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ తిరుగు రథయాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.చంద్రతేజ, ఆలయ ధర్మకర్తలు బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భుగాతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వి.వి. సుబ్రహ్మణ్యం, బొడ్డేడ వెంకట చలపతిరావు, కూటమి నాయకులు, భక్తులు ప్రముఖులు పాల్గొన్నారు.

## 500 కోట్ల జల్ జీవన్ మిషన్ మంజూరుపై కూటమి నాయకులు హర్షం

### సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, స్పీకర్ అయ్యన్న చిత్రపటాలకు క్షీరాభిషేకం

గొలుగొండ, జూలై 25 ప్రభాతవార్త



శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కృషితో నియోజవర్గం మొత్తం జల్ జీవన్ మిషన్‌గా 500 కోట్లు మంజూరు చేసి ప్రతి గ్రామానికి తాగునీరు అందించే ప్రాజెక్టును మంజూరైన సందర్భంగా మండల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ విజయోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కూటమి నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలియజేశారు. నిత్య కృషివల్యుడుగా నియోజకవర్గం ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా ఉండిపోతుంది అన్నారు. ఎన్నో ఏళ్లగా నియోజవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలకు ఇకపై పూర్తిస్థాయి పరిష్కారం దొరుకుతుందని ప్రతి ఇంటికి నేరుగా తాగునీరు అందేందుకు ఈ భారీ ప్రాజెక్టు దావత్ పడుతుందని నాయకులు అన్నారు. ఒక నియోజక వర్గంలో అన్ని గ్రామాలకు తాగునీటి పథకాన్ని ఇంత పెద్ద స్థాయిలో మంజూరు చేసిన ఘనత స్పీకర్ దక్కుతుందని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లతో ప్రత్యేకంగా మాట్లాడి ప్రజల దశాబ్దాల కల నెరవేర్చేందుకు రూ.500 కోట్లు సాధించడం అయ్యన్నపాత్రుడి నాయకత్వానికిలో అరుదైన మైలురాయిగా చెప్పవచ్చు అన్నారు. నాతవరం, మాకవరపాలెం మండలాల ప్రజల తరపున స్పీకర్ అయ్యన్నపాత్రుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకల్లో టీడీపీ జిల్లా పార్లమెంట్ కన్వీనర్ అడిగర్ల అప్పలనాయుడు, జోన్ 1 ఇంచార్జ్ ఆధపురెడ్డి గోపాలకృష్ణ, జూన్ 2 ఇంచార్జ్ కొల్లు రాంబాబు, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి, భీమిరెడ్డి సత్యనారాయణ, మాజీ డైరెక్టర్ కోళ్లు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి, ,27 గ్రామ పంచాయతీల గ్రామ పార్టీల అధ్యక్షులు, తెలుగు యువత అధ్యక్ష, ఉపాధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.10 కోట్లతో బవులవాడలో రోడ్లు, డ్రైనేజీ పనుల ప్రారంభం

### ప్రజల భద్రత, అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, జూలై 25, ప్రభాతవార్త




అనకాపల్లి నియోజకవర్గంలోని బోగులవాడ గ్రామం వివీ రమణ కాలనీలో జిల్లా ఖనిజ అభివృద్ధి నిధి ద్వారా రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను శనివారం మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటి కార్యక్రమం చేపట్టారు.అనకాపల్లి పట్టణంలో క్రషర్ మెటీరియల్ రవాణా చేస్తున్న భారీ క్వారీ లారీల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడం, పలువురు ప్రాణాలు కోల్పోవడం, రహదారులు దెబ్బతినడం, విజయరామరాజుపేట వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి పలుమార్లు భారీ వాహనాల ఢీకొనడంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడడం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి కొణతాల రామకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అనకాపల్లి-చోడవరం రహదారి నుంచి మాకవరం జంక్షన్ వరకు వివీ రమణ కాలనీ మీదుగా సీసీ రహదారిని నిర్మించడం ద్వారా బవులవాడ, మాటూరు, సీహెచ్ఎన్ అగ్రహారం తదితర మైనింగ్ ప్రాంతాల నుంచి వచ్చే భారీ క్వారీ లారీలను పట్టణంలోకి రాకుండా మళ్లించే అవకాశం కలిగింది. వీవీ రమణ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పూర్తికావడంతో స్థానికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ఈ అభివృద్ధి పనుల పట్ల కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## రూ.500 కోట్ల తాగునీటి నిధుల సాధనపై స్పీకర్ అయ్యన్నపాత్రుడికి ధన్యవాదాలు

### ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం

మాకవరపాలెం జులై 25 ప్రభాతవార్త



నర్సీపట్నం నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల అయిన శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ఏకంగా రూ.500 కోట్ల భారీ నిధులను సాధించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడికి తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఘనంగా కృతజ్ఞత లు తెలిపారు. ఈమేరకు శనివారం మాకవరపాలెంలో మండల టిడిపి అధ్యక్షులు ఆర్ వై పాత్రుడు, ఇతర నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నియోజకవర్గ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒకే ఒక్క మంచినీటి ప్రాజెక్టుకు రూ.500 కోట్లు తీసుకురావడం ఆయన దూరదృష్టి, నాయకత్వ పటిమకు నిదర్శనమని పేర్కొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్.వై. పాత్రుడు,నాయకులు అల్లురామునాయుడు, రుత్తల నందకిషోర్, అడిగర్ల శ్రీనివాసరావు వబ్బలరెడ్డి శివ, చిటికిల రాంప్రసాద్, లాలం రాము,చిరంజీవిరాజు సింగంపల్లి రమణ, వబ్బలరెడ్డి గోవింద,సిద్దభత్తుల శ్రీను, పోతల రాంబాబు,శంకరావు, తాతబాబు,శీరంరెడ్డి రమణ,అధిక సంఖ్యలో కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ జగన్నాథుడి తిరుగు రథయాత్ర

కసింకోట, జూలై 25, ప్రభాతవార్త;



మండల కేంద్రమైన కసింకోటలో శనివారం ఘనంగా సుభద్ర బలబద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామి వారి తిరుగు రథయాత్ర ఘనంగా జరిపారు. శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర వారోత్సవాలు స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో శ్రీమన్ రేజేటి రామాచార్యులు సారధ్యంలో రేజేటి మారుతి, కన్నబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు, భజనలు, కోలాటాలు, తోడపెత్తు సేవ వంటి పలు సంస్కృతిక కార్యక్రమాలతో కసింకోట పురవీధులలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని జగన్నాథ స్వామి వారి తిరుగు రథయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, రెడ్డి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యుత్ సమస్యలపై వినతి

అనకాపల్లి, జులై 26, ప్రభాతవార్త



అనకాపల్లి ప్రాంత రైతాంగ విద్యుత్ సమస్యలపై అనకాపల్లి వ్యవసాయ దార్ల సంఘం ప్రతినిధులు అనకాపల్లి (ఎపి ఇ పి డి సి ఎల్ ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ ని శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ప్రస్తుతం రైతులకు ఇస్తున్నటువంటి ఉచిత విద్యుత్ గత ప్రభుత్వం వారు వేసిన మీటర్ల ప్రకారం ఆ యొక్క మీటర్లో ఉన్న రీడింగ్ తీసి అధిక మొత్తంలో కరెంట్ బిల్లులు ఇస్తున్నారని,దీనివలన రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలా కాకుండా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వారు ఆ బిల్లును రద్దుచేయు చర్యలు తీసుకొని గతంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్కీం ప్రకారం మీటర్ చార్జీలు మాత్రమే రైతుల నుండి వసూలు చేయాలని అధికారులును కోరారు. ఈ విషయం పై ప్రభుత్వం వారి దృష్టి లో పెట్టి, ప్రభుత్వం నుండి సానుకూల స్పందన వచ్చే వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఆపకుండా, రైతులను ఆదుకోవాలని కోరారు. కొత్తగా వ్యవసాయ కలెక్షన్స్ కోసం వచ్చిన రైతులకు ఇబ్బందులు లేకుండా మంజూరు చేయవలసిందిగా కోరుచూ అనకాపల్లి ప్రాంత వ్యవసాయ విద్యుత్ సమస్యపై ప్రభుత్వ దృష్టిలో పెట్టి తగిన పరిష్కార మార్గం చూపాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విల్లూరి రాము, సారిపల్లి లోకేష్, పెంటకోట వర ప్రసాద్, సిలపరిశెట్టి బాబి పాల్గొన్నారు.

## రక్తహీనత నిర్మూలనకు పోషకాహారమే మార్గం

### ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ల లీలారాణి - ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం-70 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు.. పోషకాహార కిట్ల పంపిణీ

ఎలమంచిలి, జూలై 25, ప్రభాతవార్త



మహిళలు, గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు రక్తహీనతను నివారించేందుకు పోషకాలతో కూడిన ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలనిఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ల లీలారాణి తెలిపారు. రాంబిల్లి మండలం గోవిందపాలెం గ్రామంలో శనివారం ఫౌండేషన్, రోటరీ క్లబ్ విశాఖపట్నం, అంగన్‌వాడీ బృందం సంయుక్త ఆధ్వర్యంలో "అనీమియా ముక్త్ భారత్" (రక్తహీనత రహిత భారత్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 70 మందికి పైగా మహిళలకు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించి, రక్తహీనత స్థాయిని పరీక్షించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, అనుసరించాల్సిన ఆరోగ్య నియమాలపై నిపుణులు అవగాహన కల్పించారు. శిబిరానికి హాజరైన మహిళలకు పోషకాహార కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సరోజిని, న్యూట్రిషనిస్టులు మాధురి, క్రాంతి, జీఎన్ఎం భాగ్యలత, ఫౌండేషన్ బృంద సభ్యులు పాల్గొన్నారు.రోటరీ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షుడు ఎన్.వంశీ మోహన్, రొటేరియన్లు రామనారాయణ, బి. మధు (పాస్ట్ ప్రెసిడెంట్) పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటన విజయవంతం చేయాలి

### ప్రతి ఒక్కరూ వీక్షించి చారిత్రాత్మక ఘట్టంలో భాగస్వామ్యం కావాలి : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి, జూలై 25, ప్రభాతవార్త



విజయనగరం జిల్లాలో, అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న భారత ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేస్తున్న సందర్భంగా ఆయన పర్యటనకు సంబంధించిన సమయాన్ని, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు, ప్రత్యక్షంగా తిలకించేందుకు జిల్లాలో స్థానిక నెహ్రూ చౌక్ వద్ద గల నాలుగు రోడ్ల జంక్షన్ కూడలిలో డిజిటల్ ఎల్ఈడీ డిస్ప్లే ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం ప్రకటన విడుదల చేశారు. దేశంలోనే అత్యంత ఆధునీకరణతో, సువిశాలమైన విమానాశ్రయం ఉత్తరాంధ్రలో నెలకొల్పడం ఒక చరిత్రని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ డిజిటల్ డిస్ప్లేలో ప్రధానమంత్రి పర్యటన సమయం, ప్రారంభోత్సవ కార్యక్రమ వివరాలు, ప్రత్యక్ష ప్రసారానికి సంబంధించిన సమాచారం నిరంతరం ప్రదర్శించబడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ సమాచారాన్ని తెలుసుకొని అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం అనే చారిత్రాత్మక ఘట్టాన్ని వీక్షించాలని కలెక్టర్ కోరారు. ప్రజలకు కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించడం, ప్రధానమంత్రి పర్యటన సమయాన్ని సకాలంలో తెలియజేయడమే లక్ష్యంగా జిల్లాలో డిజిటల్ డిస్ప్లేను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని వీక్షించి ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## తొలి ఏకాదశి... పల్లకి సేవలో దర్శనమిచ్చిన కోదండ రాముడు

గొలుగొండ జులై 25 ప్రభాతవార్త



తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జానకిరాంపురం శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తుల పల్లకి సేవ కార్యక్రమం ప్రారంభించి, పక్క గ్రామమైన నర్సింగ్ పల్లి నుండి సీతారాముల ఉత్సవ విగ్రహాల పల్లకి సేవ తోడై గ్రామాల్లో పర్యటించారు. శ్రీ కోదండ రామస్వామి ఉత్సవమూర్తులు జానకిరాంపురం, కొత్త జోకంపేట, జోగుంపేట కూడలి, ద్వారకానగరం సాయిబాబా దేవాలయం వరకు పల్లకి ఉత్సవం సాగింది. గ్రామ గ్రామాన తొలి ఏకాదశి పూజలు అందుకుంటూ స్వామివారి పల్లకి సేవ భక్తిశ్రద్ధలతో సాగింది. శ్రీ కోదండరామస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి ఏకాదశి పల్లకి సేవ కార్యక్రమం ఆజాంతం భక్తుల ప్రత్యేక పూజలు భజనలతో ఈ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.

## యాక్షన్ తెసా కంపెనీలో ప్రమాదం - ఎత్తి నుంచి పడి వెల్డర్‌కు తీవ్ర గాయాలు


రాంబిల్లి, జులై 25, ప్రభాతవార్త

కృష్ణం పాలెం గ్రామ పరిధిలోని యాక్షన్ తెసా కంపెనీలో పనిచేస్తున్న వెల్డర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఎత్తి నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడినాడు. ఈ ఘటనపై రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన బొద్దపు శివసంతోష్ (35) జీ.కే ఫైర్ అండ్ సేఫ్టీ సంస్థ ద్వారా ఈ ఏడాది జూన్ నెల నుంచి యాక్షన్ తెసా కంపెనీలో వెల్డర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈనెల 23వ తేదీ సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో కంపెనీలో ఫ్యాబ్రికేషన్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు సుమారు పది అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోయాడు దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కంపెనీ సేఫ్టీ సూపర్వైజర్ రామకృష్ణ సహ ఉద్యోగుల సహాయంతో బాధితుని అచ్చుతాపురంలోని పవన్ సాయి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో బాధితుడి వెన్నుముక (స్పైయిన్) కు కంప్రెషన్ ఫ్రాక్చర్ అయినట్లు నిర్ధారించారు. గాయం తీవ్రత దృష్ట్య శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు సూచించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి 24వ తేదీన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి ఎమ్ ఎల్ సి స్టేట్మెంట్ ను రాంబిల్లి పోలీసులు నమోదు చేసుకున్నారు. అనంతరం బాధితుడు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో 25వ తేదీ ఉదయం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం ఎలా జరిగింది కంపెనీలో కార్మికుల భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా, రక్షణ పరికరాలు వినియోగించారా వంటి అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అలాగే ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు అనంతరం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు స్థానిక సిఐ సిహెచ్. నరసింగరావు తెలిపారు.

## గోవిందపాలెంలో గర్భిణీలకు పోషకాహార కిట్లు

### విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు- రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

రాంబిల్లి, జులై 25, ప్రభాతవార్త



రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో రాంబిల్లి మండలం గోవిందపాలెం గ్రామంలో శనివారం పలు సామాజిక సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు పోషకాహార లోపాలను నివారించే లక్ష్యంతో న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. గర్భిణీల ఆరోగ్య పరిరక్షణ తల్లి-శిశువు సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించి చికిత్స అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు వంశీ మోహన్ మాట్లాడుతూ సమాజసేవే రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను ప్రజలకు చేరవేయడం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆమె సహకారంతో న్యూట్రిషన్ కిట్లు, రక్త పరీక్షలు, ఇతర ఆరోగ్య పరీక్షలను విజయవంతంగా నిర్వహించగలిగామని రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాంబిల్లి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ సంతు, గ్రామ పెద్దలు, పంచాయతీ ప్రతినిధులు, అంగన్వాడి సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు, లీఫ్ ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని గ్రామస్తులు కోరారు.




## కృష్ణంపాలెం నిర్వాసితులకు నూటికి నూరు శాతం న్యాయం చేయాలి

### స్థానికులకు పునరావాసం, ఉపాధి కల్పించకపోతే భారీ ఆందోళనలు -వైఎస్ఆర్సీపీ మండల అధ్యక్షుడు కిషోర్ రాజు హెచ్చరిక

రాంబిల్లి, జులై 25, ప్రభాతవార్త



కృష్ణంపాలెంలో బాలాజీ యాక్షన్ తెసా పరిశ్రమ ఏర్పాటు తో ప్రభావితమైన నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం నూటికి నూరుశాతం న్యాయం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాంబిల్లి మండల అధ్యక్షుడు కిషోర్ రాజు డిమాండ్ చేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించడం తోపాటు అర్హులైన స్థానిక యువతకు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. పరిశ్రమ ఏర్పాటుకు ముందు సుమారు 70 నుంచి 100 నిర్వాసిత కుటుంబాలకు తగిన పునరావాసం కల్పించాలని అప్పటి ప్రజాప్రతినిధులు గుడివాడ అమర్నాథ్, కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులకు పలుమార్లు స్పష్టం చేసినప్పటికీ ఆ హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని అన్నారు. నిర్వాసిత కుటుంబాలు తమ హక్కుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం కూడా సమస్యకు పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. హైకోర్టు కమిషన్ స్వయంగా ప్రాంతాన్ని పరిశీలించినప్పటికీ నిర్వాసితులను బలవంతంగా కాలిచేయించే ప్రయత్నాలు జరగడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఉధృత పరిస్థితుల్లో గాయపడి ఫ్రాక్చర్‌తో చికిత్స పొందుతున్న నిర్వాసితురాలు రాజన లక్ష్మిని కిషోర్రాజు, ఎలమంచిలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు చేపల గోవింద్ పరామర్శించారు. భూములు కోల్పోయిన ప్రతి నిర్వాసిత కుటుంబానికి సముచిత పునరావాసం కల్పించడంతోపాటు అర్హులైన ప్రతి స్థానిక యువకుడికి పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లోగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, కంపెనీ యాజమాన్యం చొరవ తీసుకొని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని లేనిపక్షంలో జిల్లా, రాష్ట్రస్థాయి పార్టీ నాయకుల భాగస్వామ్యంతో భారీ ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నిర్వాసితుల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడుతామని కిషోర్ రాజు స్పష్టం చేశారు.

## ఆరవ రోజు కొనసాగిన దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్

(నక్కపల్లి,ప్రభాతవార్త)



నక్కపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ కార్యక్రమం శనివారం నాటికి ఆరవ రోజుకు చేరింది. ఈ నిరసన కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొంగర చిన్నకృష్ణమూర్తి, అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎన్ వి రమణ, ట్రెజరర్ లోవరత్నం, జాయింట్ సెక్రటరీ డిఎంపి కుమార్, త్రినాధ్ ,నవీన్ ,ముద్దా బాబ్జి, సాయి తేజ, మదీనా, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపమాక వెంకన్న సన్నిధిలో తహాశీల్దార్ చిన్నికృష్ణ

నక్కపల్లి,ప్రభాతవార్త



తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో తాసిల్దార్ చిన్నికృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

## చంద్రబాబు నమ్మిన బంటు

### లోకేష్‌కు ప్రీతి పాత్రుడు : మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ .. నేడే జన్మదిన వేడుకలు

అనకాపల్లి, జులై 25, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆపార్టీ పట్ల అత్యంత విదేయతతో మెలుగుతున్న విశాఖ ఉమ్మడి జిల్లాలోని అతి కొద్ది మంది నేతలలో అనకాపల్లికి చెందిన మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగజగదీశ్వర రావును ప్రముఖంగా పేర్కొనవచ్చు. సామాన్య కార్యకర్తగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పట్ల వీరాబిమానంతో 1983లో రాజకీయ అరంగ్రేటం చేసిన జగదీశ్ అప్పటి నుండి ఇప్పటి పసుపు వస్త్ర దారణను విడువక పోవడం ఇందుకు సంకేతంగా పేర్కొనవచ్చు. నాగజగదీష్ జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 1985 లో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కు అత్యంత విదేయత కలిగిన నేతగా మెలుగుతూ అనకాపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా తొలిసారి సంస్తాగత పదవిని చేపట్టి సుదీర్ఘ కాలం పాటు పట్టణ పార్టీ అధ్యక్షులుగా సమర్దవంతమైన పాత్ర నిర్వహించారు. దాడి వీరభద్రరావు ప్రోత్సాహంతో నూకాంబికా దేవాలయట్రస్టీ బోర్డు చైర్మన్‌గా సుదీర్ఘ కాలంపాటు పనిచేసి దేవాలయ అభివృద్ధి లో కీలకపాత్ర వహించారు.మున్సిపల్ కౌన్సిలర్ గా విశాఖ నగర అభివృద్ధి సంస్థ డైరక్ట ర్ గా అనకాపల్లి ప్రాంత అభివృద్ధి కి కృషి చేశారు. 2014 ఎన్నికల సమయంలో తన రాజకీయ గురువు వీరబద్రరావు వైసిపి లో చేరిన సందర్బంలో జగదీష్ ఆయన వెంట వెల్లడానికి నిరాకరించి తెలుగు దేశం పార్టీలో ఉండి పోవడం ద్వారా పార్టీ అధినేత చంద్రబాబుకు బాగా దగ్గరయ్యారు. విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులుగా జదదీశ్ పార్టీ పటిష్టతకు చేసిన కృషికి గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారు. జగన్ ప్రభుత్వంలో శాసనమండలి రద్దు బిల్లును శామండలిలో వ్యతిరేకించడంలో జగదీష్ పోరాట పటిమను అప్పటి ఎమ్మెల్సీ నారాలోకేష్ ఇప్పటికి పలు సందర్భాల్లో కొనియాడుతుంటారు. ప్రస్తుతం తెలుగు దేశం పార్టీ రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి గా పార్టీ అధినేత చంద్రబాబు అప్పగించిన బాధ్యతలను సమర్దవంతంగా నిర్వహిస్తారనే గుర్తింపు ఉంది.అధికారం ఉన్నా లేక పోయినా సామాన్య కార్యకర్త సాయి నుండి ఎమ్మెల్సీ పదవి చేపట్టినా పసుపు వస్త్రాలతో కనిపించడం ద్వారా తన ప్రత్సేకతను చాటుకంటారనడం అతిశయోక్తి కాదు. పెదవులతో పనిలేకుండా అధినేత చంద్రబాబు ఆదేశమే తనకు శిరోదార్యమని బుద్ద నాగజగదీశ్ అంటున్నారు.

## శేష పాన్పు అవతారంలో జగన్నాథ స్వామి

చోడవరం, జులై 25, ప్రభాతవార్త



చోడవరంలో జరుగుతున్న శ్రీ జగన్నాథ స్వామి వారి రథోత్సవ కార్యక్రమంలో భాగంగా దశావతారంలో చివరిదైనా శేష పాన్పు (రంగనాథ ) స్వామి వారి అలంకరణలో జగన్నాథుడు శనివారం దర్శనమిచ్చారు. అందున తొలి ఏకాదశి శనివారం కావడంతో రంగనాథ్ అవతారంలో గల స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పది రోజులు పాటు ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తుల ఆదర అభిమానాలతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్టు ఆలయ అర్చకులు సుదర్శనం సీతారామచార్యులు తెలిపారు.





## ఆర్థిక ఒత్తిడితో యువకుడి బలవన్మరణం

ఆనందపురం, జూలై 24, ప్రభాతవార్త:

ఆర్థిక ఇబ్బందులతో మానసిక ఆందోళనకు గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ఆనందపురం మండలం శొంట్యాం జగనన్న కాలనీలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శొంట్యాం జగనన్న కాలనీకి చెందిన కోరుకొండ హేమంత్ కుమార్ (27) కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుమారు 9.45 గంటల సమయంలో ఇంటికి వచ్చిన హేమంత్ కుమార్ స్నానం చేసిన అనంతరం భోజనానికి రాకపోవడంతో తల్లి కోరుకొండ అప్పలకొండ (47) గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు వెంటనే చీరను కోసి హేమంత్ కుమార్‌ను కిందకు దించారు. హేమంత్ కుమార్ ప్రాణాలతో ఉన్నాడని భావించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి హేమంత్ కుమార్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు కొంతకాలంగా తీవ్ర ఆర్థిక ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని వారు పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోరుతూ మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఆనందపురం ఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. శవపంచనామా నిర్వహించి, సంఘటనకు గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రూ.2.38 కోట్ల నష్టపరిహారం మంజూరు చేయాలి..జగన్నాధపురం రైతుల డిమాండ్

ఆనందపురం, జూలై 25, ప్రభాతవార్త




గ్రేహౌండ్స్ అవసరాల కోసం గత ప్రభుత్వం హయామంలో భూసేకరణ చేసిన తమ భూములకు రావాల్సిన అదనపు నష్టపరిహారాన్ని వెంటనే మంజూరు చేయాలని జగన్నాధపురం గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆనందపురం తహసీల్దార్‌ను కలిసి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాధపురం గ్రామంలోని సర్వే నంబర్ 1/1లోని ప్రభుత్వ భూమిని గ్రేహౌండ్స్ అవసరాల కోసం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూసేకరణ చేశారు. ఈ ప్రక్రియలో సుమారు 20 మంది డి.పట్టా, 4సీ పట్టాదారులను సక్రమంగా గుర్తించకపోవడంతో వారికి రావాల్సిన నష్టపరిహారం కంటే తక్కువ మొత్తం మంజూరైందని రైతులు తెలిపారు. చెక్కుల పంపిణీ సమయంలో ఈ విషయంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో అధికారులు తిరిగి విచారణ చేపట్టారని పేర్కొన్నారు. తదుపరి విచారణ అనంతరం అర్హులైన రైతులకు అదనంగా సుమారు రూ. 2.38 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని అప్పటి తహసీల్దార్, ఆర్డీవో నివేదికల ద్వారా జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు రైతులు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఆ నష్టపరిహారం మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన 'ఒక నెల-ఒక నియోజకవర్గం' కార్యక్రమంలో తమకు రావాల్సిన నష్టపరిహారం మంజూరు చేయాలని అర్జీ సమర్పించగా, అర్హులైన అందరికీ నష్టపరిహారం మంజూరు చేస్తామని ఎండార్స్‌మెంట్ కూడా ఇచ్చారని రైతులు తెలిపారు. గతంలో భూసేకరణ సమయంలో అప్పటి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి కలిసి రైతులతో సమావేశం నిర్వహించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని రైతులు గుర్తుచేశారు. అధికారుల వద్ద ఉన్న గత నివేదికలను పరిశీలించి, అర్హులైన రైతులకు రావాల్సిన రూ. 2.38 కోట్ల నష్టపరిహారాన్ని తక్షణమే మంజూరు చేయాలని వారు తహసీల్దార్‌ను కోరారు. రైతుల సమస్యపై అధికారులు సానుకూలంగా స్పందించి, సంబంధిత రికార్డులు, గతంలో పంపిన నివేదికలను పరిశీలించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## హామీలు నెరవేర్చాలని ఎమ్మెల్యే గంటాకు తర్లువాడ రైతుల వినతి



ఆనందపురం, జూలై 25, ప్రభాతవార్త

గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం కోసం తమ భూములను, జీవనాధారాన్ని కోల్పోయిన తమకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి న్యాయం చేయాలని తర్లువాడ రైతులు కోరారు. ఈ మేరకు శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మాజీ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, రైతు నాయకుడు బంకు రాజు తదితర రైతులు కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలోని సర్వే నంబర్ 1లో గూగుల్ డేటా సెంటర్ కోసం సుమారు 307 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించిన సమయంలో, రైతులతో గవర్నర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ తదితర అధికారులు సమావేశమై పలు హామీలు ఇచ్చారని రైతులు తెలిపారు. డీఆర్‌డీఏ బంజరు భూముల అభివృద్ధి పథకం కింద ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న 520 మంది రైతులకు ఒక్కొక్కరికి మూడు సెంట్ల చొప్పున ఇంటి స్థలం, 51 మంది డి.పట్టాదారులకు ఒక్కొక్కరికి 20 సెంట్ల చొప్పున భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అదేవిధంగా రైతులు, స్థానిక ప్రజల ఉపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు, 51 మందికి ఉద్యోగాలు, గ్రామ అభివృద్ధికి 60 అడుగుల రహదారి నిర్మాణం, కొండపై టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం వంటి హామీలను కూడా అధికారులు ఇచ్చారని రైతులు గుర్తుచేశారు. అయితే భూములు సేకరించి ఇంతకాలం గడిచినా హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హామీల అమలులో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, హామీలను త్వరితగతిన అమలు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును రైతులు కోరారు.


## అంగన్వాడీ కేంద్రాలతో చిన్నారుల్లో సమగ్ర అభివృద్ధి

ఆనందపురం జూలై 25, ప్రభాతవార్త:

భీమునిపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గొంతినవానిపాలెం అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈడే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.సీడీపీవో ఎం. శ్రీదేవి మాట్లాడుతూ 3 నుంచి 6 ఏళ్ల వయసున్న పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటలు, పాటల ద్వారా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా పిల్లల్లో శారీరక, భాషా, మేధో, మానసిక--సామాజిక అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. సూపర్వైజర్ పి.వి.వి. రత్నం మాట్లాడుతూ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించడం ద్వారా వారిలో మంచి అలవాట్లు, గణిత పరిజ్ఞానం, సృజనాత్మకత పెంపొందుతాయని తెలిపారు. చదవడం, రాయడం, వివరం వంటి నైపుణ్యాలతో పాటు మంచి ఆరోగ్యం అలవడి, పిల్లలు పాఠశాల విద్యకు సిద్ధమవుతారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గాజువాక సర్ మొదటి దశ పూర్తి.. 83.14% ఓటర్ల వివరాల డిజిటలైజేషన్

గాజువాక, జూలై 25,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గంలో ఓటర్ల ఎన్యూమరేషన్ తొలి దశలో 83.14 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని ఈఆర్ఓ, వీఎంఆర్డీఏ ఈడీ దయానిధి తెలిపారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం 3,34,768 మంది ఓటర్లు ఉండగా, 6,814 మంది మృతిచెందినవారు, 26,345 మంది చిరునామా మార్చుకున్నవారు, 15,252 మంది ఆచూకీ లేనివారు, 6,968 మందికి ద్వంద్వ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. సంతకాలు చేయని 1,070 దరఖాస్తులను తిరస్కరించినట్లు చెప్పారు. దీంతో మొత్తం 56,449 ఓట్లు తొలగించగా, మిగిలిన 2,78,319 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసినట్లు వివరించారు. ఆగస్టు 1న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని, పేర్లు లేకుంటే ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిశీలించిన అనంతరం అక్టోబర్ 5న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. తొలి దశలో సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏఈఆర్ఓ, గాజువాక తహసీల్దార్ త్రినాథ్, జోనల్ కమిషనర్ శేషాద్రి, డిటి సూర్య కళ ,బీజేపీ తరఫున కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కాంగ్రెస్ తరఫున జెర్రిపోతుల ముత్యాలు,టీడీపీ తరఫున పల్లా శ్రీనివాస్ ,జనసేన తరఫున రౌతు గోవింద్,వైసీపీ తరఫున వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## తైపురం జంక్షన్‌కు సీసీ కెమెరాల భద్రతా కవచం

### పంచాయతీ నిధులతో ఏర్పాటు.. ప్రజల రక్షణకు మరింత బలోపేతం

బుచ్చయ్యపేట, జూలై 25 (ప్రభాతవార్త)



బుచ్చయ్యపేట మండలం తైపురం జంక్షన్‌లో ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణతో పాటు రాకపోకలను నిరంతరం పర్యవేక్షించేందుకు పంచాయతీ నిధులతో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బుచ్చయ్యపేట ఎంపీడీవో కె.శివప్రసాద్ నారాయణరావు, డిప్యూటీ ఎంపీడీవో వై.దివి సహకారం అందించారు. జంక్షన్ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కదలికలు, ప్రమాదాలు, ఇతర సంఘటనలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకునేందుకు ఈ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని బుచ్చయ్యపేట ఎస్ఐ పి.మనోజ్ కుమార్ తెలిపారు.ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా సీసీ కెమెరా ఏర్పాటుకు అభినందనీయమని పేర్కొన్న ఆయన, ఈ కార్యక్రమానికి సహకరించిన ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలకు బుచ్చయ్యపేట పోలీసుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు కూడా సీసీ కెమెరా వినియోగాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## విమ్స్‌లో 50 కిలోవాట్ల ఆన్-గ్రిడ్ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ప్రారంభం



ఆరిలోవ, జూలై 25, ప్రభాతవార్త

విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా 50 కిలోవాట్ల సామర్థ్యం గల ఆన్-గ్రిడ్ రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును 'ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ తమ కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్సిబిలిటీ చొరవలో భాగంగా ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ, దిశానిర్దేశంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి.మన్మథరావు, ఏఎం, ఎన్ఎస్ ఇండియా (విజాగ్ స్టీల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రవీంద్రనాథ్ సమక్షంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రారంభోత్సవంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి. మన్మథరావు మాట్లాడుతూ... ఈ సోలార్ ప్లాంట్ ద్వారా ఆసుపత్రికి నెలకు సుమారు 6 వేల యూనిట్ల విద్యుత్ అదనంగా ఉత్పత్తి అవుతుందని, దీనివల్ల ప్రతి నెలా సగటున 50 వేలు వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆసుపత్రి ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. విమ్స్ బిల్డింగ్ పైన ఇప్పటికే 220 కే డబ్ల్యు సామర్థ్యం గల సోలార్ ప్యానెల్స్ ఉండగా, ఇప్పుడు అదనంగా 50 కే డబ్ల్యు అమర్చడంతో మొత్తం సామర్థ్యం 270 కే డబ్ల్యుకి చేరిందని, భవిష్యత్తులో మరో 50 కే డబ్ల్యు సోలార్ ప్లాంట్ ఇస్తామని, పర్యావరణ హిత కార్యక్రమాలకు సి ఇ అర్ ద్వారా తమ తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని ఏఎం, ఎన్ఎస్ ఇండియా ఈడీ రవీంద్రనాథ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా. మనోజ్ కుమార్, ఏఎం, ఎన్ఎస్ ఇండియా హెడ్ - హెచ్ఆర్, ఐఆర్ అండ్ అడ్మిన్ డి.ఎస్. వర్మ, ఈ. సీతారామిరెడ్డి, ఏ.వి. సుబ్రహ్మణ్యం, విమ్స్ వైద్యులు, నర్సింగ్ సూపర్నింటెండెంట్ స్వర్ణలతతో పాటు విమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనంత పద్మనాభ స్వామి ఆలయంలో వైభవంగా తొలి ఏకాదశి పూజలు

### భక్తులతో పోటెత్తిన ఆలయం

పద్మనాభం, జూలై 25, ప్రభాతవార్త



పద్మనాభం గ్రామంలో వేంచేసి ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయం, అనంతని కొండ దిగువన ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయంలో శనివారము దక్షిణాయణంలో వచ్చిన తొలి ఏకాదశి పర్వదినమును భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పవన్ కుమార్, సీతారామ ఆచార్యులు కుంతీ మాధవస్వామికి, అనంత పద్మనాభ స్వామికి వేకువజామున పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని తులసి దళాలు, పూలమాలలతో ఆకర్షణీయంగా అలంకరించారు. తదుపరి భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. దీంతో ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సింహాచలం రాజగోపాల్ ఆచార్యులు భక్త బృందం విష్ణు సహస్రనామం, రామాయణ పారాయణం చేశారు. కొండపైన, కొండ దిగున భక్తులు స్వామివారి దర్శనానికి బార్లు తీరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, అనంత పద్మనాభ స్వామి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు డి గోపి బాబు, ఎంపీటీసీ లక్ష్మీ నాయుడు, బుగత సత్యనారాయణ, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

## గిరి భక్తులకు చినగదిలి బాబా ఆలయంలో భారీ ఏర్పాట్లు



ఆరిలోవ, జూలై 25, ప్రభాతవార్త

గిరి ప్రదక్షిణ, గురు పౌర్ణమి మహోత్సవాలను పరిష్కరించుకొని చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేస్తుంది. 1995 నుండి క్రమం తప్పకుండా సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షణ చేసే భక్తులకు ఆహారం, ప్రసాదం, అల్ప పానీయం, మంచినీరు, వైద్యం అందించడం ఆనవాయితీగా వస్తుంది. 32 కిలోమీటర్లు దూరం గిరి ప్రదక్షణ చేసే భక్తులకు సేవలందించే మహత్కార్యం ఈ ఏడాదికి 31 సంవత్సరాలు పూర్తి చేసుకుని 32లో అడుగుపెట్టడం ఆనందంగా ఉందని నార్త్ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు. సింహాద్రి అప్పన్న ప్రదక్షిణలో భాగంగా శ్రీ నార్త్ షిరిడిసాయిబాబా మందిరం కూడా ఒక దర్శనీయ క్షేత్రంగా భక్తులు గుర్తించి దర్శించు కుంటున్నారన్నారు. మంగళవారం గిరి ప్రదర్శన రోజున ఉదయం నుండి భక్తులకు ప్రసాదం, మధ్యాహ్న భోజనం సాయంత్రం టీ పలహారం, రాత్రి పులిహార పంపిణీ జరుగుతుందన్నారు. బుధవారం గురుపౌర్ణమి రోజు ఉదయం సుప్రభాతసేవ, కాగడ హారతి, విశేష నైవేద్య ఆరగింపు,గురు దైవ స్థానాలలో వున్న బాబా పంచామృతాభికం, సుగంధద్రవ్యాలతో అభిషేకం, పూజలు జరుగుతాయి అన్నారు. ఉదయం 11 గంటలకు బాబాకి భక్తులు మరియు ట్రస్టుబోర్డు సభ్యులచే అన్నాభిషేక కార్యక్రమము అనంతరం మధ్యాహ్న హారతి, భక్తులకుమహా అన్నప్రసాదము విందు ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం లోక కళ్యానార్ధమై సాయి సుహృతహోమం, సంధ్యాహారతి, సాయినామ సంకీర్తన భజన,రాత్రి నక్షత్రహారతి తర్వాత పవళింపుసేవ, మహాప్రసాద వితరణ తో కార్యక్రమం ముగుస్తుందన్నారు. అదిక సంఖ్యలో భక్తులు హాజరై సేవలు అందుకుని, బాబాను దర్శించుకోవాలని ఆలయ కమిటీ పిలుపునిచ్చారు.

## తుంగలంలో శ్రీ విజయరాఘవస్వామికి ప్రత్యేక పూజలు

గాజువాక,జూలై 25,ప్రభాతవార్త



తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 69వ వార్డు పరిధిలోని తుంగలం గ్రామంలో వేంచేసియున్న శ్రీ విజయరాఘవస్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు, ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. భక్తులంతా స్వామివారి కృపాకటాక్షాలు పొంది పునీతులయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి యువజన సేవా సంఘం (తుంగలం) ప్రతినిధులు, నిర్వాహకులు, గ్రామ ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.

## రెడ్డిపల్లిలో త్వరితగతిన నిర్మాణం చెందుతున్న ఆరోగ్య ఉప కేంద్రం



పద్మనాభం, జూలై 25, ప్రభాతవార్త

మండలంలో రెడ్డిపల్లి గ్రామంలో లక్షల రూపాయలతో చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రము నిర్మాణ పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. అయితే పూర్వం నిర్మించిన ఏఎన్ఎం సబ్సెంటర్ పూర్తిగా శిధిలావస్థకు చేరుకుంది. వేరే గతిలేక ఈ సెంటర్లో ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వహించాల్సి వచ్చింది. ఒకవైపు పాములు, మరోవైపు శిథిలమైన గోడలు, పెచ్చులుడుతున్న స్లాబ్ వల్ల ఆరోగ్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నూతన ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణానికి లక్షల రూపాయల ను విడుదల చేశారు. ఈ నిధులతో ఈ ఆరోగ్య కేంద్రము నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే నెలలో ఈ కేంద్రమును భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు ప్రారంభించనున్నారని నాయకులు తెలిపారు.

## నేరాల ఛేదనలో విశేష ప్రతిభ: క్రైమ్ సీఐ జి.డి. బాబుకు సిపీ ప్రశంసా పత్రం

గాజువాక,జూలై 25,ప్రభాతవార్త



సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ బ్రాంచ్ పరిధిలో నమోదైన పలు కీలక కేసులను చాకచక్యంగా ఛేదించి, ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను గాజువాక క్రైమ్ సీఐ జి.డి. బాబుతో పాటు వారి పోలీస్ సిబ్బందికి విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు లభించాయి. సౌత్ సబ్ డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వివిధ నేరాలను వేగంగా దర్యాప్తు చేసి, నిందితులను అరెస్ట్ చేయడంలో సీఐ జి.డి. బాబు నేతృత్వంలోని బృందం అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వారి పనితీరును ప్రత్యేకంగా అభినందిస్తూ, రాబోయే రోజుల్లో కూడా ఇదే రకమైన నిబద్ధతతో పనిచేసి శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల అదుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, క్రైమ్ విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మీయ మజిలీ... బాల్య జ్ఞాపకాల వేదికగా 'గాజువాక' మిత్రుల సమ్మేళనం



గాజువాక,జూలై 25,ప్రభాతవార్త

అది ముప్పై ఏళ్లకు పైగా నాటి జ్ఞాపకాల నెమరువేత... ఒకరినొకరు పలకరించుకుంటూ మురిసిపోయిన క్షణాలు... చిన్ననాటి ముచ్చట్లతో పండుగను తలపించిన వాతావరణం! గాజువాక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) 1987-88 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక బీసీ రోడ్డులోని కళ్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు సుమారు 120 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం నుంచే ఒకరినొకరు కలుసుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా సందడి చేశారు. విందు వినోదాలు, ఆటపాటలతో రోజంతా ఆహ్లాదకరంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, రాజకీయ నాయకులు మహమ్మద్ రఫీ, నక్క వెంకటరమణ, కట్టా పద్మ, అంజిబాబుతో పాటు మిత్రులు గిడుతూరి అప్పారావు, దీపక్, ఈశ్వరరావు, అక్రమ్, సత్యనారాయణ, నరసింహారావు, సుగుణాకర్, గోపాల్, వేణు, మేనకేతన్ తదితరులు ఆధ్వర్యం వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మళ్లీ ఇలాగే క్రమం తప్పకుండా కలుసుకోవాలని ఆకాంక్షిస్తూ వేడుకలను ముగించారు.

## గీత కులాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



విశాఖపట్నం, జూలై 25 ప్రభాతవార్త

గీత కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సీతమ్మధారలోని శెట్టిబలిజ భవనంలో ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన గీత కులాల సమస్యలు, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కీలక సూచనలు చేశారు. చెట్టుపై నుంచి పడి ప్రమాదవశాత్తు మరణించే గీత కార్మికులకు, గతంలో మాదిరిగానే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చే విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెనుకబడిన గీత కులాల విద్యార్థులు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు త్వరలోనే విశాఖపట్నంలో భారీ మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గీత కులాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి అవకాశం ఉన్నవాళ్లు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. గీత కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు సంపంగి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అప్పారి గిరి నిర్వహణలో జరిగిన ఈ సమావేశంలో యాత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిల్లి సుజాత నూకరాజు, కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, పూర్ణ మార్కెట్ దుర్గాలమ్మ గుడి చైర్మన్ కడవల రఘు, నాయకులు రేఖల కృష్ణ గౌడ్, గొడ్డి కన్నారావు, రెడ్డి వెంకటేశ్వరరావు, డి. సుధాకర్ తో పాటు పెద్ద సంఖ్యలో గీత కులాల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎస్ఈజెడ్ నిర్వాసితుల ఆందోళన ఉధృతం

### -ఆర్ అండ్ ఆర్ కాలనీ, పూర్తి ప్యాకేజీ, కళాసి ఉద్యోగాల కోసం ధర్నా

రాంబిల్లి, జూలై 25, ప్రభాతవార్త



రాంబిల్లి మండలం కృష్ణం పాలెం గ్రామానికి చెందిన ఎస్ఈజెడ్ నిర్వాసితులు తమకు రావలసిన పునరావాస, పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) ప్రయోజనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తమ భూముల వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం చేపట్టడంతో పాటు పెండింగ్లో ఉన్న పరిహార ప్యాకేజీలను పూర్తిస్థాయిలో చెల్లించాలని, స్థానికులకు కలాసి ఉద్యోగాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనకు సిపిఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి. దేవుడు నాయుడు మద్దతు ప్రకటించి మాట్లాడుతూ నిర్వాసితుల భూములను సేకరించి దాదాపు రెండు దశాబ్దాలు గడిచిన ఇప్పటికి ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం చేపట్టకపోవడం ప్రభుత్వ వైఫల్యం అని విమర్శించారు. నిర్వాసితుల భూముల్లో ప్రస్తుతం యాక్షన్ పెసా కంపెనీ నిర్మాణ పనులు చేపడుతున్నప్పటికీ స్థానిక నిర్వాసితులకు కనీసం కళాసి పనులు కూడా ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్వో పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కంపెనీ నిర్మాణ పనులు కొనసాగించే ప్రయత్నం చేశారు. అయితే తమ సమస్యలు పరిష్కరించే వరకు పనులు చేపట్టేందుకు వీలు లేదంటూ నిర్వాసితులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. కంపెనీ ప్రతినిధులు స్పందిస్తూ స్థానికులకు కూలి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని అయితే కంపెనీలో కళాసి ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని యాజమాన్యం తెలిపిందన్నారు. దీనిపై నిర్వాసితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ తమకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితుల డిమాండ్లకు మద్దతుగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు బాధ్యత కుటుంబాలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆందోళనకారులు కోరారు.



## కోదండరాముని ఆలయానికి విరాళం

(నక్కపల్లి,ప్రభాతవార్త)

నక్కపల్లి బందారు పేటలో ఉన్న కోదండరాముని ఆలయానికి పట్నానికి చెందిన ముద్దా సుబ్బారావు కుటుంబ సభ్యులు 40 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఆలయం పెద్దలు మొండి సత్తిబాబు, హనుమంతు, వీరబాబు, అయ్యప్పలు ఆ కుటుంబాన్ని సత్కరించారు.

### కడుపు నొప్పితో మనస్థాపం

## పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

రాంబిల్లి,జులై 25, ప్రభాతవార్త

మండలంలో పంచదార్ల గ్రామానికి చెందిన మరపు రెడ్డి రాము (46) అనే వ్యక్తి పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం: మరుపు రెడ్డి రాము గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. అలాగే అతనికి తరచూ మద్యం సేవించే అలవాటు కూడా ఉన్నట్లు తెలిసింది. ఈనెల 18వ తేదీ రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో కడుపునొప్పిని తట్టుకోలేక మనస్థాపానికి గురైన రాము క్యూరాక్రాన్ అనే పురుగుల మందును సేవించాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అనంతరం పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే వారం రోజులుగా చికిత్స పొందుతున్న రాము శనివారం జులై 25 మధ్యాహ్నం 12:17 గంటలకు కేజీహెచ్‌లో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు మరపురెడ్డి సతీష్ (26) ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తరలించి తదుపరి చట్టమైన చర్యలు చేపట్టారు. మృతికి గల పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తాం

చోడవరం, జూలై 24, ప్రభాతవార్త:



చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలకు అన్ని రిజిస్ట్రేషన్ సేవలు అందించడానికి సబ్-రిజిస్ట్రార్, వారీ సిబ్బంది అందుబాటులో ఉన్నారనీ చోడవరం సబ్ రిజిస్ట్రార్ బి గీతా లక్ష్మీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.మేము దస్తావేజును సిద్ధం చేయడం,పబ్లిక్ డేటా ఎంట్రీ చేయడం( పిడిఎఫ్), చలానా కట్టడం,మార్కెట్ విలువలు, ఈసిలు, నకలు తెలియజేయడం ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉచితంగా పూర్తి చేస్తామన్నారు. అలాగే దస్తావేజు తయారీ, పిడి ఈ ఎంట్రీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ లకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ లు రిజిస్ట్రార్ కార్యాలయం నందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాబట్టి ప్రజలందరూ మా సేవలను వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## చాకిపల్లి వద్ద పెద్దేరు నదిపై వంతెన నిర్మాణానికి చర్యలు

### క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అధికారులు -చోడవరం జనసేన ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు

చోడవరం,జూలై 25, ప్రభాతవార్త



దశాబ్దాల కాలం నుండి చోడవరం నియోజకవర్గంలో గల చోడవరం మండలం చాకిపల్లి వద్ద పెద్దేరు నదిపై వంతెన నిర్మాణానికి కదలికలు వచ్చాయి. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో వంతెన నిర్మాణానికి అవసరమని చర్యలు చేపట్టేందుకు అధికారులు శనివారం పరిశీలన జరిపారు. ఈ నదిపై బ్రిడ్జి లేక వ్యవసాయ పనులు చేసుకునే రైతులు,వ్యవసాయ కూలీలు పనులు నిమిత్తము ప్రతిరోజు ప్రమాదకరమైన ఈ నదిని ఒక తీగ సహాయంతో దాటుతూ ఉండడం జరుగుతూ వస్తుంది. ఈ క్రమంలో కొంతమంది ప్రాణాలు కోల్పోవడం కూడా జరిగింది. ఈ అతిపెద్ద సమస్యను జనసేన పార్టీ ప్రతిపక్షంలో ఉండగానే చోడవరం జనసేన పార్టీ మేనిఫెస్టో అయిన "లక్ష్యం"లో పొందుపరిచి కూటమి ప్రభుత్వం రాగానే ఈ సమస్యను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తామని ప్రజలకు మాటివ్వడం జరిగింది.ఈ నదిపై నిర్మించబోయే ఈ వంతెన వల్ల కన్నంపాలెం, రామజోగిపాలెం,చాకిపల్లి ,భోగాపురం తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులకు వ్యవసాయ శ్రామికులకు ప్రాణభీతి లేకుండా సౌకర్యంతమైన వ్యవసాయ పలు చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రజల ఆకాంక్షలు, నియోజకవర్గం జనసేన పార్టీ అభ్యర్ధనపై ఈ వంతెన ఆవశ్యకతను గుర్తించి దీని నిర్మాణానికి అవసరమయిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నుండి నుండి అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయని పార్టీ ఇంచార్జి రాజు అన్నారు ఈ సందర్బంగా గ్రామ ప్రజలు పార్టీ నాయకులతో కలసి రాజు తీగ వంతెన ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రాజు గ్రామస్తులతో మాట్లాడుతూ ఇక్కడ వంతెన నిర్మించడం అనేది ప్రజల చిరకాల స్వప్నం కావడం వలన తాము దీనిని అత్యంత ప్రాముఖ్యత అంశంగా తీసుకున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్ళినప్పుడు అయన సానుకూలంగా స్పందించి అవసరమయిన ఆదేశాలను జారీ చేసారన్నారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో పవన్ కళ్యాణ్ ఒక విలక్షణమైన రాజకీయ నాయకుడిగా ఇలాంటి సమస్యలను పరిష్కరించడం వలన తమ జీవితాల్లో వెలుగులు వస్తాయని వారికి రుణపడి ఉంటామని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. చోడవరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అల్లం మాధవి రామ అప్పారావు, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు నందవరపు రమాదేవి నాయుడు, పార్టీ నాయకులు జెర్రిపోతుల నానాజీ, నరవ సరోజిని, చప్పగడ్డ శ్రీను, తుమ్మపాల దేముళ్ళు నాయుడు, సియ్యాద్రి జగదీశ్, మిస్కా భూలోక నాయుడు, దేవర అప్పల నాయుడు, కోసం నర్సింగ్, చింతల కిషోర్, స్థానిక నాయకులు యలమంచిలి శ్రీనివాస్, నేమని సింహాచలం, పోతల అప్పారావు,నందికొల్ల గణేష్ ,పోలేపల్లి శ్రీను,లగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

26-7Pg7exHMNWJQE.qxd OK:26-7Pg7exHMNWJQE.qxd 1/1/02 7:28 AM Page 1



# అల్లూరి త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయం

- ఉత్తరాంధ్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించే చరిత్ర
- 34 నియోజకవర్గాల నుంచి 5 వేల బస్సులతో జనసమీకరణ
- రూ.8 వేల కోట్లతో బీచ్ కారిడార్‌కు మాస్టర్ ప్లాన్ రెడీ
- భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జులై 25 ప్రభాతవార్త:** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరలను ఎదిరించిన విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు పేరు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు పెట్టడంతో ఆయన త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో శనివారం జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఎయిర్‌పోర్ట్‌ను పరిశీలించిన మంత్రి అనంతరం అక్కడ విలేకర్ల సమావేశంలో ఎయిర్‌పోర్ట్ గురించి పలు విషయాలు వెల్లడించారు. ఉత్తరాంధ్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన భోగాపురం అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొంటున్నట్టు మంత్రి తెలిపారు. అరకు ప్రాంతానికి చెందిన సుమారు 13,000 మంది బాలికలతో ప్రత్యేక దింసా నృత్య ప్రదర్శనతో ప్రధానమంత్రికి స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ బహిరంగ సభకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి 5 వేల బస్సులతో భారీ ఎత్తున జనసమీకరణ చేస్తున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు.

**బీచ్ కారిడార్ కోసం రూ.8 వేల కోట్లతో మాస్టర్ ప్లాన్:** ఇక విశాఖపట్నం నుంచి విమానాశ్రయానికి ప్రతిపాదించిన 7 కనెక్టివిటీ రహదారులలో ఇప్పటికే 4 పూర్తయ్యాయని.. మిగిలిన 3 రహదారుల పనులు శరవేగంగా జరుగుతున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అలాగే కోస్టల్ కారిడార్‌గా 6 లైన్ల బీచ్ రహదారిని రూ.8000 కోట్లతో అనుసంధానించే మాస్టర్ ప్లాన్ కూడా రెడీ అవుతోందన్నారు. విశాఖ నగరం నుంచి విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికుల కోసం జీఎంఆర్ సంస్థకు 69 మెట్రో బస్సులను కూడా కేటాయించినట్టు మంత్రి స్పష్టం చేశారు.

**వైసీపీ నేతలు ఇప్పుడేమంటారో..?:** గతంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై ఎర్రబస్సు వెళ్లని చోట ఎయిర్‌పోర్ట్ ఎందుకని వైసీపీ నేతలు వెటకారం చేశారని.. ఇప్పుడు చంద్రబాబు ఎంతో కష్టపడి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా చేయడంతో వైసీపీ వాళ్ల వద్ద సమాధానం లేకుండా పోయిందని మంత్రి కొండపల్లి ఎద్దేవా చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు చూసి వైసీపీ నేతలు కళ్లు తెరవాలన్నారు. ఈ విమానాశ్రయ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు, స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ఇప్పటికే జాబ్ మేళాలు నిర్వహించి బ్లూ కాలర్, వైట్ కాలర్ ఉద్యోగాలు కూడా వారికి ఇచ్చామన్నారు. ఉత్తరాంధ్ర మామిడి, మత్స్య ఉత్పత్తులు ప్రపంచస్థాయికి ఎగుమతి అయ్యేలా కార్గో సదుపాయం కూడా త్వరలోనే రాబోతోందని తెలిపారు. దీనివల్ల అనేక పరిశ్రమలు ఇక్కడకు వచ్చి ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గుతాయన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

**ఆగస్టు 17 నుంచి పూర్తి సేవలు:** ఇక ఈ విమానాశ్రయ పూర్తి సేవలు ఆగస్టు 17 నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో భోగాపురం ఎయిర్‌పోర్ట్ తర్వాత విజయనగరం జిల్లా కూడా అలాగే అభివృద్ధి చెందుతుందని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి భూములు ఇచ్చిన రైతులతో పాటు ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసిన జీఎంఆర్ యాజమాన్యానికి, ప్రతి నెలా సమీక్షలు చేసి పనులు వేగంగా పూర్తయ్యేలా చేసిన కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అలాగే 2015లో నాడు కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న పూసపాటి అశోక్‌గజపతిరాజు ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని.. ఇప్పుడు ఇది పూర్తి కావడంతో ఆయన కల నెరవేరిందని మంత్రి తెలిపారు.రు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, ఎస్పీ దామోదర్ నాయుడు, కూటమి ప్రభుత్వ నేతలు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# అతిపెద్ద ధింసా నృత్యంతో ప్రధానికి ఘనస్వాగతం పలకాలి

- భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించి, సమీక్షించిన మంత్రి నారా లోకేష్

**విజయనగరం, జులై 25 ప్రభాతవార్త:** ఉత్తరాంధ్రకే తలమానికంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతా రామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంను ఆగస్టు 1వతేదీన ప్రధాని నరేంద్ర మోడీ జాతికి అంకితం చేస్తున్న నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నభూతో నభవిష్యత్ అనే రీతిలో విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం పరిశీలించిన మంత్రి లోకేష్, అనంతరం సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 3లక్షలమంది ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం, ప్రధాని మోదీజీ బహిరంగసభకు హాజరవుతారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. కూటమి నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రధాని సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలుకుతూ సుమారు 13వేల మందితో దేశంలోనే అతిపెద్ద ధింసా నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలి. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ సభకు హాజరయ్యే ప్రజలకోసం 36 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 5వేల బస్సులు రానున్నాయి. సభకు వచ్చేవారు బస్సు ఎక్కినప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు ఎటువంటి లోటులేకుండా మండల స్థాయి లైజన్ ఆఫీసర్లు దగ్గరుండి చూసుకోవాలి. సభకు హాజరయ్యే వారందరికీ తాగునీరు, అల్పాహారం, భోజన సదుపాయం కల్పించాలి. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్ల కమిటీ ముఖ్య అధికారి ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ ప్రధాని బహిరంగసభను వీక్షించేందుకు ప్రతి 5వేల మందికి ఒక ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నాం, సీనియర్ ఐఎఎస్ అధికారులు, జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

సమీక్షా సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి కిలారి రాజేష్, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, ఎంపిలు కలిశెట్టి అప్పలనాయుడు, చింతకాయల విజయ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణరాజు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు (విజయనగరం), కళా వెంకట్రావు (చీపురుపల్లి), కోండ్రు మురళీమోహన్ (రాజాం), లోకం నాగమాధవి (నెల్లిమర్ల), విఎంఆర్ డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్, విజయనగరం కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ ఎండి ఢిల్లీరావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చైర్మన్ ఎంఎం నాయక్, ఎపి గిరిజన కార్పొరేషన్ ఎండి ఎస్ఎస్ శోభిక, విశాఖపట్నం రేంజి ఐజి గోపినాథ్ జెట్టి, రవాణాశాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, విజయనగరం ఎస్పీ దామోదర్, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ డైరక్టర్ భార్గవి, ప్రోటోకాల్ (జిఎడి) డైరక్టర్ మోహన్ రావు, విజయనగరం జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, విజయనగరం డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ పరిశోధనలు-సహజ వ్యవసాయమే భవిష్యత్‌కు దిక్సూచి

- ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ 58వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు

**బాపట్ల (బాపట్ల జిల్లా), జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కోవాలంటే శాస్త్రీయ పరిశోధనలు, సుస్థిర వ్యవసాయ విధానాలు, సహజ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం నిర్వహించిన ఏఎన్జీ ఆర్‌ఏయూ 58వ వార్షిక స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలుగా వ్యవసాయ విద్య, పరిశోధనలు, విస్తరణ సేవల ద్వారా రైతు సమాజానికి విశ్వవిద్యాలయం విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. పట్టభద్రుల విజయం వెనుక తల్లిదండ్రులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తల కృషి అమూల్యమని అన్నారు. ప్రస్తుతం ఆలస్యమైన రుతుపవనాలు, కరువు, అతివృష్టి, భూగర్భ జలాల క్షీణత, నేల సార నష్టం వంటి సమస్యలు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారాయన్నారు. నేల ఆరోగ్యం, నీటి వినియోగ సామర్థ్యం, సహజ వనరుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సుస్థిర వ్యవసాయాన్ని విస్తరించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు వాతావరణ మార్పులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు చేయడంతో పాటు రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని గవర్నర్ తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం, ఆరోగ్యం మెరుగుదల, నీటి వినియోగం తగ్గుదల వంటి ప్రయోజనాలు సహజ వ్యవసాయం ద్వారా సాధ్యమవుతున్నాయని చెప్పారు. 2047 నాటికి రాష్ట్రాన్ని పూర్తిస్థాయి సహజ వ్యవసాయ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సి. హెచ్. శ్రీనివాసరావును, పత్తి శాస్త్రవేత్త కె. రవీంద్రనాథ్‌ను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. రవీంద్రనాథ్‌కు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. పట్టభద్రులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ విద్య జ్ఞానంతో పాటు బాధ్యతను కూడా అందిస్తుందని, రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేసి గ్రామీణాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, భారతరత్న డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ సందేశాలను గుర్తుచేస్తూ సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ స్నాతకోత్సవంలో 50 మంది డాక్టరేట్ పండితులు, 240 మంది పీజీ విద్యార్థులు, 1,385 మంది గ్రాడ్యుయేట్లకు పట్టాలు, ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ సి. హెచ్. శ్రీనివాసరావు, ఏఎన్జీ ఆర్‌ఏయూ వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.వి. సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి., బాపట్ల ఎమ్మెల్యే వేగేశిన నరేంద్ర వర్మరాజు, జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.





# పెంచలకోనలో భక్తజన సందోహం

## - శేషవాహనంపై శ్రీవారి క్షేత్రోత్సవం

**రాపూరు (నెల్లూరు), జులై 25 ప్రభాతవార్త:** పెంచలకోనలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి వారి దర్శనానికి భక్తులు జనసందోహంగా వచ్చారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున 4గంటలకు స్వామి వారి మూల మూర్తికి అభిషేకం నిర్వహించారు. ఉదయం శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహునికి వివిధ రకాల సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసారు. ఈ సందర్బంగా స్వామి వారు భక్తులకు వైకుంఠనాథుని రూపంలో దర్శనమిచ్చారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ చెంచులక్ష్మీ, శ్రీ ఆదిలక్ష్మీ సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారిని శేషవాహనంపై వుంచి క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు సమర్పించిన 100 గొడుగులు నడుమ వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మద్య వైభవంగా సాగిన ఈ ఉత్సవం భక్తులను విశేషంగా అకట్టుకుంది. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చకులు గుండ్లూరు శశీ స్వామి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# పిఎం మోడీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

- సిపిఎం రాష్ట ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు



**కావలి (నెల్లూరు), జులై 25 ప్రభాతవార్త:** నీట్ పరీక్షా పేపర్ లీకేజీలకు సంబంధించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో దేశంలో మోడీపాలనకు కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యిందని సిపిఎం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన కావలిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజ్‌లపై ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన ఘటన దేశమంతా కలిచివేసిందన్నారు. ఈ విద్యార్థుల మొదటగా అందళనపై హెచ్చరించినా మోడీ పట్టించుకోలేదన్నారు. విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలని, విద్యార్థులు దేశవ్యాప్త ఆందోళనకు దిగడంతో దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మోడీ ఒకే రోజు రెండు పర్యాయాలు ప్రెస్‌మీట్లు పెట్టినా కేంద్రమంత్రి రాజానామాపై మాట్లాడకుండా సంబంధిత శాఖలో ఛీఫ్ సెక్రటరీని బదిలీ చేసి ముఖ్యమైన అధికారులు 47మంది సిబ్బందిని తొలగించారని తెలిపారు. అయినా విద్యార్థులు ఆందళన కార్యక్రమాలు విరమించకపోవడంతో ధరేంద్రప్రదాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. విద్యార్థులపై లాఠీచార్జి జరిగినా కూటమి, జనసేన, వైసిపి పార్టీల నాయకులు ఎవరూ నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, పట్టణ కమిటీ సీనియర్ నాయకులు, శ్రీకర్ల వెంకటయ్యలు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించండి

- చిత్తూరు జడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు

**చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన వర్షాలు నమోదు కాకపోవడంతో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు కోరారు. జడ్పీ సమావేశభవనంలో జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, ఆరణి శ్రీనివాసులు, జడ్పీ సిఇఒ రవికుమార్ నాయుడు, ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల పెండింగ్ ఫైళ్ళను పరిశీలిస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అధికారులతో పాటు గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు జిల్లా అధికార యంత్రాంగం పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించ డానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు బాధ్యతగా తీసుకుని పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 27 మండలాల్లో 489 మోడల్ ప్రైమరీ పాఠశాలలను పూర్తి చేయడానికి రూ.29 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. బాలికల సంక్షేమ వసతిగృహాల్లో దశలవారీగా సిసి కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.80 కోట్ల బిల్లులు పెండింగ్‌లో వున్నాయని, ఈ బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగిందన్నారు.

చిత్తూరు-తమిళనాడు, చిత్తూరు-కర్నాటక, జిల్లా సరిహద్దులో వున్న రోడ్లన్నింటినీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అలాగే పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో చెరువులు అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుప్పం పట్టణంను సుందరంగా తీర్చిదిద్దడానికి కడ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నామన్నారు. 2025-26 సంవత్సరంలో రూ.165.45 కోట్ల వ్యయంతో కొత్తగా 8,294 వ్యవసాయ సర్వీసులకు ఉచిత విద్యుత్ సర్వీసు చేయడం జరుగుతున్నదన్నారు. అన్నమయ్య జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు అధిక సంఖ్యలో కావాలని సభ్యులు సమావేశంలో డిమాండ్ చేశారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి 1,403 వ్యవసాయ సర్వీసులు ఇవ్వడానికి ఎపి సదరన్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆమోదించిందన్నారు.

ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు, ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్‌లు మాట్లాడుతూ జులై నెలాఖరుకు సైతం వర్షాలు నమోదు కాకపోవడంతో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పించి, వారికి అవసరమైన విత్తనాలను సకాలంలో సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే రైతులకు ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన వేరుసెగన విత్తనాలు అందించడానికి వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. తోతాపురి మామిడి రైతుకు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ మొత్తంను అర్హులైన రైతులకు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. సభ్యులు అడిగే ప్రశ్నలు జిల్లా అభివృద్ధికి ఉపయోగపడేలా వుండాల న్నారు. అందరు కలసికట్టుగా జిల్లా అభివృద్ధికి కంకణం కుట్టుకుని ముందుడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీటిసీలు, ఎంపిపిలు, అధికారులు పాల్గొన్నారు.

## పంటలను శాస్త్రీయపద్ధతుల్లో రక్షించుకోవాలి

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త:** ప్రస్తుతం నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో శాస్త్రీయపద్ధతుల్లో సాగుచేసి ఉద్యానపంటలను రక్షించుకోవాలని ఎన్‌టిఆర్‌జిల్లా ఉద్యానఅధికారి పి.బాలాజీకుమార్ రైతులకు సూచించారు. ఇందుకోసం పంచసూత్రాలను అవలంభించాలన్నారు. పప్పుజాతి, నూనెజాతి, ధాన్యపుజాతి, పచ్చిరొట్ట వంటి పంటలు సాగుచేయటం వల్ల తేమ ఎక్కువకాలం నిల్వఉండి పంటల స్థిరత్వం పెరుగుతుందన్నారు. తోటల్లో వర్షపునీరు, భోరుబావుల ద్వారా వచ్చే నీటిని పంటకుంటలలో నిల్వచేసుకుని, బిందుసేద్యం ద్వారా తక్కువనీటితో పంటలు పండించుకోవచ్చన్నారు. నీటికుంట నిర్మాణానికి రూ.18వేలు ఖర్చు అవుతుండగా, ఉద్యానశాఖ 50శాతం రాయితీ ఇస్తుందన్నారు. మిరప సాగుచేసే రైతులు పంటల భీమాప్రీమియం ఎకరానికి రూ.1800లు చెల్లించి రూ.90వేలు భీమా పొందవచ్చని తెలిపారు. తోటల్లో వీడ్‌మ్యాట్‌ను పరచటం ద్వారా కలుపు నివారించటంతోపాటు, తేమను ఎక్కువరోజులు నిలిపేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. వీడ్‌మ్యాట్‌కు ఉద్యానశాఖ ఎకరానికి లక్షరూపాయలు రాయితీ ఇస్తుందని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఏపి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రైతుల కేటగిరిని బట్టి డ్రిప్, స్ప్రింకర్ పరికరాలకు 50 నుండి 100శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు గ్రామంలోని రైతుసేవా కేంద్రం, ఉద్యాన అధికారులను సంప్రదించాలని బాలాజీ సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి

**చీమకుర్తి, జులై 25 ప్రభాతవార్త:** చీమకుర్తి మండలంలోని రామతీర్థం మర్రిచెట్ల పాలెం మధ్యలో ఉన్న పెట్రోల్ బంకులు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం శనివారం చోటుచేసుకుంది. బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో తల్లి, కుమారులు మరణించారు. మర్రిపూడి మండలం చిమట గ్రామానికి చెందిన మల్లేశ్వరి ఆమె కుమారుడు శివలుగా గుర్తించారు. చీమకుర్తి సీఐ దాసరి ప్రసాద్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని మృతదేహాలను ఒంగోలుకు తరలించి కేసు విచారణ చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించి సిఐ దాసరి ప్రసాద్ విషయాలను తెలిపారు. చీమకుర్తి నుంచి గ్రానైట్ లోడుతో లారీ పొదిలి వైపు వెళుతుండగా, తల్లి కుమారులు ఒక బైకుపై చీమకుర్తి వైపు నుంచి చిమటకు వెళుతూ ఉన్నారు. పొదిలి వైపు నుంచి ఒక యువకుడు బైకును నడుపుకుంటూ ఎదురుగా వచ్చిన వీరి బైకును ఢీకొనడంతో అదుపుతప్పి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మరణించినట్టుగా ప్రాథమిక సమాచారం. పూర్తి విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.




# వాడపల్లి గోవిందుడి సేవలో భక్త జనం

## రికార్డు స్థాయిలో ఆదాయం రూ.1.05 కోట్లు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 25 ప్రభాతవార్త:** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ బిఆర్‌అంబెద్కర్ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం తొలి ఏకాదశి పర్వదినం కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగాయి. వేకువ జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన దర్శన కార్యక్రమాలు రాత్రి 10గంటల వరకు కొనసాగాయి. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయడంతో పాటు, లొల్ల వంతెన నుంచి ఆలయం వరకు ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శన భాగ్యాన్ని పొందారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఏడు వారాల వెంకన్న వ్రతం ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికి రావడం విశేషం. భక్తుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు దర్శనానికి, ఇటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే క్యూలైన్లు, మంచినీరు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు మెడికల్ క్యాంప్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్నదాన శాలలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. లక్షా ముప్పై వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకోగా సుమారు 35 వేల మందికి పైగా అన్నప్రసాదం స్వీకరించారాని, ప్రత్యేక దర్శనాలు, ఇతర సేవల ద్వారా ఆలయానికి రూ కోటి ఐదు లక్షల,67వేల745లు ఆదాయం సమకూరినట్లు డిప్యూటీ కమిషనర్, ఈఓ నల్లం సూర్య చక్రధర్రావు తెలిపారు. శనివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీనివాసుడు కొలువైన గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించారు. స్వామివారి సేవలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పాల్గొన్నారు.

## మహిళలు నైపుణ్యాభివృద్ధి సాధించి ఉపాధి అవకాశాలుగా మార్చుకోవాలి

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త:** మహిళలు కొత్తనైపుణ్యాలను నేర్చుకుని వాటికి సృజనాత్మక జోడించి ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు. ఇబ్రహీం పట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్‌కేంద్రంలో శనివారం పెప్‌క్లీనర్‌తో తయారు చేసే హసకళా ఉత్పత్తులపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈవర్క్‌షాప్‌ను సందర్శించిన కలెక్టర్ మహిళలు తయారు చేసిన బొకేలు, అలంకరణ వస్తువులు, బహుమతులను పరిశీలించారు.



వర్క్‌షాప్‌లో మహిళలు రూపొందించిన హస్తకళా ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఇంటివద్ద ఉంటూ చేయగలిగే ఇటువంటి ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రభుత్వశాఖలు, రైజ్ కేంద్రం ద్వారా అందిస్తున్న శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఈ మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకుని తమ ఉత్పత్తులకు మంచి ధర పొందవచ్చని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి నాంచారరావు, శ్రావ్స్ ఎండ్‌లెస్ క్రాఫ్ట్స్ వ్యవస్థాపకులు శ్రావణి, మహిళలు పాల్గొన్నారు.

# 31వరకు రహదారి భద్రతా వారోత్సవాలు



శ్రీకాకుళం,జూలై 25, ప్రభాతవార్త :

రహదారి ప్రమాదాలను నివారించేందుకు జూలై 25 నుంచి జూలై 31వ తేదీ వరకు రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించబడునని జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా అద్దె బస్సు, ఆన్-కాల్ డ్రైవర్లకు ఆన్‌లైన్‌లో డ్రైవర్లను పర్యవేక్షించడానికి శిక్షణ ఇవ్వడానికి భద్రతా డ్రైవింగ్ శిక్షకులను ప్రత్యేకంగా ఉపయోగిస్తామన్నారు. డ్రైవర్లందరికీ (అద్దె బస్సు, ఆన్-కాల్ డ్రైవర్లతో సహా) విధులకు వెళ్లే ముందు ట్రాఫిక్ సూపర్‌వైజర్‌ల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. విధులకు బయలుదేరే ముందు డ్రైవర్లందరూ 'భద్రతా సూక్తి' పాఠించేలా నిర్ధారిస్తామని చెప్పారు. భోజన విరామ సమయంలోఛేంజ్ ఓవర్ సమయంలో నిపుణులు, ప్రముఖులతో రహదారి భద్రతపై సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. వారోత్సవాల సందర్భంగా బ్యానర్లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా రహదారి భద్రతా అంశాలపై విస్తృత ప్రచారం కల్పిస్తామని వివరించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల గురించి డ్రైవర్లను అప్రమత్తం చేయడానికి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను చూపే ప్రమాద మార్గ పటాన్ని అన్ని డిపోలలో, బస్ స్టేషన్లలో ప్రదర్శిస్తామన్నారు. బ్రేకులు, స్టీరింగ్, టైర్లు, లైటింగ్ వ్యవస్థ, ప్రయాణీకుల డోర్ లాచెస్ (లాక్) పనితీరు మొదలైన వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ భద్రతా కోణంలో బస్సుల నిర్వహణ చేస్తామని పేర్కొన్నారు. ఈ వారోత్సవాల ప్రారంభానికి ముందే డ్రైవర్లందరూ తప్పనిసరిగా ఏపీఎస్ఆర్టీసీ ఆసుపత్రులలో క్రమానుగత వైద్య పరీక్షలు చేయించుకునేలా పర్యవేక్షస్తామని వెల్లడించారు. తరచుగా ప్రమాదాలకు గురిఅవుతున్న డ్రైవర్ లను కౌన్సెలింగ్ చేస్తామన్నారు. ప్రమాద రహిత వారోత్సవాలలో భాగంగా చేపట్టే కార్యక్రమాలను డిపోలోని సిబ్బంది అందరిలో అవగాహన కల్పించే విధంగా నిర్వహిస్తామని తెలిపారు.

# పరిశోధన పుస్తకానికి జాతీయ బ్రోచర్ ఆవిష్కరణ



టెక్కలి,జూలై 25, ప్రభాతవార్త :

అంతర్జాతీయ స్థాయి పరిశోధన ప్రచురణల్లో అధ్యాపకులు, పరిశోధకులు భాగస్వాములు కావాలని ఐతం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "నెక్స్ట్-జనరేషన్ బిగ్ డేటా: అనలిటిక్స్, ఏఐ ఇంటిగ్రేషన్ అండ్ రియల్-వరల్డ్ అప్లికేషన్స్" పేరుతో రూపొందుతున్న అంతర్జాతీయ సంపాదిత పరిశోధన పుస్తకానికి సంబంధించిన జాతీయ బ్రోచర్‌ను కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన పత్రాలు, అంతర్జాతీయ ప్రచురణలు అధ్యాపకులు, పరిశోధకులకు ప్రపంచస్థాయి గుర్తింపును తీసుకువస్తాయని అన్నారు. పరిశోధన ఫలితాలను అంతర్జాతీయ వేదికలపై ప్రచురించడం ద్వారా విజ్ఞాన వికాసానికి తోడ్పాటుతో పాటు సంస్థ ప్రతిష్ఠ కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.పుస్తక సంపాదకులు డా. కె. స్వరూప మాట్లాడుతూ పుస్తకం ఉద్దేశాలు, అధ్యాయాల ఆహ్వానం, రచన, సమర్పణ విధానం, సమీక్షా ప్రక్రియ, ప్రచురణ ప్రమాణాలు, రచయితలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ అంతర్జాతీయ పరిశోధన పుస్తకాన్ని ఇటరేటివ్ ఇంటర్నేషనల్ పబ్లిషర్స్ (ఐఐపీ) ప్రచురించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, ఆర్ అండ్ డి డైరెక్టర్ డా. భట్టాచార్య, ఆర్ అండ్ డి డీన్ డా. డి. శ్రీరాములు, కంప్యూటర్ డేటా సైన్స్ విభాగాధిపతి డా. టి. నరేష్, అధ్యాపకులు, పరిశోధకులు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్తమ్మతల్లికి ప్రత్యేక పూజలు

కోటబొమ్మాళి, జూలై 25, ప్రభాతవార్త:



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతులు మీదుగా ప్రారంభోత్సవం జరగనున్న తరుణంలో ఆ కార్యక్రమం విజయవంతం కావాలని స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో పురోహితులు సుసరాపు కాశ్యప్ శర్మ సర్వ విఘ్నవ పూజ జరిపించారు. ఆయనతో పాటు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బొమ్మాళి ప్రసాదరావు, పాత్రుని గోపి, దేవాది లక్ష్మణరావు, పట్నాయకుని ఇందువదన, భక్తులు, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్యాక్యుమెంటేషన్‌ను ప్రజలు వినియోగించుకోవాలి

కోటబొమ్మాళి, జూలై 25 :

ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆదేశాలు మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్తో పాటు డ్యాకువె ంటేషన్ సౌకర్యం కల్పించామని సద్వినియోగం చేసుకోవాలని కోటబొమ్మాళి సబ్ స్ట్రార్ బి. శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ దాక్యుమెంట్ రైటర్ల పెన్నో క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాలతో కార్యాలయంలోనే దస్తావేజులు తయారు చేయడం జరుగుతుందన్నారు. దీని కోసం కార్యాలయంలో మే ఐ హెల్ప్ యూ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ పని మీద వచ్చే వారిని ఎవరైన అడ్డుకుంటే సబ్ స్ట్రార్ కార్యాలయానికి వచ్చి పిర్యాదు చేయాలని కోరారు.

# గ్రామీణ నీటి సరఫరాకు ఎస్‌డిఎస్ నిధులు విడుదల : ఎమ్మెల్యే



ఆముదాలవలస , జూలై 25,(ప్రభాతవార్త):

గ్రామీణ నీటి సరఫరా ఎస్ డి ఎస్ గ్రాండ్ నుండి ఆముదాలవలస నియోజకవర్గ పరిధిలోని పొందూరు, బూర్జ మండలాలకు 16 పనుల నిమిత్తం రూ.450.05 లక్షల రూపాయలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ డెవల ప్మెంట్ మరియు గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం జీవో ఎంఎస్ నెంబర్ 94 ప్రాప్తికి నిధులు మంజూరయ్యాయి. పొందూరు మండలంలో బురిడీ కంచరం, ధర్మపురం, కింతలి గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం 187.90 లక్ష రూపాయలు విడుదలయ్యాయి. మండలంలోని 13 గ్రామాల హ్యాబిటేషన్ పరిధిలో 282.15 లక్షల నిధులు మంజూరయ్యాయని ఆ ప్రకటనలో పేర్కొ న్నారు. పి రామన్నపేట, నీలం పేట, ఓపివాడ, లాభం, ఏ బి సి పేట, లంకము, మామిడివలస, చీడివలస, గంగంపేట, నీలాదేవి పురం, తమ్మి నాయుడుపేట, గుత్తావల్లి, జికేఆర్ పురం తదితర గ్రామాలు హేమ్లెట్ పరిధిలో తాగునీటి సరఫరాకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ కృషి ఫలితంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో నిధులు మంజూర య్యాయని వారికి కృతజ్ఞతలు ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

## రొట్టవలస ఇనాం భూములపై

# వైసీపీ బహిరంగ చర్చకు సిద్ధమా ?



ఆమదాలవలస , జూలై 25,(ప్రభాతవార్త):

నియోజకవర్గంలో తప్పుడు ఆరోపణలతో పార్టీని బ్రతికించుకుంటున్న వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఇనాం భూములపై బహిరంగ చర్చకు రావాలని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ సవాల్ విసిరారు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన టిడిపి నాయకులు కిల్లి సిద్ధార్థ తాడేల రాజారావు లతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ఇన్చార్జి చింతాడ రవికుమార్ ఆరోపణల ను తీవ్రంగా ఖండించారు సరుబుజ్జిలి మండలం రొట్టవలస గ్రామానికి చెందిన ఇనాం భూముల రైతులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని కోరడం జరిగిందన్నారు పార్టీలకు అతీతంగా వచ్చిన రైతుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే రవికుమార్ రాష్ట్రస్థాయిలో ఇనాం భూముల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నాయకులు ఎమ్మెల్యే రవికుమార్ ను విమర్శించడం తగదన్నారు. సమావేశంలో కూన గణపతిరావు, లావేటి పూర్ణారావు,మీసాల రామారావు బెండి దశరథ, పి వి కే రాజు నాగళ్ళ మురళీధర్ యాదవ్ చౌదాల గోవిందరావు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి రాజీనామా విద్యార్థుల, ప్రజా ఉద్యమాల విజయం

రాజాం, జూలై 25, ప్రభాతవార్త :

నీట్ ప్రశ్న పత్రాలు లీక్ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదన్ రాజీనామా చెయ్యడం మని ఇది పరిణామం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్ అన్నారు. ఈ సంఘటన పై శనివారం రాజాం విలేకరుల తో అయన మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయాన్నారు. ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ స్పందించి బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేసారన్నారు. ఈ రాజీనామా విద్యార్థుల ,మేధావుల ప్రజా ఉద్యమాలే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాలనలో నీట్ పేపర్ లీకేజీలు, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ కొంతకాలంగా డిమాండ్ చేస్తోందన్నారు . ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు, యువతతో కలిసి ఆ పార్టీ చేపట్టిన నిరసనలు కేంద్రంపై ఒత్తిడి పెంచాయిన్నారు . పరీక్షల వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం, పేపర్ లీకేజీలకు అడ్డుకట్ట వేయడం, విద్యార్థులకు న్యాయం చేయడం వంటి డిమాండ్లను ఉద్యమకారులు ప్రధానంగా ముందుంచారన్నారు. అఖిలపక్షం బృందం విద్యార్థులు ఉద్యమానికి సంఘీభావం తెలియచేసి విద్యార్థులకు అండగా ఉన్న కారణం గా ఈ రోజు కేంద్రం దిగి వచ్చిందన్నారు.

# మెట్రో సేవలు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాలి : ఎమ్మెల్యే

ఆముదాలవలస, జూలై 25,(ప్రభాతవార్త) :



నగరాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు మెట్రో సేవలను విస్తరించాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శనివారం హైదరాబాదులో జరిగిన సౌత్ ఇండియా లార్జెస్ట్ సి ఎస్ ఆర్ సమీట్ లో తెలంగాణ మైనారిటీ మంత్రి, భారత మాజీ క్రికెట్ జట్టు కెప్టెన్ మహమ్మద్ అజరుద్దీన్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే వై.శ్రీనివాసరెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మైనారిటీ శాఖ మంత్రి, భారత మాజీ క్రికెట్ జట్టు కెప్టెన్ మొహమ్మద్ అజహారుద్దిన్,తెలంగాణ ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి సి ఎస్ ఆర్ ద్వారా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి అవార్డులు ప్రదానం చేశారు.సదస్సులో ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ సి ఎస్ ఆర్ కార్యక్రమాలు మెట్రో నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విస్తరించాలని అన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో సి ఎస్ ఆర్ నిధులు గ్రామాలకు చేరేలా కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిఎస్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మరువాడలో వర్షం కోసం గీతాయజ్ఞం



సంతబొమ్మాళి, జులై 25,ప్రభాత వార్త:

మండలంలోని దిబ్బల మరువాడ, సముద్ర తీరములో వర్షం కురవాలని మహా గీతా యజ్ఞం,చేపట్టారు. స్థానిక ఎంపీటీసీ సురాడ రాజారావు, మాజీ సర్పంచ్ సురాడ కొర్లయ్య యజ్ఞం ప్రారంభించారు, శనివారంనుంచి సోమవారం వరకు ఈ మూడు రోజులు శ్రీ మాత్ భగవద్గీత లో ఉన్న 701, శ్లోకాలు చదవడం అర్చన చేయడం, తర్వాత భజన కాలక్షేపం చేయనున్నారు , అంతకుముందు గంగా మాత పూజ చేసి సముద్రానికి వెళ్లి, అర్చన ,హారతి ,ప్రసాదము ,చీర, పసుపు ,కుంకుమలు, సమర్పించడం సమర్పించారు , వేణుగోపాల స్వామి ప్రధాన అర్చకులు గణపతి స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, మైలిపల్లి శ్రీరాములు, మెరుగు నూకయ్య,, నూకయ్య, ఈశ్వరరావు, అప్పుల స్వామి, గురు భక్తులు,, శ్రీను,. లోకేష్ ,ప్రసాద్,, వీర భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న, సన్న కారు రైతులకు ఎరువులు అందివ్వాలి

## ప్రభుత్వ విప్ అశోక్



కవిటి , జూలై 25, ప్రభాతవార్త :

చిన్న, సన్నకారు రైతులకు సకాలంలో ఎరువులు అందే విధంగా సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. శనివారం నాడు రామయ్య పుటికలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో పంటల పరిస్థితి ఎరువుల లబ్ధిత, ఏపీ ఏఐఎస్ఎఫ్వంటి విషయాలను వ్యవసాయ అధికారులతో వివరాలడిగి తెలుసుకున్నారు. వరి పంట పండించిన అందరి రైతులతో పసల బీమా యోజన చేయించాలని వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు. చిన్న సన్న కర్ర రైతులకు యూరియా డిఏపి వంటి ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు . ఎల్ ని నో ప్రభావం వల్ల రైతుల నష్టపడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారులు నరసింహమూర్తి, శ్రీదేవి లతోపాటు, మాజీ జడ్పిటిసి పొందల.కృష్ణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబుతోపాటు టీడీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



కంచిలి, జూలై 25, ప్రభాతవార్త :

కొల్లూరు పంచాయతీ గుండాం గ్రామంలో 50 మీటర్లు సుమారు 2 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు తెలుగుదేశం పార్టీ కంచిలి మండలం అధ్యక్షులు మాదిన రామారావు చేతుల మీదగా శంకుస్థాపన చెయ్యడం జరిగింది. కార్యక్రమంలో ఐటీడీపి కంచిలి మండలం అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామారావు,జూఖుఎం మెంబెర్స్ కిషోర్, శ్రీకాంత్, క్లస్టర్ ఇంచార్జి పూర్ణ, ప్రదీప్, గురునాథం,కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ లా సమావేశంలో పాల్గొన్న అన్వేష్

ఇచ్ఛాపురం, జులై 25, ప్రభాత వార్త:



విశాఖపట్నం డాల్ఫిన్ హోటల్ లో జరుగుతున్న "ఉత్తరాంధ్ర క్రిస్టియన్ లా ఇంటర్నేషనల్" సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టర్ ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు. బిషప్ పాల్ విక్టర్ , బిషప్ డి.ఎస్.వి.ఎస్. కుమార్ కార్యక్రమానికి హాజరయ్యారు. అన్వేష్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైతులకు అంతర పంటలపై అవగాహన



కంచిలి,జులై 25, ప్రభాత వార్త:

అంపూరం గ్రామంలో ఈరోజు వరిలో నాలుగు మోడల్స్ పైన కేడర్స్ కు మరియు రైతులకు డెమో మోడల్‌లో వేసి చూపిస్తూ ఫీల్డ్ మాస్టర్ ట్రైనర్, శివానందం వివరించడం జరిగింది. ఒక మోడల్ నాలుగు అడుగులకు ఒక బెడ్ దానిపైన అడుగుకు ఒక వరుస వరి, మరో వరుస బెండ మరొక వరుస వరి మరో వరుసముల్లంగి, మరో వరుస వరి, మరో వరుస గోంగూర,మరో వరుస వరి మరో వరుస గోరుచిక్కుడు ఈ విధముగా ఒక్కో బెడ్ పైన నాలుగు రకాల జాతులు కూరగాయలు ,ఆకుకూరలు, దుంప జాతి ,వరి ఇలా నాలుగు రకాలు ఒక బెడ్ పైన వేయడం వలన రై తుకి వరి తో పాటుకూరగాయల ఆదాయం వస్తుంది. రెండవ మోడల్ ఒక లైన్ వరి ఒక లైను పప్పు ధాన్యాలు ఇలా వరుసల పద్ధతులు మోడల్స్ మూడో మోడల్ డైరెక్ట్ గా వరి కూరగాయలు ఆకుకూరలు పప్పు దినుసులు అన్నీ కలిపి ఒక దగ్గర వేయడం వలన కలుపు మందులు వాడకుండా ఉండడానికి ఈ పద్ధతిలో వేయించడం జరిగింది.దీనికి హాజరైన వారు ఎన్ ఎఫ్ ఏ శివాజీగారు, మెంటర్ లోహిదాసు, కామరాజు, అంపురం,అఎతీజూ లు లీడ్ ఫార్మర్స్ మరియు రైతులు హాజరు కావడం జరిగింది.

# ఘనంగా ఏకాదశి వేడుకలు



కంచిలి,జులై 25, ప్రభాత వార్త:

కంచిలి కొల్లూరు గ్రామంలో గల జగన్నాథ స్వామి దేవాలయాల్లో తొలి ఏకాదశ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బహుడా యాత్ర మరుసటి రోజు రథం పైనే దేవతామూర్తులు పూజలు అందుకోవడం ఆనవాయితీ. ఏకాదశి సందర్భంగా జగన్నాథ స్వామి రథలు వద్ద భక్తులు దేవత మూర్తులకు పూజలు చేసి భక్త పారవశ్యంలో మునిగితేలేరు.

## రణస్థలంలో..



రణస్థలం, జూలై 25, ప్రభాతవార్త

ఆషాఢ మాసంలో వచ్చే పవిత్రమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని గరికిపాలేం వేంకటేశ్వర స్వామికి ఆలయ అర్చకులు దర్భముళ్ళ కామేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అశేష భక్తులు పాల్గొన్నారు. ఈ తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, వెంకటేశ్వర స్వామిని తులసి దళాలతో పూజించి 'ఓం నమో వేంకటేశాయ' నామాన్ని స్మరిస్తే సమస్త పాపాలు తొలగి, శ్రేయస్సు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తులకు అర్చకులు వివరించారు.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

FOR SALE

★ సింగిల్ బెడ్ రూమ్, డబల్ బెడ్ రూమ్ అక్కయ్యపాలెం వైజాగ్ నందు అమ్మకము నకు కలవు (దక్షిణం face, 3 YRS old) CALL 9492532878.

(Ro.No.16549)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


శ్రీకాకుళం వార్త



# కలెక్టర్ ,ఎమ్మెల్యేకు బిటివాడ గ్రామ ప్రజలు నీరాజనాలు

వీరఘట్టం, జూలై 25, ప్రభాతవార్త:



ప్రజల ముంగిటికే ప్రజా పాలన తెచ్చే విధంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని, దీనివల్ల ప్రజలకు సేవలు అందించడంలో ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని కలెక్టర్ కె ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం బిటివాడలో ఒక నెల, ఒక నియోజకవర్గం, నాలుగు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారికి బిటివాడ గ్రామ ప్రజలు నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో తహశీల్దార్ వి. రాజేశ్వరరావు, ఎంపీడీవో బి వెంకటరమణ, వ్యవసాయ శాఖ ఏ డి ఏ కే రత్నకుమారి మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య మండల పశు వైద్య శాఖ అధికారి చైతన్య శంకర్ ఏపీవో జీ సత్యం నాయుడు ఎంఈఓ ఆర్ ఆనందరావు తోపాటు మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు యువ నాయకులు ఉదయాన ఉదయభాస్కర్ వీరఘట్టం పట్టణ శాఖ సీనియర్ నాయకులు జామి లక్ష్మీనారాయణ జనసేన నాయకులు తూర్పు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గర్భాన సత్తిబాబు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గొర్లే గౌరునాయుడు వైశ్య సంఘం రాష్ట్ర డైరెక్టర్ తూముల రమేష్ జనసేన నాయకులు లింగాల చంటి జంపు శేఖర్ చుక్కా శ్రీనివాసరావు మత్స వెంకటరమణ ముద్ద వెంకటరమణ కర్రి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర దివ్య క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

సీతంపేట, జూలై25, ప్రభాతవార్త :



తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సీతంపేటలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర దివ్య క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. మొదట ఏకాదశి శనివారం కావడంతో శ్రీ వెంకటేశ్వర ఆలయ దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. పాలకొండ కొత్తూరు హిరామండలం వీర గొట్టం శ్రీకాకుళం రాజాం తదితర ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద ఎత్తు తరలి రావడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది స్థానిక ఎస్సై వై.అమ్మన్నారావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఆలయ సమీపంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలు. రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

# థింసా నృత్యానికి తరలి వెళ్లిన గిరిజన విద్యార్థులు

సీతంపేట, జూలై 25, ప్రభాతవార్త :

ప్రధానమంత్రి మోడీ ఆగస్టు 1న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవానికి రానున్నారు. దీని దృష్టిలో పెట్టుకొని ఆరోజు ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా గిరిజన దింసా నృత్యాన్ని ఏర్పాటు చేశారు. ఐదు జిల్లాల పరిధిలో 16000 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నరని, సీతంపేట ఐటిడిఏ నుంచి 1600 వందల మంది గిరిజన విద్యార్థులు ఈ దింషా నృత్యంలో పాల్గొనడానికి ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు నిమగ్నం అయ్యారు ఈ దింసా నృత్యం గిన్నిస్ బుక్‌లో నమోదు చేసుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సీదిరి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

పలాస, జూలై 25, ప్రభాతవార్త :



మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకురాలు రెడ్డి శాంతి మరియు కాంగ్రెస్ నాయకురాలు కిల్లి కృపారాణి తదితరులు శనివారం పలాసలో డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి శ్రీదేవి ని కలిసి పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటన ఆధారంగా అప్పలరాజు కుటుంబాన్ని రాజకీయంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అయితే, అనుకోకుండా జరిగిన ఒక ప్రమాదాన్ని రాజకీయ కక్షసాధింపుగా మార్చడం రాజకీయాలకు అతీతంగా తీవ్రంగా ఖండించదగిన విషయమని పేర్కొన్నారు.

**అప్పలరాజు కుమారుడిపై అక్రమ కేసులు:**

డాక్టర్ చదువుతున్న అప్పలరాజు కుమారుడు (ఆరవ్ వర్మ) ప్రమాద సమయంలో వెనుక సీట్లో కూర్చుని ఉన్నాడని, అతనికి కూడా తల, కడుపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అతనే 108 కి ఫోన్ చేసి సమాచారం అందించినప్పటికీ, పోలీసు వ్యవస్థను ఉపయోగించి అతనిపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడం దారుణమని మండిపడ్డారు.

# నేరడి బ్యారేజీకి రూ.641కోట్లు

## -దశాబ్దాల స్వప్నాన్ని సాకారం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
## -నిమ్మాడలో మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపిన ఇరిగేషన్ అధికారులు

కోటబొమ్మాళి, జూలై 25, ప్రభాతవార్త :



ఉత్తరాంధ్ర సాగునీటి రంగ చరిత్రలోనే ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. వంశధార పరివాహక ప్రాంత రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నెరడి బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.641 కోట్లు మంజూరు చేయడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాలుగా చిక్కుముడిగా మారిన జల వివాదానికి తెరదించి, అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేస్తూ ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించడంలో రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చూపిన అనన్యసామాన్యమైన కృషిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ సందర్భంగా శనివారం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఇరిగేషన్ అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందించి ఘనంగా అభినందించారు. మంత్రిని కలిసినవారు వంశధార ఎస్ఈ జి. రామచంద్రరావు ఇరిగేషన్ ఎస్ఈ పి. సుధాకరరావు , టెక్కలి ఈఈ బి. శేఖరరావు, నరసన్నపేట ఈఈ ఎం. మురళీమోహన్ వంశధార డీఈఈలు, ఏఈఈలు ఉన్నారు.

# ముగ్గురు చిన్నారులకు అందని 'తల్లికి వందనం'

సంతబొమ్మాళి, జూలై 24, ప్రభాత వార్త

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం అర్హులైన విద్యార్థులకు కూడా అందని పరిస్థితులు నెలకొంటున్నాయి. మండలంలో చిన్న మరువాడ గ్రామానికి చెందిన గోవింద బాలకృష్ణ--సంధ్య దంపతుల ముగ్గురు పిల్లలు కేవలం హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్‌లో జరిగిన లోపం కారణంగా పథకానికి దూరమయ్యారు.బాలకృష్ణ కుటుంబం పూర్తిగా కూలి పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తోంది. తండ్రి వలస కూలీగా ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేస్తుండగా, తల్లి గ్రామంలో దొరికిన కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇలాంటి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన విద్యార్థులు కవిత, సందీప్, గగన్ కు 'తల్లికి వందనం' పథకం అందకపోవడం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస, జూలై 25, ప్రభాతవార్త :

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష తెలిపారు. శనివారం పలాస నియోజకవర్గం కాశీబుగ్గ-పలాస మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడు గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 15 లక్షల వ్యయంతో 255 మీటర్ల పొడవున కాలనీ నుండి బరెల్ గ్రౌండ్ వరకు నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష గమాట్లాడుతూ: పట్టణాలు, గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. పెసరపాడులో ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు సౌకర్యవంతంగా మారడమే కాకుండా, వర్షాకాలంలో ఎదురయ్యే బురద, నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావుబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లోడగల కామేష్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్ పలాస మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26 -7Pg9th cheli.qxd:26 -7Pg9th cheli.qxd 1/1/02 6:30 AM Page 1



# ఒరుగులు

## బెండ



**కావలసినవి:** బెండకాయలు-కిలో, ఉప్పు-రుచికి తగినంత, చిక్కటి మజ్జిగ-3 కప్పులు, పసుపు-స్పూన్, కారం- ఒకటిన్నర స్పూన్లు.

**తయారీ :** పుచ్చులేని బెండకాయలను ఎంచుకోవాలి. వాటిని బాగా కడిగి.. తొడిమెలు తీసేయాలి. కూరలోకి కోసుకున్నట్టు కాకుండా కాస్త పెద్ద ముక్కలుగా కట్ చేసుకోవాలి. వెడల్పాటి పాత్రలో మజ్జిగ పోసి.. కారం, ఉప్పు, పసుపు వేసి.. బాగా కలపాలి. కప్పుడు బెండకాయ ముక్కలు జోడించాలి. ఈ మిశ్రమాన్ని రెండు మూడు ప్లేటుల్లోకి తీసి.. ఎండబెట్టాలి. సాయంత్రం ఇంట్లోకి తెచ్చి మర్నాడు మళ్లీ ఎండలో ఉంచాలి. అలా ముక్కలు పెళుసుగా అయ్యేవరకూ ఎండబెడుతుండాలి. బాగా ఎండిపోయాక గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకుంటే.. కూర చేసుకోవచ్చు. సాంబార్‌లో వేసుకోవచ్చు. వీటిలో ఉప్పు ఉంటుంది. కాబట్టి మళ్లీ వేయనవసరం లేదు.

## కాకర :

**కాకరకాయలు**-కిలో, కారం-నాలుగు స్పూన్లు, ఉప్పు-రుచికి తగినంత, పసుపు, మెంతి పొడి-స్పూన్ చొప్పున, డ్రై జింజర్ పౌడర్-ముప్పావు స్పూన్, ఆవపొడి- టేబుల్ స్పూన్, ఆమ్‌చూర్ పౌడర్- అర స్పూన్



**తయారీ :** కడిగిన కాకరకాయలను తడిలేకుండా తుడిచి సన్నటి చక్రాల్లా కోయాలి. ఈ ముక్కల్లో ఉప్పు, పసుపు జోడించి.. రెండు గంటలు పక్కనుంచాలి. అందులో ఊరిన నీరు తీసేసి.. డ్రై జింజర్, ఆమ్‌చూర్ పౌడర్లు, కారం, మెంతి, ఆవపొడులు వేసి కలపాలి. వాటిని వస్త్రం మీద పరిచి ఎండబెట్టాలి. ముక్కలు పెళుసుగా కావడానికి మూడు నాలుగు రోజులు పడుతుంది. నాలుగైదు నెలలు నిల్వ ఉండే ఈ ఒరుగులతో కూర, వేపుడు ఏదైనా చేసుకోవచ్చు.

## అరటి ..



**కావలసినవి :** పచ్చి అరటికాయలు-కిలో, పసుపు-ఒకటిన్నర స్పూన్లు, ఉప్పు-రుచికి తగినంత, కారం-రెండు స్పూన్లు, ఆవపొడి-ముప్పావు స్పూన్

**తయారీ :** అరటికాయల చెక్కు తీసి గుండ్రంగా ముక్కలు కోయాలి. సగం పసుపును నీళ్లలో కలిపి.. ముక్కలను అందులో వేసి ఐదు నిమిషాలుంచాలి. తర్వాత ఆ నీళ్లు వంపేసి.. మిగిలిన పసుపు, ఆవ పొడి, కారం, ఉప్పు జోడించి బాగా కలపాలి. ఈ ముక్కలను వస్త్రంమీద పరిచినట్లు వేసి మూడు రోజులు ఎండబెట్టాలి. బాగా ఎండి.. తుంచితే సాగకుండా మిరిగిపోయేట్లు అయ్యాక.. గాలిచొరబడని సీసాలో భద్రం చేసుకోవలి. వీటితో కూర, పులుసు చేసుకోవడమే కాదు..వడియాల్లా వేయించి తినొచ్చు కూడా..

## బీట్ రూట్ ...

**కావలసినవి:** బీట్‌రూట్-అరకిలో, నిమ్మకాయలు-రెండు, పసుపు-పావు స్పూన్, మిరియాల పొడి-అర స్పూన్, ఉప్పు-రుచికి తగినంత, నిమ్మరసం-మూడుస్పూన్లు



**తయారీ :** బీట్‌రూట్ దుంపల చెక్కు తీసి.. స్లైసులుగా చేసుకోవలి. ఒక పాత్రలో నిమ్మరసం, పసుపు మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. అందులో బీట్‌రూట్ ముక్కలు జోడించి.. ఎగరేసినట్లు చేయాలి. నిమ్మరసం ముక్కలకు పట్టే వరకూ అలా చేయాలి. వాటిని రెండు ప్లేటుల్లో పరిచినట్లు పేర్చి ఎండబెట్టాలి. పచ్చితనం అంతాపోయి తుంచితే విరిగేట్లు అయ్యాక గాజు లేదా ప్లాస్టిక్ కంటెయినర్‌లోకి తీసుకోవాలి. కారం, ఉప్పు, పులుపు ఉన్న పదార్థాలు వేటినీ కూడా స్టీలు పాత్రల్లో నిల్వవుంచకూడదు.

## టొమాటో.

**కావలసినవి :** టొమాటోలు-కిలో, ఉప్పు-రుచికి తగినంత, పసుపు-ముప్పావు స్పూన్, కారం-రెండు స్పూన్లు, డ్రై జింజర్ పౌడర్-ముప్పావు స్పూన్



**తయారీ :** కడిగిన టమాటోలను తడి లేకుండా తుడవాలి. ఒక్కోదాన్ని నిలువుగా ఎనిమిది లేదా పది ముక్కలుగా కోసుకోవాలి. అందులో కారం, ఉప్పు, పసుపు వేసి కలపాలి. ఆ ముక్కలను వస్త్రం మీద పరిచి.. ఎండబెట్టాలి. బాగా ఎండిన తర్వాత సీసాలోకి తీసి భద్రం చేసుకుంటే ఎక్కువ రోజులు నిల్వ వుంటాయి.

## చిట్కా

**ముద్గధాలి గధవ్యాలి:** అన్ని రకాల పప్పు ధాన్యాలలో, పచ్చ పెసలు ఉత్తమమైనవి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇతర పప్పు ధాన్యాలు అన్నీ, ఒకటి లేదా మరొకటి దుష్ప్రభావాలను కలిగి ఉంటాయి.

**బాగ్నస్తి సంధనకరో రాసోనాహ:** వెల్లుల్లి విరిగిన ఎముకలతో కలుస్తుంది. వెల్లుల్లి తరచుగా తినేవారిలో ఎముకలు, వాటి జాయింట్లు గట్టిగా ఉంటాయి. అతి సర్వత్రా వర్జయేత్:అధికంగా తినేది ఏదైనా, అది మంచి రుచిని కలిగి ఉన్నా, ఆరోగ్యానికి మంచిది కాదు. మితంగా (తక్కువ) తినండి.

**నాస్తిమూలం అనౌషాధం:** శరీరానికి ఎటువంటి ఔషధ ప్రయోజనం లేని కూరగాయలు అంటూ లేవు.

**నా వైద్యా ప్రభుయుయుషా:** ఏ డాక్టర్ కూడా మన దీర్ఘాయువుకు ప్రభువు కాదు. వైద్యులకు కొన్ని పరిమితులు ఉన్నాయి.

# రుతు చక్రం గుండె లయ తప్పేనా ?



**మహిళల శరీరం సహజ హార్మోన్ల మార్పులకు ఎలా స్పందిస్తుందనే అంశంపై ఎన్నో పరిశవోదనలు జరుగుతున్న విషయం విదితమే మహిళలు, క్రీడాకారిణులు, వైద్య నిపుణులు గుండె ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షల ఫలితాలను అర్థం చేసుకునేటప్పుడు రుతుచక్ర దశలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు.**

మహిళల రుతుచక్రం కేవలం పునరుత్పత్తికే పరిమితం కాదు. కొన్ని సందర్భాల్లో గుండె పనితీరుపైనా ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. నెలసరి సమయంలో శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులు గుండె స్పందన నియంత్రణ వ్యవస్థలో మార్పులకు కారణమవుతాయని పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ మార్పులు కండరాల బలం, మానసిక స్థితి లేదా పనులు చేయాలనే ఉత్సాహంపై గణనీయ మైన ప్రభావం చూపవంటోంది. గుండె ఒకే రీతిలో కొట్టుకుం టున్నట్లు కనిపించిన ప్పటికీ, ప్రతి స్పందన మధ్య విరామం స్వల్పంగా మారుతూ ఉంటుంది. హార్ట్ రేట్ వెరియబిలిటీ (హెచ్ఆర్‌వి) అంటే గుండె కొట్టుకునే ప్రతి రెండు స్పందనల మధ్య ఉండే సమయ వ్యవధిలో కనిపించే చిన్నచిన్న తేడాలను సూచిస్తుంది. సాధారణంగా హెచ్ఆర్‌వి ఎక్కువగా ఉంటే శరీరం ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటోందని భావిస్తారు. ఈ అధ్యయనంలో సహజంగా రుతుచక్రం ఉన్న ఆరోగ్యవంతమైన మహిళలను ఎంపిక చేసి, వారి రుతుచక్రంలోని వివిధ దశల్లో గుండె పనితీరు, కండరాల బలం, మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహాన్ని పరిశీలించారు. ప్రారంభ ఫాలిక్యులర్ దశ, అండోత్సర్గం దశ, ల్యూటియల్ దశలలో హెచ్ఆర్‌వితో పాటు ఇతర శారీరక మార్పులను పోల్చి హార్మోన్ల ప్రభావాన్ని విశ్లేషించారు రుతు సమయంలో వస్తున్న మార్పులు గమనిస్తే.. రుతుచక్రంలోని ప్రతి దశలో హెచ్ఆర్‌విలో స్పష్టమైన మార్పులు కనిపించాయి. హార్మోన్ల స్థాయిలు మారేకొద్దీ గుండెను నియంత్రించే స్వయంచాలక నాడీ వ్యవస్థ పనితీరులో కూడా మార్పులు నమోద య్యాయి. ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్ హార్మోన్ల హెచ్చుతగ్గులు గుండె స్పందన నియంత్రణపై ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. మహిళల మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహం కూడా రుతుచక్రంలోని వివిధ దశల్లో పెద్దగా మారలేదని అధ్యయనం తెలిపింది. అంటే హార్మోన్ల మార్పులు గుండె నియంత్రణ వ్యవస్థపై ప్రభావం చూపినా, శారీరక పనితీరు మాత్రం చాలా వరకు స్థిరంగానే ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఈస్ట్రోజెన్ రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడటంతో పాటు గుండె స్పందనను ప్రశాంతంగా ఉంచే వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. మరోవైపు ప్రొజెస్టెరోన్ కొన్ని దశల్లో గుండె స్పందనను వేగవంతం చేసే నాడీ వ్యవస్థను ఎక్కువగా చురుకుగా మారుస్తుంది. అందువల్ల ఈ రెండు హార్మోన్ల స్థాయిల్లో నెలనెలా జరిగే మార్పులు హెచ్ఆర్‌వి లో తేడాలకు కారణమవు తాయి. ఈ ఫలితాల ప్రకారం స్మార్ట్‌వాచ్‌లు లేదా ఫిట్‌నెస్ ట్రాకర్ల ద్వారా హెచ్ఆర్‌విని గమనించే మహిళల్లో నెలసరి సమయంలో సహజంగానే కొన్ని మార్పులు గమనిస్తుం టారు. అలాంటి మార్పులు కనిపించిన ప్రతిసారి ఆందోళన చెందాల్సిన అవసరం ఇది పరిశోధకులు చెప్పే మాట.

# సుతి మెత్తగా..!

**ఉద్యోగం, సంపాదన, నూతన లక్ష్యలు... కారణా లేమైతేనేం అమ్మాయిలది ఉరుకుల పరుగుల జీవితమే ఒత్తిడి పెరిగిపోయి హార్మోనుల అసమతుల్యత, హృద్రోగాలూ వస్తున్నాయి.**



అయితే, వీటితోపాటే ఆరోగ్యంకోసం వెల్నెస్ ట్రెండ్‌లూ వస్తున్నాయి. వాటిలో టే అటానమస్ సెన్సరీ మెరీడియన్ రెస్పాన్స్ ట్రెండ్. దీన్నే సింపుల్గా ఏఎస్ఎంఆర్ అని అంటారు. అందులో ఏం చేస్తారో తెలుసా? చిన్నతనంలోనే కాదు ఇప్పటికీ చాలామందికి బబుల్ ర్యాప్ చూస్తే దాన్ని టపీమని ఒత్తేయాలనిపిస్తుంది. మెత్తగా, నున్నగా ఉన్న ఇసుకలో బొమ్మలు వేయాలని పిస్తుంది. ఈ అనుభూతులన్నింటికీ కారణం జ్ఞానేంద్రియాలే అందుకే మానసిక ప్రశాంతత పొందడానికి అప్పుడప్పుడూ జ్ఞానేంద్రియాలను ఉత్తేజ పరుస్తుంది. అందులో భాగంగా వచ్చిందే ఈ ఎస్ఎస్ఆర్ ట్రెండ్ కూడా. దీన్లో భాగంగా మైక్రోఫోన్‌లో మంత్రంగా మాట్లాడడం, చిన్న శబ్దాలు చేయడం, నెమ్మదిగా చేతివేళ్లను కదిలించే లాంటి వీడియోలు చూడడం లేదా వినడం చేస్తారు. ఇక రంగు రుcగుల సబ్బుల్ని చాకుతో తురమడం, మెత్తగా జెల్లీలా ఉన్న పదార్థాలను తాకుతుండే వీడియోలు చూడడమూ దీన్లో భాగమే. అంతెందుకు మన తలకు ఎవరైనా మసాజ్ చేసినా, చెవిలో ఇయర్ మనకు మనమే సుతిమెత్తగా తిప్పినా అలాంటి అనుభూతినే పొందుతాం. ఆ సంతృప్తే... అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చేసిన పరిశోధ నలు చెబుతున్నాయి. హాయినిచ్చే ఇలాంటి వీడియోలను చూసిన ప్పుడు మెదడులో రివార్డు, ఎమోషనల్ భాగాలు యాక్టివేట్ అవుతా యట. న్యూరో హార్మోనులైన ఆక్సిటో, డోపమైన్, ఎండార్ఫిన్లు విడుదలై మూడ్ని మెరుగుపరుస్తాయిట. అనేక దీర్ఘకాల నొప్పులనూ తగ్గిస్తాయట. ఏకాగ్రతను పెంచడంతో పాటు, రిలాక్స్ అయ్యేలా చేసి మంచి నిద్ర పట్టేలానూ చేస్తాయట. ఆందోళన, ఒత్తిడి, బీపీ వంటి సమస్యలు తగ్గిపోతాయి. ఎప్పుడైనా నిద్రపట్టనప్పుడూ, ఆందోళనగా అనిపించినప్పుడూ... అందుకే కుర్చీలోనో, బెడ్మీదో కూర్చోని ఇలాంటి వీడియోలు చూస్తే మనసు కుదుటపడుతుంది.



# 'శ్రీనివాస మంగాపురం' బాబాయ్‌కి నచ్చింది. : జై కృష్ణ



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు.

**మీకు యాక్టర్ కావాలనే ఆలోచన ఎప్పుడు మొదలైంది?**

నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. నా 16వ ఏటా యాక్టర్ కావాలని నిర్ణయించుకున్నాను. డిసైడ్ అయిన తర్వాత ప్రాపర్‌గా ట్రైనింగ్ స్టార్ట్ చేశాను. రెండేళ్లు ముంబై వెళ్లాను. తర్వాత పాండిచ్చేరి వెళ్లాను. అక్కడ కొంతకాలం శిక్షణ తీసుకున్న తర్వాత న్యూయార్క్ వెళ్లాను. అక్కడ కూడా రెండు సంవత్సరాలు శిక్షణ తీసుకున్నాను. తిరిగి వచ్చిన తర్వాత కథలు వినడం మొదలు పెట్టాను..

**శ్రీనివాస మంగాపురం జర్నీ ఎలా స్టార్ట్ అయింది?**

జెమినీ కిరణ్ ద్వారా ఈ జర్నీ స్టార్ట్ అయింది. ఆయనే అజయ్‌ని పరిచయం చేశారు. అలా ఈ సినిమా మొదలైంది. ఇంతకుముందు కూడా నేను కొన్ని కథలు విన్నాను. కాకపోతే అజయ్ చెప్పిన కథ చాలా అద్భుతంగా అనిపించింది.

**మీ ఫ్యామిలీ సపోర్ట్ ఎలా ఉంది? మహేష్ ఈ సినిమా చూశారా ?**

నాకు ఫ్యామిలీ సపోర్ట్ ఉంది. ప్రతి అడుగులో బంగారు తాతయ్య ప్రోత్సాహం ఉంది.
మహేష్ బాబాయ్ ప్రతి విషయంలో గైడెన్స్ ఇస్తారు. ఆయన ఆయన సినిమా కూడా చూశారు. చాలా హ్యాపీగా ఫీలయ్యారు. ఆయనకు చాలా నచ్చింది.

**వైజయంతి మూవీస్‌లో మీ తొలి సినిమా చేయడం ఎలా అనిపిస్తోంది?**

అశ్విని దత్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. వైజయంతి మూవీస్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలో లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. బాబాయ్ తొలి సినిమా కూడావైజయంతి మూవీస్‌లోనే వచ్చింది.

**మీ ఫ్యామిలీ నుంచి ఒక హీరో వస్తు న్నారంటే చాలా అంచనాలు ఉంటాయి కదా... మీ మీద ఆ ఒత్తిడి ఉందా?**

నేను ఈ సినిమా చేస్తున్నానని తెలియక ముందే ఘట్టమనేని అభిమానులు నాకు ఎంతో సపోర్ట్ చేశారు. .

**రాషా తడానీ గురించి?**

రాషా ఈ సినిమా చేయడం ఈ సినిమాకి ఒక మంచి అసెట్. తనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్.

**ఇందులో మీరు చేసిన శ్రీను పాత్ర ఎలా ఉండబోతుంది?**

శ్రీను వెరీ ఫన్ లవింగ్. తనలో అల్లరి ఉం టుంది. తనకేం కావాలో తనకి క్లియర్‌గా తెలుసు. తను మంగని ప్రేమిస్తాడు. ఆ తర్వాత కథ ఎలా సాగు తుందనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది.

**షూటింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి?**

ఈ సినిమా కోసం 70 రోజుల పాటు అవుట్‌డోర్ షూటింగ్ చేశాం. ప్రతిదీ పబ్లిక్‌లోనే షూట్ చేశాం. ఈ ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నాను.

**మోహన్‌బాబుతో వర్కింగ్ ఎక్స్ పీరియన్స్ గురించి?**

మోహన్ బాబు వెరీ స్వీట్. చాలా క్లోజ్‌గా ఉంటారు.

**నాన్నగారు మీకు చిన్నప్పుడు ఏమైనా చెప్పేవారా?**

ఆయన చాలా సినిమాలు చూసే వారు. మేమిద్దరం సినిమా గురించి చాలా మాట్లాడుకునేవాళ్లం.

# సైకలాజికల్ థ్రిల్లర్ 'లూసీ' షూటింగ్ పూర్తి

విభిన్న కాన్సెప్ట్‌తో రూపొందుతున్న 'లూసీ' చిత్రానికి సంబంధించిన షూటింగ్ విజయ వంతంగా పూర్తైంది. మైండ్‌బెండింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కు తున్న ఈ సినిమా ప్రేక్షకులను సస్పెన్స్, థ్రిల్, ఊహించని మలుపులతో అలరించ నుందని చిత్ర బృందం తెలిపింది. సైన్మా స్టూడియోస్ బ్యానర్‌పై రాఘవేంద్ర పూజారి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అండాలమ్మ పిక్చర్స్ సమర్పిస్తోంది. ప్రస్తుతం ఎన్ఐటీ వరంగల్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న రాఘవేంద్ర పూజారి, టాలీవుడ్‌లో అత్యంత చిన్న వయసులో చదువును కొనసాగిస్తూనే సినీ నిర్మాణ రంగంలో నిర్మాత గా కూడా తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించాలనే లక్ష్యంతో వరుస సినిమాలను నిర్మించేందుకు ఆయన సిద్ధమవు తున్నారు. మహదేవ్ చిరంజీవి కథ, దర్శకత్వం వహించగా, ఆశిష్ పసుల, కిరణ్ పట్టేటి సహ నిర్మాత



లుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో చరణ్ రాజ్, శశాంక్ బాలు, ప్రశాంతి ఏడే, బల్వీర్ సింగ్, రంజిత్ నగెల్లి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సాంకేతిక విభాగంలో లీది సినిమాటోగ్రఫీతో పాటు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించగా, వియాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. నాగేష్ అడపా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తవడంతో ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగు తున్నాయి. త్వరలోనే టీజర్, ట్రైలర్, విడుదల తేదీకి సంబంధించిన అధికారిక ప్రకటనలు వెలువడనున్నాయి. సైకలాజికల్ థ్రిల్లర్‌లను ఇష్టపడే ప్రేక్షకులకు 'లూసీ' ఒక కొత్త అనుభూతిని అందించ నుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేస్తోంది.

# 'విశ్వనాథ్ సన్స్' 'ది వెడ్డింగ్ సాంగ్' విడుదల



'ది వెడ్డింగ్ సాంగ్'లో మెరిసిపోతున్న సూర్య, మమితా బైజుతమిళ అగ్ర కథానాయుడు సూర్య ప్రధాన పాత్రలో ప్రతిభగల దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందిస్తోన్న చిత్రం 'విశ్వనాథ్ సన్స్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'నేనో బటర్‌ఫ్లై' విశేషంగా ఆకట్టుకుంది. ఆ ఉత్సాహంతో విశ్వనాథ్ సన్స్ చిత్ర బృందం, 'ది వెడ్డింగ్ సాంగ్' రూపంలో అభిమానులకు మరో కానుకను తీసుకొచ్చింది. ఈ రెండవ గీతం విడుదలైన తక్షణమే అందరినీ అలరిస్తూ, అసలుసిసలైన వేడుకల గీతంగా ప్రశంసలు అందుకుంటోంది. ఉత్సాహభరితమైన, పండుగ వాతావరణాన్ని తలపించే ఈ పాటలో.. సూర్య, మమితా బైజు తమ అద్భుతమైన నృత్యంతో తెరపై వెలుగులు నింపుతూ, ఒక ఘనమైన కుటుంబ వివాహంలోని ఆనందాన్ని, ఆత్మీయతను కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ పాటను సూర్య స్వయంగా ఆలపించడం మరింత ప్రత్యేకంగా, హృదయానికి హత్తుకునే సంగీత అనుభూతిగా మార్చింది. ఈ గీతానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చగా, రామజోగయ్య శాస్త్రీ సాహిత్యం అందించారు. ఈ అద్భుతమైన సంగీత సాహిత్య కలయిక, పాటకు సంబరాల అనుభూతిని జోడించింది. కేవలం ప్రకటనతోనే 'విశ్వనాథ్ సన్స్' సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పోస్టర్లు, టీజర్ ఆకట్టుకోవడంతో పాటు.. 'నేనో బటర్‌ఫ్లై', 'ది వెడ్డింగ్ సాంగ్' వంటి వరుస చార్ట్‌బస్టర్లతో ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. ఈ కుటుంబ కథా చిత్రం స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఆగస్టు 14, 2026 న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.

# "అమ్మా.. నాకు ఆ అబ్బాయి కావాలి' ఆగస్టు 7న విడుదల



జిఎస్ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త శైలజ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విభిన్న ప్రేమకథా చిత్రం "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి". పవన్ మహావీర్ లండన్ లో వైద్య విద్య అభ్యసిస్తూ హీరోగా నటించడం విశేషం. శివాల ప్రభాకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వర్షిక, సుహానా హీరోయిన్లు. సుమన్, రావు రమేష్, రాజీవ్ కనకాల, సత్యకృష్ణ, సుజాత తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్ విడుదల చేశారు!!హైదరాబాద్, ప్రసాద్ ల్యాబ్ లో అత్యంత ఘనంగా జరిగిన ఈ వేడుకకు ప్రముఖ దర్శకులు దర్శకుల సంఘం అధ్యక్షులు వి.ఎన్. ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ దర్శకులు సి.రాంప్రసాద్, శివనాగు, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. "నిర్మాత జి. శైలజరెడ్డి మాట్లాడుతూ... "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి" అద్భుతంగా వచ్చేందుకు సహకరించిన సాంకేతిక నిపుణులకు, నటీనటులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. డాక్టర్ టర్నెడ్ హీరో మహావీర్ మాట్లాడుతూ.... "డాక్టర్‌గా వైద్యం... హీరోగా వినోదం అందించాలనే తన సంకల్పం కార్యరూపం దాల్చడానికి కారకురాలైన దేవతలాంటి మా అమ్మకు ఈ జన్మంతా రుణపడి ఉంటాను. ఈ చిత్రం ఇంత గొప్పగా రావడం కోసం మనసుపెట్టి పనిచేసిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు

# 'ది మేజ్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, ప్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. 'ది మేజ్' చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు.ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను ఈ రోజు మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో లీడ్ యాక్టర్స్ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపిస్తుండగా, వారి బ్యాక్ డ్రాప్‌లో ఒక మహానగరాన్ని చూపించారు. లీడ్ యాక్టర్స్ అంతా బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో ఉండటం ఆసక్తి కలిగి స్తోంది. న్యూ ఏజ్ కమర్షియల్ థ్రిల్లర్ మూవీని చూడబోతున్నామనే ఇంప్రెషన్ 'ది మేజ్' ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఏర్పడుతోంది.

# 'నేను రెడీ' మూవీ సాంగ్ లాంచ్



సాంగ్ లాంచ్ ఈవెంట్ లో బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బాబీ కొల్లి 'నేను రెడీ' నా కెరీర్ ్లో బెస్ట్ మూవీ అవుతుంది: హీరో హావిష్‌హావిష్, కావ్య థాపర్, నర్గిస్ ఫక్రీ 'నేను రెడీ' నుంచి అదిరిపోయే రొమాంటిక్ 'కొంచెం కొంచెం' సాంగ్ లాంచ్‌యంగ్ హీరో హవీష్ కథానాయకుడిగా, కమర్షియల్ హిట్ చిత్రాల దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ' ఇప్పటికే టీజర్, ఇతర ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్ కథానాయికగా నటిస్తున్నారు. మెలోడీ స్పెషలిస్ట్ మిక్కీ జే మేయర్ స్వరపరిచిన 'కొంచెం కొంచెం' రొమాంటిక్ మెలోడీగా ఆకట్టుకుంటోంది. పాటలోని రొమాంటిక్ మూడ్‌ను అందంగా ప్రజెంట్ చేసిన ట్యూన్‌తో పాటు, మ్యూజిక్ అరేంజ్‌మెంట్ ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమను సరదాగా ప్రజెంట్ చేస్తోంది. సమీరా భరద్వాజ్ తన మెలోడీ వోకల్స్‌తో పాటలోని భావాలను మరింత అందంగా పలికించారు.ఈ పాటలో హవీష్, కావ్యా థాపర్ మధ్య కనిపించే రొమాంటిక్ కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బాలీవుడ్ నటి నర్గిస్ ఫక్రీ స్పెషల్ అప్పియరెన్స్‌తో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ఆమె గ్లామర్‌తో పాటు స్టైలిష్ డ్యాన్స్ మూవ్స్ కూడా పాటకు మరింత స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. ఆకట్టుకునే ట్యూన్, సరదా సాహిత్యం, మెలోడీ వోకల్స్, స్టైలిష్ విజువల్స్‌తో కొంచెం కొంచెం పూర్తి స్థాయి రొమాంటిక్ సాంగ్‌గా అలరిస్తోంది.

26vzm15:26vzm15.qxd 25-07-2026 22:36 Page 1



## ఐక్యంగా పోరాడుదాం .. సమస్యలు పరిష్కరించుకుందాం



చీపురుపల్లి, జూలై 25, ప్రభాతవార్త :

రాష్ట్రంలో నాయి బ్రాహ్మణ కులస్తుల పట్ల జరుగుతున్న వివక్షతను ఐక్యంగా పోరాడి సమస్యను పరిష్కరించుకుందామని నాయి బ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ దుర్గారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శనివారం నాడు చీపురుపల్లి తాసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజాం లో జరుగు నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయండి అని కోరారు.ఈ నెల 28న రాజాం లోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపం లో జరుగు విజయనగరం జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా మహా సభను జయప్రదం చెయాలని కోరుతూ చీపురుపల్లి లో కరపత్రాలను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి. దుర్గారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సంఘం నాయీ బ్రాహ్మణులను చైతన్య పరుస్తుందని, మన సంక్షేమనికి ప్రభుత్వం విడుదల చేసిన జివో లన్ని కాగితాలకే పరిమితమాయ్యాయని అన్నారు, 50 ఏళ్ళకు వృత్తి దారులకు ఇస్తానన్న పింఛను ఇవ్వాలని, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ కు బడ్జెట్ ఇవ్వాలని కోరారు, మన సమస్యలు మహాసభ లో చర్చించి భవిష్యత్ ప్రణాళికను అందరి సలహాలతో సిద్ధం చేస్తారని ఆమె వివరించారు. ఈ మహా సభలలో జిల్లా వ్యాప్తంగా నాయీ బ్రాహ్మణులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి. రమణ మూర్తి, టి. అప్పారావు, మీసాల రాము, సి. హెచ్. సంఘం. అప్పారావు, పి, శంకర్, పి, చిన్న, బి.శ్రీను. పి. కనక రాజు. ఏ. అప్పారావు. డి. పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



## తొలి ఏకాదశి - పోటెత్తిన భక్తులు

### ఎమ్మెల్సీ,న్యాయమూర్తులు ప్రత్యేక పూజలు

శృంగవరపుకోట,జూలై25,ప్రభాతవార్త :

ఆషాఢ మాస శుక్లపక్షంలో వచ్చే తొలి ఏకాదశి సంధర్భంగా మండలంలో ఉన్న శ్రీవెంటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో పోటెత్తాయి.ఎస్.కోట శివారు పుణ్యగిరి క్షేత్రానికి వెళ్ళే రహదారిలో ఉన్న పుణ్య తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు,జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీధర్,ఎస్.కోట జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి పి.కనకలక్ష్మి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆలయ అర్చకులు వారిని వేద మంత్రాలతో ఘనంగా స్వాగతం పలికారు.అలాగే పట్టణంలో వెంకటేశ్వరస్వామి ఆలయం, మండల పరిధిలో భర్తాపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాలు వద్ద స్వామివారి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.తెల్లవారుజామునుంచే భక్తులు చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారిని తులసి మాలలుతో ప్రత్యేకంగా అలంకరించారు.మొత్తం మీద తొలి ఏకాదశి రోజున స్వామివారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

## శభాష్ ఉప ముఖ్యమంత్రి.. పవన్ కళ్యాణ్ గారు

### -ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

### - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు





గరుగుబిల్లి, జూలై 25, ప్రభాత వార్త:

అడవి ఏసుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదలపవన్ కళ్యాణ్ చర్యలు అభినందనియ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు సంతోషం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్వతీపురం మన్యం జిల్లా ఇన్చార్జి అచ్చన్న నాయుడు మాట్లాడుతు. పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపునకు కుంకీలు జయంత్, అభిమన్యు, కుంకి ఏనుగులను తరలించడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే సుమారు గత పది సంవత్సరాలు క్రితం శ్రీకాకుళం నుండి ఎనిమిది ఏనుగులు మొట్టమొదటిసారి పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం నియోజకవర్గంలోనే ఎక్కువ కాలం అడవి ఏనుగులు సంచరించడము అందరికీ తెలిసిన విషయమే.. అలాగేరైతులు పండించే పలు రకాలైన పంటలను ఆడవిఏనుగుల వల్ల నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. అలాగే వ్యవసాయ మోటార్ల తో పాటు ప్రాణహాని కూడా జరిగేదని ఆయన తెలిపారు. ప్రాణానికి ఎటువంటి భయం లేకుండా అలాగే రైతులు పండించే పలు రకాలైన పంటలుకు ఎటువంటి నష్టం జరగకుండఉండాలనిరక్షణకు కోసం కుంకీ ఏనుగులను మన్యం జిల్లాకు తరలించడం స్వాగతించదగిన నిర్ణయమన్నారు.. అలాగే ఇటీవల కొన్ని సంవత్సరాల క్రితం నుండిఏనుగుల బెడదతో ఇబ్బందులు పడుతున్న రైతులకు పవన్ కళ్యాణ్ ప్రభుత్వం అండగా నిలిచిందనీ ఇన్చార్జి మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. పార్వతీపురంమన్యం జిల్లాలో ఏనుగుల నియంత్రణ చర్యలు అటవి ఏనుగుల బారి నుండి కాపాడేందుకు, వాటిని ప్రత్యేక షెల్టర్కు తరలించే చర్యలు చేపట్టిన అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వారికి ప్రజల తరపున అభినందనలు తెలిపారు.. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పవన్ కళ్యాణ్ మరోసారి నిరూపించుకున్నారని పార్వతిపురం మన్యం జిల్లాఇన్చార్జి మంత్రి కింజరపు అచ్చననాయుడు కొనియాడారు.

## ఇన్కమ్ ఉంటేనే వెల్కమ్...అంతా క్యాష్ రిలేషన్స్..!



గరుగుబిల్లి, జూలై 25, ప్రభాత వార్త:

మంచితనం మరుగున పడింది. మానవత్వం మంట కలిసింది. ఆదాయం ఉంటే ఆదరిస్తారు. పేదరికంతో ఉంటే పొమ్మంటారు. రక్తసంబంధాలు అన్ని మనీ చుట్టూ తిరుగుతున్నాయి. బంధాలు... అనుబంధాలు అన్ని డబ్బుతోనే ముడిపడ్డాయి. తరాలు మారుతున్న కొద్దీ అంతరాలు పెరుగుతు న్నాయి. అమెరికాలో పిల్లలు ఆశ్రమాల్లో తల్లి దండ్రులు. చివరకు కర్మకాండకు సైతం ప్యాకేజీలు మాట్లాడి డబ్బు విసిరేసి కార్యక్రమం జరిపించేస్తున్నారు. బ్లడ్ రిలేషన్ కాస్త బ్యాడ్ రిలేషన్గా మారింది. ప్రస్తుతం ఈ పరిస్థితి ఉంటే రాబోయే తరాల్లో పరిస్థితులు ఇంకెంత దారుణంగా ఉంటాయో ఊహిస్తేనే ఒళ్ళు జలదరిస్తుంది. రేపు ఇదే పరిస్థితి వీరికి కూడా వస్తుందన్న పచ్చి నిజాన్ని గ్రహించలేని మూర్ఖులుగా చెప్పవచ్చు. స్నేహమైనా.., బంధుత్వమైనా డబ్బుంటేనే పలకరిస్తారు. అంతెందుకు ఒక తల్లి కడుపున పుట్టిన బిడ్డలు సైతం డబ్బు లేని సోదరుల చెంతకు చేరరు. ఎలా సంపాదించారు అన్నది కాదు సంపాదించారా లేదా అన్నది ముఖ్యంగా చూస్తున్నారు. డబ్బు లేకుంటే మాటకు విలువ ఇవ్వరు మంచితనానికి స్థానం ఉండదు. అసలు సమాజంలో వాడిని ఒక వ్యక్తిలా కూడా గుర్తించరు. అంతలా పరిస్థితులు దిగజారాయి. నీ చావు నువ్వు చావు అన్నట్లు చాలా చులకనగా చూస్తారు. ఆర్థిక సాయం చేయకపోయినా పరవాలేదు గానీ నేనున్నానన్న కనీస భరోసా కూడా ఇవ్వరు. డబ్బు ఉందన్న అహంకారంతో సమాజాన్ని శాసిస్తున్నట్లు ఫోజులు కొడుతుంటారు. డబ్బున్న వాళ్ళే ఒక దగ్గర చేరి కాలక్షేపం చేస్తుంటారు. ఆర్థిక స్తోమత లేని వాళ్ళని దూరంగా ఉంచుతారు. ప్రస్తుతం పట్టణాలు.. నగరాల్లో ఎక్కడ చూసినా ఇటువంటి బ్యాచ్ లే ఎక్కువగా కనిపిస్తున్నారు. జీవితంలో ఎన్నో బాధ్యతలు మోసి తన కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించి పిల్లలకు ఒక గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించిన వారికి పలకరింపులు కూడా కరువయ్యాయి. రేపటి తరం ఇంకెలా మారుతుందో తలచుకుంటేనే భయమేస్తుంది. చిన్ననాటి స్నేహాలు.., చిన్నప్పటి బంధాలు అన్ని డబ్బు గుప్పిట్లో బందీగా మారాయి. ఓ మంచితనమా నీ చిరునామా ఎక్కడ..?


## చీపురుపల్లి నియోజకవర్గంలో 19 వేలు ఓట్లు తొలగే అవకాశం

### ముగిసిన సర్ సర్వే

గరివిడి, జూలై 25, ప్రభాత వార్త:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ ఐ ఆర్) అనంతరం చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో 19 వేలు పైచిలుకు ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ 19 వేల 60 ఓట్లకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫారాలు అందక పోవడంతో ఓట్లు తొలగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అన్ కలక్టబుల్ డేటా జాబితాలోకి ఆ 19 వేలు ఓట్లు చేరిన నేపథ్యంలో ఆ ఓట్లు తొలగే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 24 తో సర్ కార్యక్రమం ముగిసింది. కాగా ఆగస్టు 30 న విడుదల చేసే తుది జాబితాలో చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో ఎన్ని ఓట్లు తొలగి పోయాయనేది తెలుస్తుంది. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో గల నాలుగు మండలాల్లో 2,07,471 ఓట్లు ఉండగా,1,88,411 ఓట్లు డిజిటలైజ్ అయ్యాయి.వాటిలో 7,508 మంది మృతి చెందారు,7,246 మంది శాశ్వతంగా షిఫ్ట్ అయ్యారు. కాగా 19, 060 మంది ఎన్యుమరేషన్ ఫారాలు అందివ్వని,సమాచారం అందని జాబితాలో ఉన్నారు. 9 శాతం ఓట్లు అన్ కలక్టబుల్ జాబితా లో ఉన్నాయి. అన్ కలెక్టబుల్ జాబితాలో 19 వేలు ఓట్లు ఉన్నాయి తప్ప ఆ ఓట్లు రద్దు జాబితాలో ఇంకా చేరలేదని, ఆగస్టు30 తుది జాబితాలో ఎన్ని రద్దు అయ్యాయనేది తెలుస్తుందని చీపురు పల్లి ఆర్డిఓ జి.సుధారాణి మాట్లాడుతూ పేర్కొన్నారు. కాగా 19 వేల అరవై ఓట్లు తొలగి పోయే అవకాశం ఉన్న నేపథ్యంలో వివిధ పక్షాల నేతలు అప్పుడే తమ తమ ఓట్లు పోతున్నాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. కాగా మెరకముడిదాం మండలంలో 4,776 ఓటర్లు, గరివిడి మండలం లో 4,824 ఓటర్లు,చీపురుపల్లి మండలంలో 3,898 ఓటర్లు, గుర్ల మండలంలో 5,562 ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని జాబితాలో ఉన్నారు.

## స్వర్గీయ ఎన్.టి.రామారావు విగ్రహావిష్కరణ



సాలూరు, జూలై25, ప్రభాతవార్త :

సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళుఅనే నినాదంతో తెలుగుదేశం పార్టీ స్థాపించిన వ్యవస్థాపకులు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని మంత్రి సంధ్యారాణి అన్నారు.శనివారం ఉదయం మండలం పెద బోరబంద గ్రామంలో ఎంతో వేడుకగా ఎన్.టి.ఆర్.విగ్రహా ఆవిష్కరణ మంత్రి చేతుల మీదగా జరిపారు. అలాగే పూలదండ వేసి అంజిలి ఘటించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న యుగపురుషుడన్నారు.

## ప్రభుత్వ శాప్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



శృంగవరపుకోట,జూలై25,ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం శాప్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కోటి రూపాయలతో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్ షిప్ ఆటల పోటీలను ఎస్.కోట నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ క్రీడా కోఆర్డినేటర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు.ఇందుకు సంభందించి ఎస్ కోట ఎంఈఓ జగదీశ్వరరావు సమక్షంలో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు జి.లక్ష్మణరావు ఎస్ కోట నియోజకవర్గం క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు,వివిధ మండలాల కోఆర్డినేటర్లు,వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీరాములు మాట్లాడుతూ ఈ అమరావతి ఛాంపియన్ షిప్ అండర్ 17 అండర్ 23 స్త్రీ పురుషుల విభాగాల్లో ఆరు ఈవెంట్లు కబడ్డీ కోకో వాలీబాల్ బ్యాడ్మింటన్ చెస్ యోగ ఇక్కడ ఎంపిక పోటీలు నిర్వహించనున్నామన్నారు.ఎక్కడ ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోవు జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని, ఎంపిక పోటీలకు వచ్చిన క్రీడాకారులకు భోజన సదుపాయం ఉంటుందని శ్రీరాములు తెలిపారు.క్రీడాకారులందరూ ఈనెల 28వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకల్లా క్రీడా ప్రాంగణంలో పాల్గొనాలని శ్రీరాములు తెలిపారు.

## న్యాయవాదుల సహకారంతోనే కేసులు పరిష్కారం



శృంగవరపుకోట,జూలై25,ప్రభాతవార్త

న్యాయవాదుల పూర్తి సహకారంతోనే కోర్టుల్లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీధర్ తెలిపారు. శనివారం ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీధర్ వార్షిక తనిఖీలో భాగంగా కోర్టు రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ముందుగా కోర్టుకు విచ్చేసిన జిల్లా అదనపు న్యాయమూర్తిని స్థానిక న్యాయమూర్తి బి.కనకలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లు సత్యాజీ, కార్యదర్శి ఎం.దొరబాబు తదితరులు పూలబోకేలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.ఈసందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ,కక్షిదారులకు న్యాయం అందజేయడంలో కోర్టులు, న్యాయవాదుల పాత్రను గుర్తు చేశారు. కోర్టులో పెండింగ్ కేసులను తగ్గించడంలో దృష్టి సారించాలని న్యాయవాదులకు పిలుపునిచ్చారు.అనంతరం బార్ అసోసియేషన్ న్యాయమూర్తి శ్రీధర్ను ఘనంగా సత్కరించారు. బార్ ప్రెసిడెంట్ సత్యాజీ,కార్యదర్శి దొరబాబు,సీనియర్ న్యాయవాదులు మండా కామేశ్వరరావు, ఎం.దుర్గాప్రసాద్, జి.సూరిదేముడు,గేదెల ప్రకాష్,వారాది ఈశ్వరరావు, డబ్ల్యు.ఎన్.శర్మ, బీవీఎస్ రామారావు, బి.వెంకటరావు, నాయుడు, చిట్టిబాబు,సూపరింటెండెంట్ చిన్నారావు పాల్గొన్నారు.

## రామతీర్థంలో ఘనంగా తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



నెల్లిమర్ల, జూలై 25,ప్రభాతవార్త

ప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థం శ్రీరామస్వామి వారి దేవస్థానం లో ఆషాడ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి )సందర్భంగా శనివారం ప్రాత:కాలార్చన బాలభోగం. అయిన తర్వాత దేవాదాయ ధర్మదాయ శాఖ కమీషనర్ వారి ఉత్తర్వులు మేర విజయనగరం జిల్లా భోగాపురం లో ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి చెందాలని ప్రత్యేకముగా శ్రీ పుష్పార్చన, యాగశాలలో సుందర కాండ హోమం. శ్రీ సుదర్శన మూల మంత్రం హోమంలను ఘనంగా నిర్వహించారు.అనంతరం ఉత్సవమూర్తులు వద్ద నిత్యాకల్యాణం, పట్టాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీ రామచంద్ర స్వామి వారి ని విశేషంగా పూల దండలతో అందముగా అలంకరించారు. కార్యక్రమములో సహాయ కమీషనర్, కార్యనిర్వాహనాధికారి వై. శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి వారికి అభిషేక పూజలు



రామభద్రపురం, జూలై 25,ప్రభాత వార్త:

తొలి ఏకాదని పురస్కరించుకొని బుసా యవలస గ్రామంలో భూనీల సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారిదేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. తొలి ఏకాదశి తో పాటు శనివారం కూడా కలిసి రావడంతో దేవాలయంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ బూనేల కళ్యాణివెంకటేశ్వర స్వామి కి ఆలయ ప్రధాన అర్చకులు దినేష్ భరద్వాజ శర్మ ఆధ్వర్యంలోపంచామృతాలతో కూడిన అభిషేకాలను నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే ఆలయానికి చేరుకోవడంతో తులసి వనమాల తో పాటు సుగంధ ద్రవ్యాలతో కూడిన పంచామృత, చక్ర స్నానాలను కళ్యాణి వెంకటేశ్వర స్వామి పూజలునిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలు కూడా గోవిందా నామస్మరణలతో మార్మోగాయి.లో ఉన్న పురాతన కాలంలో కూడా గోవిందులకి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తొలి ఏకాదశి కూడా కలిసి రావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. విచ్చేసిన భక్తులకు గోత్రనామాలతో పాటు పంచామృతాలతో కూడిన అభిషేకాలతో పాటు తులసి వనమాలతో అర్చనలను నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల రామభద్రపురం మామిడి వలస పాత రేగ దుప్పలపూడి మరడం నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండాఆలయ ధర్మకర్త కోరాడ వెంకట్రావు కుమారులైన శ్యాము మహేష్ సకల సౌకర్యాలు కల్పించి వాటర్ ప్యాకెట్లు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు.

## ప్రభుత్వ రాజముద్రతో పాసుపుస్తకాలు పంపిణీ : మంత్రి



సాలూరు, జూలై 25, ప్రభాతవార్త :

భూ వివాదాలు లేకుండా స్పష్టమైన భూహక్కులు కల్పించడం కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.శనివారం ఉదయం మండలం పెద బోరబందలో మీ భూమి–మీ హక్కు అనే కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా సంధ్యారాణి పాల్గొన్నారు.అలాగే ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలు ఆమె చేతులు మీదుగా రైతులకు పంపిణీ చేశారు.అనంతరం మాట్లాడుతు గత సర్కార్ లో అడ్డగోలుగా జరిపిన ఆక్రమణ భూమి సమస్యలను పరిష్కరించి పాసు పుస్తకాలు అందజేయడం రైతులకు వరం అని క్లారిటీ ఇచ్చారు.అలాగే కూటమి ప్రభుత్వంలో ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేసిన ఘణత సీఎం చంద్రబాబుదని మంత్రి స్పష్టం చేశారు.ఎమ్మార్వో సురేష్, ఎంపీడీఓ పార్వతి,ఆముదాల పరమేష్,శ్యామ్ ఇంకా లీడర్లు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో పర్యటించిన టిడిపి ప్రధాన కార్యదర్శి బలరాం



పాచిపెంట, జూలై 25, ప్రభాతవార్త :

ప్రజాసమస్యలు తెలుసుకొనందుకై తెలుగుదేశం పార్టీ ముందంజలో ఉంటుందని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మతల బలరాం అన్నారు. మండలంలో శుక్రవారం ఏజెన్సీ గిరిజన గ్రామాలైన మోదుగ అడారపాడు ఇప్పల గుడ్డి కాట్రగుడ్డి లోవ బుచ్చింపాడు, తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు కలిసి ఇంటింటికి వెళ్లి త్రాగునీటి సమస్యతెలుసుకున్నందుకు టిడిపి నాయకులు సందర్శించారు. మన గిరిజనుల యొక్క సమస్యలు తెలుసుకోవడం కోసం త్రాగునీరు , విద్యుత్తు సమస్య వీధి దీపాలు పారిశుధ్యం పై ప్రజలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని గ్రామస్తులుకు తెలిపారు. అదేవిధంగా అర్హులైన వారికి పింఛన్లు అందుతున్నాయా లేవని అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలు ఉన్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి వద్దకు మీరు నేరుగా కలవచ్చు లేదా మా వద్దకు మీ సమస్య తీసుకువచ్చిన ఆ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు . ఈయన వెంట మండల టిడిపి నాయకులు మరియు కోటికి పెంట పంచాయతీ టిడిపి నాయకులు రాకోటి పాపారావు మరియు మర్రి మహేష్ పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా పశువుల తరలింపు



దత్తిరాజేరు, జులై 25, ప్రభాతవార్త :

పార్వతీపురం నుండి పశువులను కేరళకు ఎటువంటి అనుమతులు లేకుండా కంటైనర్లలో 42 పశువులు తరలిస్తుండగా పెదమానాపురం టోల్ప్లాజా వద్ద శనివారం పోలీసులు వాహనాలను తనిఖీలు చేపడుతుండగా అక్రమంగా తరలిస్తున్న 42 పశువులను పట్టుకోవడం జరిగిందని స్టేషన్ఎస్సై కళాధర్ తెలిపారు . కేరళ చెందిన అయ్యప్ప తాలూకా పశువులుగా గుర్తించారు ఎటువంటి పత్రాలు లేకుండా పశువులు తరలిస్తున్న లారీ డ్రైవర్ క్లీనరు, పశువులు ఓనర్ పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు . దొరికిన 42 పశువులను గో సంరక్షణ కార్యాలయానికి పంపిస్తామన్నారు కంటైనర్ల 32 పశువుల కన్నా ఎక్కువ ఎక్కించరాదని నిబంధనలు ఉన్న వాటికి విరుద్ధంగా 40 నుండి 50 వరకు పశువులు ఎక్కించి తరలిస్తున్నారు. పశువులు ఇటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా తరలించిన వ్యాపారస్తులును కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుచున్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త

## ఘనంగా జగ్నన్నాథ స్వామి బహుదా యాత్ర



లక్కవరపుకోట, జూలై 25, ప్రభాత వార్త :

మండలంలోని శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో గడచిన 16వ తేదీ నుంచి విశేష పూజలు అందుకున్న శ్రీ జగన్నాథ స్వామి బహుదా యాత్ర తిరుగు )ప్రయాణం శనివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జగన్నాథ స్వామి సోదరిసుభద్ర సోదరుడు బలబద్ర సమేతంగా బంగారు వన్నె గల రథంలో వైభవంగా ఊరేగారు ఈ సందర్భంగా భక్తులు ఉదయాన్నే ఆలయానికి వెళ్లి స్వామివారికీ ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు సాయంత్రం ఊరేగింపు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ముందుకు సాగనంపారు ప్రతి ఏడాది పూరీలో నిర్వహించే ఈ జగన్నాథ స్వామి రధ యాత్ర తొలి రోజు గుండి చా దేవి ఆలయం వరకు కొనసాగుతుంది దీనిని గుండి చా యాత్ర అని కూడా పిలుస్తారు అక్కడ 7 రోజులు విశ్రాంతి తీసుకుని భక్తులచే పూజలు అందుకున్న జగన్నాధుడు ఏకాదశి తిది నాదు తిరుగు ప్రయాణంలో ప్రధాన ఆలయానికి చేరుకుంటారు 3 కిలోమీటర్లు సాగె ఈ యాత్ర నే జగన్నాధ స్వామి రధ యాత్ర అంటారు ఈ సందర్భంగా జగన్నాధునికి బలబద్రునికి సుభద్ర దేవికి ప్రత్యేక ఏర్పాటు చేసి ఈ ఊరేగింపు నిర్వహించడం జరుగుతుంది ఈ రధాలను నంది ఘోష, తాళద్వజ, దర్పదలన, అనే పేరుతో పిలుస్తారు హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం ఈ రథయాత్ర సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న ఈ రధాలను లాగినా సర్వ పాపాలు నశించి మరణాంతరం మోక్షం లభిస్తుంది. ఈ రథాన్ని లాగిన లాగిన్ వారికి అక్షయ లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.ఎక్కడో పూరీలో నిర్వహించే రథయాత్రను గ్రామంలోకూడా ఆ రథయాత్రకు అనుగుణంగా నిర్వహిస్తూ పూరి వెళ్ళలేని అనేకమంది భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తున్నటువంటి జగన్నాథ స్వామి ఆలయ కమిటీకి భక్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు ఈ ఊరేగింపులో గ్రామ పెద్దలు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డివిజనల్ స్థాయిలో సెకండ్ స్థానం పొందిన పిఎల్ఐ ఏజెంట్ టిఆర్ఎస్ ప్రతాప్ నాయుడు



బొబ్బిలి, జూలై 25, ప్రభాతవార్త:

పార్వతీపురం పోస్టల్ డివిజనల్ స్థాయిలో పోస్టల్ డైరెక్ట్ ఏజెంట్ టిఆర్ఎస్ ప్రతాప నాయుడు సెకండ్ స్థానం సాధించాడని విశాఖ రీజినల్ పి ఎల్ ఐ పోస్ట్మాస్టర్ జనరల్ డాక్టర్ జయశంకర్ తెలియజేశారు. శుక్రవారం జరిగిన అభినందన సభలో ప్రతాప్ నాయుడు (చంటి) కు మెమోరాండంతో పాటు ఘనంగా సత్కరించారు. ఈ సన్మానం నాకు ఎంతో బాధ్యత నాపై పెట్టారని ఈ బాధ్యతను నేను మనసారా పూర్తి చేస్తానని అన్నారు. ఇలాంటి సన్మానాలు నాకు గతంలో ఎన్నో జరిగాయని మరింత రెట్టింపు ఉత్సాహంతో నేను ముందుకు పోవడానికి సన్మానమే నాకు ప్రోత్సాహంగా మిగులుతుందని అన్నారు. కార్యక్రమంలో మా వసతాధికారులు మా శ్రేయోభిలాషులకు నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు.

## మన్యం జిల్లాకు చేరిన 'జయంతి', 'అభిమన్యు' కుంకీ ఏనుగులు

### ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడి నివారణకు ప్రభుత్వ కీలక చర్యలు

### డిప్యూటీ సీఎం చొరవతో రంగంలోకి దిగిన శిక్షణ పొందిన ఏనుగులు



విజయనగరం, జూలై 25, ప్రభాతవార్త:

ఉత్తరాంధ్ర ప్రాంతంలో సుదీర్ఘకాలంగా గిరిజన గ్రామాలు, రైతులకు నిద్రలేకుండా చేస్తున్న ఏనుగుల సంచారం, పంట నష్టం మరియు మానవ–ఏనుగుల సంఘర్షణకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గౌరవ ఉప ముఖ్యమంత్రి గారి ప్రత్యేక శ్రద్ధ, దార్శనికతతో చిత్తూరు నుంచి 'జయంతి', 'అభిమన్యు' అనే రెండు ప్రత్యేక శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను పార్వతీపురం మన్యం జిల్లాకు సురక్షితంగా తరలించారు.అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పి.సి.సి.ఎఫ్, విశాఖపట్నం సి.సి.ఎఫ్ పర్యవేక్షణ లో చిత్తూరు అటవీ శాఖ బృందం, నిపుణులైన పశువైద్యులు అత్యంత జాగ్రత్తతో ఈ రెండు ఏనుగులను మన్యం జిల్లాకు తీసుకువచ్చారు.ప్రజలు, రైతులకు లభించనున్న ఊరటలిజిల్లాలోని సరిహద్దు గ్రామాల్లో తరచూ విరుచుకుపడే అడవి ఏనుగుల గుంపులను సురక్షితంగా అటవీ ప్రాంతాల్లోకి మరలించడానికి, గ్రామాల్లోకి రాకుండా నిరోధించడానికి ఈ కుంకీ ఏనుగులు ఎంతగానో ఉపకరించనున్నాయి. దీనివల్ల రైతులకు పంట నష్టం తగ్గడమే కాకుండా, స్థానిక గిరిజన ప్రజల ప్రాణ ఆస్తి నష్టాలను నివారించవచ్చని చీఫ్ కన్సర్వటర్ అఫ్ ఫారెస్ట్స్ విశాఖపట్నం,రాజు,డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ జి. ఎ పి ప్రసునవెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల స్థానిక గిరిజనులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్, అటవీ శాఖ ఫీల్డ్ స్టేఫ్ ఉన్నారు.

## ప్రధానమంత్రి పర్యటనకు విస్తృతంగా సీసీ కెమెరాల ఏర్పాటు

### - విశాఖపట్నం రేంజ్ ఐజీపి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్



విజయనగరం, జూలై 25 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించిన విశాఖ రేంజ్ ఐజిపి గోపినాథ్ జట్టి మరియు జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ ప్రధాన మంత్రి పర్యటనలో భాగంగా ట్రంపెట్, టెర్మినల్, సభా ప్రాంగణం, వీఐపీ వాహనాల పార్కింగ్ స్థలం, ప్రజా వాహనాల పార్కింగ్ స్థలాలను స్వయంగా పరిశీలించిన పోలీసు అధికారులు దేశ ప్రధానమంత్రి మోడీ జిల్లాలో భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను విశాఖ రేంజ్ ఐజిపి గోపినాథ్ జట్టి, జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ జూలై 25న మరోసారి పరిశీలించి, అధికారులకు భద్రతాపరమైన పలు సూచనలు చేశారు.విశాఖ రేంజ్ ఐజిపి గోపినాథ్ జట్టి, ఐపీఎస్ మాట్లాడుతూ – జాతీయ రహదారి నుండి ఎయిర్ పోర్ట్ ను అనుసంధానం చేసే రహదారి, ట్రంపెట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఎయిర్ పోర్టు టెర్మినల్, ట్రంపెట్, మీటింగ్ నిర్వహించే ప్రజా వేదిక, వీఐపీ వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం, మీటింగ్ హాజరయ్యేందుకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాల పార్కింగ్ కు కేటాయించిన పార్కింగ్ స్థలాలను స్వయంగా సందర్శించి, ఏర్పాట్లును పరిశీలించి, చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేసారు. ప్రధానమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ ఇబ్బందులు తలెత్తకుండా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం కలగకుండా ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టాలన్నారు. సుమారు 5 వేల బస్సుల్లో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వాహనాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాలకు బస్సులు సులభంగా చేరే విధంగా చూడాలని, ఎయిర్ పోర్ట్ మార్గంలో బస్సులు ఎక్కడా ఆగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్ స్థలాల్లోకి వాహనాలు వెళ్లి తిరిగి సులువుగా వచ్చే విధంగా పార్కింగ్ స్థలాలు కేటాయించిన లే అవుట్ లో ఏర్పాట్లు చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్, పార్కింగ్ స్థలాలు, ట్రంపెట్, సభాస్థలి, చుట్టు ప్రక్కల అన్ని ప్రాంతాలను కవర్ చేసే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిని కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మీటింగ్ కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్ట్ మార్గంలో వాహనాలు మార్గ మధ్యంలో ఆగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలకు ఎటువంటి సందేహాలు కలగకుండా పెద్ద పరిమాణంలో సైనేజ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను రేంజ్ ఐజిపి గోపినాథ్ జట్టి ఆదేశించారు.జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్, ఐపిఎస్ మాట్లాడుతూ – ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలు పార్కింగ్ కు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు, వీటికి అదనంగా మరికొన్ని పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసామన్నారు. సభ ముగిసిన తరువాత పోలీసు అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతతో పని చేయాలన్నారు. వాహనాలు అన్ని ఒక క్రమంలో తిరిగి గమ్య స్థానాలకు చేరే విధంగా విధులు నిర్వహించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ ఆదేశించారు.ప్రధాని పర్యటనకు భద్రత ఏర్పాట్లను విభాగాలుగా విభజించి, భద్రత ఏర్పాట్లు చేపట్టామని, భద్రత పర్యవేక్షణకు సీనియర్ పోలీసు అధికారులనునియమించామన్నారు. ప్రారంభోత్సవంకు విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు, పార్వతీపురం మన్యం జిల్లాల నుండి సుమారు రెండు లక్షల మంది ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున కచిచిడ్ మేనేజ్మెంట్ కు ప్రత్యేకంగా చర్యలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. విజయనగరం ఎస్పీ ఎఆర్ దామోదర్, పార్వతీపురం ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, మెరైన్ ఎస్పీ శ్రావణి, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, పలువురు డిఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

26-7pg10exH.qxd:26-7pg10exH.qxd 1/1/02 6:25 AM Page 1



## టి20ల్లో జింబాబ్వేపై
# భారత్ యంగ్ ప్లేయర్ల రికార్డ్
## నంబర్ వన్ అభిషేక్


అభిషేక్ శర్మ


శుభమన్ గిల్


రుతురాజ్ గైక్వాడ్


కేఎల్ రాహుల్


యశస్వి జైస్వాల్

**న్యూఢిల్లీ:** టీమిండియా యంగ్ బ్రిగేడ్ అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో సంచలనాలు సృష్టిస్తోంది. జింబాబ్వేపై టీమిండియాకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. ముఖ్యంగా జింబాబ్వేతో జరిగిన టి20 మ్యాచ్‌లలో భారత యంగ్ బ్యాటర్లు తమ బ్యాట్‌కు పనిచెప్పి భారీగా పరుగులు సాధించారు. ఆ వికెట్లపై ఆధిపత్యం చెలాయిస్తూ జట్టుకు అద్భుతమైన విజయాలను అందించారు. జింబాబ్వేపై టి20ల్లో భారత్ తరఫున అత్యధిక రన్స్ చేసిన టాప్ 5 బ్యాటర్లలో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అగ్ర స్థానంలో ఉన్నాడు. అభిషేక్ జింబాబ్వేపై ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లలో 35.80 సగటుతో ఏకంగా 179 పరుగులు సాధించాడు. మెరుపు ఇన్నింగ్స్‌లతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ఈ లిస్ట్‌లో నంబర్ వన్ పొజిషన్‌ను సొంతం చేసుకున్నాడు. టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో స్థానంలో నిలిచాడు. గిల్ జింబాబ్వేపై ఐదు టి20 మ్యాచ్‌లు ఆడి 170 పరుగులు చేశాడు. ఈ క్రమంలో రెండు హాఫ్ సెంచరీలు కూడా బాదాడు. మైదానంలో నిలకడగా ఆడుతూ జట్టుకు కొండంత అండగా నిలవడంలో శుభ్‌మన్ సక్సెస్ అయ్యాడు. భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ చాలా తక్కువ మ్యాచ్‌లలోనే అద్భుత రికార్డు నమోదు చేసి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. జైస్వాల్ జింబాబ్వేపై కేవలం మూడు టి20 మ్యాచ్‌లు మాత్రమే ఆడి, ఏకంగా 141 పరుగులు రాబట్టాడు. క్రీజులోకి వచ్చిన ప్రతిసారీ వేగంగా పరుగులు సాధిస్తూ జట్టుకు మంచి ఆరంభాలు అందించాడు. క్లాస్ బ్యాటింగ్‌కు మారుపేరైన రుతురాజ్ గైక్వాడ్ ఈ లిస్ట్‌లో నాలుగో స్థానంలో ఉన్నాడు. రుతురాజ్ జింబాబ్వేపై మూడు ఇన్నింగ్స్‌లలో 66.50 సగటు, 158.33 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 133 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ కూడా ఉంది. బాధ్యతాయుతంగా ఆడుతూనే అవసరమైనప్పుడు బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. టీమిండియా స్టార్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఐదో స్థానంలో నిలిచాడు. రాహుల్ జింబాబ్వేపై నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడి 120 పరుగులు సాధించాడు. రాహుల్ ఖాతాలో కూడా జింబాబ్వేపై ఒక హాఫ్ సెంచరీ ఉంది. కీలక సమయంలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టి జట్టును విజయం దిశగా నడిపించడంలో రాహుల్ తన మార్కు చూపించాడు.






## జింబాబ్వేతో రెండో టి20.. విక్టరీతో
# టీమిండియా సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరిగిన రెండో టి20లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే శనివారం ఈ సిరీస్‌ను భారత జట్టు దక్కించుకుంది. టీమిండియా అందించిన 220 పరుగుల లక్ష్య ఛేదనలో జింబాబ్వే టీం కేవలం 17.5 ఓవర్లలో 129 పరుగులకే పరిమితమైంది. భారత్ తరఫున యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్, శివమ్ దూబే, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వికెట్లు తీశారు. బ్రియన్ బెన్నెట్ (32 పరుగులు)ను ఔట్ చేయడం ద్వారా యశ్ తన తొలి టి20 వికెట్‌ను సాధించాడు. ప్రిన్స్, బెన్ కర్రన్, సికందర్ రజాలను ఔట్ చేశాడు. తడివానషే మరుమణి, న్యూమాన్ న్యాముర్రి క్రీజులో ఉన్నారు. అంతకుముందు, హరారేలో టాస్ ఓడిపోయి బ్యాటింగ్ చేసిన భారత్, 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 81), తిలక్ వర్మ (29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 నాటౌట్) చెలరేగారు. దీంతో ఇండియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 219 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ అతి కష్టం మీద 9 బంతుల్లో 20 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇషాన్, శ్రేయస్ అయ్యర్ (25) మూడవ వికెట్‌కు 66 పరుగులు జోడించగా, ఇషాన్, తిలక్ నాలుగవ వికెట్‌కు 94 పరుగులు జతచేశారు. జింబాబ్వే తరఫున, న్యూమాన్ న్యామ్హురి, రిచర్డ్ నగరవా, బ్రయాన్ బెన్నెట్, బ్లెస్సింగ్ ముజరబాని, సికందర్ రజా తలా ఒక వికెట్ తీసుకున్నారు. జింబాబ్వేపై బ్యాటింగ్ లో అదరగొట్టిన భారత్ ప్రపంచ రికార్డు సమం చేసింది. ఒకే క్యాలెండర్ ఇయర్ లో అత్యధిక సార్లు 200 కంటే ఎక్కువ పరుగులు చేసిన జట్టుగా నిలిచి తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

## పురుషుల బాక్సింగ్..
# ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు శివాచ్

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ ప్లేయర్ సచిన్ శివాచ్ దూసుకుపోతున్నాడు. స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో శనివారం జరిగిన పురుషుల 60 కేజీల రౌండ్ ఆఫ్ 32 బాక్సింగ్ బౌట్‌లో, రెండవ రౌండ్ మధ్యలో, కెనడాకు చెందిన కియోమా అల్‌అహ్మదీహ్‌పై భారత ఆటగాడు సచిన్ శివాచ్ తొలుత అలసిపోవడం ప్రారంభించినా తదుపరి పుంజుకున్నాడు. 26 యేళ్ల శివాచ్ తీవ్రంగా పోరాడి 4-1 తేడాతో స్ప్లిట్ డెసిషన్ విజయాన్ని నమోదు చేసి ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు, అక్కడ అతను ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హెవిట్‌ను ఎదుర్కొంటాడు. మాజీ కామన్వెల్త్ యూత్ గేమ్స్ ఛాంపియన్ సచిన్, తన తొలి దాడి అయిన రైట్ హుక్‌నుగురితప్పాడు. కానీ ఆ కెనడియన్ దానిని వేగంగా తప్పించుకు న్నాడు. దానికి ప్రతిస్పందనగా కెయోమా, సచిన్ ముఖంపై కుడి చేతితో ఒక పంచ్ విసిరాడు. అయితే, ఆ భారత ఆటగాడు పోటీలో కుదురుకుని, రెండు చేతులతో పదునైన ఎదురుదాడి చేసి తిరిగి పట్టు సాధించి, హోరాహోరీగా సాగిన తొలి రౌండ్‌లో 3-2 తేడాతో విజయం సాధించాడు. మొదటి రౌండ్‌లో ఓడిపోయిన తర్వాత కోలుకోవాలని చూస్తున్న కియోమా, రెండవ రౌండ్‌లో వేగాన్ని పెంచాడు. ఒత్తిడిలో కూడా సచిన్ నిలకడగా ఉంటూ, అనేక దాడులను తప్పించుకుని, ఎదురుదాడిలో కచ్చితమైన కాంబినేషన్ల వర్షం కురిపించాడు. అతని క్రమశిక్షణకు ఐదుగురు న్యాయనిర్ణేతల నుండి ఏకగ్రీవంగా 10-9 తీర్పు లభించి, అతను ఆ రౌండ్‌ను 5-0తో గెలుచుకున్నాడు. మూడవ రౌండ్ కూడా హోరాహోరీగా సాగింది.





## స్కాటిష్ ఓపెన్‌లో..
# పుంజుకున్న దీక్షా దాగర్

**న్యూఢిల్లీ:** భారత క్రీడాకారిణి దీక్షా దాగర్, స్కాటిష్ ఓపెన్‌లో కష్టమైన ఆరంభం తర్వాత అద్భుతంగా పుంజుకుంది. మొదటి రౌండ్‌లో రెండో ఓవర్ 74 స్కోరుతో 33వ స్థానంలో నిలిచి పటిష్టంగా నిలుపుకుంది. స్కాట్‌లాండ్‌లో శనివారం జరిగిన ఈ గోల్ఫ్ టోర్నమెంట్‌లో డండొనాల్డ్ లింక్స్‌లో సవాలుతో కూడిన పరిస్థితులలో ఆడుతూ, 10 హోల్స్ పూర్తయ్యేసరికి ఆరు ఓవర్‌కు పడిపోయిన తర్వాత దీక్ష అద్భుతంగా కోలుకుంది. తక్కువ స్కోర్లు సాధించడం కష్టంగా ఉన్నా, ఈ 24 యేళ్ల క్రీడాకారిణి తన చివరి ఎనిమిది హోల్స్‌లో నాలుగు బర్డీలు సాధించి, పోరాడి 74 స్కోరుతో ముగించింది. ఆమె రౌండ్‌లో మొదటి, రెండవ, నాల్గవ హోల్స్‌లో బోగీలు చేసి, ఆ తర్వాత ఏడవ హోల్‌లో బర్డీ సాధించింది. ఎనిమిదవ హోల్‌లో ట్రిపుల్ బోగీ, 10వ హోల్‌లో మరో బోగీ ఆమెను బాగా వెనుకబడేలా చేశాయి. కానీ 11, 14, 17, 18వ హోల్స్‌లో చేసిన బర్డీలు అద్భుతమైన పునరుద్ధరణకు దారితీశాయి. ఈ సీజన్‌లో లేడీస్ యూరోపియన్ టూర్‌లో ఇప్పటికే నాలుగు సార్లు టాప్10లో నిలిచిన దీక్ష, ఈ పోటీలో పాల్గొన్న ముగ్గురు భారతీయ గోల్ఫర్లలో అత్యుత్తమ స్థానంలో నిలిచింది. ఇక ప్రశాంత్ 8 ఓవర్లలో 80 స్కోరుతో తడబడి 116వ స్థానంలో నిలవగా, ప్రణవి ఉర్స్ 12 ఓవర్లలో 84 స్కోరు చేసి తొలి రోజును 138వ స్థానంతో ముగించింది. లీడర్‌బోర్డ్ లో దక్షిణ కొరియాకు చెందిన జెన్నీ షిన్, అమెరికాకు చెందిన లారెన్ కప్లిన్ 6అండర్ 66 స్కోరుతో సంయుక్తంగా అగ్రస్థానాన్ని పంచుకున్నారు. మరో దక్షిణ కొరియా క్రీడాకారిణి, ఎ లిమ్ కిమ్, 5అండర్ 67 స్కోరుతో మూడవ స్థానం, జర్మనీకి చెందిన ఎస్తేర్ హెన్సెలీట్, జపాన్‌కు చెందిన ఎరికా హారా, మియు యమషిత, స్వీడన్‌కు చెందిన అన్నా నార్డ్‌క్విస్ట్ 3అండర్ 69 స్కోరుతో ఐదవ స్థానాన్ని పంచుకున్నారు.

## మహిళల పెయిర్స్ బౌల్స్‌లో..
# టోంగాను ఓడించిన భారత్



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో భాగంగా లాన్ బౌల్స్ మహిళల పెయిర్స్ ఈవెంట్‌లో రూపారాణి తిర్కే, పింకీ సింగ్ జోడీ ట్రైబ్రేక్‌లో టోంగాపై విజయం సాధించి వరుసగా మూడో గెలుపును నమోదు చేసింది. ఈ కామన్వెల్త్ గేమ్స్ 2026లో భాగంగా జరుగుతున్న సెక్షనల్ ప్లేలో ట్రైబ్రేక్‌లో శనివారం టోంగాను ఓడించినతర్వాత, భారతబౌల్స్ మహిళల జంట జట్టు రూపా రాణి టిర్కీ-పింకీ సింగ్ తమ విజయ పరంపరను కొనసాగించారు. ఈ భారత జంట తొలి సెట్‌ను 5-2తో గెలుచుకుని, రెండో సెట్‌ను 4-6 తేడాతో కోల్పోయింది. కానీ ట్రైబ్రేక్‌లో ఒత్తిడిలో కూడా పింకీ అద్భుతంగా ఆడి, ప్రత్యర్థులపై తమ జట్టు విజయం సాధించడంలో సహాయపడింది. ట్రైబ్రేకర్‌లో భారత్ 2-0తో టోంగాను ఓడించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మహిళల పెయిర్ సెక్షనల్ ప్లేలో భారత్‌కు ఇదివరుసగా మూడోవిజయం. దీనికి ముందు మాల్టా, దక్షిణాఫ్రికాలను ఓడించిన భారత్, ఇప్పుడు మూడు మ్యాచ్‌లలో ఓటమి ఎరుగని ఇంగ్లాండ్ వెనుక రెండో స్థానంలో నిలిచింది. ఈ సెక్షన్ నుండి సెమీఫైనల్స్‌కు ఒకే జట్టు మాత్రమే వెళ్తుంది కాబట్టి, తమ చివరి సెక్షనల్ మ్యాచ్‌లో తలపడనున్న భారత్, ఇంగ్లాండ్ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకునేందుకు సిద్ధమవుతున్నాయి.

## మార్కెట్‌లోకి ఎనిమిది కొత్త ఫండ్ ఆఫర్స్

**ముంబయి,జులై 25:** మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే ఇన్వెస్టర్లకోసం ప్రస్తుతం మార్కెట్లో 8 కొత్త న్యూ ఫండ్ ఆఫర్స్ సబ్‌స్క్రిప్షన్‌కు తెరిచి ఉన్నాయి. ఈఫండ్ల ద్వారా అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు తమ ప్రొడక్ట్ పోర్ట్ ఫోలియోను విస్తరించడంతో పాటు ఇన్వెస్టర్లకు కూడా కొత్త పెట్టుబడి అవకాశాల్ని అందిస్తున్నాయి. ఈ ఎన్‌ఎఫ్‌ఒల్లో ఇటిఎఫ్‌లు, ఫ్లెక్సీ క్యాప్, లార్జ్ అండ్ మిడ్ క్యాప్, మిడ్ క్యాప్, సెక్టోరల్ ఫండ్స్, ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్స్ వంటి విభిన్న కేటగిరీలు ఉన్నాయి. కొన్ని స్కీమ్‌ల్లో కేవలం రూ. 100 తోనే పెట్టుబడి ప్రారంభించే అవకాశం ఉండటం విశేషం. ప్రస్తుతం సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉన్న ఎన్‌ఎఫ్‌ఒల్లో ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ బీఎస్‌ఈ ఇన్సూరెన్స్ ఇటిఎఫ్ ఇది ఇటిఎఫ్ కేటగిరీకి చెందినది. ఈనెల 28 ఇక్కడ లాస్ట్ డేట్. ఇందులో కనీసం రూ.1000 పెట్టుబడితో చేరొచ్చు. ఎడెల్‌వీస్ బిఎస్ఇ టాప్ 10 బ్యాంక్ ఇటిఎఫ్ ఇది కూడా ఇటిఎఫ్ కేటగిరీకి చెందినదే. ఈనెల 30 లాస్ట్ డేట్. కనీసం రూ. 100 తోనే చేరొచ్చు. ఆల్ఫాగ్రెప్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కేటగిరీ ఫండ్‌లో చేరేందుకు ఆగస్ట్ 4ఆఖరి తేదీ . ఇందులో కనీస పెట్టుబడి రూ. 5 వేలుగా ఉంది. అబాక్కస్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ ఈనెల 29 లాస్ట్ డేట్. కనీస పెట్టుబడి రూ. 5 వేలు. ది వెల్త్ కంపెనీ మిడ్ క్యాప్ ఫండ్‌లో చేరేందుకు ఆఖరి తేదీ ఈనెల 29గానే ఉండగా కనీసం రూ. 1000 పెట్టుబడితో చేరొచ్చు.

## 676.24 బిలియన్ డాలర్లకు పెరిగిన ఫారెక్స్ ఖజానా




**ముంబయి,జులై 25:** దేశ విదేశీ మారక నిల్వలు ఈనెల 17తో ముగిసిన వారంలో 1.08 బిలియన్ డాలర్లు పెరిగి 676.237 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ డేటా విడుదలచేసింది. అంతకుముందు వారంలో కూడా ఫారెక్స్ నిల్వలు 964 మిలియన్ డాలర్లు పెరిగి 675.157 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో 728.494 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అనంతరం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ప్రారంభం కావడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. రూపాయి విలువను స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ డాలర్ల విక్రయాల ద్వారా విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో ఫారెక్స్ నిల్వలు వరుసగా తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో విదేశీ మారక నిల్వలను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోడీ మే 11 నుంచి పలుమార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విదేశీ పర్యటనలను తగ్గించుకోవడం, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయడం, యేడాది పాటు బంగారం కొనుగోళ్లను తగ్గించడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్‌బిఐ వివరాల ప్రకారం, ఈనెల 17తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో కీలక భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 4.549 బిలియన్ డాలర్లు పెరిగి 551.057 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్ల పరంగా లెక్కించే విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాతర కరెన్సీల విలువల్లో వచ్చిన పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుందని ఆర్‌బిఐ పేర్కొంది. దేశ బంగారం నిల్వల విలువ 3.48 బిలియన్ డాలర్లు తగ్గి 101.749 బిలియన్ డాలర్లకు చేరింది. మరోవైపు స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 44 మిలియన్ డాలర్లు పెరిగి 18.67 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. అదే సమయంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ వద్ద భారత్‌కు ఉన్న రిజర్వ్ పొజిషన్ 32 మిలియన్ డాలర్లు తగ్గి 4.761 బిలియన్ డాలర్లకు చేరింది.

# మణిపాల్ హెల్త్ భారీ ఐపిఒ
## రూ.9,275 కోట్ల సమీకరణ




**ముంబయి,జులై 25:** భారత్‌లో ఇష్యూ పరిమాణం పరంగా అతిపెద్ద హెల్త్‌కేర్ ఐపిఒను మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఈనెల 29న ప్రారంభించనుంది. ఈ ఐపిఒ ద్వారా కంపెనీ రూ.9,275.22 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్కో షేరు ధరను రూ.560-590 మధ్య నిర్ణయించింది. టెమాసెక్ మద్దతు ఉన్న ఈ ఆస్పత్రుల సంస్థ, గరిష్ఠ ధర బ్యాండ్ వద్ద సుమారు రూ.77,607 కోట్ల మార్కెట్ విలువను పొందనుంది. ఈ ఐపిఒ జులై 31న ముగియనుండగా, యాంకర్ ఇన్వెస్టర్ల కోసం 28న ప్రత్యేకంగా బిడ్డింగ్ నిర్వహించనున్నారు. ఈ ఐపిఒలో రూ.8వేల కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీ, గరిష్ఠ ధర వద్ద రూ.1,275.22 కోట్ల విలువ చేసే 2.161 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉంటుంది. ప్రమోటర్లైన ఇంపీరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ ఇండియా, టిజిపి ఎస్‌జి మ్యాగజైన్, సెవెంటీ సెకండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, అమ్మార్ ఎస్‌డిఎన్ బిహెచ్‌డీ, నోవో హోల్డింగ్స్ ఇన్వెస్ట్ ఏషియా, ఫీనిక్స్ బేర్ ఇన్వెస్ట్‌మెంట్స్ తమ వాటాల్లో కొంత భాగాన్ని ఒఎఫ్‌ఎస్ ద్వారా విక్రయించనున్నాయి. ఫ్రెష్ ఇష్యూ ద్వారా వచ్చే నిధుల్లో రూ.5,552.8 కోట్లను అనుబంధ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ తీసుకున్న రుణాలు మరియు వాటిపై ఉన్న వడ్డీని చెల్లించడానికి వినియోగించనున్నారు. మరో రూ.574 కోట్లను స్టెప్‌డౌన్ అనుబంధ సంస్థ సహ్యాద్రి హాస్పిటల్స్‌లో మైనారిటీ వాటా కొనుగోలుకు కేటాయించగా, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. లిస్టింగ్ అనంతరం ప్రధానంగా విస్తరణపైనే దృష్టి సారిస్తామని మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ దిలీప్ జోస్ తెలిపారు. ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 3,000 పడకల సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఇవి వచ్చే మూడు సంవత్సరాల్లో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అవకాశాలు వచ్చినప్పుడు మాత్రమే కొత్త ఆస్పత్రుల కొనుగోళ్లను పరిశీలిస్తామని, ప్రస్తుతం సహ్యాద్రి హాస్పిటల్స్ సమీకరణ పూర్తి చేయడం, ఇప్పటికే ఉన్న నెట్‌వర్క్‌లో పడకల వినియోగాన్ని మరింత పెంచడంపైనే ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.
2026 మార్చి 31 నాటికి మణిపాల్ హెల్త్ దేశవ్యాప్తంగా 49 ఆస్పత్రులను నిర్వహిస్తూ, 13,037 లైసెన్స్ పొందిన పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 2024లో రూ.6,171.6 కోట్ల నుంచి 2026లో రూ.10,335.8 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో నికర లాభం రూ.533.2 కోట్ల నుంచి రూ.916.5 కోట్లకు పెరిగింది.

## పెండింగ్ ఐటి అప్పీళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి: నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ,జులై 25:** దేశంలో పెండింగ్‌లో ఉన్న పన్ను అప్పీళ్ల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు అధికారులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ప్రస్తుతం పరిష్కారం కాని పన్ను వివాదాల్లో రూ.5 లక్షల కోట్లకు పైగా మొత్తం చిక్కుకుపోయిందని ఆమె పేర్కొన్నారు. సీనియర్ ఆదాయపన్ను అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడిన నిర్మలా సీతారామన్, పెండింగ్ అప్పీళ్ల సంఖ్య తగ్గుతున్నప్పటికీ ఆ ప్రక్రియ ఆశించినంత వేగంగా లేదని వ్యాఖ్యానించారు. పెండింగ్ కేసుల నిర్వహణను సమీక్షించి, మరిన్ని అప్పీళ్లను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పన్ను సంబంధిత వ్యాజ్యాలను తగ్గించడం, పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడం సిబిడిటి అత్యంత ప్రాధాన్య అంశాల్లో ఒకటిగా కొనసాగాలని ఆమె స్పష్టం చేశారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరాన్ని కూడా మంత్రి నొక్కి చెప్పారు. పన్ను శాఖతో వ్యవహరించిన తర్వాత చాలా మంది పన్ను చెల్లింపుదారులు అసంతృప్తితో వెళ్తున్నారని పేర్కొంటూ, ఆ పరిస్థితిని మార్చే బాధ్యత అధికారులదేనని అన్నారు. పన్ను చెల్లింపుదారులు దేశ అభివృద్ధికి భాగస్వాములు. వారికి తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు. పన్ను చట్టాల అమలులో అతిగా కఠినంగా వ్యవహరించడం గానీ, అత్యంత సడలింపు చూపించడం గానీ సరైన విధానం కాదని హెచ్చరించారు. స్వచ్ఛంద పన్ను చెల్లింపులను మరింత ప్రోత్సహించడం, పన్ను చెల్లింపుదారులకు సులభమైన విధానాలను అమలు చేయడం, పన్ను వ్యవస్థలో స్పష్టత మరియు విశ్వసనీయతను పెంచడం వంటి అంశాలపై పైనా సిబిడిటి ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మలా సీతారామన్ సూచించారు.

# ఇక దేశవ్యాప్తంగా సికెవైసి
## ఒకే కస్టమర్ ఐడితో అన్ని సేవలు:ఆర్బీఐ కసరత్తులు




**ముంబయి,జులై 25:** ఆర్బీఐ, స్టాక్‌మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డిఏలు సంయుక్తంగా అమలు చేస్తున్న సెంట్రల్ కెవైసి 2.0తో ఇకపై దేశంలోని బ్యాంకులు, బీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు కూడా ఒకే కస్టమర్ ఐడీని వినియోగించే వీలు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం ఒక ఆర్థిక సంస్థలో కెవైసి పూర్తి చేసినా, మరో సంస్థలో కొత్తగా మళ్లీ అదే ప్రక్రియ చేయాల్సి వస్తోంది. కొత్త సీకేవైసీ 2.0 అమల్లోకి వస్తే తర్వాత కస్టమర్ ఒకసారి మాత్రమే కెవైసి చేస్తే సరిపోతుంది. తర్వాత వేరే బ్యాంకు లేదా బీమా సంస్థ లేదా ఇతర ఏదైనా ఆర్థిక సంస్థలో అకౌంట్ తెరవాలంటే కస్టమర్ అనుమతితో కేంద్ర రిజిస్ట్రీనుంచి నేరుగా వివరాల్ని పొందగలుగుతాయి. బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు ఈ వ్యవస్థను ఆగస్ట్ నుంచే దశలవారీగా అమలు చేయనున్నాయి. మ్యూచువల్ ఫండ్ సంస్థలు, బ్రోకరేజీ కంపెనీలు కూడా ఈ సంవత్సరం చివరి నాటికి ఈ విధానంలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో ఇప్పటికే 120 కోట్లకుపైగా సికెవైసి రికార్డ్స్ ఉన్నప్పటికీ డేటాలో డూప్లికేట్లు, అసంపూర్తి సమాచారం వంటి కారణాలతో వాటి వినియోగం మాత్రం పరిమితంగానే ఉంది. బ్యాంకులు ఆ డేటాను పూర్తిగా స్వీకరించకపోవడంతో కస్టమర్లు మాత్రం ప్రతిసారీ ప్రతి సంస్థకు వేర్వేరుగా కెవైసి చేయాల్సి వస్తోంది. ఆధార్ తరహా 14 అంకెల నంబర్‌ను ఆర్బీఐ జారీచేస్తుండటంతో ఇక కెవైసి తిప్పలుండవు. సికెవైసి 2.0లో మాత్రం ప్రతి రికార్డుకూ కాన్ఫిడెన్స్ స్కోర్ ఉంటుంది. ఆ సమాచారం ఎంత వరకు ధ్రువీకరించిందో తెలుస్తుంది. ఇంకా ఏయే సంస్థ ఆవివరాల్ని వెరిఫై చేసిందో కూడా సమాచారం ఉంటుంది. దీంతో డేటాపై నమ్మకంపెరగడంతోసహా మోసాల్నికూడా గుర్తించడం ఈజీ అవుతుందని నియంత్రణ సంస్థలు భావిస్తున్నాయి.

SIDCO
स्वच्छ भारत एक कदम स्वच्छता की ओर
75 Azadi Ka Amrit Mahotsav
ISO 9001:2015 CERTIFIED
हर एक की पहचान ग्रीन कार्ड

SMALL INDUSTRIES DEVELOPMENT COUNCIL
REQUIREMENT
SPECIAL SERVICE AND EMPLOYMENT OPPORTUNITIES
SMALL INDUSTRIES DEVELOPMENT COUNCIL INVITES APPLICANTS FORTHE POST OF DIRECTOR/SUPERVISOR/TEACHER IN ALL DISTRICTS/BLOCKS AND PANCHAYAT'S LEVEL.

| | | | |
|---|---|---|---|
| 1 | DISTRICT MANAGING DIRECTOR | MALE | QUALIFICATION - GRADUATE |
| 2 | BLOCK DIRECTOR | MALE | QUALIFICATION - INTERMEDIATE |
| 3 | PANCHAYAT DEVELOPMENT MANAGER | MALE | QUALIFICATION - MATRICULATION |
| 4 | DISTRICT SUPERVISOR | FEMALE | QUALIFICATION - GRADUATE |
| 5 | BLOCK SUPERVISOR | FEMALE | QUALIFICATION - INTERMEDIATE |
| 6 | PANCHAYAT TEACHER | FEMALE | QUALIFICATION - MATRICULATION |

NOTE: CANDIDATES HAVING NTT/PTT/PPTTC WILL BE GIVEN PREFERENCE FOR PANCHAYAT TEACHER
STATE OFFICE:
Saai Priya Apts, Jaffar Ali Bagh,
Somajiguda, Raj Bhavan Road, Hyderabad - 500082
Mobile No: 9151986284, 9151986283, 9968226986
Office No: 9511115219 (This number available for office)
Email ID: info@sidcobharat.com, delhi@sidcobharat.com
Website: www.sidcobharat.com
Toll-Free No: 1800 212 6811 | Tel. No.011-41328096 | Website - www.sidcobharat.com

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.